నాల్గవ సంకలనం

ఎన్నెమ్మ కతలు



తెలుగు తూలికలో ఊసుపోక శీర్షికతో ప్రచురించిన కతలు

2016

thulikan@yahoo.com - మీ సందేహాలు, అభిప్రాయాలు ఈ ఐడికీ పంపవచ్చు.

నిడదవోలు మాలతి కథలు, వ్యాసాలు, ఇతర రచనలు

తెలుగు తూలికలో చూడవచ్చు.

http:\\tethulika.wordpress.com.

- నిడదవోలు మాలతి.

26 జూన్ 2016.

విషయ సూచిక

1. వ్యసన ప్రహసనం!... 3
2. వొర్థి కబుర్లే.. 6
3. పాతకథల్లో కొత్తమాటలు?!!... 9
4. మందిబుద్ధి... 11
5. మనవాళ్ళ మొహాలు!... 15
7. అక్కరకు రాని చట్టాలు.. 25
8. నా ఆరోగ్యసూత్రాలు.. 30
9. యాంత్రికం... 33
10. పేరులో "పెన్"నిధి?... 40
11. నా భాష భక్తి.. 47
12. కాలూ, కారూ... 49
13. కేబిను జొరం... 53
14. ఏదో సామెత చెప్పినట్టు.. 56
15. ఎవరీమె?... 63
16. పనసపొట్టు కూర.. 66
17. పుచ్చుకున్ననాటి ముచ్చట!... 68
18. తిలకాష్ఠ మహిషబంధనము అను నాగ్రంథాలయచరిత్ర!.................. 73
19. ఏముంది మనసంస్కృతిలో ప్చ్!.. 77

20. వింబుల్డన్ సమయమహో.. 79
21. నీటపా మేలు మేలు, కాకున్న ఓ చిరు లైకు................................ 81
22. నవ్వెప్పుడొస్తుందో!..85
23. పొట్టి కూడా పొడుగే..89
24. మాయరోగాలు.. 93
25. నాకల నాకు నిజం..99
26. మ్, ఏ రచయితలా రాస్తే బాగుంటుంది చెప్మా?!........................ 101
27. అర్ధాంతరీకరణము.. 103
28. పిన్నలు "నేనెందుకు రాస్తున్నానంటే ..".................................. 110
29. నా సంగీతసేవ..112
30. నా ఇష్ట గాయనీగాయకులు.. 117
31. నా ఇష్ట గాయనీగాయకులు 2... 123
32. ఎందుకు మళ్లీ "ఎందుకు పారేస్తాను నాన్నా?"......................... 130
33. నిరవధిక చిరునవ్వు కష్టతరము!...140
34. మహావీరచక్ర అనుభవం మళ్ళీ...145
35. అరటి చెట్టు..147
37. కాపీ ఒక సాహిత్య ప్రక్రియ!..157
38. పుచ్చుకున్ననాటి ముచ్చట!..164
ఉపసంహారం.. 169

1. వ్యసన ప్రహసనం!

“ఇప్పుడు నేనొక ప్రశ్న అడుగుతాను. తడుముకోకుండా, ఆలోచించకుండా, ఠపీమని జవాబు చెప్పేయాలి.”

“సరే అడుగు.”

“నీకు గల ఒకవ్యసనం ఏమిటి?”

“హాహా,” “ఇంకా ఏమిటో అనుకున్నాను.” “మరే,” “ఇంకా ఏమడుగుతావో అని భయపడిపోయేను,” “నేనూ అంతే.” “ఏదో పరమరహస్యం అనుకున్నాను.” “నా ఆస్తిగురించేమో అనుకున్నానండీ,” “నారహస్యప్రేయసి పేరేమోనని హడలిపోయేను.” ఏదో చిక్కు ప్రశ్న …” “నావయసు,” “మాయింటి చిరునామా” …

“రహస్యం లేదు, ఏమీ లేదు. నువ్వు చెప్పు నీవ్యసనం ఏమిటో.”

“నాకే వ్యసనాలూ లేవు.” “నాకూ అంతే.” “నీదయవల్ల అవేం అంటలేదు తల్లీ.”

“నేదమ్మా, నాకు యసనంవంటే అసయ్యం.”

“అవునండీ, ఈరోజుల్లో అందరూ చాలా అప్రమత్తతతో ఉంటున్నారు కదా.”

“సరే మీకు లేని వ్యసనాలు చెప్పండి.”

“లేనివంటే ఏముంది. తాగుడు లేదు.” “జూదం లేదు.” “సిగరెట్లు లేవు.” “మాంసం నిజానికి వ్యసనం అనుకోను కానీ కొందరు సుజనులు వంకలు పెడుతున్నారు కనక నాకు అది కూడా లేదని చెప్పుకుంటా.” “ముం… అదేలెండి ఇతర అతివలసాంగత్యం లేదు.”

“అవేనా మీకు తోచిన వ్యసనాలు?”

“సరేలెద్దూ. నీసొద. సినిమాలూ, పత్రికలూ అని కాబోలు నీ గోల.”

“నన్నడిగితే చదవడం వ్యసనం. రాయడం వ్యసనం. అదే పనిగా వేళా పాళా లేకుండా తినడం వ్యసనం.”

“ఆగండాంగండి. ఆపకుండా వాగడం కూడా వ్యసనమే అనిపిస్తోంది నాకిప్పుడు.”

“నామీదేనా ఆ విసురు?”

“బాబూ, తప్పులెన్నటం యస్నం. మరింగ నాతప్పు కాదన్టం గూడ యస్నంవే.”

“చదవడం వ్యసనం ఎలా అయిందో చెప్పు.”

“పుస్తకం పట్టుక్కూచుని కూర మాడిపోతుంటే చూసుకోకపోడం వ్యసనం అయితేనే గదా.”

“ఇప్పుడు తాగుడూ, జూదం, స్త్రీ కాదు. ఇప్పుడు కొత్తరకాలు.”]

“కాఫీ, చాక్లెట్,”

“అవి వ్యసనాలు అవడం మానేసి చాలా కాలం అయింది.”

“తమకేదో పెద్ద చిట్టాయే ఉన్నట్టుంది. సెలవీయండి.”

“టీవీలూ, సినిమాలు కూడా వ్యసనాలేనాండి?”

“టీవీ కాదు.”

“హోహో. బాగ సెప్తివి. నివ్ సూసేవీ, సేసేవీ మాతరం యస్నాలు గావు.”

“ఇదుగో, నన్నలా సతాయించడానికి నీకధికారం లేదు.”

“అదికారం, ఉప్పుకారం ఊసేటి. నివ్ టీవీ ఎన్ని గంటలు సూస్తవు సెప్పు.”

“చూసేవా అక్కడే ఉంది చిన్న మెలిక. ఎన్ని గంటలు టీవీ ఆన్లో ఉంటుంది అన్నది వేరు, ఎన్ని గంటలు చూస్తావు అన్నది వేరు.”

“ఏంటండీ, టీవీ ఆన్లో ఉంటే అది వ్యసనమే కదా. మీకు ఆ బొమ్మలాడకపోతే తోచదు. అది వ్యసనంకిందకే వస్తుంది.”

“రాదు ఎందుకంటే, నేను ఎప్పుడు కావలస్తే అప్పుడు ఆపేయగలను ఏ షోఐనా సరే పూర్తిగా చూడకపోతే ప్రాణం కడగట్టుకుపోదు నాకు. అదీ వ్యసనానికి చిహ్నం.”

“హోహో. నేను రోజుకి గంటకంటే ఎక్కువ టీవీ పెట్టను.”

"హాహా. ఎవరికి తెలీదు నీవాటం. అడ్డాల్లో బిడ్డలా రోజుకి 20 గంటలు ఆ లాపుటాపు ఒళ్ళో పెట్టుక్కూచుంటావు."

"అది అందరూ చేస్తారు నేనొక్కణ్ణేనేమిటి? అదొక సాంఘికధర్మం. దాన్ని వ్యసనం అనడానికి లేదు."

"ఈయమ్మ గూడాను. నాన్నూడనేదేటి."

"ఏమిటి చూసేవు. ఎవరైనా కబురంపితే జవాబివ్వడం మర్యాద కనక చూస్తానంతే. లేకపోతే నేను జవాబివ్వలేదని వారికి కోపం రావచ్చు. అలా మాటాడుకుంటూ పన్లు చేసుకుంటాం కనక అది థెరపీ కూడా అనుకుంటాను మరియు విజ్ఞానదాయకం. ఎన్నో విషయాలు తెలుస్తాయి."

"ఎన్నో పనులు అవకుండా ఆగిపోతాయి కూడాను."

"అది నిజం కాదు. అసలు నాకు multitasking అంటే ఎంత చిరాగ్గా ఉండేది. ఇప్పుడు నేను చెయ్యగలుగుతున్నానంటే, ముఖపుస్తకం చలవే. అది మేధకి పదును పెడుతుందని నేను ప్రతిపాదిస్తున్నాను."

000

రోజుకు ఎనిమిది గంటలు టీవీ, కనీసం ఎనిమిది ఆటలు స్కాబులు అంటే నాలుగు గంటలు, ఫేస్బుక్కు కనీసం పది సార్లు పది పది నిముషాలు అంటే సుమారుగా గంటన్నర అనుకుందాం, నిద్ర ఎనిమిది గంటలు, అదేమిటి రోజుకి ఇరవైనాలుగ్గంటలే కదా ... మరి మిగతా పనులు ఎలా అవుతున్నాయి చెప్మా - :!

అయితే నా వ్యసనాలేమిటి? చిట్టా రాయడం ఆరోగ్యకరం కాదనుకుంటా ...

000

(జులై 24, 2013.)


2. వొర్థి కబుర్లే

ఇవాళ ఒర్థీ ఊసుపోని కబుర్లే. అంటే ఒకదానికీ ఒకదానికీ సంబంధం ఉండదన్నమాట. నాకు తోచినవి తోచినట్టు తప్పొప్పులు చూసుకోకుండా, తలా తోకా లేకుండా రాసుకుంటూ పోడమే. అసలీమధ్య కొంతకాలంగా ఇలాగే ఉంటున్నాయి నాఆలోచనలు. ముసిల్దాన్నయిపోయేనన్న నమ్మకం దృఢపడిపోతోంది. ఒత్తులు సరిగ్గానే పెట్టేననుకుంటున్నాను. అంచేత కూడా నాకిలా వదరడానికధికారం ఉంది.

లైబ్రరీనించి తెచ్చిన Rita Rudner పుస్తకం చదివేక నాకు భలే ఉత్సాహం వచ్చేసింది. ఆవిడ ఆలోచనలు అవి చెప్పిన తీరు నాకు చాలా చాలా బావుంది. ఉదాహరణకి నాలాగే (!) ఆవిడ కూడా కారు తోలడంగురించి రాసింది. నాలాగే(!) ఆడవాళ్లు అందచందాలు తీరిచి దిద్దుకునేందుకు పడే తాపత్రయంగురించి రాసింది ఎంతో సీరియస్‌గా. భలే నవ్వొచ్చింది. వీటన్నిటితో పుస్తకం పూర్తయేక, చివర, ఒక బొమ్మ ఉంది ఆవిడదే. సోఫాలో తలకిందులుగా కూర్చుని, అంటే తలా కాళ్లూ స్థానాలు మార్పిడి చేసుకుని, గది కప్పువేపు తేరి చూస్తున్నదృశ్యం. ఆ బొమ్మ కింద మహావాక్యం – నేను సీలింగ్ కంప్యూటరు కొనిఉండకపోతే, ఈ పుస్తకం రాయడం ఇంత కష్టం కాకపోను అని. మామూలుగా పుస్తకం రాయడం కష్టం. కానీ దానికి కారణం నా కంప్యూటరు గదికప్పుకి అతుక్కున్నట్టు చూపడం నాకు భలే నవ్వు తెప్పించింది. నేనింకా విరగబడి నవ్వుతూనే ఉన్నాను కనక నాకు ఈ బొమ్మ మరింత నవ్వొచ్చేసింది. వెంటనే నాస్నేహితులందరికీ పంపేసేను కాపీ చేసి. ఇక్కడ పెట్టలేను ఎందుకంటే ఆ పుస్తకము సర్వస్వామ్యసంకలితము కనక. అవును, ఈదేశంలో ఇలాటి పట్టుదలలు కొంచెం ఎక్కువే. చీటికీ మాటికీ కోర్టులకీడవడం వీరికే తగును. అదే మనవాళ్ళయితే, ప్చ్ అని చప్పరించేసి ఊరుకుంటారు. ఇంతకీ నాస్నేహితులకి బొమ్మయితే పంపేను కానీ సంగతి సందర్భాలు చెప్పలేదు కనక ఆ బొమ్మ

అసందర్భంగానూ, అర్థరహితంగానూ కనిపించింది. సందర్భం వివరించకపోతే ఇలాటి చిక్కులే వస్తాయని నాకిప్పుడు తెలిసింది. ఇదే రీటా రడ్నర్ అయితే సందర్భం మరో కథలో మరింత చక్కగా వివరించి ఉండేది అనిపించింది. నేను రీటాని కాను కానీ యథాశక్తి వివరించడానికి ప్రయత్నిస్తాను.

నన్ను ఆ బొమ్మ – రీటా సోఫాలో శీర్షాసనంతో – ఆకట్టుకోడానికి కారణం నేనే ఇంతకుముందొకసారి ఈ ఊసుపోక ధారలోనే పెట్టిన మరో బొమ్మ గుర్తు రావడం



కావచ్చు. అలాగే కారు తోలడంగురించి ఆవిడరాసిన కతతో కూడా నా అనుభవాలు మననం చేసుకుని ఉంటాను అచేతనావస్థలో. అలాగే ఈనాటి సాంకాతికాభివృద్ధిగురించి కూడా నేను నసాంకేతికాలు పోస్టులో రాసినట్టే ఉంది. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఇలా సుమారుగా మనఅనుభవాలూ, అభిప్రాయాలూ గొప్పవారి కబుర్లలో కనిపిస్తే మరింత అర్థవంతంగా ఉంటాయి. అవున్లే, నీకూ తెలుసాసంగతి. అయినా మరోమారు చెప్పకుండా ఉండలేను. హుమ్. అది నా వ్యసనం.

***

ముసిల్దాన్నయిపోయేననీ, నాకు మతిమరుపు ఎక్కువయిపోయిందనీ అనుకుంటున్నసమయంలో మా అమ్మాయి ఫోన్ చేసింది కిందటివారం. ఇక్కడ ఏదో దొరకలేదని చెప్తున్నా. "అవునమ్మా, మాడిసన్లో అలాటివి దొరకడం కష్టం" అంది. "నేను మాడిసన్లో లేను కదా," అన్నాను, కొంచెం తికమకపడి, నాభుజాలమీద ఉన్న నాబుర్ర ఓమారు తడిమి చూసుకుని. "అదే …" అంటూ మాట మార్చేసింది. అది కిందటివారం. మళ్ళీ నిన్న మాటాడుతూ, "కారుకి windshield wipers కొత్తవి వేయించాలని చెప్పేను గుర్తుందా?" అనడిగింది. "నువ్వు కిందటినెల చెప్పినప్పుడే గబగబ షాపుకెళ్ళి కొత్తవి వేయించేసేను. ఆమాట నీకు చెప్పేను కూడా కదా," అన్నాను. "ఓ … అదే … ఇక్కడ వాన పడుతోంది. …"

దీంతో నాకు చాలా ఆనందం కలిగింది. మరిచిపోడానికి ముసిలితనమే కారణం కానక్ఖర్లేదు. ఒక్కపెట్టున ఊపిరాడనన్ని రాచకార్యాలు కలిసొచ్చినప్పుడు కూడా చాలా సంగతులు మరిచిపోవడం జరుగుతుంది. దీనికి వయసుతో సంబంధం లేదు. నిజానికి ఈకాలపు యువతీయువకులకే ఈ మతిమరుపు ఎక్కువ, లేదా ఇది మతిమరుపు కాదు అని కూడా అనుకోవచ్చు. దాన్ని వాళ్లు తమ వ్యాపకాలన్నిటివల్లా కలిగిన ఏమరుపాటు అని గానీ స్ట్రెస్ అని గానీ అంటారు.

***

ఆమధ్య ఒక స్నేహితురాలు నాయందు అభిమానంతో నా మహావాక్యాలుగా ప్రకటించిన వాక్యాలు చూసి ఉలికిపడ్డాను, ఏమిటీ, నేనిలా అన్నానా, నేసే అన్నానా, నేను నేనేనా… ఇలా ఒక్కొక్క అక్షరంమీదా ఒత్తులు మార్చుకుంటూ చాలాసేపు చూసుకున్నాను.. కొన్ని బాగున్నాయి, కొన్ని చాలా బాగున్నాయి. కొన్ని ఫరవాలేదు, కొన్ని నాకు అర్థం కాలేదు. … అంటే ముసిలితనంచేతే … కాకపోవచ్చు.

రచయితలందరికీ తెలిసిన మరో సత్యం ఉంది. మనం ఒక కథ రాస్తాం. అందులో పదిమందికి పది రకాల అర్థాలు స్ఫురిస్తాయి. అలా రకరకాల అర్థాలు స్ఫురించినప్పుడు ఆ అర్థాలకి జవాబుదారీ రచయితా, పాఠకుడా? హ్మ్. దీనికి సమాధానం అంత తేలిగ్గా దొరకదేమో. అంజనం వేసి చూసుకోవాలి కాబోలు. లేదా ఏ తెలుగు మహాసభలకో పంపాలి ఈవిషయంమీద ఓ పేనల్ పెట్టమని.

ఇప్పటికింతే. మళ్ళీ ఏమైనా జ్ఞాపకం వస్తే, రేపు రాస్తాను.

000

(జులై 30, 2013)

3. పాతకథల్లో కొత్తమాటలు?!!

నాలుగురోజులక్రితం మహీధర రామ్మోహనరావుగారి కొల్లాయి గట్టితేనేమి పూర్తి చేసేను. ఖ్యాతి చెందిన నవల కనక నేను కొత్తగా చెప్పేదేమీ లేదు కానీ ఇంతవరకూ చదవనివారికి – చివర్లో రచయితమాట చదివి, తరవాత నవల చదివితే ఇంకా ఎక్కువ అర్థవంతంగా ఉండేదేమో నాకు అనిపించింది. హెచ్చరిక – నాకు మాత్రమే. మీకలా అనిపించకపోవచ్చు.

ఇంతకీ ప్రస్తుతానికి వస్తే – ఈనవలలో కొన్ని పదాలు, నుడికారాలు నాకు కొత్తగా అనిపించేయి. బలంవుంటే బతుకుంటుంది అన్న డార్విన్ సిద్ధాంతం భాషకి వర్తించదనే అనుకుంటాన్నేను. భాష గాలిలో బతకదు కదా. మనం మాటాడితే నిలుస్తుంది, లేకపోతే లేదు. ఏ పదానికైనా బలం ఉంటే, మనకి వాడాలనిపిస్తుందని వాదించొచ్చనుకోండి. నాకు మాత్రం మనప్రయత్నం కొంత ఉండాలి అనే అనిపిస్తుంది. అంచేత నాకు తెలీని లేదా నేను మరిచిపోయినమాటలు మరోసారి మననం చేసుకుంటున్నాను.

ఇంతకీ కొల్లాయి గట్టితేనేమి నవలలో కొన్ని పదాలు, ప్రయోగాలు - ఇవి మీకు తెలుసా? మీరు మరెక్కడయినా చూసేరా? ఇలాగే మీరు చదివినకథల్లో, నవలల్లో ఈరోజుల్లో వాడుకలో లేనివి కనిపించేయా?

ఇంతకీ, నాజాబితా ఇదుగో. ఈ నవలలో పదాలకి నాకు తెలిసిన సమానార్థకాలూ, వ్యాఖ్యలు.

ఉడికిల్లేడు – ఉడుక్కున్నాడు.

సంత చేసుకొచ్చేతలికి – శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు సంత చేసుకుని అన్న నుడికారం వాడినప్పుడు నాకు అర్థం తెలీలేదు. సౌమ్యనడిగితే, కంఠతాపట్టడం అని

చెప్పింది. రామ్మోహనరావుగారి నవలలో సందర్భం చూస్తే, సంతపనులు అంటే బజారు పనులు అన్న అర్థం ధ్వనిస్తోంది.

గ్రీవాభంగంలో – ఇది నాట్యశాస్త్రంలో పదం కాబోలు, నారాయణస్వామి చెప్పాలి.

నిర్వాక్కుడు – అవాక్కయి అనడం నాకు తెలుసు. నిర్వాక్కయి అనొచ్చేమో కూడా. నిర్వాక్కుడు అని సర్వనామంగా వాడడం నేను వినలేదు.

నిలువ చచ్చిపోయింది – సుమారుగా అర్థం తెలుస్తోంది కానీ మరోలా చెప్పాలంటే తెలియడంలేదు. నిలువునా నిలబడిపోయింది, సగం చచ్చినిలబడిపోయింది లాటిదేదోనేమో.

ఔడు కరిచేడు – పెదవి కరిచేడు. ఇది నాకు తెలిసిందే కానీ ఈమధ్య ఎక్కడా చూడలేదు.

(ఇంగ్లీషువాడినో మరొకడినో) భంగపడాలి – (కేసునించి) విడబడి – విడిపోయి అనా? ఇక్కడ బడు ప్రత్యయం లెక్కలోకి తీసుకుంటే, మరెవరో కర్త అయి ఉండాలి. అంటే కేసునించి విడిపోయి (మరొకరిసాయంతో) అనేమో!

తుప్పు దుళ్ళకొట్టి – ఇది కూడా నాకు పరిచయమైన నుడికట్టే కానీ ఈమధ్య రచనల్లో ఎక్కడా కనిపించడంలేదు. నాకు భలే నచ్చిన నుడికట్టు. :)).

నాకు భాష, ఏ భాషయినా చక్కగా తెలుసుకోడం ఒక ఆనందం. నేను స్క్రాబులు ఆడినప్పుడు కూడా నాకు తెలీనిమాటలు కంప్యూటరు వాడితే, గుర్తుపెట్టుకుంటాను. రచయితని తప్పు పట్టే ఉద్దేశంతోనో కించపరిచే ఉద్దేశంతోనో ఇది రాయలేదని గమనించాలి.

000

(ఆగస్ట్ 24, 2013)

4. మందిబుద్ధి

మంది అంటే గుంపు కదా. జమిలిగా, కలిసికట్టుగా మూకఉమ్మడిగా ఏదో ఒక వాక్యాన్నో, అభిప్రాయాన్నో, వస్తువునో తీసుకుని మందికి ఏర్పడిన బుద్ధి మందిబుద్ధి. ఈ మందితత్వానికి మొదలెక్కడ, ఎప్పుడు ఎలా మొదలయింది, ఎంత దూరం వచ్చేం, ఈనాడు ఈ మందిబుద్ధి పరాకాష్ట చేరిందా, లేదా, ఇంకా చేయగలిగినది ఏమైనా ఉందా అని ఇవాళ ఎంతో సునిశితంగా పరీక్షించి, తాడో పేడో తేల్చేసుకుందాం అనే నిశ్చయానికొచ్చేను. లేదు బాబూ, ఈ అంశంమీద నాకొక మంద లేనూ లేదు, నేనొకటి ఏర్పరచ బూనడమూ లేదు. ఏకకణజీవిలాగ ఇది ఏకప్రాణమంద.

మొదటిసంగతి మొదట చెప్పమని ఆర్షవాక్యం కనక మొదటి మంద ఎలా ఏర్పడింది అన్న అంశంతో మొదలుపెడతాను. నేననుకోడం ఆదిమానవుడు తుపానులనించీ, గాలివానలనించీ తనని తాను రక్షించుకోడానికి ఒక గుహ ఏర్పాటు చేసుకున్నాక అందులో ఓ ఆడమనిషిని పెట్టి, సంసారం ప్రారంభించేడు. తరవాత చెప్పనేల, కుటుంబం కూడా వచ్చింది. ఆ తరవాత అటూ ఇటూ ఉన్న మరో రెండు గుహల్లో మగాళ్ళని పిలిచి మనం పులులనించీ, ఎలుగుబంట్లనించీ రక్షించుకోడానికి అందరం కలిసికట్టుగా ఓ మంద ఏర్పాటు చేసుకుందాం అన్నాడు. ఆవెనకే ఉన్న ఆడమనిషి కూడా అవునౌను, మన మగాళ్ల వీరసాహసగాథలు కథలు కథలుగా కాలక్షేపానికి చెప్పుకోవచ్చు, వొయ్యింటించడానికి అగ్గీ, లేడికూరకి ఉప్పూ అప్పులెత్తుకోవచ్చు అన్నారు ముక్తకంఠాలతో. అపుడు తొలిమంద ఏర్పడింది.

ఆ తరవాత కత్తులవారూ, ఘంటాలవారూ, గల్లాపెట్టెలవారూ, తోళ్ళపనివారూ ఇలా పనులనిబట్టి కులాలన్నారు. ఇప్పుడూ అంతే. వృత్తులనిబట్టి మందలు – డాక్టర్లూ, ఇంజినీర్లూ, అందలో సాఫ్టువేరూ, నెట్వర్క్సూ, ఇలా తమతమ ఉద్యోగాలు ప్రాతిపదికగా గుంపులేర్పడుతున్నాయి. బహుశా, తమకి ఇష్టమయిన సంగతులు మాటాడుకోడమే

కాక అలా మాటాడుకోడానికి తగిన జాగాలూ, సమయాలూ దొరకడం కూడా కావచ్చు. అంతే కాదు, సామాన్య విషయాల మందలు కూడా పుట్టుకొస్తున్నాయి. ఆమధ్య ఒకసారి నేను కూరలు కొనుక్కుని, కౌంటరుదగ్గర నిలబడితే, వరసలో నాముందున్న ఒకాయన అదే పనిగా నావంక చూడ్డం మొదలు పెట్టేడు. కొంచెంసేపయినతరవాత, నువ్వు పెరుగుమందలో ఉన్నావా అనడిగేడు. అదేమిటో నాకు తెలీలేదు కానీ లేదన్నాను ఎందుకైనా మంచిదని. పోనీ, చేర్తావా అనడిగేడు. మంద పెంచుకోడానిక ఇదో పద్ధతి కాబోలనుకుని, చేరనని చెప్పేను. ఇంతకీ, పెరుగుమంద, కలలమంద, కేరట్ మంద ఇలా ఇక్కడ మందలేర్పడుతున్నాయని నాకప్పుడే అర్థమయింది. పెరుగు తింటే తింటారు, లేకపోతే లేదు, దానికి వారం వారం కలిసి మాటాడుకోడానికి ఏముంటాయి అని చాలాకాలం మధనపడ్డాను కానీ నాకైతే జవాబు దొరకలేదు. పోనీ వాళ్ళలో చేరిపోయి తీవ్ర పరిశోధన చేద్దామా అనిపించింది కానీ ఇలాటివి సాలెగూడులో చిక్కుకోడమేనేమో అని భయమేసి ఆగిపోయేను. మరి ఆ మందలో ఒకొకరికి మరెన్ని మందలున్నాయో, వాటన్నిటిలోనూ చేరమని పోరు పెడితే, నాకింక ఊపిరాడదు. సైబరులోకం అవతరించేక, ఇష్టాయిష్టాలు చాలా ప్రాముఖ్యంలోకి వచ్చేసేయి. బ్లాగుల్లోనూ ఇతరమందల్లోనూ చిన్నచిన్న మందలు చోటు చేసుకుంటున్నాయి. అంటే, సినిమాలు తీసుకోండి, అందులో హిందీ సినిమాలూ, అందులో షరూఖ్ ఖాన్ మంద, లేదా సై ఫిక్షను మరియు ఎడ్వంచరు మంద ... నాకు తెలిసింది ఇంతే కానీ మీకింకా ఎక్కువ తెలుసు కనక ఇక్కడ నా అజ్ఞానప్రదర్శన ఆపేస్తాను, మళ్ళీ మీలో ఎవరో ఒకరు కోప్పడకముందే. ఇంతకీ ఇలాటి మందలు ఏర్పడడంలో మరో సుళువుంది. హాయిగా ఇంట్లో పక్కమీదనించి దిగకుండా, రాత్రి కట్టిన బట్టలైనా మార్చకుండా హుషారుగా కబుర్లు చెప్పుకోవచ్చు. ఇష్టమైన సంగతులు అవే ఇష్టమైనవారితో మాటాడుకుంటున్నప్పుడు రక్తసంబంధీకులతో మాటాడినట్టు మర్యాదలకి పోనక్కర్లేదు. సైబరులో కూడా మర్యాదలున్నాయి కానీ అవి తమకి

నచ్చినట్టే ఉంటాయి. లేకపోతే, పోస్ పొమ్మని అక్కడ్నుంచి పోతారు కదా, అదేలెండి మంచం వదలకుండానే.

మనిషికి మనిషి కావాలి. ఎంత నాకెవరూ అఖ్ఖర్లేదంటూ తలుపులేసుక్కూచున్నా ఏదో సమయంలో మరో మొహం కనిపిస్తే బాగుండు, మరో స్వరం వినిపిస్తే బాగుండని అనిపించకమానదు. ఇది నేనెప్పుడు గ్రహించేనంటే, తోచడం లేదని టీవీ పెట్టి, ఓ పావుగంటయిన తరవాత ఆ ప్రోగ్రాంలో ఒక్కముక్క నాతలలోకి ఎక్కడంలేదనీ, నాబుర్ర మరో ఆలోచనలతో కుస్తీ పడుతోందనీ తెలుసుకున్న తరవాత. అది నాబుర్రకెక్కడం లేదు, ఎందుకు ఎలెక్ట్రిసిటీ వ్యయం చెయ్యడం అని ఆపేస్తే, తోచడం లేదు, తోచడం లేదంటూ మళ్ళీ హోరుపెడుతుంది ఆ బుర్రే హుమ్. ఇంతకీ మనిషయి పుట్టిన ప్రతి జీవికీ సదా ఏదో ఓ గోల అత్యవసరం అని నా రూలు నెంబరు వన్ను.

ఇది మనదేశంలో మరీ ఎక్కువ. చైనాలో కూడానేమో. ఎందుకంటే, ఇదివరకు నేనే చెప్పినట్టు మనకి జనంపెక్కువా జాగా తక్కువా. ఉమ్మడికుటుంబాల్లో మూడు తరాలవాళ్ళు ఒక కప్పు కింద ఒకరిమీద ఒకరు అరుస్తూ, ఒకర్నొకరు ఆడిపోసుకుంటూ, ఏడుస్తూ, ఏడిపిస్తూ, ఓదార్చుకుంటూ బతకేస్తారంటే, మనిషికి మనిషిశబ్దాలు నిత్యావుసరం అన్న ప్రాతిపదికమీదే.

వెనకటిరోజుల్లో రాసేవారూ చదివేవారూ కూడా మితంగానే ఉండేవారు. వాళ్ళ వ్యావృత్తులు కూడా పరిమితమే. ఇప్పు రాసేవాళ్లూ చదివేవాళ్ళూ ఎక్కువయేరు. తమ ఆలోచనలని కాలక్రమంలో సాంకేతికపరిజ్ఞానం దేశదేశాలా వ్యాపించేసి, ఛ, మీమందా, మామందా అంటూ లక్ష్మణరేఖలు గీసుకుని కూచోడం బాగులేదు, మనవందరం ఒకే పెద్ద మంద, మీరూ, మేంవూ అంటూ చిన్న చిన్న మందలు కావలిస్తే ఉంచుకోండి, కానీ నిజం నిజం ఏమిటంటే మనవందరం ఏకమంద అన్నారు అలా అనడానికి వెసులుబాటు ఉన్నవారు.

అయ్యొయ్యొ, మీకిదంతా వింటూ కూర్చోడానికి టైములేదంటారా? సరే, గబగబ మరో 140 పదాలకి మించకుండా ముగించేస్తాను.

"మీరక్కడా మేంవిక్కడా పని జరగడంలేదు. ఇక్కడికొచ్చేయండి. మీకూ మాకూ సుఖం" అన్నారు కాస్త ఎడంగా ఉన్నవాళ్ళు.
"వచ్చేం అమ్మా, నాన్నా, తోబుట్టువులతో కబుర్లు చెప్పుకున్నట్టు లేదు."
"దానికేముంది, ఫోనులో మాటాడుకో."
తల్లిపాలకోసం ఏడ్చేవాడికి పాలపీక అందించినట్టు ఇందులో సుఖం ఉంది కానీ క్రమంగా రక్తసంబంధాలు నీరుగారిపోయి, సైబరుసంబంధాలు స్థిరపడ్డాయి.
కూరేంవొండేవో దినాలాటి కబుర్లు ఏ నూతిగట్టునో పెరటిగోడపక్కనో వినిపించేవి.
ఇప్పుడు సైబరుపంచల కనిపిస్తున్నాయి.
పద్ధెనిమిది పర్వాల కావ్యం పద్ధెనిమిది పేజీలయి, పద్ధెనిమిది పదాలయి, …
ప్రస్తుతానికి ఇక్కడ ఉంది కానీ పద్దెనిమిది అక్షరాలయే రోజులు కూడా రావొచ్చు.
ఇప్పటికే ట్విటరులో 140 అక్షరాలని ఆంక్ష పెట్టేరు కదా. ఇంక మరో పద్ధెనిమిది రోజుల్లోనో వారాల్లోనో పది బొమ్మలు సరిపోవచ్చు చైనీసుభాషలా.
నీటిమీద తేలే నాచు ఉమ్మలు ఉమ్మలు చుట్టుకుంటూ, కలుస్తూ విడిపోతూ రూపులు మారినట్టు "మంది రూపు" మారుతోంది కానీ మనసులో మందివాసనలు పోయేలా లేవేనాటికీ. కిటికీలూ, తలుపులూ, మనసులూ మూసేసుకున్నా ఏ వర్చువల్ ప్రపంచంలోకో తొంగి చూస్తూనే ఉంటాం, పలకరించేవారికోసం. ముక్కూ మొహమూ తెలీకపోయినా చులాగ్గా పలకరిస్తూనే ఉంటాం. వారికోసం పలవరిస్తూనే ఉంటాం. ఏదో వంక ఎక్కడో అక్కడ ఎలాగో ఓలా హలో చెప్పకుండా ఊరుకోలేం.
చెప్పేవారికోసం దిక్కులు చూడకుండా ఊరుకోలేం.ఈ సంగతులన్నీ గత రెండు మూడు వారాల్లో గ్రహించిన పరమసత్యాలు!
000

(సెప్టెంబరు 5, 2013)

5. మనవాళ్ళ మొహాలు!

అమెరికాలో అద్వితీయ సౌందర్యవతిగా తెలుగు అమ్మాయి నీనా దావులూరి గుర్తించబడింది. ఇది ప్రకటించగానే కొందరు ఉడుక్కోడం, రుసరుసలాడ్డం, ఎక్కళ్ళేని వంకలు వెతకడం కూడా మొదలయింది. ఆ అమ్మాయి ఇండియను కాదనీ... అదనీ ఇదనీ ... అదంతా ఎందుగ్గానీ ... మన పిల్లన్నమాట తిరుగులేని సత్యం. ఇంటిపేరే చెప్తోంది అచ్చమయిన తెలుగు వెలుగని. ఊళ్ళపేర్లు ఇంటిపేర్లు తెలుగువాళ్ళకే కదా. ఇండియా మాత్రమే కాదు, తెలుగుబాల, అందులోనూ ఆంధ్రదేశం నడిబొడ్డునున్న విజయవాడ పాప. నా స్నేహితురాలొకావిడ, వాళ్ళదీ విజయవాడే, నన్ను హడావుడిగా పిలిచేసి ఆ అమ్మాయి తమచుట్టం అనీ, తనకి వాళ్ళందర్నీ చిన్నప్పట్నుంచీ తెలుసని చెప్పింది సంబరపడిపోతూ. నేనూ అంత హడావుడిగానూ మా అమ్మాయిని పిలిచేసి చూసేవా మిసమెరికా అన్నాను. అవునౌవును, ఇండియను అంది. అహహహహహ అంతే కాదు, తెలుగమ్మాయి అన్నాను. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, అది మనరక్తంలో ఉంది. మనవాడిలా కనిపించే ఏ మొహం చూసినా మనసు ఎగిరిపడుతుంది క్షణంలో సగంసేపు. ఆ తరవాత మిగతా ఆలోచనలు వస్తాయి. నిజంగా మనవాడేనా, మనవాడిలా కనిపిస్తున్న మరొక దేశీవా? ఎందుకంటే హిస్పానికులు కూడా హిందువుల్లా కనిపించే అవకాశాలున్నాయి.

ఏ దుకాణంలోనో మనాడిమొహంలా ఉందే అనిపించే మొహం కనిపిస్తే మరోమారు పరికించి చూస్తాం. అలా చూడ్డానికి మనం "కండిషన్డు" అయిపోయేం. చిన్నపిల్లలు చూడండి, మనవాళ్ళమొహాలు ఇట్టే పసి కట్టేస్తారు ఎక్కడైనా సరే. ఓ సారి నేను హైవే మీద పోతున్నాను 65మైళ్ళ వేగంతో. నా పక్కలేనులో మరోకారు దూసుకుపోతోంది. ఆ కారులోంచి ఓపాప నావేపు వేలెత్తి చూపుతోంది మామీ అంటూ. తెలుగుపిల్లలే కాదు

తెలుగు తల్లులు బేబీసిట్ చేసిన అమెరికను పిల్లలు కూడా మనమొహాలు కనిపిస్తే మనదగ్గరికొచ్చేసి, మొహంలోకి చూస్తూ నిలబడిపోతారు. మనవాళ్ళపిల్లలయితే, ఎత్తుకోమని చేతులు చాపుతారు.

అసలు అది మానవధర్మమే కాదు, జీవ ధర్మం. ఒకేరకం ఈకలన్నీ ఒకచోట చేరతాయని సామెత కదా. వీధిలో ఒక కుక్క మరోకుక్కని చూస్తే మొరగడం కూడా ఈ గుర్తింపుకోసమే. సజాతి కుక్క అయితే సౌమ్యంగానూ, మరోజాతి కుక్క అయితే కోపంగానూ మొరుగుతుందని నా అభిప్రాయం.

నేను అమెరికాకి 70ల్లో వచ్చేను. అప్పట్లో మాఊళ్ళో నాలుగు తెలుగు మాత్రమే ఉండేవి తెలుగు కుటుంబాలు. ఎంతో ముచ్చటగా ఉగాది, దసరా, దీపావళీ, వినాయకచవితి ... పండుగలన్నీ పద్ధతిగా జరుపుతునేవాళ్లం. మానాలుగు కుటుంబాలే కాక యూనివర్సిటీలో చదువులకొచ్చిన విద్యార్థులని భోజనాలకి పిలిచేవాళ్ళం. పండుగంటే సరదా లేనివాళ్ళు కూడా భోజనాలకి సంతోషంగా వచ్చేవాళ్ళు. పొయ్యిమీద మూకుడు పెట్టి, కూరముక్కలు తరిగి, “ఇప్పుడేం చెయ్యమంటారు?” అని నన్ను ఫోనులో పిలవడం ఇప్పటికీ గుర్తే. ఇలాటివాళ్ళమొహాలే మతాబాల్లే వెలిగేది ఏ బజారులోనో తెలుగు మొహం కనిపిస్తే.

నిజానికి అది మానవధర్మం. అమెరికాలో చూడండి, వీధిలో అడుగు పెడితే చాలు, దారి పొడుగునా, హలో, హలో చెప్తూనే ఉంటారు. విస్కాన్సిన్లో హలోలు చెప్పిన కొత్తలో ఇలా ఎవరైనా పలకరిస్తే నేను కంగారు పడిపోయేదాన్ని. వీళ్ళెవరో ఎరిగినవారు కాబోలు, నేను వీళ్ళని ఎక్కడో కలిసేను కాబోలు, ఎక్కడ కలిసేను చెప్మా, నేను వాళ్ళని గుర్తు పట్టలేదని వాళ్ళకి కోపం రాలేదు కదా .... ఇలా ఆ పూటంతా తల బద్దలు కొట్టుకునేదాన్ని.

అసలు అది మానవధర్మమే కాదు, జీవ ధర్మం. ఒకేరకం ఈకలన్నీ ఒకచోట చేరతాయని సామెత కదా. వీధిలో ఒక కుక్క మరోకుక్కని చూస్తే మొరగడం కూడా ఈ గుర్తింపుకోసమే. సజాతి కుక్క అయితే సౌమ్యంగానూ, మరోజాతికుక్క అయితే

కోపంగానూ మొరుగుతుందని నా అభిప్రాయం. ఇక్కడే మరోమాట కూడా చెప్తాను. నా రోజూ ఓ గంటసేపు తిరుతాను కదా. ఆ సమయంలో కనీసం ఇద్దరో ముగ్గురో బాగున్నావా అని పలకరిస్తారు. జనం తక్కువా, జాగా ఎక్కువా సంస్కృతిలో భాగమే ఇది. ఇదే మనూళ్లో ఏ వీధి చివరో నిలబడి అలా పలకరించగలరా? హాహ్. బాగున్నారాకి బదులు రామ రామ అంటే, ఓ పూటలో రామకోటి అయిపోతుంది. ఎందుకు చెప్తున్నానంటే, ఈ మనం, మనవాళ్లూ అన్న స్పృహ కూడా దేశం యెల్లలు దాటి వెళ్ళినప్పుడు ఎక్కువ తెలుస్తుంది.

ఇలా అనుకోడానికి నాకు మరో కారణం కూడా ఉంది. నేను ఈ నేలమీద కాలెట్టేక, చాలాకాలం తెల్లవాళ్లందరూ ఒకేలాగ కనిపించేవారు. అలాగే మిగతా రంగులూను, నల్లవాళ్లు, చామనచాయవాళ్లు ... చలికాలం అయితే నీలం పర్కా, లేదా ఆకుపచ్చ పర్కా, ... కొన్నాళ్ళు వాళ్లు జుత్తూ, ముక్కూ, కళ్ళరంగూ, పళ్ళవరసా ఇలా కొన్ని కొండగుర్తులు పెట్టుకోడానికి ప్రయత్నించేను కానీ అది కూడా అట్టే కాలం సాగలేదు. వీళ్ళు జుత్తులు రకరకాలుగా మార్చేస్తుంటారని నాకు చాలా కాలం తెలీలేదు. అది తెలిసి, మరోరకం గుర్తులు వెతుక్కుంటూ వస్తున్నాను. ఇది ఇంకా పూర్తి కాలేదు. 90లు వచ్చేసరికే మొత్తం బొమ్మ మారిపోయింది. అమెరికా రాబోయే పిల్లలందరూ దేశంలో ఉండగానే చక్కటి ఇంగ్లీషు చదువులు చదువుకుని, అమెరికనులకంటే మించిన అమెరికనిజం ఒంట బట్టించుకుని దిగుతున్నారు. అందులో ఒక భాగం స్నేహాలు ఎలా చేసుకోవాలి, ఎవరితో చేసుకోవాలిలాటివి. ఇది బిజినెస్ 101. ఎవరితో ఎలా మాటాడాలి, ఎవరు మనకి ఏవిధంగా పనికొస్తారో ఎలా తెలుస్తుంది, మనం పైమెట్టుకి ఎక్కడానికి ఏం చెయ్యాలి - ఇలాటివన్న మాట.

ఎదటివాడు మనవాడవునా, కాదా అన్న ఆలోచనకంటే తమ పురోభివృద్ధి ముఖ్యం కనక ఆ ఆలోచనల్లోనే ఉంటారు సదా. అది సమంజసమే కదా. ఇంతదూరం వచ్చిందెందుకు?

ఇంతకీ ఇది పైచదువులకీ, వృత్తికీ సంబంధించినది. మరి తమతమ గదులకొచ్చేక జరిగేది -   తెలుగుభోజనం కావాలన్న బాధ కూడా లేదు. విదేశీవంటకాలకి కూడా అలవాటు పడే వస్తారు కనక. విదేశీవంటకాలంటే నాకేదో కక్ష అనుకోకండి. అభిరుచులు మారుతున్నాయని చెప్పడమే నా ఉద్దేశం ఇక్కడ. నేను కూడా విదేశీవంటలు తింటాను కానీ నాకు తెలుగు వంటలే ఎక్కువ ఇష్టం.

మరో కోణం – ఇదే నిజానికి ముఖ్యమైన కోణమూ, మరియు ఒళ్ళు, తలా దగ్గరపెట్టుకు చూసుకోవలసిందీను - అబ్బాయిలకి అమ్మాయిలతో స్నేహం. "మనదేశంలోలా అమెరికాలో ఆంక్షలు లేవు, అందరూ ఎంచక్కా భుజాలమీద చేతులేసుకు, కలిసిమెలిసి తిరుగుతారు" అని ప్రచారంలో ఉంది కదా. ఎటొచ్చీ కొందరు ఈ భుజాలమీద చేతులతో ఏపనివ్వరు. మీడియాలధర్మమా అని కొన్ని అపోహలు బహుళప్రచారం పొందేయి. కానీ నిజానికి అందరమ్మాయిలు – అంటే నేనంటున్నది అన్ని దేశాలవారు – కూడా కొన్ని నియమాలు పాటిస్తారు. ఏదో సినిమాలోలాగో, నవలలోలాగో చూడగానే, పద,పదమంటూ మంచాలెక్కెయ్యరు. "ఎవరికీ చెప్పనులే, ఈ ఒక్కరాత్రేలే" అంటూ శృతి మించి, మంచీ చెడ్డా, సంగతీ సందర్భమూ చూసుకోకుండా అమ్మాయిలని పలకరించేవాళ్ళున్నారంటే నాకే ఆశ్చర్యంగా ఉంది. నిజంగా అందరూ అలా చేస్తారని కాదు, చేస్తే మాత్రం పప్పులో కాలేసే అవకాశాలెక్కువని తెలియజేస్తున్నాను. నూటికి తొంభైపాళ్ళు ఆ అమ్మాయి ఆ అబ్బాయిని "లైను"లో పెడుతుంది. అబ్బాయిలు తాము ఇండియాలో చదువుకున్న అమెరికనిజానికి సంబంధించిన మిడిమిడి చదువు వదిలించుకుని మళ్ళీ ఓనమాలతో మొదలు పెట్టాల్సివస్తుంది మళ్ళీ. ఇంతకీ, నేను మొదలు పెట్టింది ఇది చెప్పడానికి కాదులెండి. ఇలా కూడా జరుగుతోందని తెలుసు కనక చెప్పేనంతే. పాతిక ముప్పై ఏళ్ళగా ఈ దేశంలో స్థిరపడినవారు ఈ కొత్తగా వచ్చినవాళ్ళకి అన్లెర్నింగులో సాయపడడంలో కూడా తప్పు లేదేమో.

మనవాళ్ళు మనవాళ్ళని పలకరించకపోవడానికి నాదృష్టిలో ఒకే కారణం – “వీరితో మనకేం ఉంటుందిలే మాటాడ్డానికి” అని. పైన చెప్పేను కదా ఒకేరకం ఈకలు అయితేనే … :))

000

(సెప్టెంబరు 18, 2013)

6. ఈ ఆడాళ్ళు కూరెలా తరుగుతారో :(

హా, ఆగు, ఈ ఆడాళ్లంటావు, నువ్వు మాత్రం … అంటూ మొదలెట్టకు. నాకు తెలుసులే నీకొచ్చే ప్రథమ సందేహం అదేనని. “కూరలు తరగగల ఆడాళ్ళు” అన్న పరిమితార్థంలో నేనంటున్నది. ఏం జరిగిందా? చెప్తాను, విను.

కాపురానికొచ్చినకొత్తలో కూరలు తరగడం ఎలాగో అని దిగులుపడుతుంటే మాయింటికి తరుచూ వచ్చే రిసెర్చ్ కుర్రాడొకడు ఆదుకున్నాడు నన్ను. ఎనిమిది చేతులూ, శంఖచక్రాలూ లేవు కానీ నాప్రాణానికి ఆపూట ఆపద్బాంధవుడిలాగే కనిపించేడు. పాపం, అతనికి తెలుగువంటకాలు చాలా ఇష్టంట. “నేను కత్తి తెచ్చిపెడతాను, మీరు కూర చేసి పెట్టండి” అన్నాడు. అలాగే అంటూ ఒప్పేసుకున్నాను మహోత్సాహంతో. “మరి ఎలాటి కత్తి కావాలి, చిన్నదా, పెద్దదా, మొత్తం సెట్టు తేనా, ఒక్క కత్తి చాలా” … ఇలా సందేహాలు వెలిబుచ్చేడతను. అంతవరకూ నాకూ తెలీదు ఇన్ని కరవాలాలున్నాయని. నను సుమారుగా కూరలు తరుక్కునేదొకటీ, మేకలు నరుక్కునేదొకటీ మొత్తం రెండుంటాయనుకున్నాను. అలా కాదుట, వంకాయకొకటీ. గుమ్మడికాయకొకటీ, బీరకాయ పొట్టు చెక్కడానికి ఇంకోటీ. ఉల్లికొకటీ, అల్లానికి మరొకటీ … వెల్లుల్లికి వేరే ఉంటుందిట, దాన్ని ప్రెస్సరంటారుట, అది మళ్ళీ నిమ్మకాయకి పనికిరాదుట – ఇలా అతను నాకు ఎంతో ఓపిగ్గా పాఠం చెపుతుంటే, కళ్లు తిరిగేయి. అమ్మో, ఈదేశం ఎంత పురోభివృద్ధి చెందినదేశం, వీళ్ళెంత సూక్ష్మపరిశీలకులు అని నోరు తెరుచుకు కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయేను. నాకళ్లు మెరిసేయేమో కూడా కన్నీళ్లతో. అతను జాలిగా నావేపు చూసి, అవున్లే, నాకు తెలుసు మీదేశంలో ఇన్ని రకాలు లేవు అన్నాడు.

అతను అలా అనడానికి రెండు కారణాలున్నాయి.

నేను ఈదేశం వచ్చేనాటికి, మాఇంట్లో మేం కత్తిపీటలే వాడుతున్నాం. నేలమీద కూర్చుని, కాలితో పీట కదలకుండా పట్టుకుని, నిలువుకత్తిమీద వంకాయో, గుమ్మడికాయో రెండు చేతులూ పుచ్చుకుని తరిగేరోజులవి. నీకూ తెలుసు కదా కడవంత గుమ్మడికాయ కత్తిపీటకి లోకువ. గుమ్మడికాయ అయినా పచ్చిమిరపకాయ అయినా ఆ కత్తిపీటతో అయిపోయేది పని. ఆరోజుల్లో అన్నమాట ఆ పిహెచ్.డీ అబ్బాయి ఇండియా వెళ్ళేడు. కత్తిపీట చూసి, ముచ్చట పడి ఒకటి తెచ్చుకున్నాడు కూడా. అప్పటికింకా ఎయిర్పోర్టుల్లో ఇప్పుడున్నంత పకడ్బందీగా జాగ్రత్తలు లేవు. ఇదుగో, ఇది తెస్తున్నాను అని వారి కళ్ళముందొకసారి ఆడిస్తే చాలు నైవేద్యం పెట్టినట్టు. సరే, పో అని పంపేసేవారు.

ఇంతకీ ఇలా కత్తులసమాచారం సకలం తెలిసిన ఆ పెద్దమనిషి అన్నిటికీ పనికొస్తుందిలే అని మూరెడు కత్తి తెచ్చిచ్చేడు నాకు. చెప్పొద్దూ, అది చూడగానే నా గుండె దడదడలాడింది. కూరలు తరుక్కోడానికి అని చెప్పలేదు కానీ మేకలు నరికడానికి కాదని నేను ప్రత్యేకించి చెప్పలేదు కదా అనిట. చాలా పదును, జాగ్రత్త అని కూడా చెప్పేడు.

గత నలభైఏళ్లగా అదే వాడుతున్నాను కూరలు తరుక్కోడానికీ, కొబ్బరికాయ కొట్టడానికీ కూడా. ఆ రెండో వాడకంమూలంగా ఈమధ్య పిడి వదులయిపోయి, కదులుతోంది. మళ్ళీ అలా వాడబోతే, ఎగిరి నామొహంమీదో, ఎదటివారిమొహమ్మీదో గంటు పెట్టే ప్రమాదస్థాయికి వచ్చింది. ఇహ తప్పదని, వారంరోజులకిందట నేను మళ్ళీ మరో కత్తి కొనుక్కోడానికి బయల్దేరేను. నా కత్తిబజారు కార్యక్రమం అంతా చెప్పను కానీ, ఈసారి మూరెడు కాక జానెడుపొడుగుది తెచ్చుకున్నానని మాత్రం గ్రహించగలరు. ఈమారు అది చాలాపదును, జాగ్రత్త అని చెప్పడానికెవరూ లేరు. కానీ, 40 ఏళ్ళు అమెరికాలో ఉన్నాక ఆ మాత్రం తెలీదేమిటి ఎవరికి మాత్రం – అదే మనజాగ్రత్తలో మనమే ఉండాలని, అంచేత నాకు నేనే చెప్పుకుని మమ అనుకున్నాను శ్రద్ధాభక్తులతో.

జాగ్రత్తగా ఉన్నాననే అనుకున్నాను. కాయ బల్లమీద పెట్టి తరగబోయేను. కాయ టప్మని తెగింది. రెండో ముక్క తరగబోతున్నాను. బల్లమీద ఎర్రగా చార కనిపించింది. ... ఎక్కడినించి చెప్మా అని చూస్తున్నా, మరి బీరకాయ ఎర్రగా ఉండదు కదా. అప్పుడు గ్రహించేను నావేలునించని.

గబగబ కొళాయి తిప్పి, చన్నీళ్ళకింద చెయ్యి పెట్టి, తెగినవేలు బొటనవేలితో నొక్కి పట్టుకుని, వంటింట్లో గిన్నెలూ, తప్పేలాలూ ఎక్కడివక్కడ వదిలేసి, ఈపూటకి కొత్తగా, వేడివేడిగా ఒండుకు తినే అదృష్టానికి నోచుకోలేదు, టీవీలో ఏదైనా సరదాగా ఉందేమో అని చూస్తూ కూర్చున్నాను. అదేం ఖర్మో, నేను ఎప్పుడు టీవీ చూడబోయినా, ప్రకటనలతోనే తెరుచుకుంటుంది తెర. గోరుచుట్టుమీద రోకటిపోటులా, సాటిలేని, ఆ జన్మాంతం మొక్క వోని కత్తి ప్రకటనతో మొదలయింది నా టీవీ ఆనందం. నాకెప్పుడూ అనుమానమే. ఈ టీవీ ప్రకటనల్లో రానున్న రెండు క్షణాల్లో కొనేస్తే, రెండు రెట్లు ఆదా అంటాడు. కానీ మనం ముందు డబ్బు పంపేయాలి. ఎలా నమ్మడం, వాడు డబ్బు తీసుకుని వస్తువు పంపకపోతే ఏం చెయ్యడం? ఇలాటి కథలు కూడా వింటూనే ఉన్నాం మరి. నిజానికి నేనొచ్చినకొత్తలో, అదే ఆ పిహెచ్.డీ బాబు పరిచయం కాకముందు ఒకటి ఆర్డరు చేసేను. తీరా వచ్చినవస్తువు చూస్తూ, వాడు టీవీలో చూపినదానికి నాకు చేతికొచ్చినదానికీ ఎక్కడా సంబంధమే లేదు. మ్.

రెండో రోజు చిన్నచీటీమీద "జాగ్రత్త, ఈ కత్తి పదును" అని రాసి ఎదట గోడకి అంటించి, దాన్ని చూస్తూ ఉల్లిపాయ తరగడం మొదలు పెట్టేను. ఉల్లిపాయ మంచి ఘాటుగా ఉందేమో కళ్ళలో మళ్ళీ నీళ్లు, ఆ నీటిపొరలమధ్య నాచీటీ మసకమసకగా కనిపిస్తోంది. కటింగుబల్లమీద ఎర్ర ఉల్లిపాయరంగు పాకినట్టు కనిపిస్తోంది. ఎర్ర ఉల్లిపాయరసం ఒకొకసారి తెల్లటిబల్లమీద జీరలుజీరలుగా కనిపించడం మామూలే కానీ ఈ ఎరుపు కొంచెం ఎక్కువగా ఉంది. చటుక్కున ఉల్లిపాయ వదిలేసి, వేలు విదిలించేను. ఆవిదంగా కౌంటరమీదే కాక, కింద కబర్డుతలుపుమీదా, వెనక ఫ్రిజిమీద, నాచుట్టూ రకరకాల డిజైనులు మన tie and dye చీరెల్లా అలుముకున్నాయి. నయనానందంగా

కాదులే. కళ్లు తిరిగి పడిపోడానికిది సమయం కాదని, నిలదొక్కుకుని, మళ్లీ చెయ్యి కొళాయికింద పెట్టేను కొంచెంసేపు. నాలుగు నిముషాలకి రక్తధారలు తగ్గినట్టే అనిపించి, అక్కడ చెదురుమదురుగా కనిపిస్తున్న రక్తపుచారలు తుడవడం మొదలు పెట్టేను. తుడుస్తూంటే మళ్లీ వేలునించి తడి అవుతోంది. ఆధునిక తెలుగుకథలా గంటు లోతుగానే ఉంది కాబోలు ఈ అనుకుని హడావుడిగా పక్కగదిలోకెళ్ళి ప్రథమచికిత్స సరంజామాకోసం చూస్తే, అక్కడ తెగినవేలుకి కట్టు కట్టడానికి పనికొచ్చేదేమీ కనిపించలేదు. అవును మరి, పిల్లలున్న ఇల్లయితే అస్తమానం కాలో చెయ్యో గీరుకుపోయిుందంటూ వస్తారు, అలాటివి తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలి, అంతేగానీ నాకెందుకూ, నేను కూర్చుంటే లేవడమే కష్టం, ఇంక పడడం ఎక్కడ, మోకాలో మోచెయ్యో చీరుకుపోడం ఎక్కడ? ...

హాహహ్. ఈ కబుర్లకేం గానీ ఆ చెయ్యి చూసుకుందూ ముందు, కార్పెట్మీద రక్తం చిందితే మేనేజరు మొత్తం కార్పెట్టు మార్చమంటాడు నీ సొంత ఖర్చులతో.

వేలు మళ్ళీ చూసుకున్నాను, ఇహ లాభం లేదు, ప్రథమచికిత్స తప్పదు అంటూ వీధిచివరనున్న దుకాణంలో ఏ బాండెయిడో దొరక్కపోతుందా అని. తలుపు తీయబోతుంటే, తలుపుమీద ఎర్రగా వేలుముద్రొకటి పడి, జాగ్రత్త అని కళ్ళెర్ర జేసింది. మరోసారి గుర్తు తెచ్చుకున్నాను నేను అతిజాగ్రత్త జనులమధ్య ఉన్నాను. నేనిలా రక్తసిక్తహస్తంతో బయటికి వెళ్ళేనంటే, ఏమైంది అని నన్నడగడానికి ముందే తొమ్మిదీపదకొండు కొట్టేస్తారు. ఆ వెంటనే ఓ ఆంబులెన్సూ, రెండు ఫైరుట్రక్కులూ, ముగ్గురు బీటు పోలీసులు వచ్చేసి నాముందు నిటారుగా నిలబడి, నిదానంగా ప్రొసీజరు ప్రశ్నలేస్తారు, “ఇంగ్లీషొచ్చా,” “ఒక్కదానివే ఉన్నావా?” “కళ్ళు కనిపిస్తాయా?” “చెవులు వినిపిస్తాయా?”

నాకేమో అరవాలనిపిస్తుంది, “వాటన్నిటికీ ఇంగ్లీషులోనే జవాబులు తరవాత చెప్తాను, ముందు నావేలికి బేండయిడుంటే ఇయ్,” అని. కానీ నేనలా అరవడం వీరి పద్ధతికి

విరుద్ధం. అంచేత ఓపిగ్గా జవాబులివ్వాల్సొస్తుంది. ఈలోపున నావేలినుంచి రక్తం మరింత చిమ్ముతుంది ...

అలాటి విధానాలకి ప్రతిబంధంగా నావేలికి చేతికందిన రుమాలొకటి తడిపి చుట్టి, దానిమీద మరో రుమాలు చుట్టి, దానికి ఓ ప్లాస్టిక్ సంచీ తగిలించి, ఆ చెయ్యి ఎవరికీ కనిపించకుండా పేంటుజేబులోకి దోపి, రాజు వెడలే అన్నట్టు బయల్దేరేను నేను కొనబోయే రెండు డాలర్ల బాండెయిడులకోసం.

తిరిగొచ్చేక, వేలు నరుక్కోకుండా కూర తరుగుట ఎట్లు అన్న పాఠాలు నేర్చుకోడానికి online courses ఏమైనా ఉన్నాయేమో చూడాలి. లేదా ఏ జ్యోతిగారింటికో వెళ్ళిపోయి, కానున్న కుర్రడాక్టరులా residency లేక internship చేయాలి. అదేదైనా జరిగినప్పుడు మిగతా కథ చెప్తాను.

000

(సెప్టెంబరు 9, 2013)

7. అక్కరకు రాని చట్టాలు.

మాఅమ్మ ఓ సామెత చెప్పేది - చదవేస్తే ఉన్నమతి కూడా పోయిందని. చదవకముందు కాకరకాయ అనేవాడు చదువుకున్నతరవాత కీకరకాయ అంటాడని. ... ఇలాటివే ఇంకా చాలా ఉన్నాయిలే. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే ప్రథమతరగతి పండితమ్మన్యులకీ, పాలకులకీ (వారూ వీరూ వేరనే అనుకుంటూ) బుక్కుల్లో బుక్కులు వల్లె వేయడం ఎక్కువయి చూపు ముక్కుకొన దాటి ముందుకి పోలేకుండా ఉంది. నాగరీకత అనబడే పదార్థం వెర్రితలలు వేస్తోంది. నీకేమైనా అనుమానం అయితే ఈ చట్టాలు చూడు.

చట్టాలకీ చుట్టాలకీ సంబంధం ఏమిటి? అంటావా. చుట్టాలని ఏదో ఓ సమయంలో ఎలాగో అలాగ వదిలించుకోవచ్చేమో కానీ చట్టాలని మాత్రం నెత్తిన పెట్టుకు పూజించాలి వరమీయని వేలుపులయినా సరే.

ఆమధ్య ఒక 17 ఏళ్ళ కుర్రాడిని గుండేసి కొట్టేసిన కథ చెప్పేను కదా. ఆ చంపినవాడితప్పేం లేదని న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని కూడా చెప్పేనా? వీళ్ళ బుర్రలెక్కడున్నాయి? మోకాళ్లలోనా? ఇలా ఎందుకంటున్నానంటే, ఆ తీర్పుకి జవాబుదారీ అయిన జూరీలు అతనిది నిజంగా తప్పే అని బయటికొచ్చేక బాహాటంగా ప్రకటించేరు. ఆ చంపినవాడు బోలెడు అబద్ధాలు చెప్పేడని తెలిసినా, నీతప్పేం లేదు బాబూ, పో, హాయిగా అలా నీ తుపాకీ ప్రదర్శించుకుంటూ వెయ్యేళ్ళు వర్ధిల్లు నాయనా అంటూ పంపేశారు. ఆ తరవాత అతని ఇంటావిడని మాత్రం అబద్ధం చెప్పిందని ముప్ఫై రోజులు జైల్లో పడేశారు. అదేంవంటే, అది వేరు, ఇది వేరు, దాన్లో ఉన్న తిరకాసు దీన్లో లేదంటారు, నిజంగా? లేదూ? ఆ చంపినవాడు కోర్టుకెక్కకపోతే, ఆ ఇల్లాలు

బొంకవలసిన అగత్యం లేదు కదా అప్పుడే నాకనిపించింది ఇంత మరీ తలా తోకా లేని వ్యవహారం ఏమిటని.
సెనేటూ, హౌసూ – వీళ్ళ సంగతి సరే సరి. డబ్బు లేదు, ఆఫీసు మూసేస్తున్నాం అంటూ చేతులెత్తేసి వందల వేలమందిని ఇళ్ళకి పంపేసేరు. కాంగ్రెసుమన్లు మాత్రం జీతాలు వసూలు చేసేసుకోడానికి పకడ్బందీగా చట్టాన్ని తమరే తయారు చేసేసుకున్నారు. కాదు, కాదు, ముందున్న చట్టాన్నిమార్చేసుకున్నారు. ఏదో amendmentట. అది ఎవరు మార్చేరు అంటే తమరే!! ఎందుచేతంటే, వాళ్ళు పని చేస్తున్నారుట. హాహాహాహ పని చేస్తున్నారా? పని జరక్కుండా చూస్తున్నారా? ఇంకా అదేంవంటే, సరే, మేం జీతం తీసుకోం, తీసుకున్నా ధర్మం చేసేస్తాం అంటున్నారు. మహాప్రభో, మీరు తీసుకున్నా, తీసుకోకున్నా, దర్మం చేసేసినా, అగ్నిదేవుడికి ఆహుతి చేసినా నాకొరిగేదేమీ లేదు. నాక్కావలసింది నా పొయ్యిలో పిల్లి లేవడం. నాపింఛను డబ్బులు నాచేతిలో పళ్ళేదు, అద్దె ఇవ్వనంటే ఇంటివాడూరుకుంటాడా? కూరలవాడు కూరలు తీసుకోనిస్తాడా?
నాకయితే మరో చట్టం వెంటనే చేసేయాలనిపిస్తోంది. అదేమిటంటే – ఎన్నికలకి ముందు కాంగ్రెసుఅభ్యర్థులకి అర్హతలలో ఒక అర్హత – అభ్యర్థి నెలరోజులపాటు తమ సంపదలకి దూరంగా, మధ్యతరగతి కుటుంబాలమధ్య రెండుపడగ్గదుల వాటాలో నెలరోజులపాటు మధ్యతరగతి ఆదాయంతో గడపాలి.
"అదేం లాభంలేదమ్మా. వాళ్లకి తమ సంపదలదన్నూ ఉందన్న స్పృహ ఉంటుంది కదా. పైగా నెలరోజులు ఎలాగోలా గడిపినా, మళ్ళీ మరిచిపోతారు. నీకు మాత్రం తెలీదేమిటి … దాలిగుంటలో పడుకున్నంతసేపే…"
హుమ్. అదీ నిజమే. స్వతహాగా రావాలి కానీ ఇలాటి బుద్ధులు … చూస్తున్నాం కదా స్పీడింగు టికెట్టు పుచ్చుకున్నవాడు స్పీడింగు మానేసేదేమిటి … హాహా.

వాళ్లకి తమ సంపదలు వెనక ఉన్నాయన్న స్పృహ ఉంటుంది కదా. పైగా నెలరోజులు ఎలాగోలా గడిపినా, మళ్ళీ మరిచిపోతారు. నీకు మాత్రం తెలీదేమిటి ... దాలిగుంటలో పడుకున్నంతసేపే..."

అసలు ప్రభువులే కాదు పెద్దా, చిన్నా అన్ని చోట్లా అలాగే ఏడుస్తున్నాయి ఇవి. పెద్దవయితే చట్టాలు, చిన్నవైతే పాలసీలనబడు నియమాలు. ఎక్కడికెళ్ళినా రూల్సొప్పండీ అంటూ కంటిక్కనిపించని ఒక అవతారాన్ని చూపించి బొమ్మలాట ఆడిస్తారు.

రెండేళ్ళకిందట మాపక్కింటావిడకారుకి కొత్తగా చక్రం చేపట్టిన ఓ చిన్నారి ఢీకొని, ఆవిడ కారుని తుక్కు తుక్కు చేసేసిందా. పోలీసులొచ్చి ఏంచేసేరూ ... ఎవరితప్పో చెప్పలేం అంటూ గోడమీద పిల్లివాటంగా ఓ కాయితం గిలికేసి తప్పుకున్నారు. రెండు ఇన్సూరెంసు కంపెనీలు మా క్లయింటు తప్పు కాదంటే మాక్లయింటు తప్పు కాదని తప్పుకున్నారు. ఆవిడ మళ్ళీ కారు కొనేవారకూ కారు లేదు. అదేమిటంటే, నువ్వు ఇంకెవరికారైనా అప్పు తీసుకోవచ్చు కదా, అద్దెకారు నడపొచ్చు కదా. ఆవిడ నేనలాటివేం చెయ్యను మహాప్రభో అని ఒట్లూ ప్రమాణాలూ చెయ్యడానికి సిద్ధపడినా ఇన్సూరెన్సు వాడు మాత్రం, అదేం పనికిరాదమ్మా, రూలంటే రూలే అంటూ పట్టు బట్టి వసూలు చేసుకున్నాడు తమ వాటా లేని కారుకి! అయినా సరే, కారు లేకపోయినా ఇన్సూరెన్సు నిలబెట్టుకోవాలిట.

నేను సూచించే మరో చట్టం – 21 ఏళ్ళు వచ్చేవరకూ తాగరాదు కనక అదే డ్రైవింగ్ లైసెన్సుకి కూడా వర్తింపజేయాలి.

ఇలా ఆలోచిస్తుంచే నాకు ఇంకా బోలెడు తోస్తున్నాయి. ఈమధ్యనే విమానం ఎక్కేను కనక – నేను ఏడాదికో రెండేళ్ళకో ఓమారు విమానం ఎక్కితే గొప్ప – అంచేత ఇది మరింత విశేషం. అసలు నాకు విమానం ఎక్కడం అంటే చిరాకు. వాళ్ళు పెట్టే నియమనిష్ఠలు చూస్తే పూర్వం నిరతాగ్నిహోత్రులు ఆచరించే నిష్ఠలకి మించిపోయి ఉంటాయి. ఆ విమానాధిపతులు అస్సలు బుర్ర లేదని వాళ్ల అనుకుంటున్నారేమో

అనిపిస్తుంది. ఉదాహరణ చెప్పమంటావా, చెప్తాను. ఇక్కడ అమెరికాలో ఉన్నన్ని ఆంక్షలు అన్ని దేశాల్లోనూ లేకపోవచ్చు. అంచేత కొన్ని దాటేస్తాను body imaging లాటి బాలారిష్టాలు చాలా ఉన్నాయి. అవన్నీ గడిచి, సీటులో పడతామా? అక్కడినించి మొదలవుతాయి, నిగడదన్ని కూర్చో, బెల్టు తగిలించుకో, సిగరెట్టు కాల్చకు, పానీయాలు త్వరలోనే ఇవ్వబడును (ఉచితంగానో, అచ్చుకోవాలో అర్థం కాదు ఆ మైకులో). ...ఇలా ఏదో అగోచరవాణిలో చెప్పుకుపోతూంటారు వాళ్ళమానాన వాళ్ళు. నాకు ఈపక్కా, ఆ పక్కా ఎదురుగానూ ఉన్నవాళ్ళు వాళ్ళమానాన వాళ్ళు సెల్లుల్లో మాటాడుకోడమో, లాపుటాపుల్లోనూ, టాబ్లెట్లలోనూ తమ పనులు తాము చూసుకుంటూనో ఉంటారు. ఎవరికోసమీ రొద, ఎవరికి తెలీదీ సొద అని నేను తికమక పడిపోతూంటాను. అంచేత నా ప్రతిపాదన – విమానాల్లో ఇంటర్కం వాడరాదు. విమానాల్లో ప్రయాణీకులసౌకర్యార్థం నియమాలు తయారు చేసేవాళ్ళెవరూ నాలాటి సామాన్య పౌరులబాధ అర్థం చేసుకోరు. చేసుకోలేరు. ఎందుకంటే ఈ సౌకర్యాలు ఏర్పాటు చేసేవాళ్ళు సొంత జెట్టుల్లో ప్రయాణాలు చేస్తారు. లేదా ఉత్తమతరగతిలో ప్రయాణాలు చేస్తారు.

సీట్లు వెనక్కి వాలే సదుపాయం ప్రయాణీకులసౌకర్యార్థం పెట్టేం అని విమానాల అధికారులలో ఎవరో అనుకోవచ్చు. కానీ అందరి సౌకర్యార్థం కాదని వాళ్ళకి తట్టలేదు, ఆశ్చర్యంగా లేదూ? ఇంతకీ నా అసలు నస – ఏ పూర్వజన్మలోనో చేసిన ఏ దుష్కృతంమూలంగానో నావంతుకి మధ్య సీటు దొరికిందంటే నాకింక ఊపిరాడదు. గిజగిజలాడిపోతాను. ఊపిరాడనట్టు బాద పడతాను. అలాటప్పుడు ముందు సీటులో ఉన్న ప్రయాణీకుడు, లేదా ప్రయాణీకురాలు తనసీటు వీలయినంత వెనక్కి వాల్చి, ఎంచక్కా దుప్పటి కప్పుకుని, పడుకుంటే నాకు చెప్పలేనంత చిరాకేస్తుంది. ఆ మనిషి నాఒళ్ళో తల పెట్టుకు పడుకున్నట్టుంటుంది. జోల పాట పాడనా అని అడగాలని కూడా

అనిపిస్తుంది. అ పరిస్థితిలో నేను నిలబడితే, అలనాటి కుబ్జ మహాదేవిలా మూడంకె వేసినట్టు నిలబడవలసివస్తుంది. అంచేత

నేను ప్రతిపాదించే చట్టం – విమానాల్లో సీట్లు 15 డిగ్రీలకోణం మించి వెనక్కి వాలగలసౌకర్యమును వెంటనే రద్దు చేయవలెను.

ఎలాగా చట్టాలు ప్రతిపాదిస్తున్నాను కనక మరి కొన్ని కూడా పన్లో పనిగా చెప్పేస్తాను.

ప్రతివారూ సాటి మనిషిని గౌరవించవలెను.

- ఇది ఎప్పట్నుంచో ఉంది కదా.

- ఎవరూ పాటిస్తున్నట్టు కనిపించడం లేదు కదా.

- అది నీదృష్టి దోషము తల్లీ

- చూసేవా, ఇలా మాటాడ్డం మర్యాద కాదని కూడా తెలీదు నీకు.

- తల్లీ అన్నాను కదా. …

- సరి. నిన్నుద్ధరించడం నాతరం కాదు. వచ్చే జన్మలో కనిపిస్తాను.

తా.క. - ఈ చట్టాలు ఎప్పుడు అక్కరకు వస్తాయంటే నువ్వు కాంగ్రెస్మనువో, ఇన్సూరెన్సు కంపెనీ యజమానివో అయినప్పుడు.

ooo

(అక్టోబరు 13, 2013)

8. నా ఆరోగ్యసూత్రాలు

గమనిక – ఈ సూత్రములు కాలపరీక్షకి తట్టుకుని నిలిచినవి. ఆ పరీక్షలు నేనే చేసేను. ఫలితాలు నేనే అక్షరగతం చేస్తున్నాను. ఇవి ఉద్యోగస్థులకీ పిల్లలతల్లులకీ ఇప్పుడు సాధ్యం కాకపోవచ్చు కానీ ఉద్యోగాలు విరమించిన తరవాత, పిల్లలు ఇల్లు వదిలేసేక తప్పక పనికిరాగలవని నానమ్మకం.

పది రోజులక్రితం ఒకరోజు పొద్దున్నే ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఏడు గంటల ముప్ఫై నిముషాలకి నాకు వృద్ధాప్యము ప్రవేశించినదని గ్రహించేను. అప్పటికి నేను లేచి మూడు గంటల ముప్ఫై నిముషములయినది. మరి ఏడు గంటల ముప్ఫై నిముషాలవరకూ ఎందుకు తెలీలేదు లేదా అప్పుడే ఎలా తెలిసింది, అసలు ఎవరైనా ఎలా తెలుసుకుంటారు లాటి ప్రశ్నలు చాలా కలుగవచ్చు మీకు. వాటికి తరవాత జవాబులు చెప్తాను.

ఉదయం లేస్తూనే కాలు పీకడం మొదలుపెట్టింది. నిలిచినా నడిచినా రెండు కాళ్ళమీద చేస్తాం కదా ఒక కాలే ఎందుకు నొప్పెడుతోంది అని నాకు కలిగిన మొదటి సందేహం. సరే, అది తరవాత చూదాం అసలు నొప్పి ఎందుకొస్తోంది అని ఆలోచించడం మొదలు పెట్టేను. మీకు చెప్పేనో లేదో – మామూలుగా నాకు ఏ రుగ్మత సంభవించినా ముందు నాకు నేను వైద్యం చేసుకోడానికి ప్రయత్నిస్తాను. డాక్టరు దగ్గరికి వెళ్తే ఆయన లేక ఆవిడ ఏం ప్రశ్నలు వేస్తారో అవి నాకు నేను వేసుకుంటాను.

నొప్పి ఎప్పుడు మొదలయింది? ఎక్కడ? ఎలా?

కూర్చున్నప్పుడా? నిల్చున్నప్పుడా? నడుస్తున్నప్పుడా?

ఎంత సేపు కూర్చుంటే? … నిల్చుంటే? … నడిస్తే?

ఎక్కడ కూర్చుంటే? …

ఇలా ప్రాథమిక పరీక్ష అయింతరవాత, ఆ స్థితి ఒకొకటే మార్చి చూస్తాను.

మూడు మైళ్ళకి బదులు ఒక మైలు నడువు

కుర్చీ మార్చి చూడు

కాలు మార్చి కాలు మీద నిల్చుని చూడు.

మొదటి సూత్రం నడక - తగ్గించేను. అప్పుడు మరో బాధ మొదలయింది – ఆకలి.

అలా నాలుగ్గోడలమధ్య నాకు నేనే బందీనై కూర్చుంటే ఆకలేస్తున్నట్టనిపించింది - ఒక అరటిపండు, రెండు రొట్టెముక్కలు, మూడు ప్లేట్లు పకోడీలు ... అలా తింటూనే ఉన్నాను, కడుపు మాత్రం ఖాళీగా కరి మింగిన వెలగపండులా డొల్లగా ఉంది.

బకాసురభావం ... హా. ఇదో కొత్త అనుభవం నాకు.

మామూలుగా నేను నా శరీరాన్ని గౌరవిస్తాను. నాశరీరం చెప్తుంది ఏం తినాలో... తాజా నెయ్యితో పూర్ణాలు తిందామా, గోంగూర తిందామా, పళ్ళు తిందామా, మిరపకాయ బజ్జీలా, మైసూరుపాకా అన్నది నాకు టెలిపతిలో తెలుస్తుంది. నేను నాశరీరతత్వాన్ని మన్నించి ఆపకుండా తినడం సాగించేను. అసలు తింటేనే శరీరం ఉంటుంది. శరీరం ఉంటేనే బతుకు. మన దేశంలో భోజనానికి ఎంత ప్రాముఖ్యం ఉందో వెనకటి తరాలవారికి తెలిసే ఉండాలి. చక్కగా పీటమీద మఠం వేసుక్కూచుని నిదానంగా రుచులు అనుభవిస్తూ తినాలి. భోజనందగ్గర మాటాడకూడదంటారు. ఎందుకు? తింటున్న తిండిమీద దృష్టి పెట్టకపోతే తిన్నది ఒంట బట్టదుట. సరే, ఇంతకీ నేను ఎంత తినడం ఎన్నిసార్లు తినడం – అన్నది ద్విగుణీకృతం చేసేక, సత్ఫలితాలు కనిపించసాగేయి.

క్రమంగా కాలునొప్పి తగ్గినట్టే అనిపిస్తోంది.

అంచేత నా ఆరోగ్య సూత్రం – తిరగడం తగ్గించి తినడం హెచ్చించవలెను.

సాధారణంగా నేను కనుగొన్న పరమసత్యాలు మాఅమ్మాయికి కూడా చెప్తాను.

Exercise less eat more అని టైపు చేసి ఫ్రిజిమీద పెట్టుకోమని సలహా ఇచ్చేను.

మాపిల్ల తను గ్రహించిన ఈ బ్రహ్మరహస్యంలాటి ఆరోగ్యసూత్రం స్నేహితులకి వెంటనే

ట్వీట్ చేసింది. ఒక భారతీయుడు తిరుగుట్వీటు చేసేడు భారతీయ తల్లులు పొట్ట పేలిపోయేవరకు పిల్లలకి మెక్కబెడతారు ప్రేమతో అని.

ఇక్కడే నాకు చిన్న పేచీ. నేను మాపాపకి అలా మెక్క బెట్టలేదు. సత్యప్రమాణంగా మా చిట్టితల్లి చెప్పవలసిన కథ ఇలా ఉండాలి నన్నడిగితే –

బువ్వ తిందువు రమ్మంటే పారిపోతాను






నావంట నేనే చేసుకుంటాను

నాకు ఇష్టమైనవి తింటాను.





ఇంతే సంగతులు.

000

(అక్టోబరు 25, 2013)

9. యాంత్రికం

ఐదున్నరేళ్లయింది నసాంకేతికాల గురించి రాసి. అప్పట్లో చెప్పేను ప్రోగ్రామరులు "నిరంతరం ప్రోగ్రాములు రాయడమో, పాతవి తిరగరాయడమో చేస్తూ సకలజనులకు వెలుగు చూపుతారు. అందువల్ల నాలాటివారికి కాస్త ఇబ్బందే కాని అది తరవాత చెప్తాను" అని. ఆ ఇబ్బంది రాసే సమయం ఆసన్నమయింది. ఆలస్యమయినందుకు పాఠకులు పెద్ద మనసు చేసి మన్నించగలరని ఆశిస్తున్నాను. నిజానికి ఇది నావ్యక్తిత్వంలో లోపం. నాజీవితంలో బోర్లాపడ్డందగ్గర్నుంచీ చదువు, ఉద్యోగాలూ, పెళ్లీ, పిల్లా అన్నీ ఆలస్యమే. చావొక్కటే ఆలస్యం అయేట్టు లేదు. అవకూడదని ఆశిస్తున్నాను. ఆ కథ తరవాత చెప్తానులెండి.

ఈ సాంకేతకయుగంలో మనం, కనీసం నేనెంత యాంత్రికం కావలసి వస్తోందో చెప్తాను. అవే నాఇబ్బందులు.

నసాంకేతికం టపాలో నాకేం తెలీదో తెలియజెప్పుకున్నాను. ఇప్పుడు నాకేం తెలుసో తెలియజేసుకోవలసిన అగత్యం కనిపిస్తోంది. హతవిధీ అనుకోవాలి తమరు.

నాకేం తెలుస్తోందంటే - యాంత్రికయుగంలో తెలిసినదానికంటే ఎక్కువ తెలుసుననుకునేవారే ఎక్కువ. వారితో మనకి పని పడితే, అంటే మనింట్లో ఏదో వస్తువు పని చేయకపోతే, ఈ ఎక్కువతెలుసుననుకున్నవారిని మనం కూడా అదే విధముగా గౌరవించాలి. వారు చెప్పినది మనము వినడమే కానీ మనము చెప్పినది వారు వినడము జరగదు. అంటే యంత్రాలు మనుషులని యాంత్రికం చేస్తున్నాయి. ఈ ఉరవడిలో మన విద్యుత్ గాడ్జటుని రిపేరు చేయగలవారూ వారిచే రిపేరు చేయించుకోవలసిన అవుసరం కలవారూ కూడా యంత్రవతుగా కాలయాపన చేయడం జరుగుతుంది. అదే నాగరిత అనిపించుకుంటోంది. గుళ్ళో రాతిబొమ్మలనీ, వాకిట్లో

చెట్లనీ, ఊళ్లో పుట్టలనీ పూజించడం అనాగరికత అని హేళన చేసేవారు ఈ లోహశకలాలకీ, ప్లాస్టిక్ తునకలకీ, ప్లాస్టిక్ ముసుగులో లోహతీగెలకీ ఇస్తున్న గౌరవం అసమానం, అమేయం, అద్వితీయం, అఖండం. ...

ఎలా అంటారా?

పది రోజులక్రితం నా సర్వరేశుడికి (TV, Internet service providers) మూలాధారమైన బాటరీ కీం, కీం అని మూలగడం మొదలెట్టింది. ఇక్కడినించి మొదలయింది నా సాంకేతివిద్యని అప్డేటు చేసుకొను విధానము. కారయితే మెకానిక్ దగ్గరికి తీసుకెళ్ళాలి కానీ ఇంట్లో చాలా వస్తువులకి బాటరీలాటివి మనమే మార్చేసుకోవచ్చు. హాయిగా అని కూడా అనొచ్చు కొన్ని సందర్భాలలో. ఇంతకీ ఆ డబ్బానేం అనాలో తెలీడంలేదు కనక బేటరీ డబ్బా అందాం.. సరే నా డబ్బాలో బేటరీ మార్చవలసిన సమయం వచ్చింది. మీలో ఎంతమందికి అనుభవమో కానీ మామూలుగా ఈ ఇంటర్నట్, టీవీ, ఫోనూ సర్విసు ఇచ్చేవారిని పిలిస్తే ఆ ఫోనులో మనిషిని పట్టుకోడం మరో యజ్ఞం అంత తతంగం అవుతుంది.

మనం ఫోను చేసేక అవతల మరో యంత్రం బదులు పలికి, మన పిలుపుకి ఆనందం వెలిబుచ్చి, నీకొచ్చిన ఆపద తొలగించడానికే మేం ఇక్కడున్నాం అని ధైర్యం చెప్పి, this call may be monitored for quality purpose అని మనకి విదితం చేసి, అలా చెప్పుకోవలసిన అవుసరం ఉన్నందున, ఆ తరవాత మొదలు పెడతారు. మనం ఎందుకు పిలిచేమో కనుక్కోడం. దానికి మరో పది నిముషాలు పడుతుంది. ఇది కూడా యంత్రగాత్రమే అని మరిచిపోకండి.

... అయితే ... 1 నొక్కు

... అయితే ... 2 నొక్కు

ఈ వరస క్రమం అంతా ఇక్కడ రాయను. మీలో చాలామందికి ఇది తెలిసే ఉంటుంది. తెలీకపోతే విడిగా చెప్తాను.

ఇలా మరో పావుగంట గడిచేక, ఈ కాలు తెగిపోతే మళ్ళీ పిలవడానికి వీలుగా మీ సెల్ నెంబరివ్వండి అని అడుగుతారు ఎంతో మర్యాదగా.

నాకు సెల్ లేదు. ఈ నెంబరే పిలవండి అంటాను. అలా మరో పావుగంట దాగుడుమూతలయేక, ఓ మనిషి దొరుకుతాడు.

అతను అడిగే ప్రశ్నలన్నీ రాయను కానీ కొన్ని మాత్రం ఆమాత్రం తెలీదా అనిపించేలా ఉంటాయని చెప్పడానికి చింతిస్తున్నాను. ఉదాహరణకి,

నీ ఎకౌంటు చూస్తున్నాను ఈలోపున కొన్ని ప్రశ్నలు అడుగుతాను

సరే

నీటీవీ పని చేస్తోందా?

ఇప్పుడు పని చేస్తోంది.

మరి ఎందుకు పిలిచేవు?

బేటరీ మార్చాలి.

ఇంటర్నెట్ పని చేస్తోందా?

చేస్తోంది.

ఫోను పని చేస్తోందా?

మీతో మాటాడుతున్నాను కదా.

మరి ఎందుకు పిలిచేవు?

చెప్పేను కదా బేటరీ మార్చాలని

నువ్వెందుకు బేటరీ మార్చాలనుకుంటున్నావు?

కీం కీం అని అరుస్తోంది.

సరే

నీకేం ఫరవాలేదు. నేను చెప్తాను.

ఇక్కడినించి నాచిన్నప్పుడు రేడియోలో డాన్స్ పాఠాల్లా ఉంటాయి ఆ పెద్దమనిషి సలహాలు.

ఆ డబ్బా బేటరీ ఎక్కడుందో తెలుసా?

తెలుసు.

ఆ డబ్బానుండి కేబులు వాల్ అవుట్ లెట్ కి కనెక్టయిందా?

అయి ఉంది.

అది తీసేయ్?

తీసేశాను.

ఇప్పుడు పని చేస్తోందా?

చూడు బాబూ, నాక్కూడా ఆ స్టెప్పులన్నీ తెలుసు. నా నిజబాధ ఆ బేటరిని దాచిన తలుపు తెరుచుకోడంలేదు.

తలుపు తెరవడానికి స్క్రూడ్రైవరు కావాలి.

అది కూడా తెలుసు. కానీ ఆ బోల్టుకి గంటు లేదు.

మరో స్క్రూడ్రైవరు వాడి చూడు.

నాకు విసుగొచ్చి, అక్కడికి ఆ సంభాషణ ముగించేస్తాను.

ముందొకసారి ఇంటర్నెట్ పని చెయ్యడం లేదని ఫోను చేస్తే, మా వెబ్‌సైటు చూడు, అక్కడ వివరాలున్నాయంది ఆ జవాబులడబ్బా! ఆయనే ఉంటే మంగలెందుకన్నట్టు లేదూ?

అంతర్జాలంలో ఏమైనా జవాబులు దొరుకుతాయేమోనని. నా గ్రహాలన్నీ తమ తమ స్థానాలలో ఉన్నందున అనుకుంటాను ఓ విడియో వెంటనే దొరికేస్తుంది. మా సర్వరేశులు పెట్టినదే.

శలాకలా నాజుగ్గా ఉన్న సుందరొకతె మొహానికి మరిన్ని రంగులు పులుముకుని, ఒయ్యారాలు పోతూ, అలవోకగా ఆ backup box లో బేటరీ మార్చేయడం కన్నులపండువుగా నటించి చూపించింది. చెప్పొద్దూ బొమ్మలాటంత తేలిక అనిపించింది. అయినా ఎందుకేనా మంచిదని మరో మూడుసార్లు చూసేను ఆ విడియో.

ముందు గోడమీద outlet నించి unplug చేయి.

బాక్స్ ఎడంవేపు తలుపు తెరు.
బాటరీని యూనిట్ కలుపుతూ పంగలకర్రలాటి మూడు తీగెలుంటాయి. అవి లాగేయి.
పాత బాటరీ తీసేయి.
కొత్త బాటరీ పెట్టు.
మూడు కొనల తీగెలు వాటి వాటి స్థానాలలో అమర్చు.
అంతే. చిటికెలో పని.
అది చూసినతరవాత నాకు కొన్ని అనుమానాలొచ్చేయి. నేను కూడా సన్నగా, నాజుగ్గా శలాకలా ఉండాలా? మొహానికి అన్ని రంగులేసుకోవాలా, ఒకటో రెండో వేసుకుంటే చాలా? ఆ రంగులెక్కడ దొరుకుతాయో? అని కొంత తర్కించుకుని, ముందు రంగులేసుకోకుండా, ఏ మేకప్పు లేకుండా చేసి చూదాం, అది పని చేయకపోతే తరవాత చూద్దాం అనుకుని కొత్త బేటరీకి ఆర్డరు పెట్టేను.
ఆహా ఎంత సుళువు చేసేరు అంటూ ఇప్పుడే చప్పట్లు కొట్టడం మొదలెట్టేయకండి. బేటరీ వచ్చేలోపున నాకష్టాలు ఎమెజాన్.కాంలో పెట్టేను. అక్కడ జవాబులిచ్చేవారు అనుభవజ్ఞులు. తాము స్వయంగా చేసి చూసినవారు సాఫ్టువేరు చదువుకున్నవారు కాకపోవచ్చు కానీ వాళ్ళసమాధానాలు మాత్రం తప్పకుండా పని చేసేవిగానే ఉంటాయి. అందుకు వారిని అబినందిస్తున్నాను. లోపాయికారీగా మనలో మాట – చదువుకున్నవాడికంటే చాకలివాడు మేలని ఊరికే అన్లేదు కదా. ఇక్కడ చాకలివాడు అన్నపదం గౌరవవాచకంగానే గ్రహిస్తున్నాను. మనచదువులు లోకజ్ఞానం ప్రసాదించడం లేదన్నది జగమెరిగిన మరియు మన విశ్వవిద్యాలయాలు పట్టించుకోని పరమసత్యం.
ఆఖరికి తేలిందేమిటంటే, ఆ విడియోలో రెండు తలుపులున్న పెట్టెగురించి మాటాడుతున్నారు. నాముందున్నది మూడు తలుపులున్న పెట్టె!
ఇంతకీ నా సందేహం అప్డేటులగురించి. గూగుల్ అనువాదాలు చూడండి. నిన్న జిమెయిలులో టపా చూస్తూ, పైన కనిపించిన translate this అన్న సందేశం చూసి,

సరదాగా దానిమీద నొక్కేను. అక్కడ వచ్చిన అనువాదం చూసి నవ్వొచ్చి, అందరితో పంచుకోవాలనిపించి, నా వ్యక్తిగత టపాకి బదులు, మరో నాలుగు వాక్యాలు కొట్టి, అనువదించేను మీతో పంచుకోడానికి.

నావాక్యాలు -

యంత్రాలు వచ్చి మానవత్వాన్ని మంట గలిపి మనబతుకుల్ని తారుమారు చేసేస్తోందని గోలెత్తిపోతున్నవారిని తిరోగమనవాదులని ఎత్తిపొడిచే సాంకేతికనిపుణులని హేళన చేసే సంప్రదాయవాదులని … సూక్ష్మంగా వారిని వీరూ వీరిని వారూ దులుపుకోడం కనిపిస్తోంది.

గూగుల్ అనువాదం

The machines come in and manipulation of humanity burning galipi manabatukulni cesestondani గోలెత్తిపోతున్నవారిని tirogamanavadulani ettipodice సాంకేతికనిపుణులని conservatives who mocked … In short, they do viru them is dulupukodam.

ఈ అనువాదాలు ఇంత దరిద్రంగా ఉంటున్నాయని ఆ వసతి ఏర్పాటు చేసినవారికి తెలీదా? ఏదో ఒకటి చేసేం అంటే చేసేం అని ప్రజలమీదికి ఒదిలేయడమేనా?

ఇది నాకు ప్రత్యేకించి బాధ కలిగించడం నా తూలిక.నెట్‌లో పెడుతున్న కథలు, వ్యాసాలు ఈ గూగుల్ అనువాదాలతో ప్రచారం అవుతున్నాయని. ఇలాటి అనువాదాలు చదివి ఆ భాషలో పాఠకులు మనకథలగురించి ఏం అనుకుంటారు అని. భోజనానికూర్చుంటే, తల్లో ఇల్లాలో సగం ఉడికిన అన్నం వడ్డిస్తే నోరు మూసుకు తినరు కదా. వడ్డించినవారిమీద అరుస్తారు కదా. మరి ఈ సాంకేతికులు నాలాటి నసాంకేతికులకంటే ఎలా నిపుణులు?

ఇది చాలనట్టు, వారానికోమారు కాకపోతే మూణ్ణెల్లకోమారు నేను వాడే సాఫ్టువేరులో కొత్తవెర్షనులు వస్తాయి. ఇలా కొత్తవెర్షనొచ్చినప్పుడల్లా, అది పాతరాతలతో పని చేస్తుందో లేదో అన్నబెంగతో తల్లడిల్లిపోతాను. కనీసం సగానికి సగం పని చెయ్యవు.

వీటికోసం మళ్ళీ కొత్త ప్రింటరు, కొత్త స్కానరు, కొత్త విడియో కెమేరా ... ఇలా మార్చుకుంటూ పోవాలి. అప్పుడే నాకనిపిస్తుంది వీళ్ళకేం పని లేదా ఎందుకిలా కొత్త కొత్త వెర్షనులు తయారు చేయడం, ఏదో ఉన్నదాంతో పని అయిపోతోంది కదా అని. అయ్యో! నా తెలివి తెల్లారినట్టే ఉంది. ఔనౌనౌను, వారికి అదే ఉద్యోగం కదా. కొత్త వెర్షను తయారు చెయ్యక్కర్లేదంటే, వారి ఉద్యోగాలకి ఉద్వాసన చెప్పేయడమే. కానీ, నేననుకోడం ఈ కొత్త వెర్షనులు మరిన్ని వసతులతో, సౌఖ్యాలతో అవి కావలిసినవారికి మాత్రమే తయారు చేస్తూ, నాలాటి సగటు జనానికి పనికొచ్చే ఒక limited edition మాత్రం అలా వదిలేస్తే, నా బతుకు తెల్లారిపోతుంది కదా అని.

సూక్ష్మంగా యంత్రయుగం వచ్చేక, ముఖ్యంగా మనదేశంలో రైతులకీ, కూలిపనివారికీ, ఇంకా గృహపరిశ్రమలకీ ... ఇలా అనేకరంగాల్లో అదే జీవనభృతి అయినవారికి తిన తిండి, కట్ట బట్టా లేకుండా పోతున్నాయని అందరం గోలెత్తిపోతున్నాం. యంత్రాలని ప్రవేశపెట్టేముందు కాయకష్టం చేసుకునేవారికి తగిన జీవిక కల్పించి, లేదా వారికి ఇతరవిద్యలలో శిక్షణ ఇప్పించి, అప్పుడు యంత్రాలు రంగంలోకి దింపితే అందరం సుఖపడేవాళ్లం.

కంప్యూటర్లొచ్చేక, చేత్తో రాయడం మానేశాం. మరిచిపోతున్నాం. పొట్లులూ ఒత్తులూ – అన్నిటికీ కీలు కొట్టడమే కానీ చేతిలో కలం ఎటు తిరగాలో చూసుకోడం లేదు. ఇలా రాస్తుంటే నేనేదో యంత్రవిరోధిని అని అని మీరనుకుంటారేమో. లేదండీ, తెల్లారి లేచి, పొద్దు పోయేవరకూ ఈ సాంకేతికాభివృద్ధిమూలంగా వచ్చిన సదుపాయాలు ఉపయోగించుకోక నాకు క్షణం గడవదు.

క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ కాదు – సాఫ్ట్‌వేర్ సంగతుల్ అనుకోవాలి.

000

(నవంబరు 14, 2013)

10. పేరులో "పెన్"నిధి?

పేరులో ఏముంది అంటారు కొంతమంది కానీ పేరులోనే నిధులున్నాయని అంతరాంతరాల అందరం నమ్ముతాం. పేరు పెట్టడం మనచేతుల్లో ఉన్నప్పుడు మంచిపేరుకోసం పడే ఆరాటం అంతా ఇంతా కాదని పేరు పెట్టేఅవకాశంగలవారందరికీ అవగతమే కదా. మనం పెట్టే పేరెలా ఉండాలి? అమ్మా నాన్నా పెట్టినప్పుడు కారణాలు ఒకరకంగా ఉంటాయి. పిలో పిల్లాడో ...అంత గొప్పవాడు కావాలి, అంత ఉత్తముడు కావాలి, అంత ఘనుడు కావాలి అన్నది ఒకరకం. విశాపట్నంచుట్టుపట్లయితే, అప్పలస్వామి, వరాహనరసింహమూర్తి, తిరపతిలో తిరపతయ్య, వేంకటేశ్వరశాస్త్రి, వెంకన్న, ఏడుకొండలు, విజయవాడయితే, కనకదర్గ, సీతామహాలక్ష్మి. మరోరకం మరొకవ్యక్తి ముఖ్యంగా పూర్వీకులమీద గౌరవం తెలియజేసేది. ఇలా పెట్టినపేర్లు సాధారణంగా నిలవవు. తాతగారిపేరో, భర్తపేరో అయితే, ఆ పేరు పెట్టి పిలవడం బాగుండదని, మరో ముద్దు పేరు పెడతారు. చిట్టి, పొట్టి, చిన్నా పొన్నా అంటూ ఆ తరవాత కూడా ఆ పేర్లు మార్చడం కూడా జరగొచ్చు స్కూల్లో చేర్చేవేళకి. మరో తరం గడిచేక, స్వాతంత్రలక్ష్మి, రాజ్యలక్ష్మి, లవణం, బాపూ, గాంధీ లాటి పేర్లకి పేరొచ్చింది. అంతలో బెంగాలీనవలలు తెలుగుదేశం ఆక్రమించేసి, శరత్చంద్ర ఛటర్జీలూ, రవీంద్రముఖర్జీలూ వాళ్ల ఇంటిపేర్లతో సహా తెలుగుముంగిళ్ళలోకి చొచ్చుకొచ్చేసేరు. ఆతరవాత ఫేన్సీపేర్లకి గిరాకీ తగిలింది. పేరు ఎంతో ముచ్చటగా ఉండాలి, పిలిచేవారినోట నాజూగ్గా తిరగాలి. కాయితంమీద కనిపిస్తే కంటిని ఆకట్టుకోవాలి. దరిమిలా వాడు గొప్ప డాక్టరో ఇంజినీరో ఆర్థికతత్వవేత్తో అయిపోతే బోర్డుమీద కొట్టొచ్చినట్టు కనిపించేదయి ఉండాలి. సకలప్రపంచం తేలిగ్గా గమనించి, గుర్తించి, గుర్తు పెట్టుకునేదయి ఉండాలి.

పూర్వకాలంలో దేవుళ్ళపేర్లు పెట్టేవారు పిల్లాడిని పిలిచినప్పుడల్లా ఆ స్వామిని కూడా తలుచుకున్నట్టు ఉంటుందని. అంటే ఒక్కబాణంతో రెండు పిట్టల్ని కొట్టినట్టు, స్వామికార్యం స్వకార్యం అయిపోతాయి ఆ ఒక్కపిలుపుతోనూ. ఎటొచ్చీ కోపం వచ్చి తిట్లు లంకించుకున్నప్పుడు ఆ తిట్లు స్వామివారికి తగలకుండా, చాటుగా లెంపలేసుకుంటారేమో ... మ్... కనుక్కోవాలి.

రోజు రోజే ఏ పేరెట్టి పిలిచినా అని ఆంగ్ల బారుడు ప్రవచించేడని సకలజనులూ కోటుతారు. ఈవాక్యానికి అర్థం ఏ నేముతో పిలిచినా గులాబీ గులాబీయే అని ఇంగ్లీషు రచయిత చెప్పేడని.

నిజానికి గులాబీ అందమైన పేరు. పంకజం కూడా అందమైనపేరుగానే మనం గుర్తిస్తాం బురదలో పుట్టినా. నిజానికి పరీక్షగా చూస్తే ఒకొక కాలంలో ఒకొక వరస పేర్లు ప్రాచుర్యంలో ఉన్నట్టు కనిపిస్తుంది. విష్వక్సేనుడు, దుష్టద్యుమ్నుడు, ప్రద్యోతనుడు, శూర్పణఖ, అష్టావక్రుడు, రావణాసురుడు, కైకేయి, మంథర వంటి పేర్లు ఉన్నాయని పురాణాలు చెప్తున్నాయి. పురాణాలు నిజమవునా కాదా అని నేను వాదించబోవడంలేదు. అవి కథలే అనుకున్నా ఆపేర్లున్నాయి కదా. విక్రమార్కుడు అని కాకపోతే విక్రమ్, రావణాసురుడు కాకపోతే రవన్ వాడుకలోకి వస్తున్నట్టే కనిపిస్తోంది. అలాగే వరలక్ష్మి, సీతామహలక్ష్మి, వెంకటశివుడు లాటి పేర్లు కొంతకాలం చాలామంది తల్లితండ్రులకి ప్రేమపాత్రమయిన పేర్లయి రాజిల్లేయి. ఇక్కడ మనం గుర్తించవలసింది ఆ పేర్లు ఆ పిల్లలు ఎంచుకున్నవి కాదు. పాపం. వాళ్ళమ్మా నాన్నా తమ ఇష్టాయిష్టాలు తేటతెల్లం చేసుకోడానికి పిల్లలకి పెట్టినపేర్లు అవి.

అలాగే శరత్చంద్రులు, రవీంద్రనాథులు, మహాత్మాగాంధీలు కూడా మనలో అవతరించేరు. బాపూ, గాంధీ అన్నపేర్లు పెట్టుకున్న ... కాదు, కాదు, పెట్టబడిన పేర్లు గలవారు దరిమిలా మావో పుస్తకాలో చార్వాకుడిపుస్తకాలో చదివి మావోయిస్టులో నాస్తికులో అయినతరవాత కూడా ఆ పేర్లే పెట్టుకుని కథలూ వ్యాసాలూ రాస్తే కొంచెం గందరగోళంగా ఉండదూ? ఈశ్వరుడూ, అల్లా ఒక్కరు కాదు అన్నవ్యాసం కింద

రచయితపేరు గాంధీ అని ఉండొచ్చు. స్వామి జ్ఞానానంద భవతారకసూక్తులు రచన మావో అని ఉంటే నాకు అయోమయంగానే ఉంటుంది.
కొన్ని రష్యనుపేర్లూ, మార్క్సిస్టు పేర్లూ – ఇవి మాత్రం పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయింతరవాత తమతమ అభిరుచులప్రకారం మార్చుకున్నపేర్లే అనుకుంటాను. ఎందుకంటే లవణం అమ్మానాన్నలు పెట్టినపేరే. ఓల్గా కాదు. ప్రస్తుతం కొత్తపేర్లు కొత్తదనం వెల్లివిరిసే పేర్లు పెడుతున్నారు. రచన, నవీన, లాటిపేర్లు ఆడపిల్లలకీ, హలంతాలతో వినయ్, ప్రవీర్ లాటి పేర్లు మగపిల్లలకీ సర్వసాధారణం. అంచేత పేరులో పెన్నిధి మాట ఎలా ఉన్నా పేరుకి ఒక ప్రత్యేకత ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను.
నేను అమెరికా వచ్చిన కొత్తలో అమెరికనులు నాపేరుతో పట్టే కుస్తీపట్లు చూస్తే నాకు మహా ఆశ్చర్యంగా ఉండేది. బ్రజెన్స్కీని నువ్వు పేరు మార్చుకో అని అడగరు కానీ నన్ను మాత్రం మెలనీ అనో మాలీ అనో మార్చుకోమని చెప్తారు. ఓ పెద్దమనిషి పోనీ మెలవెన్స్కీ అని మార్చుకో అని సలహా ఇచ్చేడు అదేదో తేలిగ్గా పలకేయగల పేరయినట్టు. హీహీ. మెలనీలో ఒత్తులు లేవు. మాలతిలోనూ లేవు కదా ఎందుకు పలకలేరు అని నా సందేహం. పైగా చిన్నపిల్లలు మాత్రం చిలకల్లా చక్కగా మాలతి అంటారు. అంటే ఏమిటర్థం – ఈ అమెరికన్ పెద్దలు మొదట మననోట ఈపేరు తిరగజాలదు అని నిశ్చయించేసుకుని తరవాత మొదలు పెడతారన్నమాట పలికేప్రయత్నం. దాన్నే ఇంగ్లీషులో మైండ్ బ్లాక్ అంటారు. నాపేరు నాదే, ఈముక్కూ, మొహం, పేరూ, తీరూ – ఇదంతా ఒకే పేకేజీ. అలాగే వచ్చేను, అలాగే పోతాను. ఇష్టమయితే పుచ్చుకోండి, లేదంటే లేదు అని ఖచ్చితంగా చెప్పేను వాళ్లందరికీ. అన్నట్టు, అమెరికావాళ్ళదాకా ఎందుకులెండి, ఇప్పటికీ నాబ్లాగుకి కొత్తగా వచ్చేవారిలో ఎవరో ఒకరు అడక్కుండా పోరు ప్రశ్నలూ జవాబులూ రాసేది మీరేనా అని. నేను నిడదవోలు మాలతిని అని గుర్తించే రోజు ఎప్పుడొస్తుందో అని ఎదురు చూస్తున్నాను :(

నేనిలా ఆలోచిస్తుంటే తారకం వచ్చేడు, చెప్పనేల ఆవెనకే సంధ్రాలు కూడా ప్రవేశించింది.

"రండి, రండి, ఏం తోచక ఛస్తున్నాను. మీరిద్దరూ కూడా కనిపించడం మానేశారు," అన్నాను నిష్ఠూరంగా.

"నేదమ్మ, ఈమజ్జిన బిజీ అయ్యోనాది. మాదొరబాబు ఏదో కొత్త కంపెని ఎట్టినంక," అంది సంధ్రాలు.

సందేహాస్పదదృక్కులతో సంధ్రాలువేపు చూసేను. బిజి అన్నపదం ఆమెవాడకం ఎప్పుడు మొదలయిందా అని ఒకటి, ఏ వంకా దొరకనప్పుడు జనం బిజి అన్నపదం వాడుతారు కదా అదేనా అని రెండు.

"నేను కూడా బిజి. ఒక అనువాదం మొదలు పెట్టేనండి," అన్నాడు తారకం.

"ఆహ్, బాగుంది. ఇతరజాతులగురించి తెలుసుకోడానికి ప్రధానసాధనం," అన్నాను.

తారకం నావేపు చూసేడు. ఆకళ్ళనిండా బోలెడు సందేహాలు.

"సెప్పు, చల్లకొచ్చి ముంత దాసినట్టు, మాటాడకుంతె ఆయమ్మకెట్ల తెలస్తది," అంది సంధ్రాలు కసుర్తూ.

"దానికేంలే. అనువాదం అంటే మాటలా. సందేహాలు చాలానే వస్తాయి. ఎలా సాగుతోంది?"

"అది కాదండీ. చిన్న రష్యన్ కథ."

"నీకు రష్యన్ వచ్చా, నాకు తెలీదే."

"లేదండీ. నాకు రష్యన్ తెలీదు. ఇంగ్లీషు అనువాదం చూసి నాస్నేహితుడు హిందీలోకి చేసేడు. అది నేను తెలుగులోకి చేస్తున్నాను."

"ఆహ్, మూడువరసలన్నమాట వడబోత."

"అలాగే అందరూ చేస్తున్నారండి. లేకపోతే ఎవరికి వస్తాయి అన్ని భాషలు.ఠ

"అంతేలే," అన్నాను, తెలుగుభాష నొగసులు అనువాదాల్లో రాదని గోలెడుతున్న ప్రముఖులనందర్నీ తలుచుకుంటూ.

“ఆపేర్లు గుర్తు రాయడం, చదవడం, గుర్తు పెట్టుకోడం కూడా కష్టమేనండీ.”

“కావచ్చు కానీ వాళ్ళపేర్లవి. అవి అలా ఉంటాయని తెలుసుకోడం కూడా అవసరమే కదా.”

“ఇప్పుడు చాలామందికి అసలు మన పేర్లే సరిగా తెలీవు. మాఅమ్మమ్మ అంటుండేది వాళ్ళ తనస్నేహితురాలు ఇందిరాగాంధీ రెండోబ్బాయికి సంజయ్ అని పేరు పెట్టినప్పుడు, భారతంలో ఏదో పేరు పెట్టిందని అందిట. సంజయ్ అన్న పేరు కూడా ఆవిడకి తట్టలేదు.”

“అవును, ఆకథ నేను కూడా విన్నాను. పోన్లే, కనీసం భారతంలోది అని తెలిసింది కదా.”

“ఏటా సుట్టుతిరుగుడు యవ్వారం. అది గాదమ్మా. ఈబాబు ఆకతల మడుసులకి తెలుగు పేర్లెట్టినాడు.”

నేను ఉలికిపడి, అవునా అన్నట్టు అతనివేపు చూసేను.

తారకం ఇబ్బందిగా కుర్చీలో కదుల్తూ, “అది కాదండీ. పాఠకులు కథమీద దృష్టి నిలపాలి కానీ ఈ తికమకపేర్లన్నీ గుర్తు పెట్టుకోలేక సతమతమవుకూడదు కదా. అంచేత తెలుగు పేర్లయితే చదువుకోడానికి సుఖం అని.”

“ఇంక ఏం సేసినవో సెప్పు.”

“ఏం చేసేవేమిటి?”

తారకం మాటాడలేదు.

“ఆల్లబాసలో ఏదో .. ఏటది?”

“కులిబియాకా.”

“అదోరెకం సేపలకూరంట.”

నేను చాలా ఓపిగ్గా “ఇంకా ఏం మార్చేవేమిటి?” అన్నాను.

“బక్లజ్యనోయా ఇక్రా – వంకాయకూర.”

“ఇంకేటో గూడ ఉన్నది. నానేఁవో సెజ్జబూర్లని ఎట్టమంటన్న.ఠ

“అది కాదు సంధ్రాలూ, నీక్కూడా ఇలాగే బాగుంటుందంటావా?”

నాకెందుకో సంధ్రాలు కూడా ఇలా పండితకులంలోకి మారిపోడం నచ్చలేదు. తారకం అంటే మొదట్నుంచీ ఆ సజ్జులోవాడే. అయినా నా వెర్రి కానీ, సంధ్రాలు బిజీ అన్నప్పుడే నేను గ్రహించుకోవలసింది.

ఈ లెక్కన కేథరిన్ కేకయ అవొచ్చు. సాండీ శాంత, మేగ్డలిన్‌ని మాలతి అవుతుందా? అబ్బే, మాలతి కూడా పాతకాలం పేరే. మేలిమి అనొచ్చేమో కొత్తగా ఉంటుంది. థామస్ తామసిగా మారొచ్చు. మనిషి పేర్లు మారుస్తున్నాం కనక ఊరుపేర్లు కూడా మారిస్తే ఆ ఊపులోనే మరింత సౌఖ్యం కదా. ఆన్ ఆర్బర్ – అనకాపల్లి, షికాగో – సీతక్కమెట్ట, అట్లాంటా – అట్టాడ. పేర్లూ, ఊర్లూ మార్చేక, తినే తిండీ, కట్టే బట్టా కూడా మార్చేస్తే పోలే!

“మీరిలా మాటాడుతుంటే నాకో కథ తోస్తోంది. చెప్తాను. మీరిద్దరూ విని ఎలాఉందో చెప్పండి.”

“సరే. చెప్పండి. సావధానులమయి వింటాం,” అని ఇద్దరూ కుర్చీలు దిగి, గచ్చుమీద మఠం వేసుకుని కూర్చున్నారు బుద్ధిమంతులలాగ.

నేను కూడా వారికెదురుగా కూర్చుని కథ మొదలు పెట్టేను,

కేకయ, తామసి కలిసి అనకాపల్లిలో సినిమాకి వెళ్ళేరు. దానికి కూడా ఏ బండరాముడులాటి తెలుగుసినిమా పేరే పెట్టేదాం. చక్కగా నట్టింట్లో మనాళ్ళతో కబుర్లు చెప్పుకున్నట్టుంటుంది. కేకయ ధర్మవరంచీరె కట్టి, తలలో మల్లె చెండు తురుముకుంటుంటే, చూడ్డానికి రెండు కళ్ళు చాలవు. తామసి తాంబూలం నవుల్తూ … ఏంటీ రష్యాలో తాంబూలం ఎక్కడొచ్చిందంటారా? లేదనుకోండి. వాళ్ళు వాళ్లకలవాటయినదేదో తిండమో, తాగడమో చేస్తారు. …

అని ఆగేను. “ఇంతవరకూ ఎలా ఉంది నారష్యన్ కథ.”

“హాయిగా తెలుగు పేర్లూ, తెలుగు భోజనాలూ, తెలుగు సినిమా, తెలుగునవల దువుతున్నంత ఎంతో హాయిగా ఉంది. అన్నీ ఇట్టే తెలిసిపోతున్నాయి. అర్థం కానిదేదో

ఉందేమో అన్న ఆరాటం లేదు. అర్థం చేసుకోడానికి పడాల్సిన అవస్థ లేదు. హాయి … హాయి.. . కమ్మని తెలుగుదనం …"

"మరి మనం రష్యన్ జీవితంగురించి ఈనవలలో ఏం తెలుసుకున్నాం?"

"భలే అడిగేరండి, చెత్త ప్రశ్న అంటే మీరు నొచ్చుకుంటారేమో కానీ మనకి కావలసింది కథే కదా. కథ తెలిసింది కదా. అంచేత ఇది రష్యన్ నవలే."

నేను నిట్టూర్చేను నాయనా, నీచెయ్యి. నీకలం, నీవిజ్ఞానం … అంతే అనుకుంటూ.

ooo

(నవంబరు 21, 2013)

11. నా భాష భక్తి

గంటక్రితం ఫేస్బుక్కులో నాభాషాభిమానం తేటతెల్లం చేసుకున్నతరవాత, ఆ అంశంమీద మరి కొన్ని ఆలోచనలు వచ్చేయి. గర్వపడుతున్నానని చెప్పలేను, కానీ నేనే మారిపోతున్నానన్న స్పృహ.

ఇంకా వెనక్కి అంటే గంటకంటే కొన్నినెలల, బహుశా కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళ్తే, నేనే ఒకసారి పుస్తకం.నెట్ లో ప్రశ్నించేను వ్యాఖ్యలు తెలుగులో ఎందుకు లేవని.

ఆ తరవాత క్రమంగా చాలా విషయాలు తెలిసేయి. ఆఫీసుల్లోనూ, ఐపాడుల్లోనూ, మరో సాధనంలోనూ తెలుగు టైపు చేసే వసతి లేకపోవడం కావచ్చు. తెలుగు చదవడం వచ్చు కానీ రాయడం రాదు, రాయడం వచ్చు కానీ కంప్యూటరులో ఎలా రాయడమో తెలీదు … ఇలా అనేక కారణాలు.

ఇప్పుడు నేను ఫేస్బుక్కులో ఇంగ్లీషులో రాస్తున్నాను :(. మరి మీరు రాయొచ్చా అని మీరు అడగక్కపోవచ్చు కానీ నాకే తెలుస్తోంది. ఎందుకిలా చేస్తున్నాను నాకే ఆలోచన వచ్చింది. అలాగే అమెరికాలో తమిళపిల్లలు తమిళం మాటాడినట్టు తెలుగు పిల్లలు తెలుగు ఎందుకు మాటాడలేకపోతున్నారు? అని కూడా ప్రశ్నలు వస్తున్నాయి. మా అమ్మాయి 9, 10 ఏళ్ళవరకూ తెలుగు చక్కగా మాటాడేది. ఒకసారి మేం ఇండియా వెళ్తే 15 రోజులపాటు ఒక్క ఇంగ్లీషు మాట వాడకుండా తెలుగు మాటాడి, రికార్డు సృష్టించింది. :)).

ఆ తరవాత క్రమంగా ఇంట్లో తెలుగు, స్కూల్లో ఇంగ్లీషు మాటాడేది. గుంటూరులో నాస్నేహితురాలు విజయలక్ష్మి, జార్జి గారింటికి వెళ్ళి రెండురోజులున్నాం. జార్చి మాఅమ్మాయిచేత ఇంగ్లీషు మాటాడించాలని బ్రహ్మప్రయత్నం చేసేరు. ఆయన ఇంగ్లీషులో మాటాడుతుంటే, సరయు తెలుగులో జవాబులు ఇస్తూ వచ్చింది. ఆఖరికి,

ఆయన నావేపు తిరిగి, what's she talking about? I don't understand అన్నారు. సరయు నావేపు తిరిగి, ఆయనేం అంటున్నారు, నాకర్థం కాడం లేదు అంది. :)). ఆ తరవాత కొంతకాలానికి నేను తెలుగులోనూ తను ఇంగ్లీషులోనూగా సాగింది కొంతకాలం. ఆ తరవాత ... నేనే gave up :p.

నేను ఫేస్బుక్కులో ప్రవేశించేక, వారం రోజులయేకనుకుంటాను, ఒక స్నేహితురాలిని అడిగేను నువ్వు తెలుగులో రాయడం లేదేం అని. అక్కడ ఇంగ్లీషు మాత్రమే తెలిసిన స్నేహితులకోసం అంది. అలాగే టెక్నికల్ విషయాలు రాసినప్పుడు కూడా ఇంగ్లీషే సౌకర్యం.

క్రమంగా తెలిసింది నాక్కూడా. మంచి తెలుగు కనిపించడం లేదు అనడం లేదు. కొన్ని తెలుగులోనే బాగుంటాయి. తెలుగులోనే చెప్పడం తేలిక. అలాగే కొన్ని తప్పనిసరిగానూ, కొన్ని ఫరవాలేదుగానీ, కొన్ని ఇదే నయం గానూ ...

ఇప్పుడు నాక్కలిగిన సందేహం, ఒక్క నావిషయంలోనే Am I fighting a losing battle?!

000

(నవంబరు 30, 2013)

12. కాలూ, కారూ

పనిలేనివాళ్ళనీ పాటు పడనివాళ్ళనీ చూస్తే చాలామందికి చిరాకు. నాకు పని లేదనీ, నేను పాటు పడనని అనుకునేవాళ్ళని చూస్తే ... ఎందుకులెండి. నేను చెప్పను కానీ మీకు అర్థమయే ఉంటుంది. ఎవరిపనులు వాళ్ళవి. నేను ఇదివరకోసారి వివరించేను నాకు దినము ఎలా గడుచునో. ఆ కార్యక్రమానికి గంటు పడింది నేను టెక్సస్‌లో వచ్చి పడ్డాక. ఆ చెట్లమధ్య తిరుగుతుంటే, నిద్రాసమాధి స్థితిః సంచారః పదయోః ప్రదక్షిణ విధిః స్తోత్రాణి సర్వా గిరో యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో! తవారాధనమ్! అనిపించేది. నేను విడిగా చేసే పూజలేమీ లేవు. నా సంచారమే ప్రదక్షిణ, ఏం మాటాడితే అదే స్తోత్రం, ఏం చేస్తే అదే నీకు సమర్పణ – మన మతం ఎన్ని విధాల సుకరం చేస్తుందో ... అనుకుంటూ తిరిగేదాన్ని. శ్రీశైలపరిసరాలు మరిపించే ఆ వాతావరణంలోంచి సహారా ఎడారిలాటి ప్రదేశానికొచ్చి పడ్డాను.

ఇక్కడ వియత్పథాన విహరించే విహంగాల కిలకిలారావాలు వినిపించవు. నీటి కొంగల క్రేంకారములు అప్పుడప్పుడు వినిపిస్తాయి కానీ అవి శ్రవణానందంగా ఉండవు. ఆహా ఈ పక్షులు నన్ను ప్రేమగా పిలుస్తున్నాయి అనిపించదు. ఆదమరిచి కాలుతున్న పెనంమీద చెయ్యిపడితే నానోట వెలువడే కేకలా హృదయవిదారకంగా ఉంటుంది. తుపాకీగుండుకి ఎర అయిన అడవిజంతువు చేసే ఆర్తనాదంలా ఉంటుంది. మదపుటేనుగు ఘీంకరించినట్టు కూడా ఉండొచ్చు. ఒక్కమాటలో ఎందుకొచ్చిందిరా భగవంతుడా అన్నట్టు ఉంటుంది.

అయినా అర్థమనస్కంగానే వీధికెక్కుతాను. తిట్టే నోరూ, చేసే చెయ్యీలాగే నాకాలు ఊరుకోదు. నాజీవితంలో మొదటి అర్థభాగం మనదేశంలోనే గడిచింది.

అక్కడున్నంతకాలం నూటికి 90 పాళ్ళు కాలిమీదే నా తిరగుళ్లు. ఎక్కడికెళ్ళాలన్నా పాదచారినే.
అమెరికా వచ్చేక, ఏదీ కాలినడకదూరంలో లేనందున కారుమీద తిరగవలసి వచ్చింది. మళ్ళీ దాదాపు 36 ఏళ్లయినతరవాత, ఈ ఇంటికొచ్చేక, నాకు కావలసినవన్నీ గట్టిగా కాలు సాగిదీసి బయల్దేరితే పదినిముషాల్లో చేరిపోయే గమ్యములే కావడంచేత, బోలెడు ఆనందపడిపోయేను. అలాటిది, మరి నెలరోజులుగా కాలు బాధ పెట్టేస్తోంది. అదే బహుశా నేను ఏ నాటు వైద్యుడికో చెప్తే, దానికో పేరు పెట్టి, అదొకరకం జబ్బు. నిన్ను నువ్వు – అదే నీకాలుని – అదుపులో పెట్టుకోలేకపోవుట నీ తప్పు కాదు. అదొకరకం మానసిక లేదా మేధకి సంబంధించిన జబ్బు అంటూ నా తల తిరిగిపోయే పాఠం ఒకటి చెప్పి, నా బాంకెకౌంటు దోపిడీ అయిపోయే మందులచిట్టా ఒకటి రాసిస్తాడు. అంచేత ఇంటికి చుట్టపుచూపుగా వచ్చిన ఏ డాక్టరుగారినో సంప్రదించుదాంలే అని అలా కుంటుకుంటూ, అప్పుడప్పుడు కాపడం పెట్టుకుంటూ గడుపుకొస్తున్నాను. అలా నిన్న ఓ డాక్టరుగారొచ్చేరు. ఆయన్ని సలహా అడిగి సంగతి సందర్భాలు తెలిసేసుకున్నాను (హుమ్, మనఇండియనులు అని అనకండి మరి. మనం ఇండియనలుమే కదా.) ఇది కాలు కథ. ఇది కాలు కథ.
ఇంక కారు మాటకొస్తాను. ఎనిమిది నెలలక్రితం నాకారుని కొత్తగా చక్రం చేతికొచ్చిన ఓ చిన్నారి అరివీరభయంకరులకి సాటి రాగల సమరోత్సాహంతో తన 3 వేల పౌన్ల ఆయుధంలాటి కారుని నాకారుకి పెట్టేసి, నన్ను కారుహీనురాలిని చేసేసింది తృటిలో. రెండు కార్లూ తుక్కు తుక్కు అయిపోయేయి కానీ ఇద్దరం అంటే ఆ చిన్నదీ ఈ పెద్దదీ, అనగా నేనూ, బతికిపోయేం. ఆహా విధిలీలలు అని మర్నాడో మూడోనాడో అనుకున్నాననుకోండి అది వేరే సంగతి.
ఇదే సమయంలో సరయు కొత్తకారు కొనుక్కునే పథకం వేస్తున్నానని చెప్పింది. చూసేరా, వాన పడ్డప్పుడే గొడుగు కనిపిస్తుంది అని చెప్పుకున్నాను, వాడుకలో ఉన్న నానుడిని సమయానుకూలంగా మార్చుకుని.

"నాకారు నువ్వు తీసుకో, నేను కొత్తకారు కొనుక్కుంటాను," అంది సరయు. అది చాలా మంచి కారని కూడా చెప్పింది. ఆమాట నేను నమ్ముతాను. నమ్మేను. ఎందుకంటే, వస్తువులని భద్రంగా చూసుకునేవిషయంలో సరయుని మెచ్చుకోవాలి. ప్రతి మూణ్ణెల్లకీ ఆయిలు ఛేంజి చెయ్యమంటారు కారు కంపెనీవాళ్ళు. అది వాళ్ళు డబ్బు చేసుకోడానికి పెట్టిన నియమం అని నానమ్మకం. కానీ సరయు అలా అనుకోదు. ఖచ్చితంగా తు చ తప్పకుండా ఆ నియమాలన్నీ పాటిస్తుంది. అంచేతన్నమాట తను ఆ కారుని అపురూపంగా చూసుకుంటున్నానంటే నమ్మేను.

కారు వచ్చిన వారంరోజులకి కాబోలు బేటరీ హరీమంది. హుమ్మనుకుని, బేటరీరక్షకులయిన ట్రిపుల్యే ని పిలిచేను. వారొచ్చి బేటరీకి ప్రాణం పోసేరు. మర్నాడు, అక్షరాలా మర్నాడే మళ్లీ పడుకుంది. ... మూడు వారాలయింతరవాత మరోసారి చచ్చి ఊరుకుంది. సరే, కొత్త బేటరీ వేయించేను. అదీ అంతే. అలా రెండుచుట్లయినతరవాత, ఆ బేటరీవాడు మరో కొత్త బేటరీ ఇచ్చేడు. అదీ అంతే. ... ఇలా ఆరునెలలయింది ఏడు సార్లు నా బేటరీకీ నాకు తగువులయేయి. మధ్య మధ్యలో ఆయా మెకానిక్కుల సలహాలనుసరించి ఆల్టర్నేటరు కొత్తది వేయించేను. ఎలెక్ట్రిక్ సిస్టమ్ చెక్ చేయించేను.... ఇంతకీ ఇవన్నీ నాకే ఎందుకు జరుగుతున్నాయి. ఇదే కారు మాఅమ్మాయిదగ్గర ఉన్నన్నాళ్ళూ ఎందుకు ఏ పేచీ పెట్టలేదు? ఆహా విధి లీల అని మరియొక మారు తలుచుకోవలెనా?

చివరిసారి మెకానిక్కు, "అమ్మా, మీకారు మూలవిరాట్టు కాదు అలా ముంగిట పెట్టుకుని చూసి సంతోషించడానికి. అది ఉత్సవవిగ్రహం. మీరు రోజూ నాలుగువీధుల్లో తిప్పాలి," అన్నాడు.

అతనిమొహంలోకి పరీక్షగా చూసేను, "South Asian studies, Wisconsin?"

"Pittsburgh, Pennsylvania," అన్నాడు.

అదీ సంగతి. మాఅమ్మాయికి రోజులో ముప్పాతిక భాగం కారులోనే కనక అది అక్కడ బంగారంలా ఉంది. నాకేమో కారుమీద కంటే కాలుమీద తిరగడమే ఎక్కువ కనక కారు

మూలుగులు మొదలెట్టింది. అంతే కాదుట, టెక్సస్ చలిదేవరా, ఎండదేవరా కూడా కారుబతుకుకి అనుకూలం కాదుట. “అందరూ బేటరీలకి మంచు ఆ గర్భశత్రువు అంటారు కానీ ఇక్కడ ఎండలు బేటరీల పాలిట యమదూతలు,” అని కూడా ఆ మెకానిక్కు చెప్పేడు.

అంచేత, నేనిప్పుడు కాలుమీద ఒకరోజు, కారుమీద రెండు రోజులచొప్పున తిరగవలసిన అగత్యం ఏర్పడింది. కాలుమీద రోజుకు ముప్పావు మైలు తిరిగితే, కారుమీద మైలున్నర దూరంలో ఉన్న షాపుకి చుట్టు తిరిగి ఆరుమైళ్ళు వెళ్తున్నాను. ఇవ్విధమున నాకాలు ఆరోగ్యం, కారు ఆరోగ్యం కాపాడబడుతున్నాయి. ఇలా జరగగలదని నేను కలలో కూడా ఎప్పుడూ అనుకోలేదు. :(

000

(డిసెంబరు 2, 2013).

13. కేబిను జ్వొరం

మూడ్రోజులుగా మంచూ గాలీ ఎత్తి పోస్తున్నాయి టెక్సనుల దృష్టిలో. కారులు ఇల్లు వదల్లం లేదు. వదిల్తే రోడ్డుమీద టోల్తా పడుతున్నాయి. విమానాలు ఎగరడం లేదు. విమానాల్లో విహరించబోయినవారు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయి దిక్కులు చూస్తున్నారు. దీన్నే దిగ్భ్రాంతి అనొచ్చా? ఏమో మరి. స్కూళ్ళు లేవని చాలామంది సంతోషిస్తున్నారు. వారి అమ్మలూ నాన్నలూ మాత్రం సంతసిస్తున్నట్టు లేదు.
నేను కూడా మూడ్రోజులయింది గడప దాటి. అంచేత నాకు కేబిను జ్వొరం వచ్చినట్టుంది. అలా అనడానికి మొహమాటంగా కూడా ఉంది. ఎందుకంటే, నేను విస్కాన్సినునించి వచ్చేను. అక్కడ కేబినుజ్వరం రావడానికి అంగుళన్నర మంచు చాలదు. అంగుళంన్నర మంచు పడితేనూ, టెంపరేచరు ఇరవైలలో ఉంటేనూ విస్కాన్సిను పురజనులకి ఆనందంగానే ఉంటుంది. ఫరవాలేదు అనుకుంటారు. అక్కడ మామూలుగా మంచు అడుగుల్లో చెప్పవలసివస్తే, wind chill factor సున్నకి పదో ఇరవయ్యో తక్కువగా ఉంటుంది. అప్పుడన్నమాట స్కూళ్ళూ ఆఫీసులూ మూత పడడం, జనులు ఇల్లు కదలకుండా ఉండడం. మంచు విపరీతంగా కురిసి, స్కూళ్లూ ఆఫీసులూ మూత పడిపోతే, ఇల్లు కదలడానికి వీల్లేకపోతే ఇంట్లో కూర్చోలేక పిచ్చెత్తిపోయినట్టుంటే, ఒకొకరికి కలిగే అవస్థని cabin fever అంటారు. దాని ప్రదానలక్షణం అదే – పిచ్చిత్తిపోయినట్టుండడం! అంటే మూలుగులు మునపట్లాగే భోజనాలు ఎప్పట్లాగే.
మూడ్రోజులుగా టెక్సస్, ఇంకా కుదించి చెప్పాలంటే డలస్ ప్రాంతంలో చలి, మంచు మూలంగా కార్లు నడవడం లేదు. విమానాలు ఎగరడం లేదు. షాపులు మాత్రం తెరిచే ఉండొచ్చు. ఎందుకంటే వాళ్ల ఆలోచన ఆఫీసులూ స్కూళ్ళూ మూత పడిపోతే, జనులు

కాలక్షేపానికి దుకాణాలమీద పడతారని. స్కూళ్ళకీ ఆఫీసులకీ వెళ్ళలేనివారు బజారులకి ఎలా వెళ్తారు అని అడక్కండి. నాకూ తెలీదు. ఆ తరవాత అవుసరం ఉన్నా లేకపోయినా ఏదో ఒకటి కొంటారు.

ప్రస్తుతం ఇక్కడ టెస్కస్‌లో స్కూళ్లు మూసేసినందుకు పిల్లలకి ఆనందంగా ఉంది. దేవుడా, మరో రెండు రోజులు పొడిగించు ఈ మంచుకొండలు అని ప్రార్థిస్తున్నారు. దేవుడా ఈ పిల్లల్ని ఏం చెయ్యాలో నువ్వే చెప్పు అని వేడుకుంటున్నారు తల్లులు, తండ్రులు.

నాకు ఆఫీసు, స్కూలు, పిల్లలు – ఏవీ లేవు కనక నాకేం చెయ్యాలో తోచడంలేదు. మొదటి రెండు రోజులూ ముసురు పట్టి, గదిలో వెలుగు లేకపోతే ముడుచు పడుకోగలిగేను కానీ ఇవాళ కాస్త తెరిపిచ్చింది.

మూడంగుళాలమందం చొక్కాలు, కోట్లూ, సాకులూ బూటులూ చుట్టబెట్టుకుని, దసరాల్లో ఎలుగుబంటివేషం వేసుకున్నట్టు తయారయి అంగుళం అంగుళం అడుగులో అడుగేస్తూ బితుకుబితుకుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, చేపాటికర్ర తలుపు తీసి చూసి, గుండె చిక్క బట్టుకుని మళ్లీ అడుగులో అడుగు వేస్తూ మెట్లు దిగేను. కానీ మెట్లు దిగింతరవాత అడుగు పడలేదు. అందుకంటే గడ్డ కట్టుకుపోయిన మంచు అద్దంలా మెరుస్తోంది. దానిమీద చేపాటి కర్ర పెడితే, అది కూడా పాదరసంలా జారిపోతోంది. కర్రతో సహా నేను మిషల్ క్వాన్‌లా పది గజాలు జారిపోయే ప్రమాదం కళ్ళముందు కదిలింది. పడితే కాలో చెయ్యో విరుగుతుందన్న భయం కన్నా నన్నాదుకోవలసిన స్నేహితురాలికి మరింత ఇబ్బంది కదా అని నాబాధ. అంచేత మళ్ళీ అత్యంత జాగ్రత్తగా వెనుదిరిగి ఇంట్లోకొచ్చి పడ్డాను.

దాంతో మొదలయింది కేబిను ఫివరు. కానీ నాకిది హాస్యాస్పదంగా కూడా ఉంది. నిజంగా ఇక్కడ పడ్డ మంచు రెండంగుళాలు. విస్కాన్సిన్‌లో మోకాలెత్తు మంచులో కూడా నేనూ, నాకారూ కూడా హాయిగానే తిరిగేం. మరి ఇక్కడ రెండంగుళాలకే

స్కూళ్ళు మూసేయడం ఏమిటి అని నేను హాహాహాహాహాహా అని విరగబడి నవ్వుకున్నాను కూడా నిన్న.

ఆ ఊపులో ఇలా మంచుపోతగా రాతలు కూడా గిలికి పారేస్తున్నాను ఫేస్బుక్కులోనూ, బ్లాగులోనూ కూడా. ఇంకా ఎక్కడయినా సదుపాయం ఉంటే చెప్పండి. అక్కడికి కూడా రెండు రాతలు రవాణా చేసేస్తాను.

000

(డిసెంబరు 9, 2013)

14. ఏదో సామెత చెప్పినట్టు

సామెతలు ఎందుకు వాడతాం అంటే అదొక ఆమోదముద్ర కనక. నామాటకి మరొకరి మద్దతు ఉంది. చాలామంది ఇలాగే అనుకుంటారు అని దృఢపరుచుకోడానికి వాడతాం. మనకి మాట తోచనప్పుడు కూడా వాడొచ్చు. అందుకే ఏ సామెతా తోచకపోతే, సామెత్చెప్పినట్టు అనడం అనేసి తప్పుకుంటాం. ముందు టపాలో సామెతల అనువాదాలగురించి చర్చతో మొదలు పెట్టేను. అదే తూలిక.నెట్ ఫేస్బుక్కు పేజీలో పెట్టేక, చాలా విషయాలు తెలిసాయి. ఇక్కడ నేను ఫేస్బుక్ ప్రచారం చేయబోవడం లేదు కానీ అక్కడ మనం మనపేజీ జాగ్రత్తగా సెటప్ చేసుకుంటే, లాభదాయకమేనని ఇప్పుడు అర్థమయింది. అక్కడ ఖాతా లేనివారికోసం, నేను అక్కడ గ్రహించిన కొన్ని సంగతులు ఇక్కడ పెడుతున్నాను.

మొదట చెప్పుకోవలసింది ఫేస్బుక్కులో చర్చ అనువాదాల పరిధి దాటి, వివరణలపరిధిలోకి చొచ్చుకుపోవడంతో మరింత అర్థవంతమయింది.

లలిత గూడ ఒక సామెతకి నాఅనువాదం ఏమిటి అని అడగడంతో మొదలయింది.

లలిత సూచించిన సామెత పొమ్మనలేక పొగ పెట్టినట్టు అని.

నేను starting fire to make him leave or fuming the room to make him leave అనొచ్చు అన్నాను.

మరో సూచన ఏల్చూరి మురళీధరరావుగారు నేను నిడుదవోలు వెంకటరావుగారిగురించి రాసిన వ్యాసంమీద వ్యాఖ్యానిస్తూ, వ్యక్తులపేరులతో ఏర్పడిన కొత్త సామెతలు ప్రస్తావించేరు.

వాటిలో కొన్ని –

"నీకు తెలియకపోతే నిడుదవోలు వారిని అడుగు" అని నిడుదవోలు వేంకటరావు గారిని గురించి ఆ రోజులలో సామెత.
"విస్సన్న చెప్పిందే వేదం" అని మహామహులైన ఇంద్రగంటి విశ్వపతిశాస్త్రులు గారి గురించి ప్రసిద్ధిలోనికి వచ్చిన సామెత.
"బులుసు లేని యజ్ఞం, పులుసు లేని పాకం" వేదస్వరూపులైన బులుసు పాపయ్యశాస్త్రి గారిని గురించిన సామెత.
"రెంటికి చెడ్డ రేవడు" వంటివి వ్యక్తుల పేర్లమీద ఏర్పడిన తొలినాటి సామెతలు.
సువర్చల చింతలచెరువు వీటికి మరిన్ని చేర్చేరు, "ఏల్చూరి మురళీధరరావుగారి సామెతల పోస్ట్ చూశాక.. ఇలా వ్యక్తుల పేర్లతో ఉన్న జాతీయాలను కూడా పోస్ట్ చేయొచ్చుకదా అనిపించింది. మీకూ తోచినవి పంచుకుంటారుకదూ?" అంటూ -

ఆకాశరామన్న

ఆషాఢ భూతి

ఆత్మారాముడు

అరుంధతీ దర్శనం

కంచిగరుడ సేవ

చిదంబర రహస్యం

తిక్క శంకరయ్య

త్రిశంకుస్వర్గం

దరిద్రనారాయణుడు

దారినబోయే దానయ్య

నలభీమపాకం

నలుగురితో నారాయణ

పరమానందయ్య శిష్యులు

పరశురామప్రీతి

పానకాలరాయుడు

బోళా శంకరుడు

బ్రహ్మచెముడు

బ్రహ్మముడి.

ఇక్కడ సుధారాణి ఆకాశరామన్న కి ఇచ్చిన వివరణ కూడా నాకు కొత్తే. ఆమె వాక్యాల్లో, "ఆకాశరామన్న

తెలుగులో కొన్ని జననిరుక్తులు అంటూ తూమాటి దొణప్పగారు రాసిన వ్యాసంలో ఈ పదం గురించి వివరించారు. అజ్ఞాత వ్యక్తి కృతాలయిన రాతలను ఆకాశరామన్న ఉత్తరాలు అని చెప్పుకుంటాం.

ఈ పదానికి కారణం ప్రజలలో కోదండరామ, కల్యాణరామ, అయోధ్యరామ ఇలా వ్యక్తినామాలలోని రామ శబ్దానికి ఉన్న ప్రాచుర్యం వలన ఈ పదబంధం అవతరించింది. ఆకాశ నామ్న అంటే ఆకాశం పేరిటవాడు అని భావం. ఆకాశం అంటే శూన్యం అనీ అభావం అనీ అంటారు కదా. ఆకాశకుశుమం వంటి పదాలలోని అభావం అంటే లేనిది అనే అర్థంతోనే పేరు లేని వ్యక్తి అనే అర్థంతో వ్యవహృతమవుతోందని దొణప్పగారు వివరించారు."

ఆ తరవాత, మరొక పోస్టులో సువర్చలగారే రాసేరు – "ఓరకంగా సాధ్యమే కానీ..నిజంగా ఇవి చేయనివి కదా! సందర్భాలకు అన్వయించే ఇలాంటి భావనలు ఎన్నో మన భాషలో! ఇలాంటివి మీరూ పంచుకోండి మరి!" అని ఇచ్చిన మరి కొన్ని సామెతలు

బుట్టలో పడెయ్యటం!

ముగ్గులో దించటం!

మునగ చెట్టు ఎక్కించటం!

గుండెల్లో గుడి కట్టటం!

కళ్లల్లో వత్తులు వేసుకోవటం!

కళ్లు కాయలు కాయటం!
కడుపులో కళ్లు ఉండటం!
కళ్లు నెత్తిపైకి రావటం!
నోరు కట్టుకోవటం!
కాళ్లకు బలపాలు కట్టుకోవటం!(బలపాలు అరిగేలా తిరిగారు..అంటుంటాం కదా!)
ఇందులో నాకు "కడుపులో కళ్ళుండడం" అంటే ఏమిటో తెలీలేదు. వివరణ అడిగితే, సువర్చల సమాధానం – "కడుపులో కళ్లుండటం అంటే అన్ ఫెయిర్ గా ఉండేవాళ్ల చూపు పేరు. వారి పరిశీలన అలా ఉంటుంది. మనకు తెలియదు వాళ్లే వ్యూ లో చూస్తున్నారో అని! ఏమైనా ఇది నెగెటివ్ చాయలున్నదే!
ఇంకోటి కడుపులో ఎలుకలు పరిగెత్తటం!(ఆకలైతే దీన్ని వాడుతామని అందరికీ తెలిసిందేగా!)"
దానిమీద, సుధారాణి వ్యాఖ్య – "కడుపులో కళ్ళు ఏమో కానీ, కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకోవడం విన్నాను నేను. చాలా తట్టుకోలేని ఆకలి బాధని వివరించే సందర్భంలో. కడుపులోకి కాళ్ళు ముడుచుకుని పడుక్కోవడం అన్నమాట. బహుశ చాలామంది కథకులు మూడంకెవేసుకుని పడుకుంది అని వాడడం చదివే ఉంటారు. దానికి కూడా ఇదే అర్థం కదా."
ఆ పైన మరో రెండు ప్రశ్నలు తలెత్తేయి. జాతీయం, సామెత – ఈ రెంటికీ తేడా ఉందా, రెండూ ఒకే అర్థాన్నిస్తాయా అని. చర్చ విస్తృతంగానే జరిగింది.
"పెళ్ళిళ్ల పేరయ్య" అన్నది జాతీయం కాదంటారు సువర్చల చింతలచెరువు. "జాతీయం ప్రథమలక్షణం మరోదానితో పోల్చటం! సామెతకు, జాతీయానికీ చాలా దగ్గర లక్షణాలుంటాయి! రెండింటి లక్ష్యం పోల్చటమే! పెళ్లిళ్ల పేరయ్య అనే వ్యక్తి రియల్ గా ఉన్నాడు కదా!"
సురేష్ కొలిచాల ఇలా అన్నారు: "జాతీయం ప్రథమ లక్షణం మరోదానితో పోల్చటం" అన్న వివరణ సరైనది కాదేమో. ఒక జాతి ప్రజల సంభాషణలో స్థిరపడిపోయిన

పదబంధ ప్రయోగాలను జాతీయాలు అంటారని నా అభిప్రాయం. సాధారణంగా పదాలకు ఉండే మౌలికార్థాల ఆధారంగా కాకుండా ఈ పదబంధాలకు ఒక ప్రత్యేకమైన అర్థం వాటి చారిత్రక ప్రయోగాల ద్వారా ఏర్పడి ఉంటే అది జాతీయం అవుతుంది. ఇంగ్లీష్ లో వీటిని idioms అంటారు.

నా దృష్టిలో పెళ్ళిళ్ళ పేరయ్య అనేది జాతీయమే. మీరేమంటారు?

నాళము కృష్ణరావు రాసిన ఈ జాతీయాల పుస్తకం చూడండి.

https://archive.org/details/TeluguJaateeyamuluPartI

ఆమీద మరో సందేహం "పరశురామ ప్రీతి" అన్న సామెతలో పరశురాముడు ఎవరు అన్నది. ఏల్చూరి మురళీధరరావు గారు పరశురాముడు ఒక వ్యక్తి కాదంటూ పెద్ద వివరణ ఇచ్చేరు, "వేదవ్యాసుడు, విశ్వామిత్రుడు, పరశురాముడు మొదలైనవి enduring legends గా పురాణవాఙ్మయంలో స్థిరపడిన నామాలనుకొంటాను. అవి వ్యక్తుల పేర్లు మాత్రమే కావని, విద్యాధ్యయనబోధనరతులైన మహనీయుల సంస్థాప్రతీత నామాలని శ్రీపాద అమృతరావు డాంగే గారు గతశతాబ్దిలో చాలా వ్యాసాలను ప్రకటించారు. సంప్రదాయ విద్వాంసులు వాటిని కొట్టిపారేస్తారు. త్రేతాయుగంలో క్షత్రియులను సంహరించిన పరశురాముడే - చిరంజీవి కనుక - ద్వాపరంలో ద్రోణునికి విద్య నేర్పిన గురువు అన్నది సంప్రదాయభావన. (1) సంప్రదాయం, (2) విశ్వాసం, (3) చారిత్రిక పరిశోధన అన్న వేర్వేరు పరిమితులకు లోబడి ఆలోచించినప్పుడు ఇవి తలకొక్క తీరున కనబడతాయి. వాటన్నిటిని ఆధునికదృష్టితో సమన్వయించాలని ప్రయత్నించటం సాధ్యమయ్యే పనికాదు.

ఒకటి మాత్రం నిజం: పరశురామ ధనుర్వేదం, పరశురామ కల్పసూత్రానుసారం అగ్న్యారాధనం అన్నవి కేరళలో ఇప్పటికీ సజీవంగా ఉన్న సంప్రదాయాలు. పరశురాముని అగ్నిచయనవిధిని గురించి Frits Staal గారి మహాగ్రంథం Agni ఉందనే ఉన్నది."

మురళీధరరావుగారు ఇచ్చిన వ్యాఖ్యానం పూర్తిగా కావాలంటే తూలిక.నెట్ ఫేస్బుక్ పేజీ చూడాలి.

అలాగే, నాకు తోచిన మరో కోణం - కులాలని చర్చకి పెట్టడం నాఅభిమతం కాదు కానీ, కులప్రసక్తితో కూడిన సామెతలు కూడా ఉన్నాయి.

పనిలేని మంగలి పిల్లిబుర్ర గొరిగినట్టు

చదువుకున్నవాడికంటె చాకలివాడు మేలు

కమ్మల్ని, తుమ్మల్ని నమ్మరాదు

నల్ల బ్రాహ్మణులని నమ్మరాదు

రాచనేతికి కొంగు పట్టమని

రెడ్డొచ్చె మొదలాడు

కొండమీద గోలేమిటంటే కోమటోళ్ళ రహస్యాలు

- లాటివి.

నామటుకు నాకు ఇవి ప్రజలు తమకులములను సగర్వంగా చెప్పుకునే రోజుల్లో వచ్చేయేమోనని.

ఓడ ఎక్కేదాకా ఓడమల్లయ్య - ఓడ దిగిన తర్వాత బోడి మల్లయ్య-

కాళిదాసు కవిత్వం కొంత - నా పైత్యం కొంత అన్నట్లు-

తగవు తీర్చరా సింగన్నా అంటే దూడ, బర్రె నాపే అన్నాట్ట -

తిండికి తిమ్మరాజు - పనికి పోతరాజు-

భగీరథ ప్రయత్నం-

భోజునివంటి రాజుంటే కాళిదాసువంటి కవీ వుంటాడు-

రంగడికీ లింగడికీ స్నేహం - రొట్టె దగ్గర గిజగిజలు-

శాస్త్రులవారింట పుట్టాను, సోమయాజుల వారింట మెట్టాను,

లవణమంటే దూడ రేణమని తెలీదా నాకు అన్నదట-

వ్యాస ప్రోక్తమా? పరాశర ప్రోక్తమా?-

సంజయ రాయబారంలాగా-

సీతాపతీ! నీకు చాపేగతి-

నిన్నరాత్రి – అక్షరాలా అర్ధరాత్రి నాకు తోచిన మరో కోణం – మనం తరుచూ ఇంగ్లీషులో వాడుతున్న సామెతలకి సాటిగా తెలుగు సామెతలు సృష్టించగలమా అని.

నేను ఫేస్బుక్కులో అడిగేను square peg in a round hole అన్న నానుడికి తెలుగు సామెత ఏమైనా ఉందా అని.

జవాబుగా వచ్చినవి –

లంఖణాలపూట శోభనాల ముచ్చట్లు (జె.కె. మోహనరావుగారు)

గుండ్రని బెజ్జానికి చదరపు గూటంలా (కొలిచాల సురేష్ గారు)

నాకు తోచినది – గుండుకంతకి చదరపు చెక్క.

ఇంతకీ నేను చెప్పేది సామెతలు మన భాషకి పెట్టని కోటలు. అలరించే అలంకారాలు. వాటికి అస్తిత్వం మన నాలుకలమీదే.

ఇంకా కుదించి చెప్పాలంటే, ఏదో సామెత చెప్పినట్టు … :)

000

(డిసెంబరు 15, 2013)

15. ఎవరీమె?

రాయడానికింకేం లేదు అనుకున్నప్పుడల్లా కొత్తవిషయం కళ్లముందుకొస్తుంది. స్వర్ణకంకణము గురించి రాసేసింతరవాత సర్వేజనాః సుఖినో భవంతు అనుకుని, పడుకున్నాను. నిద్ర పట్టలేదు. అదే ఒక హెచ్చరికగా గుర్తించి, తెలుగు వికిపీడియాలో ఏముందోనని తవ్వకం మొదలు పెట్టేను. అవును.

డిజిటల్ లైబ్రరీవారు కినుక వహించేరో, కునుకు తీస్తున్నారో కానీ నాకు మాత్రం ఏ పుస్తకం తీయబోయినా దిగను కాక దిగనంటూ మొండికేసింది. జె.కె. మోహనరావుగారిచ్చిన కిటుకు కూడా పని చెయ్యలేదు. బహుశా అది నాలాపుటాపు లోపము కానోపు.

సరే, పోనీంపోచ్ అనుకుని తెలుగు వికిపీడియామీద పడ్డాను. రచయిత్రుల సమాచారం చూస్తే, వస్త్రం సమర్పయామి అని అక్షతలు చల్లినట్టు నామమాత్రంగా ఓ పాతిక పేర్లున్నాయి. నాకు తెలిసినవాళ్ళే వందమంది దాకా ఉన్నారు. ఆమధ్య ఎవర్నో అడిగితే 300 వందలదాకా ఉంటారన్నారు. ఇంకా వాళ్ళకి తెలీనివాళ్ళు బ్లాగుల్లోనూ, హైదరాబాదులో మహా రచయిత్రులకళ్ళముందు తచ్చాడుతూ తమపేర్లు పేపర్లలోనూ, ఉపన్యాసాలలోనూ ఎక్కించుకోలేనివారూ మరో వందమందయినా ఉంటారు.

ఇవన్నీ ఆలోచించి కళ్ళు పొడుచుకు చూసేను. ఓ మోస్తరు పేరు తెచ్చుకున్న రచయిత్రులు లేరు. నేను కని విని ఎరుగని పేర్లు కొన్ని ఉన్నాయి. అందులో ఆశ్చర్యం లేదులే. గత 30 ఏళ్లలో ప్రచురింపబడి బహు బహుమతులు పొందిన ఆధునిక కథలు చదవలేదు కనక నాకు తెలీనివారుండడంలో విచిత్రం లేదు. కానీ అంతో ఇంతో పేరు తెచ్చుకున్నవారిపేర్లు లేవు. దాంతో నాకు ఎక్కళ్ళేని హుషారు పుట్టుకొచ్చి, వాళ్లందరిమీదా రాసేయబోయి, ముందు అక్కడ ఎవరిగురించి ఏ సమాచారం ఇచ్చేరో

చూదాం అని ఒకొక పేరుమీద క్లికు చేసేను. అట్టి నాపరిశోధనలో నేను గ్రహించిన బ్రహ్మరహస్యం కె. రామలక్ష్మి అను రచయిత్రిగురించి.
"ప్రముఖ రచయిత, అభ్యుదయకవి, పండితుడు, పరిశోధకుడు, నాటక కర్త మరియు విమర్శకుడు అయిన ఆరుద్ర అర్ధాంగి మరియు రచయిత్రి."
హెచ్చరిక. నేను వికిపిడియావారికృషిని కించపరిచే ఉద్దేశంతో రాయలేదిది. వారందరూ ఉచితంగా తమసమయం వెచ్చించి సాంకేతికవిజ్ఞానం ఉపయోగించి సాహిత్యసేవ చేస్తున్నారు. అలాటి మహోన్నతకృషిలో వేలు పెట్టదలుచుకున్నవారు కూడా ఆ బాధ్యతని బాధ్యతగానే తీసుకోవాలి కదా అని. పై వాక్యంలో రచయిత్రిగురించి రచయిత్రిగా తెలిసింది ఏముంది?
సరే, వికిపిడియావారితో సంప్రదించి, ఆ భాగం నేను మార్చేను. ఇప్పుడు మీకు రామలక్ష్మి ఎవరో, ఆమె కృషి ఏమిటో కొంతలో కొంతయినా తెలిసే అవకాశం ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను.
ఇప్పుడు అసలు విషయానికొస్తాను. మనకి ఈ చుట్టరికాలద్వారా, బీరకాయ పీచయినా సరే, ఒక మనిషి అస్తిత్వాన్ని నిర్ణయించుకోడం సంప్రదాయం. గోటేటివారి కోడలు, వంకలపల్లివారి చిన్నవాడు, సుబ్బమ్మగారి అల్లుడు, సీతమ్మమొగుడు, చంద్రన్నగారి పెళ్లాం – ఇలా చెప్పుకోడంలో మనకి ఘనత. ఎందుకంటే మనకి మనిషికంటె వంశం ఎక్కువ. కుర్రవాడు పెద్ద ఉద్యోగం చేసి ఊళ్ళో వంశానికి వన్నె తెస్తాడు. కుర్రది అలాటి కొడుకుని కని వంశం నిలబెట్టడానికి దోహదకారి అవుతుంది. అంతే గానీ నేనింత చేసేనన్న గర్వం మనవాళ్ళమధ్య జరగదు. అచ్చిరాదు. అలా అన్నవాడు అహంకారి. రౌరవాది నరకాల పడిపోతాడేమో కూడా, నాకు ఖచ్చితంగా తెలీదు.
నాకు సాహితీమిత్రులు ఎదురుపడితే, నేను రాసినవో, వారు చదివినవో మాటాడతారనుకుంటాను. కానీ పదిమంది చేరినచోట కనీసం నలుగురైనా ఉంటారు మీవారిని ఇక్కడ చూసేం అనో అక్కడ చూసేం అనో చెప్పేవాళ్ళు. అమ్మలారా,

అయ్యలారా (అవునండీ, మగవారు కూడా ఉన్నారు ఇలా అనేవారు), నాకు ఆ విషయాలలో ఆసక్తి లేదన్నా సరే. అది కాదండీ అంటూ పొడిగించేవారున్నారంటే, మన సంప్రదాయం ఎంత పటిష్టమో ఊహించుకోండి.

కేవలం రక్త సంబంధాలే ఉండక్కర్లేదు. ఊరువాడు, పొరుగువాడు, తాతగారి తోడల్లుడి బావమరిదిదగ్గర పని చేసినవాడు, మేనగోడలి క్లాస్మేటు, వేలువిడిచిన తోడికోడలి ఫ్లాటుమేటు – ఇలా ఏదో రకం మనవాడే అని నిరూపించేస్తాం, అవసరమయినప్పుడు మాత్రమే. అయ్యా, అమ్మా, గట్టిగా నోటు చేసుకోండి, దయచేసి. **అవసరమైతేనే!!** ఈ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయ సిద్ధాంతం - అవుసరం తీరిపోయిన వెనక, తోబుట్టువు కూడా ఎవరీమె? అనే స్థితికొచ్చేస్తుంది. పాత సామెత – అడవిలో అబ్బా అంటే ఎవరికి పుట్టేవురా కుర్రాడా అని.

ఈమధ్య నాపేరు అంతర్జాలంలో విస్తృతంగానే కనిపిస్తోంది కనక నేను ప్రముఖ whatever అనే అనుకోవాలి. నాకు కదాచితుగా వచ్చే టపాలు చూస్తే అలా అనిపిస్తుంది మరి.

000

(మార్చి 7, 2014)

16. పనసపొట్టు కూర

పనస అనగానే మీకు గబుక్కున గుర్తొచ్చేదేమిటి? అదేలెండి సింహాచలం సంపెంగతోటలతరవాతే. అన్నట్టు ఇది కూడా మనసులో మెదులుతోందా?

తండ్రి గరగరా

తల్లి పీచు పీచు

బిడ్డలు రత్నమాణిక్యాలు

మనుమలు బొమ్మరాళ్ళు.

అయితే మీకు పనసకాయ తెలుసన్నమాట. కాకపోతే నేనేం చెయ్యలేను. మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి. ఏమోలెండి, ఇది చదివేక, మీకేమైనా తోస్తుందేమో.

పనసకాయా, అరటి చెట్టూ – ఈరెంటికీ తెలుగుఇళ్ళలో ప్రత్యేకస్థానం ఉంది ఎందుకో తెలుసా? మిగతా కూరలూ, కాయల్లా ఈ రెండూ వండుకుతినడానికి మొదలు పెడితే పారేసేదేమీ ఉండదు దాదాపుగా. అంటే పనసకాయ పైపొర – గరగరలాడే ములుకులూ, అరటిచెట్టు వేళ్ళూ తినం కానీ మిగతా అన్ని భాగాలూ ఏదో విధంగా ఆరగించడమే. అరటిచెట్టు కథ తరవాత చెప్తాను. ఇవాళ కబుర్లు పనసకాయకే పరిమితం.

ఇంతకీ అసలు ఈ కథంతా ఎందుకు మొదలయిందంటే – చెప్పేను కదా నేనూ ఇశాపట్టంలోనే పుట్టి పెరిగేనని పాతికేళ్ళు దాటేవరకూ. అంటే చాలా చాలా బోల్డు సంవత్సరాలు అయిపోయేయి కదా. మళ్లీ ఇదుగో ఇవాళ బజారుకెళ్తే, యిన్ని సంవత్సరాలు అయిపోయేక, నిజ మరియు తాజా పనసకాయ ముక్కలు కనిపించేయి. వాటికి గజం దూరంలో నిలబడి అట్టే చూస్తూ నిలబడిపోయేను కలయో వైష్ణవమాయయో అనుకుంటూ. కళ్ళు నులుముకుని మళ్ళీ చూసేను. హాచ్చెర్యమ్!

ఆ తరవాత నోరూరింది, కళ్లు చెమ్మగిల్లేయి. ఆపకుండా చదివేవారి ముంగిట పుస్తకాలదుకాణం వెలిసినట్టు, బట్టలదుకాణంలో 80 శాతం తగ్గింపు ధరలబోర్డు దర్శనమయినట్టు, రైలెక్కబోతుంటే కండక్టరు రారమ్మని పిలిచి టిక్కెట్టు అరచేతిలో పెట్టినట్టు. సరీ..ఛ్ఛా.. వాన పడ్డప్పుడే గొడుగు ఎదుట ప్రత్యక్షమయినట్టు, ఫేస్బుక్కులో నా టపాకి మూడువందల లైకులూ, ముప్ఫైయారువందల పొగడ్తలూ రాలినట్టు. వేయేల, నా గత సప్తజన్మల సుకృతములూ కూడగట్టుకుని పనసకాయ ముక్కయి నాముందు నిలిచినది. ఆహా, ఓహో అనుకుంటూ ఓ ముక్క కొనుక్కుని, ఆనందమామానందమాయె అని పాడుకుంటూ ఇంటికొచ్చేను. ఏరాగమా? ఏమో, ఏ పంజాబీ భంగ్రాలాగో పాడొచ్చేమో. రేపు ఫేస్బుక్కులో కనుక్కుని చెప్తాను.

పాటకులారా! దయచేసి మీకు తెలిస్తే, ఆనందమానందమాయే ఎలా పాడొచ్చో చెప్పండి.

పాఠకులారా! ఇప్పుడు ఈ పనసకాయ ముక్కతో కూర ఎట్లు చేయవలెనో చెప్పండి, ఆవ పెట్టా? కొబ్బరికోరు దండిగా దట్టించా? ఆమాత్రం తెలీదా అనకండి. ప్రస్తుతం నేను రెండో బాల్యంలో ఉన్నాను కదా. అంతా మొదటినుండి మళ్ళీ నేర్చుకుంటున్నాను.

పాతకులారా! ప్చ్. మీకు నేను చెప్పగలిగేదేమీ లేదు. కావలిస్తే, నేను చేసిన కూర తినడానికి మాయింటికి రండి. (మీ పాపాలకి ప్రాయశ్చిత్తం అన్నమాట.)

000

(మార్చి 26, 2014)

17. పుచ్చుకున్ననాటి ముచ్చట!

ప్రతి సూత్రానికి మినహాయింపులుంటాయి. వీటినే మన పూర్వులు ఆపద్ధర్మం అన్నారు. ధర్మవ్యాధుడు మాంసం అమ్ముకున్నా ధర్మరాజు అశ్వత్థామ హతః అన్నా ఫరవాలేదన్నదందుకే. అంతే కాదు శబరి ఎంగిలి పళ్ళు రామునికిచ్చింది. వేటగాడు శివునిమొహంమ్మీద కాలు మోపేడు. ఇవన్నీ ఫరవాలేదని ఎందుకన్నారంటే ఆ విదంగానైనా మతి సన్మార్గంవేపు మళ్ళవచ్చునని. పగనైన వగనైన ప్రాణభీతినైన నన్ను తలుచుకుంటే చాలన్నాడు కదా శ్రీహరి.

ఇంతకీ ఈ సదసద్వివేచనలోకి నేను ఎందుకు దిగేనంటే పండుగలపేర అనవసర ఇచ్చిపుచ్చుకోడాలకి వ్యతిరేకిని అని చెప్పేను కదా. కానీ పుచ్చుకోడం జరిగితే దానికి కనీసం సమాధానం ఇచ్చుకోవాలి. చేసిన పాపం చెప్తే పోతుందంటారు అన్నారు కనక. అసలు ఆ పుచ్చుకోడం కూడా నేనేదో బాధ పడిపోతూ చెయ్యలేదు. కొంచెం సంతోషం కూడా కలిగిందని కూడా ఒప్పుకోవాలి.

ఇప్పుడు అసలు కథ. దాదాపు నెల రోజులయిందనుకుంటాను నా కెమెరా తిరగబడి బొమ్మలు తీయను కాక తీయనని మొండికేసి. ఇక్కడే మరోమాట చెప్పుకోవాలి. మామూలుగా ఎంత చిన్న వస్తువు కొన్నా దానిని సదా ఉపయోగకరంగా ఉంచడానికి అంటే maintenance అనబడు కార్యక్రమానికి మరో నాలుగు వస్తువులు కొనవలసివస్తుంది. ఎంత చిన్న వస్తువయినా సరే దాన్ని నీటుగానూ, భద్రంగానూ ఉంచడానికి ఏ నోమో వ్రతమో చేసినప్పుడు ఉన్నంత తతంగం ఉంటుంది. ఉదాహరణకి కెమెరామాటే తీసుకోండి. దానికి అమర్చిన రెండున్నర అంగుళాల తెర తుడవాలంటే కేవలం అది తుడవడానికి మాత్రమే సృష్టింపబడిన గుడ్డముక్క కావాలి. అది ఏదో ఒక్క దుకాణంలో మాత్రమే దొరుకుతుంది. ఆరో పదో డాలర్లు పెట్టి కొనాలి.

దానితోపాటు చిన్న కుంచె, చిటికెడు పొడి, ఇంకా ఏవేవో కూడా వస్తాయి. ఏది ఏ చేత్తో ఎన్ని వేళ్ళతో ఎలా పట్టుకోవాలో బొమ్మలతో సహా పద్ధతి వివరించబడి ఉంటుంది. అచ్చంగా ఇలాగే కాకపోవచ్చు కానీ సుమారుగా ఇలాగే ఉంటాయి ఇక్కడి వ్యవహారాలన్నీ. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ పాత పీలిక తీసుకు తుడుస్తూ ఉండండి అప్పుడప్పుడు అని ఒక్కమాటలో చెప్పడం మాత్రం జరగదు.

ఇంతకీ నా పూర్వ కెమెరా సంగతి. పైన వివరించిన శుభ్రపరుచు విధానం ఉంది కానీ అంతర్జాలంలో చూస్తే ఓ చుక్క నీళ్ళతో తుడిస్తే చాలు అని తెలిసింది. ఆ విషయం కనిపెట్టేసిన ఆనందంతో పొంగిపోతూ వంటింట్లో కొళాయిదగ్గర ఆ కాస్త చదరపుముక్క శుభ్రపరిచి గిరుక్కున వెనుతిరిగేను. నా ఉత్సాహంపాలు శృతి మించినట్టుంది నేను వెనుదిరగడంలో. ఆ విసురుకి కెమెరా చేతిలోంచి జారి ఠప్పున లినోలియం నేలమీద పడి మట్టి కరిచింది. ఏమైందో అనుకుంటూ ఆన్ చేసి రెండు మూడు బొమ్మలు తీసేను. బాగానే వచ్చేయి. సరే, ఇంకా దానికాలం చెల్లలేదు అనుకుని సంతోషించేను.
మరోవారం రోజులు పోయేక వీధిలోకి వెళ్తే చెట్లు కొట్టేస్తూ కనిపించేరు సిటీవారు. ఇక్కడ శిశిరం ప్రవేశిస్తుండగానే ఎంత పెద్ద చెట్టయినా సరే నిచ్చెనలేసుకుని మరీ కొమ్మలు నరికేస్తారు. ఈ కొండమంగలి క్షవరానికి tree maintainance service అని పేరు. పాతిక అడుగులు ఎదిగిన చెట్టు. పది పదిహేను బారలు సాగిన కొమ్మలను హృదయవిదారకంగా నరికేసే ఆ క్రియావిశేషాన్ని maintainance అనడం నాకయితే హాస్యాస్పదంగానే ఉంది.
అలా నవ్వుకుంటూ నేను ఆరోజు వెనక్కెళ్ళి నా కెమెరా తీసుకు మళ్ళీ అక్కడికి చేరుకున్నాను ఆ తంతు పెట్టెలో పట్టడానికి. రెండు బొమ్మలు తీసినట్టే కనిపించింది. మరో నాలుగడుగులేసి, మరో బొమ్మ తియ్యబోతే పొరబాటొచ్చింది. "ఆఫ్ చేసి మళ్ళీ ఆన్ చెయ్యమం"టూ ఆదేశం కనిపించింది. మరి ఆ పెట్టె చిన్నదే అయినా ఎలా చెప్తే అలా చెయ్యాలి. నేను చేస్తాను. చేసేను కూడా బుద్ధిగా కానీ మళ్ళీ అదే సందేశం.

రెండోమారు, మూడోమారు, నాలుగూ, ఐదూ ... అలా ఆ చిన్నపెట్టెతో గంటసేపు ముచ్చట్లాడి, ఇహ ఇది పనికిరాదని అర్థం చేసుకున్నాను.

ఆ రోజుల్లోనే సరయు వస్తే, నాకు జరిగిన అన్యాయం వివరించి, కొంచెం విచారంగా మొహం పెట్టి, నేను ఇదివరకు తీసిన బొమ్మలు చూపించేను, "ఎంత బాగున్నాయో చూసేవా?" అంటూ. ఆ తరవాత ఒకొక బొమ్మనీ ఎంతమంది మెచ్చుకున్నారో లెక్కలు చూపించేను. ఒకొక బొమ్మమీద ఎన్ని వ్యాఖ్యలు వచ్చేయో చెప్పి, వాటికి అనువాదాలు కూడా ఇచ్చేను. కొన్నిటిమీద వచ్చిన కవితలు కూడా వివరించేను.

ఆ తరవాత "నాలుగు రోజుల కిందటనుకుంటాను నిండు పున్నమి చంద్రుడు మబ్బులు మధ్య అచ్చు మబ్బులమధ్య చంద్రుడిలా ఎంత అందంగా ఉన్నాడో తెలుసా, చూడ్డానికి రెండు కళ్ళు చాలవు," అన్నాను.

"మరి బొమ్మ తీసేవా?"

"కెమెరా లేదు కదా," అన్నాను. అలా చెప్పుకోడంలో నాకు విషాదం ధ్వనించలేదు. లేని వస్తువులమీద కోరిక పెంచుకోకూడదు.

"పండుగ అమ్మకాలు కదా. ఎమెజాన్ లో మంచివి ఉంటాయి,"

"మ్. చూస్తున్నాను. కెమెరా లేకుండా ఎంతకాలం ఉండగలనా అని."

ఆ తరవాత మరేవో కబుర్లలో పడిపోయేం.

ఆ తరవాత నాకు హఠాత్తుగా ఏది శాశ్వతం అన్న నిస్పృహ కూడా వచ్చేసింది. దీర్ఘంగా ఆలోచించడం మొదలు పెట్టేను. ఎందుకింత తాపత్రయం.

పదిరోజులనాడు పిలిచింది సరయు, "మేం మాలుకెళ్తున్నాం. వస్తావా?"

సరేనన్నాను. చెప్పేను కదా నాబజారుపనులు రెండు విధాలుగా జరుగుతాయని. నాకు పనున్నప్పుడు పిలుస్తాను. లేదా వాళ్ళిద్దరూ వెళ్తున్నప్పుడు వస్తావా అని అడుగుతారు. నాకేమీ అవసరాలు లేవు కానీ కాలక్షేపం కదా అని సరేనన్నాను. అలా ముగ్గురం బజారులో తేలేం.

మీరు సూక్ష్మగ్రాహులు ఆ తరవాతేమయిందో కనక గ్రహించేసి ఉంటారు ఈసరికి.

"ఎలాగా వచ్చేం కదా కెమెరా చూడు."

అసలు మాఅమ్మాయి ఆ మాట అనక్ఖర్లేదు. నాకాళ్ళు ఇనపముక్కని అయస్కాంతం ఆకర్షించినట్టు అటువేపు లాగబడతాయి నాకు ఏమీ అఖ్ఖర్లేని రోజుల్లో కూడా. మామూలుగా చీరెలూ నగలవేపు ఆడవాళ్లూ, చొక్కాలూ టైలవేపూ మొగవాళ్ళూ పొద్దు తిరుగుడుపువ్వుల్లా తిరుగుతారు అని ప్రతీతి. నేను ఎలక్ట్రానిక్స్ ఉన్నచోటికి వాలుగాలిలో తెప్పలా తేలిపోతాను. ఎలెక్ట్రానిక్స్ అరలు కనిపించడం చర్య. నేనక్కడ తేలడం అసంకల్ప ప్రతీకారచర్య.

అక్కడ నాకళ్ళు ఠక్కున ఓ కెమెరామీద పడ్డాయి. అది ఎంతో ముద్దుగా అచ్చు నా పాత కెమెరాలాగే ఉంది . నాకెమెరా నాచేతిలోనే ధ్వంసమయి నాచేతే దాచివేయబడింది అని నాకు తెలీకపోతే, అది నా కెమెరాయే అనుకునేదాన్నన్నమాట. అంత పోలికలున్నాయి దానికి. "అరె, సరిగ్గా ఇలాటిదే నాది," అన్నాను హాచ్చెర్యపడిపోతూ.

"తీసుకో."

వెంటనే నాకు తెలివొచ్చింది. కెమెరా లేకుండా ఎంతకాలం గడపగలనో చూదాం అనుకున్నాను కదా.


"ఇప్పుడొద్దు. తరవాత చూస్తాను."

పిల్లలదగ్గర తల్లులమాటలు చెల్లవు. నామాట చెల్లలేదు. ఆఖరికి మరో చుట్టు "నేనే కొనుక్కుంటాన"నని నేనూ, "కాదు, మేం కొంటాం" అని వాళ్లూ కొంచెంసేపు వాదులాడుకున్నాం. అక్షరాలా అది ఆటలాగే అనిపించింది. అంచేత ఆడుకున్నాం అనే చెప్పాలి.

ప్చ్ ఏం చెయ్యనూ కోరి ఇస్తానంటున్న కూతురూ, మేమిద్దరం ఇవ్వాలనుకున్నాం అంటున్న కొత్తల్లుడూ ... వాళ్ళసరదా చూసి ముచ్చట పడిపోతూ వెనక్కి తగ్గిపోయాను :p

అదండీ నా బహుమతి పుచ్చుకోలు మరియు కెమెరా కథ.

ఇదుగో ఆ కొత్త బహుమతితో తీసిన తొలి బొమ్మ. పరికించి చూడండి. కెమెరాని ఆప్యాయంగా పొదివి పట్టుకు ఛాయామాత్రంగా కనిపిస్తున్న రెండుచేతులూ నావే!



000

(డిసెంబరు 19, 2015)

18. తిలకాష్ఠ మహిషబంధనము అను నాగ్రంథాలయచరిత్ర!

ఈరోజు మీకు నా గ్రంథాలయచరిత్ర చెప్పబోతున్నాను. అవధరించండి, కాఫీలు, సిగరెట్లూ, మీకు ఏది అలవాటయితే అది చేత పుచ్చుకుని.

గ్రంథాలయచరిత్ర అంటే అయ్యంకి వెంకటరమణయ్యగారో వెలగా వెంకటప్పయ్యగారో రాసినట్టు రాస్తున్నాననుకోకండి. ఇది నాగ్రంథాలు అంటే మాయింట గల గ్రంథసంపదకు మాత్రమే పరిమితం. అదేమంత పెద్దది కూడా కాదులెండి. అంచేత ఈ హరికథ చీకటి పడకముస్నే ముగిసిపోతుంది. నాసైటు తూలిక.నెట్ ముఖాన చూసేరు కదా. అంతకంటె మరో మూడు అరలు ఉండేవి కానీ పుస్తకాల్లో ఉన్నది కూడా విద్యే కనక పుస్తకదానం కూడా విద్యాదానంలో భాగమనుకుని, దశదానాల్లో చేరుతుందని నిశ్చయించేసుకుని, పంచిపెడుతూ వచ్చేను. అరువిచ్చిన బుక్కు తిరిగి చూడ్డం గొప్ప లక్కు అని ఆరుద్రగారికైతే అనిఉండొచ్చు కానీ నేను మాత్రం పుస్తకాలు అలా ఇంటింటా తిరగాలనే కోరుకుంటాను. ఒకట్రెండు పుస్తకాలవిషయంలో మాత్రం తిరిగి పుచ్చుకోవలసివచ్చింది. అది వేరే కథ. అయినా ఈరోజుల్లో ఎవరు మాత్రం ఏం చేసుకుంటారు కనక ఈ పుస్తకాలు. పూర్వం అయితే పకోడీపొట్లాలు కట్టుకోడానికేనా పనికొచ్చేవి కానీ ఇప్పుడావసతి లేదు. వస్తుభ్రమణం చేస్తున్నాం అంటారు కానీ మా వీధిలోనే చూసేను గాలికి కొట్టుకుపోయేవీ, వీధిపక్కన పారే కాలువల్లో కొట్టుమిట్టాడుతున్నవీ ఎన్నో ...

ఇంగ్లీషువారు “నీస్నేహితులెవరో చెప్పు, నువ్వెలాటివాడివో చెప్తాను,” అంటారు కానీ నేనది అంగీకరించలేను. ఎందుకంటే నాస్నేహితులని చూసి ఎవరైనా నన్ను అంచనా వేస్తే తప్పులో కాలేయడం ఖాయం. అసలు అట్నుంచి ఇటు - నాస్నేహితులు అనిపించుకుంటున్నవారిని కూడా చాలామంది అడుగుతారుట, “నీకు ఆవిడతో స్నేహం

ఏమిటి? ఏం చూసి స్నేహం చేస్తున్నావు," అని. మనలోమాట - నాక్కూడా అనిపిస్తోంది ఈమధ్య నాలో ఏం చూసి వీళ్లు నాస్నేహాన్ని ఆహ్వానిస్తున్నారని. అంచేత నేను ఆ ఆంగ్లవాక్యం మార్చి, "నువ్వే పుస్తకాలు చదువుతున్నావో చెప్పు. నువ్వెలాటివాడివో చెప్తాను," అని స్థిరం చేసుకుంటున్నాను. అంటే శవసాహిత్యం చదివేవాళ్ళంతా హంతకులనీ, ప్రాచీనసాహిత్యాభిమానులకీ అభ్యుదయభావాలకి చుక్కెదురనీ అర్థం కాదు. హస్తసాముద్రికం, ముఖసాముద్రికంలాగే గ్రంథసాముద్రికం కూడా ఒకటి ఉందనీ, లేకపోతే అలాటిదొకటి సృష్టించాలనీ నాఅభిమతము.


ఇంతకీ నా గ్రంథసంచయం - తూలిక ముఖపత్రంమీద ఫొగ్గొ అయితే పెట్టేను కానీ మీరు చూసేరో లేదో వాటిలో పావులావంతు నేను పుట్టించినవే! తల్లి భారతికి అదే నాఉపచారం, కొందరు అపచారం అనుకోవచ్చు, దానికి మనంపే చెయ్యలేంవనుకోండి. మిగతావాటిల్లో కూడా సగం నిఘంటువులు, తత్సంబంధమే కదా. నిజానికవేవీ నేను తిరిగి చూడ్డమే లేదు. ఎందుకంటే ఇప్పుడు అన్నీ అంతర్జాలంలో దొరుకుతున్నాయి. పైగా గత ఇరవైఏళ్లలోనూ భాష మాయావటుడివలె వృద్ధి చెందిపోతోంది కదా. కొత్తపదం సృష్టించనివారిది పాపం. బ్లాగాడువారు, లైకరులు, కామెంటువారు వంటివి మనకెక్కడ దొరుకుతాయి అంతర్జాలంలో కాకపోతే? ఈ భాషాభివృద్ధికి ఏ సంప్రదాయవాదులూ ఆనకట్ట కట్టలేరు. ఏ ముద్రణాలయాలూ వీటితో కీపప్పు చేయలేవు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే అంతర్జాలంలో భాష మూడు పువ్వులూ ముప్ఫైయారు కాయలూగా వృద్ధి పొందేస్తుంటే, ఆ ధాటికి ఈ ఇక్ష్వాకులనాటి నిఘంటువులు తట్టుకు నిలబడగలఆస్కారం లేదు గాక లేదు.

ఇంతకీ (ఈ పదం పదే పదే వస్తున్నందుకు మన్నించాలి), పుస్తకం అనబడు వస్తువు ఎంత పెద్దదిగా ఉండాలి, ఎంత చిన్నదయి ఉండాలి అన్న యావ నాకు ఈమధ్య ఎక్కువయిపోయింది. ఈకాలపు కుర్రవారికి తెలియకపోవచ్చు కానీ కంప్యూటరు పుట్టినరోజుల్లో అది మన పల్లెల్లో పచారీకొట్టు అంత పరిమాణంలో ఉండేదిట. ఇప్పుడు అరచేతిలోకి వచ్చేయి కదా. ఇంకా చేతిగడియారం, వేలిఉంగరం పరిణామంలో కూడా



వస్తున్నాయని విన్నాను. కాలిమట్టెలలో కంప్యూటరు కూడా వస్తాయేమో. అప్పుడు మగవారికి కూడా మట్టెలు తొడిగి, వాటిని యూనిసెక్స్ వస్తువుగా చేసేయొచ్చు.

ఇంతకీ, -:), ప్రస్తుతానికి వచ్చేస్తాను. నేనిప్పుడు పెద్దసైజు పుస్తకాలు అట్టే ఇష్టపడడంలేదు. లైబ్రరీకి వెళ్తే, కూడా నా ఎంపిక - మొదట పుస్తకం లావూ, బరువూ చూస్తాను. చిన్నిచేతిలో చిక్కగలపుస్తకమే చక్కనిపుస్తకం అనే అభిప్రాయానికొచ్చేసేను. లావొక్కింతయు లేకపోతేనే చేతిలోకి తీసుకుంటాను. నేను ఎడంచేత్తోనైనా తాకని గ్రంథరాజానికి ఇదుగో ఇదొక ఉదాహరణ. నిజానికిది ఒక్కచేత్తో ఎత్తలేం, బస్కీలు తీసేవారికీ, కండ పెంచుకోడానికి బరువులెత్తేవారికీ పనికిరావచ్చు కానీ నాలాటి అర్భకులకి మాత్రం ఉపయోగపడవు.



ఈ గ్రంథరాజంలోపల బొమ్మలయితే బాగున్నాయి కానీ అక్షరాలు చదువుకోడానికి భూతద్దం కావాలి.



లావూ, బరువూ నాకు అనుకూలంగా ఉన్నాయని నమ్మకం కలిగేక, పుస్తకం పేరు చూస్తాను. మనిషిలాగే పుస్తకానికి పేరు కూడా నాదృష్టిని ఆకట్టుకోగలిగేదయి ఉండాలని నా ప్రగాఢవిశ్వాసం. ఇంగ్లీషు పేర్లు పెట్టిన తెలుగు పుస్తకాలు, తెలుగుపేర్లు గల బెంగాలీ పుస్తకాలూ (లేవనుకోండి, ఉంటే మాట) నాకు రుచికరము కావు. ఆ తరవాత, అంటే ఈ రెండు నియమాలూ అనుకూలించేక, పుస్తకం తెరిచి చూస్తాను.

ఇలాటి పుస్తకాలు అట్టే కనిపించలేదు కానీ ఇందులో నాకు గొప్ప సౌలభ్యం కనిపించింది. పుటలమీద పుటలు టకటకమని గబగబ తిరిగిపోతాయి. అసలు స్పీడురీడరులకైతే కళ్ళు తిరిగిపోతాయేమో కూడా. పైగా ఆ రాసినవారు రాసినతీరు మనకి నచ్చకపోతే, అక్కడికక్కడే మనం మరో కథ రాసుకుంటూ పోవచ్చు ఆ

ఖాళీజాగాలో. వేరే కాయితాలు వాడనవసరం లేదు కనక పర్యావరణపరిరక్షణ కూడా అయిపోతుంది. అంచేత ఇది ఉత్తమ ప్రచురణపద్ధతి. అన్నట్టు, ఒక హెచ్చరిక - అది లైబ్రరీ పుస్తకం అయితే మాత్రం మీకథ అక్కడ వ్రాయుట నిషిద్ధము. తస్మాత్ జాగ్రత్త. మిమ్మల్ని చట్టవిరుద్ధమైన నేరములకు నేను ప్రోత్సహించుట లేదని ఇందుమూలముగా తెలియజేయడమయినది.

ఇంతకీ, (ఇదే ఆఖరు) అసలు విషయానికి వస్తాను. ఇప్పుడు నా గ్రంథాలయం నాఅరచేతిలోనే ఇమిడిపోయేలా ఏర్పాటయిపోయింది, (సాంకేతికవిజ్ఞానాభివృద్ధికి జేజేలు), ముచ్చటగా గూటిలో గువ్వపిట్టలా, జేబులో బొమ్మలా, అరచేతిలో ఆమలకంలా ... ఇంకా ఇంకా ..లాలాలాలాలాలా.



ఈనాటికి నాఅరచేతిఆమలకంలో గ్రంథపట్టికవివరాలు ఎలా ఉన్నాయంటే -

32 కథా సంకలనాలు

43 నవలలు

15 కవితాసంకలనాలు

22 వ్యాససంకలనాలు (వీటిలో వస్తువైవిధ్యం చూసి తీరవలసినదే.)

35 సాహిత్య చరిత్ర, విమర్శ

12 వేదాంతం

నాఅభిరుచులు కూడా ఈవరసలోనే. అంటే వేదాంతందగ్గరకొచ్చేసరికి చాలా కాలం పట్టవచ్చు.

ఈ హస్తలైబ్రరీలోవన్నీ digital library of India, archive.org వారి సౌజన్యంతో నాకు అందుబాటులోకి వచ్చినవే. వీటిలో కొన్నిటిని నాకు అందించిన పుస్తకప్రదాతలు వి.బి. సౌమ్య, రమణమూర్తిగారు.

ఆయా సైటులకి, సైటు నిర్వాహకులకి, డిజిటల్ పుస్తకప్రదాతలకి కృతజ్ఞతలు. :)
000

(మే 6, 2014).

.

19. ఏముంది మనసంస్కృతిలో ప్చ్!

…ప్చ్ అనేవాళ్ళకోసం ఓ చిన్న ఆలోచన.
నిన్నసాయంత్రం సుధ, డాక్టరుగారూ మాఇంటికి విచ్చేసి, భోజనాలయేక, ముగ్గురం, ఏటి ఒడ్డున తీరిగ్గా నడుస్తున్నాం తెలుగులో కబుర్లు చెప్పుకుంటూ. మా వెనక వస్తున్నాయనని చూసి, డాక్టరుగారు, “పెద్దాయనకి దారీయండి,” అన్నారు, మొత్తం కాలిదారి అంతా పరుచుకు నడుస్తున్న నన్నూ, సుధని. మేమిద్దరం పక్కకి తప్పుకున్నాం. వెనకనించి వస్తున్నాయన మమ్మల్ని దాటుకుని రెండడుగులు ముందుకి వెళ్లి, గిరుక్కున వెనక్కి తిరిగి, “మీరెక్కడుంటారు?” అని అడిగేరు. పేరు చెప్పనేల. ఆయనా తెలుగువారే. అలా మాటాడుకుంటూ మా వాటావరకూ వచ్చేక, లోపలికి రమ్మన్నాం ఆయన్ని. మాటలు బాగానే కలిసేయి. ఆయన అన్నారు, “ఈ ఇంగ్లీషు చదువులతో పట్టించుకోలేదు కానీ రిటైరయినతరవాత చూస్తే, మన సంప్రదాయంలో అన్నీ ఉన్నాయి,” అంటూ వాళ్ళ నాన్నగారు ఆయుర్వేద వైద్యులని చెప్పి, మిరియాలు, పసుపువంటి మన దినసరి వెచ్చాలతో ఇట్టే కుదిరిపోయే నలతలగురించి అరగంటసేపు వివరించేరు. నాకు చాలా భలే సరదా వేసింది.

ఇప్పుడు ఇది ఎందుకు చెప్తున్నానంటే, మన సంస్కృతిలో, సాహిత్యంలో "ఇది లేదేం? అది లేదేం" అని ప్రశ్నించేవారు మొదట మనసంస్కృతిలో సాహిత్యంలో ఏముందో క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఆ తరవాత, ఈ ఉన్నవి ఎలా ఏర్పడ్డాయో తెలుసుకోవాలి. ఆ తరవాతే మిగతా చర్చ.

ఈవిషయం నేను అప్పుడప్పుడు ప్రస్తావిస్తూ వస్తున్నాను. గత రెండు, మూడు నెలలలో ముఖపుస్తకంలో నాకంటె ఒకటి రెండు దశాబ్దాలు చిన్నవాళ్లు కాదు రెండో మూడో తరాలే వెనకటివాళ్ళు చదివిన పుస్తకాలు, చేసే చర్చలూ చూస్తే నాకు పరమాశ్చర్యంగానూ, పరమానందంగానూ కూడా ఉంది.

ఇప్పుడు ఇది ఎందుకు చెప్తున్నానంటే, జాంబ పురాణం పేరు విన్నాను కానీ **డక్కల జాంబపురాణం అని ఒకటుందని నాకు తెలీదు. నాకు తెలీనివి కొన్ని** లక్షలున్నాయనుకోండి. అది వేరే సంగతి. కానీ ఈ తరం యువకులలో ఇలాటి పుస్తకాలు చదివి నిశితంగా ఆలోచించేవారున్నారని హేలీ కల్యాణ్ **డక్కల జాంబపురాణం అన్న పుస్తకం సమీక్షిస్తూ రాసిన**వ్యాసం పుస్తకం.నెట్‌లో చదివేక తెలిసింది. కానీ అది సమీక్ష మాత్రమే. వ్యాసం చదివిన తరవాత పుస్తకం కూడా చదవగలరని ఆశిస్తున్నాను. నేను చదువుతానో చదవనో చెప్పలేను కానీ ఈ వ్యాసం నాకు మరోమారు ఊరట కలిగించిందని మాత్రం చెప్పగలను.

ooo

(మే 9, 2014)

20. వింబుల్డన్ సమయమహో

ఈ ఆటకోసం తెల్లవారుఝామున నాలుగుగంటలకి లేవవలసి వస్తోంది. అంచేత తొమ్మిదయేసరికి నిద్ర ముంచుకొస్తోంది. ఏమిటో, ఆ సూర్యదేవర అంతటి ప్రతిభావంతుడు కదా అన్నిదేశాలలోనూ ఒకేసారి ఎందుకు ఉదయించడో ...

వ్యాఖ్యాతల నస మామూలే. మెకెన్రో వ్యాఖ్యానాలు ఒంటిమీద ప్రమాదంలేని పురుగులు పాకినట్టు - ప్రాణాంతకం కాదు చిరాకు పుట్టిస్తుంది, అంతే.

అలా నస పెట్టడానికి కొన్నివేల డాలర్లిస్తారంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. వాళ్ళకి డబ్బు విలువ తెలీదో, మనకి తెలివి లేదు అనుకున్నారో మరి.

ఈసారి ఆటగాళ్ళు చొక్కాలు చాలావరకూ తెలుపే. అంచేత వారి టోపీలనిబట్టో తలకట్టు పీలికలను బట్టో గుర్తించవలసివస్తోంది. ఈ టపాకి ముందు ఇదే ఆటగురించి రాసిన కత ఇక్కడ చూడగలరు.

అన్నట్టు ఈ యేడు ఆటల్లో అధికంగా గడసానిలాటి మోడీలు మొగ్గలేయడంలాటివి ఎక్కువే. సాంగా మాట చెప్పుకోవాలి ఎగిరిగెంతేసి, పడుకుని, కూచుని, పొర్లుతూనూ ఆడే ఆటకి. ఈసారి మెంఫిల్ కూడా అలాటి కసరత్తులు ప్రదర్శించేడుట. నేను చూడలేదు, నిద్ర ముంచుకురావడంచేత :(

ఇంతకుమునుపు అడిగేను, ఇప్పటికీ ఆ సందేహాలు అలాగే ఉన్నాయి -

రెండు మేడలఎత్తు గాలిలోకి లేచిన బంతిని కిందకొచ్చేవరకూ ఆగకుండా, ఆటగాళ్ళు ఎందుకు ఎగిరి అందుకుని, సెట్టుకేసి కొడతారు? మరో క్షణం ఆగితే తమకి సుఖంగా అందేఎత్తుకి వస్తుంది కదా. మ్.

రెండో ప్రశ్న - సర్వ్ చేయడానికి మూడో నాలుగో బంతులు తీసుకుని, పరీక్షగా చూస్తారు, ఏమిటి వాళ్లు చూస్తున్నది? ఇదెందుకడుగుతున్నానంటే, ఆటకి పనికిరాని బంతులని ఏరిపారేస్తారు కదా.

అన్నట్టు మీకు తెలుసా - టెన్నిస్ బంతులు 1986వరకూ తెల్లగా ఉండేవిట. 1986లో పసుపుపచ్చటి బంతులు ప్రవేశపెట్టేరు. ఎందుకు చెప్తున్నానంటే, ఏమో, టీవీలో వాళ్ళు ప్రచారం చేస్తున్నారు కనక.

ఇదంతా రాస్తుంటే, నాకూ మరొకపెద్దమనిషికీ మధ్య జరిగిన చిన్న సంభాషణ గుర్తొచ్చింది.

ఇదుగో, మీ పఠనానందంకొరకు -

నేను అప్పట్లో చిన్న ఉద్యోగంలో ఉన్నానులెండి. ఆరోజు గబగబ ఇంటికి బయల్దేరేను.

ఆ పెద్దమనిషి, "ఏమిటా తొందర? ఎక్కడికి?"

"టెన్నిస్, టెన్నిస్ ...అయిపోతోంది. వేగిరం వెళ్ళి చూడాలి ..."

"ఓ. సరే. నీ అభిమానఆటగాడు గెలుచుగాక."

"అది జరగదు."

"ఎంచేత?"

"నేనెప్పుడూ ఓడిపోతున్నవారి పక్షమే కనక!"

OOO

(జూన్ 28, 2014)

21. నీటపా మేలు మేలు, కాకున్న ఓ చిరు లైకు

దాదాపు ఆరేళ్ళక్రితం ఒక టపా రాసేను. బ్లాగుప్రపంచంలో తొలి అడుగు వేసిన రోజుల్లో. నేనేదో నాకు తోచింది నాపాట్న నేను రాసుకుపోతుంటే, అలా కాదండీ అని బ్లాగు పండితులు కొన్ని సూచనలు చేసేరు. అందులో ఇతరబ్లాగరుల దృష్టినాకట్టుకొనుట ఎట్లు అన్నది ఒకటి. అంటే మరీ అంత చాదస్తంగా చెప్పలేదనుకోండి. అదే పరస్పర భుజములు చరుచుకొని పద్ధతి. అప్పటికింకా నాకు ఈ "ఆదానప్రదానాల" సంప్రదాయంలో లుకలుకలు అట్టే తెలీవు.

అందులో ఒక ముఖ్య వేడుక లింకులిచ్చుకోడం. లింకులివ్వడం మొదలెట్టాను శ్రద్ధగా.

ఇది మళ్ళీ ఎందుకు మొదలు పెట్టేనంటే, ఫేస్బుక్కులో నాఅనుభవాలు కూడా ఇలాగే ఉన్నాయి. "నీ స్నేహము కోరుచున్నాము" అని వార్త వచ్చినప్పుడల్లా సరేననేస్తాను. పాపం, వాళ్లకి నేనివ్వగల మడిమాన్యాలు లేవు, అమెరికాకి ఆహ్వానించే తాహతు లేదు. పాపం, సరేనంటే నాసొమ్మేం పోయిందని.

Hi, U thr లాటివి వస్తే, వద్దని చెప్తాను. ఇంకా y, cu లాటివి పలికితే నీసొమ్మేం పోయింది అనపిస్తాయి. వాటి తాడు అదే మిత్రసూత్రం తెంపేస్తాను. ఆటలాడుకుందాం రా అంటే కూడా అంతే. లేదు, లేదు, లేదు, కాదు, కాదు, నావల్ల కాదు … ఇంత పాడక్ఖర్లేదులెండు, టర్నాఫ్ కొట్టేస్తే చాలు. ఇంకా కావలిస్తే, రిపోర్ట్ స్పామ్. హుమ్. కొందరికి ఆటలాడడం కాలక్షేపం. వాటిని కాదనడం నా కాలక్షేపం!

పోతే, చెన్నాపట్నం చెరుకుముక్క, నీకో ముక్క, నాకో ముక్క లాగే - లైకులు కూడా అని గ్రహించడానికి నాకు కొంతకాలం పట్టింది. అది జరగదు నావిషయంలో. నేను స్పృశించే అంశాలు వారికి నచ్చినంతమాత్రాన, వారు చర్చించే అంశాలు నాకు

నచ్చుతాయని గానీ నచ్చితీరాలని రూలు గానీ లేదు. ఈవిషయంలో ఈఊరికి ఆఊరెంత దూరమో ఆఊరికి ఈవూరు అంతదూరం కాదు. మాగ్రూపుని మెచ్చుకోండి అని అడిగినవారందరూ నాగ్రూపుని వాళ్ళపేజీలో పెట్టుకోడం లేదు. ఇదీ అంతే.

అలాగే భళీ భళా అంటూ చెప్పుకునే మెచ్చుకోళ్ళూనూ. నాకు నచ్చినది మీపేజీలో ఒకటో, పావో ఉండొచ్చు. ఈసిద్ధాంతానికి విపర్యయమున్నూ సత్యమే.

ఇంతకీ ఇదంతా ముఖపుస్తకంలోనే పెట్టక ఇక్కడ ఎందుకు పెడుతున్నానంటే, ఇక్కడ చాలారోజులుగా ఏమీ రాయలేదని ఒకటీ, రెండోది, ఇంత రగడమధ్య కూడా అక్కడ కాస్తో కూస్తో కొత్త విషయాలు తెలుస్తున్నాయి. కోకొల్లలుగా పెట్టుకునే సొంత ముఖాలమధ్య చూసి ఆనందించగల మంచి కళ, కుప్పలుతిప్పలుగా కలబోసుకుంటున్న స్వసంగతులమధ్య తప్పనిసరిగా, ఆహో నాకు ఇంతవరకూ తెలీనే తెలీదు అనుకుని ఆనందించగల సంగతులూ కూడా కనిపిస్తున్నాయి. సాహిత్యంలో మంచి అభిలాష గలవారు కూడా అక్కడ రాస్తున్నారు అని చెప్పడానికే.

నాకు ముఖ్యంగా నచ్చినవిషయం, నాకు ఏమైనా సందేహాలు వస్తే, ఒకటి రెండు వాక్యాల్లోనో లేదా ఒక చిన్న పేరాలోనో వివరిస్తే, అక్కడ సమాధానాలు వచ్చినట్టు బ్లాగులో రాలేదు. అక్కడి పాఠకులు, సభికులు (అనొచ్చేమో. చాలామంది ఫ్రెండు అని వాడుతున్నారు కానీ నాకు అంతగా నచ్చలేదు.) వేరు. అంచేత నేను అక్కడ కూడా చూస్తున్నాను.

ఇక్కడ లింకుల్లాగే ఫేస్బుక్కులో లైకులు అని చెప్పేను పైన.

అప్పట్లో ఈవిషయమై నేను రాసినది మరోసారి చదువుకోండి -

రాజు వెడలె రవితేజములలరగ అంటూ నాకత వచ్చెను తెరమీదకి.

అవే బ్లాగ్వరులపేర్లు తిరిగొస్తున్నాయి మరలా మరలా బూమరాంగులవలె.

పాఠకులు చదవడం మొదలుపెట్టి నేనిచ్చిన లింకులుచ్చుకు అటుకేసి వెళ్లిపోతున్నారు. ఒక్కరూ తిరిగొచ్చిన జాడ లేదు. ఎవరూ నాటపా చివరంటా చదివిన పాపాన పోయినట్టులేదు.. ఆబ్లాగ్వరుల ప్రతిభ అలాటిది.

ఇది కాదు పని అని, నేను కూడా ఆ లింకులివ్వబడిన బ్లాగరుల ఇల్లు సొచ్చి, తలో వ్యాఖ్య, వ్యాఖ్యమీద వ్యాఖ్య పెట్టుకుంటూ పోయేను. నా అస్తిత్వాన్ని చెప్పకయే చెప్పుతూ (బ్లాగులోళ్ల గుట్టు నెం. 2.).

ఇలా రెండురోజులపాటు గొలుసులకి గొలుసులు ఎడతెగక తగిలిస్తూ ...

కీలు మీద కీలు కొట్టుకుంటూ పోడంతో వేలు వాచిపోయింది.

డాక్టరుదగ్గరికి వెళ్లేను.

"ముదిరిపోయింది, వేలు తీసేయాలి" అన్నాడు.

"అదెలా? నావేలే నాజీవన కీలు" అన్నాను.

"నీకు వేలు కావాలా? కీలు కావాలా?" అన్నాడు.

సరే వేలు తీసేమన్నాను, స్పీచి కీలుతో గడుపుకోవచ్చులే అని.

ఆయన చురకత్తికోసం పక్కగదిలోకి వెళ్లేడు.

"డాట్రారు బాబూ" అంటూ ఓ మీసాలాసామి ఓ కర్రిగేదెని తోలుకొచ్చాడు,

నేను ఎగిరి గెంతేసేను నిష్క్రమణద్వారంవేపు.

డాక్టరొచ్చేడు మేకలు నరుక్కునే కత్తితో.

చివ్వున కత్తి విసిరేడాయన.

కెవ్వుమని కేకేసి లేచి కూర్చున్నాన్నేను.

కల గనక సరిపోయింది. ... భయంకరం!

సత్వరమే అమలులోకి వచ్చిన నా ప్రతిజ్ఞ - ప్రసిద్ధ బ్లాగరులకి లింకులివ్వబడవు. దీనికి విపర్యయసిద్ధాంతమున్నూ సత్యమే. అంటే నేను లింకులివ్వకపోతే, వారు ప్రసిద్ధ బ్లాగరులయి వుండాలి.

తాజాకలం - బ్లాగుల్లో లింకుల్లాగే ఫేస్బుక్కులో నన్ను లైకు చెయ్యండి అంటూ వచ్చే అర్జీలున్నూ. వాటికి నాసమాధానం ఇదే - అంతమందిని లైకు చేసే ఓపిక లేదు కనక నేను లైకు చెయ్యకపోతే వారు ప్రముఖ యఫ్బీమహాత్ములుగానే గుర్తింపబడినట్టు లెఖ్ఖ.

2. మీ టపాకింద నావ్యాఖ్య లేకపోతే, మరొకరిటపా కింద ఉండవచ్చని గ్రహించవలెను. :p

000

(ఆగస్ట్ 6, 2014)

22. నవ్వెప్పుడొస్తుందో!

నవ్వుగురించి బోలెడు పుస్తకాలున్నాయి. నవ్వులు ఎన్ని రకములో, నవ్వెలా వస్తుందో, నవ్వు లక్షణాలేమిటో, వాటిని ఎలా గుర్తించాలో చాలామందే చెప్పేరు. అంచేత నేను మళ్ళీ హాసము ఎట్లు జనించును అంటూ మొదలెట్టను. ఆవిధముగా నవ్వును విశ్లేషించిన పెద్దలందరికీ ఓ నమస్కారం పెట్టి, ఈమధ్య "ఆసికాలంటే ఏంటి" అని వచ్చిన సందేహం ఎందుకు వచ్చిందో మనవి చేసుకోబోతున్నాను. ఒకరకంగా పై పాఠాలకి ఇది ఆధునీకరణం అనుకోవచ్చు. ఇలాటివి మీకు కూడా తటస్థపడ్డాయా అని ప్రశ్నించడమే నా ధ్యేయం.

"నడివీధిలో నువ్వు బోర్లా పడితే హాస్యం, నేను పడితే విషాదం" అన్నది సకల జనులకూ తెలిసిన సాధారణ నియమం.

"నువ్వు తెలివితక్కువగా మాటాడితే నాకు నవ్వొస్తుంది. ఆమాట అందరికీ చెప్పి నవ్వుతాను కూడా. అదే నామాట అయితే నువ్వు నవ్వినందుకు నాక్కోపం వస్తుంది" అన్నది కూడా అలాటిదే.

కొంతకాలంక్రితం కొన్ని కార్టూనులు చూసినప్పుడు నాకు వచ్చిన ఆలోచన. హాస్యయుత చిరు సంభాషణకీ కార్టూనికీ తేడా వీరు గ్రహించలేదా అని.

ఉదాహరణకి, "మాఅమ్మాయికి అక్షరాలు నేర్పండి చాలు, నవలలు రాసి బతుకుతుంది" అని ఓ తల్లి 5వ తరగతి పంతులుతో అంటుంది. దీనికి బొమ్మ అక్ఖర్లేదు. ఇక్కడ హాస్యసంబంధి ఏమిటో మాటల్లోనే తెలిస్తోంది.

చాలాకాలం క్రితం ఒక కార్టూను చూసేను. బాపుగారిదే అని నాకు గుర్తు. తల లేని ఒక మొండెం చేతిలో పళ్ళెం, ఆ పళ్ళెంలో తల ఉంటాయి. ఎదురుగా భార్య ఉంటుంది. "ఇంత గంజి పెట్టొద్దని చాకలికి చెప్పమని చెప్పేనా?" అని వాక్యం.

ఈమధ్య సాంఘికమాధ్యమాలలో స్నేహబృందాలు విస్తారంగా ప్రాచుర్యంలోకి వచ్చేక, కొన్నివేల మైళ్ళదూరంలో, కొన్ని తరాలతేడా ఉన్నా, "దగ్గర" అయిపోతున్నారు. దగ్గరివారయేక, మరి దానికి అనుగుణంగా దగ్గరివాళ్ళలాగే కబుర్లూ, కాకరకాయలూ, హాస్యాలూ, అపహాస్యాలూ, కదాచితుగా తిట్టుకోడాలూ... నీలితెరమీద సాగదు కనక కొట్టుకోడం ఒక్కటే తక్కువ. మరి స్నేహం అంటే అదే కదా. అరమరికలు లేకుండా, హాయిగా మనసులో మాట నోటా లేదా కీలా (కీలు కొట్టి) వెలువరించేయడం. అందులో అపార్థాలకీ, అనర్థాలకీ, అంతరార్థాలకీ, విపరీతార్థాలకీ తావు లేదు. ఉండరాదు. నిజానికి హాస్యం నిత్యజీవితంలో భాగం. చాలా పెద్ద భాగం. సాహిత్యంలోనూ అంతే. అందుకే విషాదాంతనాటకాల్లో హాస్యపాత్రలు. మనవీధి నాటకాల్లో కేతిగాడూ బంగారక్కా ప్రవేశం. ప్రజలు విషాదంలో పడి కొట్టుకుపోకుండా, కాస్త తెరిపి ఇవ్వడానికే ఇవి. అష్టావధానాల్లో అప్రస్తుత ప్రసంగం కేవలం సభికులనలరించడానికే కాక, అష్టావధానం నిర్వహిస్తున్నవారిప్రజ్ఞ చాటడానికి కూడాను. మహా ఘనత వహించిన పండితులు కూడా వెనకటిరోజుల్లో పత్రికలలో ఒకరినొకరు హేళన చేసుకోడం కూడా చాలానే చూసేం కదా. ఇంకా ముందు కవులు కూడా అంతే. అల్లసాని పెద్దన అమవసనిశి అని రాసినందుకు తెనాలి రామకృష్ణుడు ఏమి తిని కపితము చెపితివి అంటూ మరోపద్యంతో వెక్కిరించడం పాఠకులకు సువిదితం. అయినా, వీటన్నిటిమధ్యా ఆసికాలకి కూడా వేళా పాళా ఉన్నాదనే నేను నమ్ముతాను. ప్రతిసారీ నప్పదేమో అనే అనిపిస్తుంది. హాస్యం, వ్యంగ్యం, హేళన, చమత్కారం - ఇవన్నీ కూడా సమయానుకూలంగా ప్రయోగిస్తే రాణిస్తాయి. అలాటిదే మరో చతురభాషణ - వెంకయ్య ఇల్లెక్కడా అని.

చిన్న కథ చెప్తాను. మీరే ఏదో పనిమీద ఏ బెజవాడలోనో రోహిణీ కార్తెల్లో రైలు దిగేరు, ఎక్కడా కనుచూపు మేరలో రిక్షాల్లేవు. ఇల్లెక్కడో మీకు సరిగా తెలీదు. స్టేషనుకొచ్చి, మిమ్మల్ని ఏసీ కారులో ఇంటికి తీసుకెళ్తానన్న మేనల్లుడు పత్తా లేడు. ఉసూరుంటూ బయల్దేరేరు కాళ్లీడ్చుకుంటూ. వాళ్ళనీ వీళ్ళనీ అడుగుతూ రోజంతా తిరుగుతున్నారు. కళ్ళూ, కాళ్ళూ, కడుపూ కూడా మండుతున్నాయి.

కనిపించిన కుర్రాడిని మళ్ళీ అడిగేరు బాబూ, వెంకయ్య ఇల్లెక్కడా అని. ఆ కుర్రాడు మంచి హాస్యరసపోషకుడు. అంచేత ఎంతో హుషారుగా, వెంకయ్య పాపం పెద్దవాడు కదండి. ఇల్లు ఎక్కలేడు అని నవ్వేడు. మామూలుగా ఏసీ గదిలో చల్లని పానీయం చప్పరిస్తూ, ఈ కత వింటే నవ్వుకోడానికి బాగుంటుంది. ఇల్లు ఎక్కడా? అని అడిగితే, ఇల్లు ఎక్కడు అని సమాధానం. లేని అర్థం కల్పించి, ఇచ్చిన జవాబు. కానీ పైన చెప్పిన సందర్భంలో మాత్రం చిరాకేస్తుంది కదా. అదీ నేనంటున్నది.

ఒకరు ఏదో కష్టంలో ఉండి దానిలోంచి బయటపడే మార్గం అడిగితే, ఆ అడిగినాయన ఏ ఉద్దేశ్యంతో అడిగేరో చూసుకుని అక్కడ హాస్యం, వ్యంగ్యం, హేళన, చమత్కారం వంటి రసపోషణకి అవకాశం ఉందో లేదో గమనించవలసిన అవుసరం జవాబిచ్చేవారికి ఉందని నా దృఢ నమ్మకం.

అలా కాక ఒకరు గంభీరంగా ఒక ప్రత్యేకమైన విషయం చర్చిస్తుంటే మరొకరు తమ తెలివితేటలు ప్రదర్శస్తూ మరో చమత్కారభాషణ చొప్పించేస్తే ఆ చర్చ రెండు విధాల పరిణమించవచ్చు. గంభీరంగా మాటాడుతున్నాయనకి కోపం రావచ్చు తనచర్చని ఆ వ్యక్తి సీరియస్గా తీసుకోలేదని. రెండోది, అందరికీ హాస్యం ఇష్టం కనక ఆ హాస్యకథవెంట బడి మిగతా కబుర్లన్నీ ఆదారినే నడిపించేయవచ్చు మిగతా హాస్యరసపోషకులు. దాంతో అసలు విషయం పక్కదారి పడుతుంది. మొదటివిషయంమీద నిశ్చితమైన అభిప్రాయాలు గలవారు కూడా ఇదేదో హాస్యానికి రాసినట్టుందని తమకి తెలిసినవిషయాలు కూడా రాయడం మానేస్తారు. పృచ్ఛకుడికి కావలసిన సమాధానం సంగతి ఇంక ఇంతే సంగతులు.

నేనిలా రాసినందుకు నాకు హాస్యరసాస్వాదనగుణం తక్కువనీ, లేదా ఇంగ్లీషులో sense of humor లేదనీ అనుకోకండి. నవ్వొచ్చినప్పుడు, నవ్వదగ్గ సందర్భం అయినప్పుడు నవ్వుతాను. నేను కూడా హాస్యభాషణలు ఆడుతాను. నావి కూడా

ఒకొకప్పుడు అసందర్భం అయి నేనే నవ్వులపాలవడం కూడా జరుగుతుంది. కానీ సీరియస్ సందర్భం అయితే సీరియస్సే అని కూడా అనుకుంటాను.
వెనకోసారి నవ్వొచ్చినప్పుడు చెప్పు అని ఓ టపా రాసేను. దానికి ఇది రెండోభాగం అనుకోవచ్చు.
000

(ఆగస్ట్ 12, 2014)

23. పొట్టి కూడా పొడుగే

అని ఎందుకంటున్నానంటే ఎవరైనా ఎవరినైనా అడిగితే నువ్వెంత పొడుగు అని అడుగుతారు కానీ నువ్వెంత పొట్టి అని అడగరు. ఇంతవరకూ నన్నెవరూ అడగలేదు మరి. ఇది చూసేక, అడగడం మొదలుపెడితే నేనేం చెప్పలేను.

నిజానికి పొట్టివాణ్ణిగురించి మాటాడితే, పొట్టివాడు గట్టివాడు, పొట్టివాడికి పుట్టెడు బుద్ధులు అంటారు కదా. నాకు తెలిసి ఒక్క సామెత కూడా లేదు పొడుగువాళ్ళని మెచ్చుకునేవి. కాకపోతే మహాకవులు ఆజానుబాహుడు వంటివి ప్రచారంలోకి తెచ్చేరు కానీ అది అతిశయోక్తే కదా. పైగా అది sexist కూడా అని నా అభిప్రాయం. ఆడవాళ్ళని ఆజానుబాహువులనడం వినలేదు నేను. అసలు ఎవరికైనా చేతులు జానువులవరకూ ఉండగా చూసేరా, చోద్యం కాకపోతే. ఇంకా కేశసంపద మోకాళ్ళవరకూ ఉండడం చూసేం కానీ పొడుగుచేతులు ఎక్కడా చూడలేదు. అసలు అదైనా వానరులు నరులుగా మారుతున్న సంధిసమయంలో వాడుకలోకి వచ్చిందని నా అనుమానం.

అలాగే చక్కగా ఏపుగా నభోమండలంలోకి చొచ్చుకుపోగల మహా వృక్షాలకి సైతం తల్లివేరు కత్తిరించేసి, గుమ్మటంలా తయారు చేయడం ఒక కళ అయిపోలేదూ? (చాటుగా చెప్తాను - నాకు అదేమంత ఆనందదాయకం కాదు. సృష్టిలో పొడుగు మొక్కలని పొడుగ్గా ఎదగనివ్వడమే న్యాయమని నా నిశ్చితాభిప్రాయం. పొట్టి మొక్కలు ఎలాగా ఉన్నాయి పచ్చగడ్డిలాటివి).

సృష్టిలో అన్నిటికంటే పొడుగైన తాటిచెట్టు నీడ “తనకీ లేదు, ఒకరికీ లేదు”. నేను చిన్నప్పుడు కంఠతా పట్టిన పద్యం ఒకటి గుర్తొస్తోంది. కేవలం నా ధారణమీద ఆధారపడి

రాస్తున్నాను కనక తప్పులుండొచ్చు. అంచేత పాఠకులు కవిగారి అభిప్రాయాన్ని మాత్రమే గుర్తించమని కోరుతున్నాను.

ధర ఖల్వాటుండొకండు
సూర్యకరసంతృప్త ప్రధానాంగుడై
తాళవృక్షచ్ఛాయం జేర
తాటిపండు పడి తలపగిలి చచ్చె.

బట్టతలాయన బహుశా రోహిణి కార్తెల్లో కావచ్చు, ఏ విజయవాడలోనో కాబోలు మాడు మాడిపోతుంటే భరించలేక ఎదట కనిపించిన తాటిచెట్టువార చేరేడుట నీడకోసం. నెత్తిమీద నాలుగు వెంట్రుకలుంటే కాస్త నయం అని రచయిత అభిప్రాయం అనుకుంటాను. అంచేతే పని గట్టుకుని బట్టతల అని చెప్పేడు. నిజానికి కాకిగూడులాటి కబరీభరం ఉంటే తప్ప, తలవెంట్రుకలు ఏమాత్రం ఆదుకోగలవు కనక తెలుగునాడు ఎండలకీ, తాటిపండు ఉరవడికీ.

ఇంతకీ నేననేది - పొడుగుదనం ఉన్నంతమాత్రాన పనికొస్తుందని దాఖలాలేమీ లేవని. పాపం ఆ బట్టతలాయనకి తోచలేదేమో కానీ - అదేలెండి నీట మునిగిపోతున్నప్పుడు గడ్డిపోచనసైనా పట్టుకున్నట్టే - తాటిచెట్టు ఇవ్వగల కిటికీ చువ్వలాటి నీడే చాలనుకుని ఆ చెట్టువార చేరినట్టుంది.

అమెరికాలో పొడుగూ, ఎత్తూ, పెద్దా - అన్నిటిలోనూ "అమితం"కి "పే...ద్ద" పీట వేస్తారు. రాను రాను రాసికున్న విలువ వాసికి లేకుండా పోతోంది, హుమ్. సుదీర్ఘంగా నిట్టూరుస్తున్నాను. ఇది మాత్రం దీర్ఘమే.

నేను అమెరికాలో ఖచ్చితంగా చాలా పొట్టిదాన్నే కానీ మనదేశంలో ఉన్నప్పుడు కనీసం నాకాలంలో నాకలా అనిపించలేదు. నాకంటే పొట్టివారిని పోకెట్ ఎడిషన్ అని నేను వెక్కిరించిన సందర్భం కనీసం ఒకటి నాకు ఇప్పటికీ గుర్తుంది. (స్నేహితురాలా, క్షమించమని, కొంచెం ఆలస్యంగానైనా ఇప్పుడు మనఃస్ఫూర్తిగా వేడుకుంటున్నాను.).

నిజానికి నేను అట్టే పొడుగు లేకపోవచ్చు కానీ పొట్టి కాదనే నా నమ్మకం. కానీ అందుకు నేను విచారించడం లేదు కూడా.

భూమికి జానెడు కాకపోతే, బారెడు అనుకోండి అలా ఉన్నందువల్ల లాభములేమిటో ముందు చూదాం.

1. గుంపులో సాధారణంగా చాలామంది మనని ముందుకి తోస్తారు. అంచేత చూడబోయే వింతలకి మరెవరితలో మనకళ్ళముందు నీటిలో బంతిలా నటనలాడుతుందన్న బాధ లేదు.

2. ఒకవేళ అలా జరిగినా, అమ్మా, లేదా బాబూ, మీ కబరీభరము లేక క్రూకట్ మాత్రమే నాకు దుర్భరముగా నున్నది అని చెప్పుకుంటే, ఎంతటి ధీరులూ అత్యంత రూక్షణంగా వెనుదిరిగినా మనమొహం చూసి పక్కకి తప్పుకుంటారు. నీఖర్మ అనేవారు ఏ కోటికో ఒకరుండొచ్చు కానీ సర్వసాధారణం మాత్రం కాదు.

3. మందబొమ్మల్లో సరే సరి, మొదటి వరసలో మధ్యనో మధ్యనించి మూడోదో కుర్చీ మనదే.

కొన్ని హాస్యరస పోషక సన్నివేశాలు.

- అమెరికాలో కారు కొనడానికి వెళ్తే, అమ్మకాలరాయుడు ముందు నిలబడితే, సాధారణంగా నేను తల బాగా పైకెత్తి, అతని గడ్డం కిందభాగం చూస్తూ మాటాడవలసి వస్తుంది. కాస్త దూరంనించి చూసేవాళ్లకి నేను అతనిపాంటు జేబులో ఉన్నట్టు కనిపిస్తుందన్నమాట. అలాటి సమయాల్లో అతను కారులో తలకీ, కాళ్లకీ ఎంత విశాలంగా ఉందో అదేపనిగా వివరిస్తుంటే నవ్వు రాదూ? నాక్కావలసింది కాళ్ళకి బోలెడు జాగా కాదు, పెడలందితే చాలు, నేను కారులో ఉన్నానని రోడ్డుమీద జనాలు గమనించగలిగితే చాలు అని శతవిధాల వివరించడానికి ప్రయత్నిస్తాను.

నిన్న అమెరికనాటగాడు 43 ఏసెస్ కొట్టి ఓటమి సాధించినసందర్భంలో నాకు తోచింది పొడుగ్గా ఉండడం కూడా ఏమంత ఘనం కాదని. అమెరికన్ ఆటగాడు Isner ఆరడుగుల పదంగుళాలనీ, పొడుగ్గా ఉన్నవారికి ఏస్ కొట్టడం తేలిక అనీ నాకు నిన్ననే

తెలిసింది. అసలు టెనిస్‌లో ఏస్ కొట్టినప్పుడు ఒక్కడే ఆడుతున్నట్టుంటుంది. నాకు ఇప్పటికీ గుర్తే పీట్ సాంప్రస్ వరసగా నాలుగు ఏసెస్ కొట్టి గేం గెలిచేడు. అదేం గెలుపు? ఎదటివాడు ఆడడానికి వీల్లేకుండా ఆట ఆటెలా అవుతుంది. నన్నడిగితే, ఛాలెంజిలాగే ఏస్ కూడా ఇన్ని కంటే కొట్టకూడదని నియమం పెట్టాలి.

ఇంతకీ ఈ పొట్టిదనంమీద నా చివరి మాట చెప్పేసి ముగించేస్తాను. ఇక్కడ మనం భౌతికశాస్త్రంలోని ఒక ప్రాథమిక సూత్రం మననం చేసుకోవాలి. ఒక వస్తువు మీదనించి కిందకి పడుతున్నప్పుడు దూరం ఎక్కువయినకొద్దీ వేగం పుంజుకుంటున్నది సూత్రం. నేను తరుచూ కాకపోయినా పడడం జరుగుతుంది. ముఖ్యంగా మంచులో నడుస్తున్న రోజుల్లో కనీసం వారానికోమారు అదొక ఆనవాయితీ అయిపోయింది కానీ నాకెప్పుడూ కాళ్ళూ చేతులూ విరగలేదు. ఒక్కసారి అయింది కానీ చాలా చిన్న ప్రమాదం అంచేత పెద్ద ప్రమాదం లేదు. ఇక్కడ నావాదన ఏమిటంటే - నేను శరీరభాగాలు భూమికి దూరంగా ఉండవు కనక విరిగిపోడానికి కావలిసిన వేగం పుంజుకునేలోపున ఆగిపోతానని.

అలా కాక పొడుగువారయితే, వారి తలా, భుజాలూ అవన్నీ ఎక్కువ దూరం పయనించాలి కదా భూభాగాన్ని చేరుకునేముందు. ఆలోపున వేగం పుంజుకుని. ... అలాగే గరిమనాభి స్థానం తప్పడానికి కూడా పొడుగువారివిషయంలోనే అవకాశాలు ఎక్కువ. ఆమధ్య ఒక స్నేహితురాలు, “నాపాదాలు చిన్నవి” అంటే నాకు అదే అనిపించింది. గరిమనాభి స్థానం తప్పకుండా నడవడం ఆ అమ్మాయికి ఎంత కష్టమో అనిపించి, అయ్యో అని కూడా అనుకున్నాను. కాస్త ఒళ్ళు గలవాళ్లయితే మరీ అంత ప్రమాదం లేదు.

ఏతా వాతా నా ఘనాపాఠీ అభిప్రాయం ఏమిటంటే ఎలా చూసినా పొట్టివారే గట్టివారని!!

000

(సెప్టెంబరు 1, 2014)

24. మాయరోగాలు

అపార్థం చేసుకోకండి. మాయరోగం అంటే తిట్టులా ఉంటుందనే బహువచనం వాడేను. మామూలుగా నేను వైద్యదర్శనాలకి సంసిద్ధురాలిని కాను. వైద్యో నారాణో హరిః అన్న జనవాక్కు విన్నాను కానీ నాకు అర్థం తెలీదు. వైద్యుడు నారాయణుడివంటివాడే అనా? వాడే వీడు అనా? రెండోదే నిజం అనుకుని, నారాయణుడిదర్శనానికి వెడలిపోయినప్పుడే వైద్యునిదర్శనం కూడా అయిపోతుందన్న నిర్ణయానికొచ్చి తరుచూ వైద్యులని సంప్రదించవలెనన్న అభిప్రాయానికి భిన్నంగా. అంటే ఇట్నుంచి అటు కాక అట్నుంచి ఇటు అన్నమాట. కానీ కదాచితుగా (జనాంతికంగా ప్రాణాంతకం అన్నఅర్థంలో) అయినప్పుడు ఇలలోనే ఆ దర్శనం కానిచ్చుకుంటాను. అలాటి ప్రాణాంతకాలు సాధారణంగా నాకు పుష్కరానికోమారు తగులుతాయి. గోదావరి పుష్కరాలా కృష్ణాపుష్కరాలా అంటే సరిగా చెప్పలేను కానీ సాధారణ మానవఅనుభవాల్లో కాలో చెయ్యో విరగ్గొట్టుకోడంలాటివి జరిగినప్పుడు ఈ భూమ్మీదే వైద్య ఉరఫ్ నారాయణదర్శనం చేసుకోడం జరుగుతుంది. అంతే గానీ మందులవ్యాపారులు చెప్పినట్టు, ముందు ముందు ఏజబ్బో రాకపోతుందా అనుకుంటూ ఇప్పట్నించే ఆ మందులపరంపర భోజనం చే సి లేనిజబ్బులు అక్షరాలా “కొని” తెచ్చుకోను. (ఈ అలవాటు గలవారికి నా క్షమాపణలు). మీరూ వినే ఉంటారు ఆంగ్లజాతీయం - సకాలంలో ఒక కుట్టు తరవాత తొమ్మిది కుట్లపెట్టు అని. అలా అని ఒక కుట్టు కూడా అవసరంలేని చోట తొమ్మిది కుట్లు వేసుకోడం మాత్రం ఏం సబబు అని నా ప్రతివాదన.

ఇంతకీ పైన ఉటంకించిన రెండు పుష్కరాల వ్యవధికి కొంచెం అటుగా కాక ఇటుగానే వచ్చేసింది. సరే, దేవుడా, ఇంత చేసేవా అనుకుని, ఊళ్లోనే ఉన్న మా చిట్టితల్లిని

పిలిచి, బెరుకుబెరుకుగా "ఓ మాటు డాక్టరుని చూస్తే బావుంటుందేమో" అన్నాను.
అసలు మాఅమ్మాయితో సంభాషణే ఒక కత. ఉదాహరణకి ఇలా సాగుతాయి -
"నీస్నేహితులని లంచికి పిలుస్తానన్నావు కదా. సరే పిలువు."
"సరే"
పదిరోజులయేక, నేను "నీస్నేహితులని పిలువు అన్నాను కదా. ఆ ఆహ్వానానికి కాలదోషం పట్టిపోయింది."
"సరే."
దాంతో సంభాషణ కూడా అయిపోతుంది. అయిపోయింది.
ఆఖరికి నేనే అడిగేను, "ఎందుకు అని అడగవేం?"
"నీఇష్టం కదా. సరే, అడగమంటున్నావు, కనక ఎందుకు, చెప్పు."
అప్పుడు చెప్పేను, మీ ఊళ్ళో డాక్టరునోమారు చూస్తే బాగుంటుందేమోనని నాకు అనిపిస్తున్నట్టు అనుమానంగా ఉందేమో అని అనుకుంటున్నాను అని.
అప్పుడు మాపిల్లకి కొంచెం చురుకు పుట్టింది. "ఏమైందేమైయిందని" కొంచెం ఆత్రుత చూపుతూ అడిగింది.
"మోకాలు నొప్పెడుతోంది," అన్నాను.
"ఎప్పట్నించీ, నాకు ఇంతవరకూ ఎందుకు చెప్పలేదు, ఎందుకు ..."
... ఇలా ఓ అయిదు నిముషాలు సాగింది.
డాక్టరుని పిలుస్తానని చెప్పి, ఆ తరవాత మరోగంటకి ఓ చిన్న సంచి పుచ్చుకుని వచ్చేసింది.
ఏమిటంటే, మామూలుగా ఏ నొప్పికైనా సర్వరోగనివారిణిలాటి లేహ్యాలు తనదగ్గర ఉన్నవేవో తీసుకొచ్చేసింది, డాక్టరుని చూసేలోపున వాడమని.
ఆతరవాత వెళ్ళిపోయి,మరో రెండుగంటల తరవాత పిలిచి, "ఇదుగో, డాక్టరుని చూడ్డానికి, అదేలే నిన్ను డాక్టరు చూడడానికి నాలుగురోజులు పట్టేట్టుంది, అంచేత ఎమర్జన్సీ రూంకెళ్దాం. నేను మరో పావుగంటలో వస్తున్నాను నిన్ను తీసుకెళ్ళడానికి."

“అయ్యయ్యో ఇది ఎమర్జన్సీ కాదు, నాకాలింకా ఉండవలసిన స్థానంలోనే ఉంది. ఇంకా లేచి తిరుగుతున్నాను. కాలూ చెయ్యీ కూడా ఆడుతున్నాయి,” అని ఆపిల్లని నమ్మించడానికి నేను పడ్డ అవస్థలు పరమాత్ముడికెరుక, నాకు విజయం మాత్రం చేకూరలేదు.

మరో అరగంటలో అమ్మాయీ, అల్లుడూ కూడా వచ్చేసేరు నన్ను అత్యవసర వైద్యసన్నిధికి చేర్చడానికి.

ఇంతకీ ఈ కథ మొదలు పెట్టడానికి కారణం - నేను ఈదేశంలో నాలుగు దశాబ్దాలు ఉన్నా, ఎమర్జన్సీ గదిమీద నాకు సదభిప్రాయం ఏర్పడలేదు. పేరుకు అత్యవసరమైనా, అది ఎవరు ముందొచ్చేరు అని కాక ఎవరిపరిస్థితి అత్యంతవిచారకరం అన్నపద్ధతిమీద వైద్యులు రోగులని చూస్తారు. ఇందులో తప్పేమీ లేదు కానీ, నాపరిస్థితి, అదే నా మొహం చూస్తే అత్యవసరపరిస్థితిగా ఎవరూ పరిగణించరు ఖర్మ. అసలు నువ్వు అత్యవసరగదికి రావడమేమిటి అని అనుకుంటారని కూడా నాకు అనుమానం. అంచేత నేను …

తీరా వెళ్ళినతరవాత నాకు ఎంత ముచ్చటేసిందో చెప్పలేను. నిజానికి మళ్ళీ ఏదో ఒకవంక పెట్టుకుని అక్కడికే వెళ్ళాలని ఏదో ఓ మూల మనసులో పీకుతోంది కూడాను!

ఇంత మంచి వైద్యసేవలు ఎక్కడా చూడలేదు. నాకెంత ఆశ్చర్యం వేసిందో .

మామూలుగా ఎమర్జన్సీ అంటే ఎమర్జన్సీ అనే అర్థం అనుకున్నానిన్నాళ్లూను. అంటే హడావుడిగా ఆనొప్పో దెబ్బో తగ్గడానికి తాత్కాలికంగా చేసే సేవ అని. ఓ కట్టు కట్టో, రెండు కుట్లు వేసో, తెల్లారేక ఇంకా తగ్గకపోతే మీ సొంత డాక్టరుని పిలు అని చెప్పే డాక్టరువరులని.

ఇక్కడ అలా కాదు - ఎంతో చక్కగా గుండెబలం, కండబలం అన్నీ పరీక్షించేసి, రక్తపరీక్షలు చేసేసి, ముగ్గురో నలుగురో నర్సులూ, డాక్టర్లూ అరగంటకొకరు చొప్పున వచ్చేసి, నాకొచ్చిన రోగం ఏమిటో మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించేసుకుని … మూడు గంటలసేపు కాలవ్యవధిలో నాకు ఆస్పత్రులంటే ఉన్న అభిప్రాయం మార్చేసేరు.

డాక్టర్లు రక్తం పీల్చేస్తారని మీకూ తెలుసు కదా. అలా నాలుగు గొట్టాలు దింపుతున్న మనిషిని చూసి, "ఏంటో ఇంతకాలమైనా నారక్తం ఏరకమో నాకే తెలీదు. అంత రక్తం తీస్తున్నావు, చెప్పగలవా?" అని అడిగేను.

ప్రశ్న వేసినపాపానికి, తత్సంబంధమైన విషయంమీద ఓ చిన్న పాఠం విని తెలుసుకున్నాను. తాను చేస్తున్న రక్తపరీక్ష వేరు. రక్తం ఏ గ్రూపుకి చెందిందో తెలుసుకోవాలంటే డాక్టరు చెప్పాలి. నీకు రక్తం ఎక్కించవలసిన అవుసరమైతే తప్ప చెప్పరు. నువ్వడిగితే చెప్పొచ్చు. అలా అవుసరం అని చెప్పే డాక్టరులు చాలామంది ఉన్నారు. అలాగే మందులు కూడా ఏది కావాలంటే అది రాసిచ్చేసేవారున్నారు. ఆమందులు మీకు సరఫరా చేసే కంపెనీలున్నాయి. అదంతా ఓ పెద్ద మోసకారి ముఠా. ...

ఓరినాయనో అనుకున్నాను. అంటే ఇలాటివి ఉన్నాయని నాకు తెలీదని కాదు. ఇలా ఆస్పత్రులలో చెప్పేసేటంత నీతిమంతులు ఉన్నారే అని!

ఆస్పత్రిలో పరీక్షబల్లమీద పడుకుని, నర్సుకీ నర్సుకీ మధ్య, డాక్టరుకీ డాక్టరుకీ మధ్య (నారీ నారీ నడుమ మురారీ) మీనమేషాలు లెఖ్ఖపెట్టుకుంటూనే, మాఅమ్మాయి ఐఫోనువంక దిగులుగా చూడ్డం గమనించేను. వరండాలో ఉన్న మాఅల్లుడేం చేస్తున్నాడో అని ... పాపం. ఆగదిలోకి సిగ్నలులు రావడం లేదు. ఇంత అభివృద్ధి సాధించిన దేశంలోనూ, అంతరిక్షంలో అందిరికీ వాసం ఏర్పాటు చేయబూనిన దేశంలోనూ, ఊరు నడిమధ్యన ఐఫోనుకి సైగలంద లేదంటే నవ్వు రాదూ?

నాకు నవ్వొచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నావు?"

అది వివరించదగ్గసమయం కాదు కనక, కొంచెం విచారం వెలిబుచ్చి, ఇంతకీ... అంటూ ఏదో అడిగేను. వెంటనే ఇద్దరిమధ్య చాలా సంభాషణ సాగింది. ఏం మాటాడుకున్నామో చెప్పడం ఇక్కడ అనుచితం కానీ, ... ఇది రెండో కారణం నాకు ఆ అత్యవసరగది మళ్ళీ దర్శించుకోవాలనిపించడానికి!

చెప్పనో లేదో మా అల్లుడు తెల్లనివాడు, నీలికన్నులవాడు, చేయెత్తు విగ్రహమ్ము వాడు, వంకాయలు, బెండకాయలంచు బాసా యాసా నేర్వ మొదలిడినవాడు." అంచేత, ఆచారాలూ, అలవాట్లూ ఏమిటో అని నాతాపత్రయం.

మొత్తంమీద పరీక్షలన్నీ అయిపోయి, గుండెలు గుడిగంటల్లా కొట్టుకుంటున్నాయనీ, మోకాలులో నీరు చేరలేదనీ, స్నాయులు తమతమ స్థానాలో పకడ్బందీగా ఉన్నాయనీ, అంతగా నొప్పి అయితే ఏ మిరపకాయ లేహ్యంతోనో మర్దించమనీ సలహా చెప్పి పంపేసేరు.

అంతసేపు కదలకుండా కూర్చోడంచేత, మోకాలు పట్టేసింది. కుంటుకుంటూ బయటికి వస్తుంటే, "నువ్వు గజ్జెలగుర్రంలా ఉన్నావన్నాడు కదా డాక్టరు. కుంటుతావెందుకూ," అంది మాపిల్ల.

"తల్లీ, ఆ డాక్టరుకి తెలీదు కానీ కాళ్ళు కదల్చకపోతే, కీళ్ళు పట్టేసి, నొప్పులు వస్తాయి," అని మరో బ్రహ్మరహస్యం తెలియజేసేను.

దారిలో capsaicin అనబడు మిరపకాయ లేహ్యం కొనుక్కొచ్చేం.

ఆరాత్రి కాలికి ఆ లేహ్యం రాస్తున్నప్పుడు కానీ నాకు తెలీలేదు - కోపం వచ్చినప్పుడు అంటాం ఒంటినిండా కారం రాచుకున్నట్టుందని - అదే అనుభవం ఈ మందుతో కూడా. మర్నాడు వేణ్ణీళ్ళతో స్నానం చేస్తున్నప్పుడు నిజంగా కళ్ళనీళ్ళొచ్చేయి!!

ఈమాట చెప్తే, ఒకరిద్దరు స్నేహితులు చెప్పేరు - వాళ్ల చిన్నప్పుడు, ఎండుమిరపకాయలు కాలికి గుడ్డతో చుట్టి ఉంచితే, నొప్పి పోయేదని. నాకది ముందే తెలిస్తే, పది డాలర్లు ఆదా అయేది కదా అని ఉసూరుమనుకున్నాను.

ఓ నొప్పి పోపడానికి మరో నొప్పి తెచ్చుకుంటాం.

ఎప్పుడో చిన్నప్పుడు ఓ చిన్నకథ చదివేను. ఓ పెద్దమనిషి జోళ్ళదుకాణానికి వెళ్ళి, ఒక సైజు చిన్నది తీసుకున్నాడుట. ఆ వ్యాపారి, "అయ్యా, అది తమకి చిన్నది. నడుస్తుంటే కాలు నొస్తాది," అన్నాడు.

"ఫరవాలేదు నాయనా, ఇంట్లో బాధలన్నీ మరిచిపోతాను, ఈకాలు నొప్పితో."

అన్నట్టు మాయరోగాలు అని ఎందుకన్నానో చెప్పలేదు కదూ. నాకేమో నొప్పిలాగే ఉంది, డాక్టరేమో నీకేమీ లేదంటాడు. మరి మాయ కాదూ? అమ్మో, అదీ కథ.

000

(అక్టోబరు 31, 2014)

25. నాకల నాకు నిజం

పక్కమీంచి లేచీ లేవకముందే రాత్రి వచ్చిన కల గుర్తొచ్చి హడలిపోయేను. పడగ్గదిలో చుట్టూ చూసి, గబగబ హాల్లోకీ వంటింట్లోకీ కూడా వెళ్ళి చూసుకున్నాను. ఎక్కడి సామానక్కడే ఉంది. నా లాపుటాపూ, టీవీ, కొత్తగా కాపురానికొచ్చినప్పుడు తెచ్చుకున్న బూందీ చట్రాలు - నా అపూర్వ వస్తుసంచయం అంతా ఎక్కడిదక్కడే ఉంది. హమ్మయ్య. ఏం పోలేదన్నమాట. రాత్రి దొంగలు పడి నాసమస్త స్థిర చరాస్తులూ దోచుకుపోలేదన్నమాట.

మొహం కడుక్కుని, కాఫీ కప్పు పుచ్చుకుని తీరిగ్గా రాత్రి వచ్చిన కల మళ్ళీ మరోమారు మననం చేసుకున్నాను.

పొరిగింటి పిల్లలు ఇద్దరు అమెరికనులే గాజుబొమ్మల్లా ఉన్నారు. ఎదురుగా నిలబడి తమని తాము పరిచయం చేసుకున్నారు నన్ను పేరు పెట్టి పిలిచి. వీళ్ళకి నాపేరెలా తెలిసిందా అని ఆశ్చర్యపోతున్నాను.

"మేం వాషింగ్టన్నించి వచ్చేం" అంది అమ్మాయి.

"ఆహా" అన్నాను.

"మాఅమ్మకి చెప్పకేం మేం నీకు చెప్పేం అని," అంది మళ్ళీ ఆ అమ్మాయే. ఎనిమిదో తొమ్మిదో ఉంటుంది వయసు.

పక్కన అబ్బాయికి మరో రెండేళ్ళుండొచ్చు. వాడు మాటాడలేదు కానీ అవునన్నట్టు తలూపేడు.

"అలాగే, నేనెవరికీ చెప్పను" అని హామీ ఇచ్చేను ఇద్దరికీ. నాకలలో నిజానికి ఇది తొలిపాదం. అంటే వాస్తవంలో కూడా నాకు నావయసువారితో కంటే నాకంటె చిన్నవారితోనే స్నేహాలెక్కువ. పిల్లలెందుకో "ఈవిడతో ప్రమాదం లేద"నుకుంటారేమో.

కలలో రెండోపాదం - ఇంటిముందు పెద్ద ట్రక్కుంది. మాయింట్లో సామానంతా దోచేసుకుంటున్నారు. “అయ్యయ్యో, నాసామాను దోచేస్తున్నారు. ఆపండి, ఆపండి,” అంటున్నాను. చుట్టూ జనం పోగయేరు కానీ ఎవరూ ఆ దొంగలని ఆపే ప్రయత్నం చెయ్యడం లేదు. గబగబ ఇంట్లోకొచ్చేను. రెండు గదులూ బావురుమంటూ, ఇల్లు అద్దెకివ్వబడును అని బోర్డు కట్టినట్టు ఉంది. (జనాంతికముగా - టీవీలో హత్యలూ, దొంగతనాలు కార్యక్రమాలు చూడడం తగ్గించాలని హెచ్చరిక కావచ్చు.)

ఇందులో వాస్తవం - నిజానికి ఇది కొంచెం విపులంగా చెప్పాలి. గత రెండేళ్ళూ జలసంపద చూసి ఆనందిస్తూ వచ్చేను. మీరు నాబ్లాగులో ఏరూ, నీరూ, తదితర జలచరాలకి సంబంధించిన బొమ్మలు చాలానే చూసేరు కదా. ఇప్పుడు, అంటే గత 4,5 నెలలుగా మాయింటి పరిసరాల్లో తిరుగుతూ ఇక్కడ తరు సంపద చూసి ముచ్చట పడిపోతున్నాను. ముఖ్యంగా వేళ్లు. దాదాపు ప్రతి చెట్టుమొదలులోనూ బయటికి పొడుచుకొచ్చి కనువిందు చేస్తున్నంతగా వేళ్ళు నేనెక్కడా చూడలేదు. అవి చూస్తుంటే నాకు వాటిమీద కథ రాయాలని కోరిక పుట్టింది. ఆ కథ తాలూకు ఆలోచనలు అనేకం నన్ను చాలా అయోమయస్థితిలో పడేసేయి. అవన్నమాట మాయింట్లో సామాను. నిన్న కథ పూర్తయింది. ఇల్లులాటి బుర్ర ఖాళీ అయిపోయింది. దాంతో హాయిగా నిద్ర పోయేను తొమ్మిదిగంటలసేపూ.

మరి దొంగలెవరంటే మీరే, పాఠకులు. దొంగలు కాదులెండి దొరలే. మాయిల్లే మీయిల్లనుకోండి అంటారు చూడండి, అలాగే నా ఆలోచనలు మీవి. మీసామాను మీకు అప్పగించేసేనన్నమాట.

హీ, హీ. ఈ సామ్యం బాగులేదనుకుంటా. అయినా కథకి కాళ్ళేమిటి, ముంతకి చెవులేమిటి. ఒకటి మాత్రం నిజం - చాలారోజులతరవాత ఈరోజు మనశ్శాంతి!

కథ ఇంకొంచెంసేపట్లో కథ మీకిచ్చేస్తాను. చదువుకున్నా, పారేసినా మీయిష్టం.

ooo

(నవంబరు 15, 2014)

26. మ్, ఏ రచయితలా రాస్తే బాగుంటుంది చెప్మా?!

రెండు రోజులక్రితం "ఏరచయితలా రాస్తే మీకథకి సార్థకత అనుకుంటారు? ఆ రచయితలో మిమ్మల్ని ప్రత్యేకించి ఆకట్టుకున్న అంశం ఏమటి?" అని వర్ధమాన రచయితలని ప్రశ్నించేను. వారి జవాబులు సూక్ష్మంగా - తాము ఎవరినీ అనుకరించమనీ, తాము తమలాగే రాస్తామని. అది నాకు ఆనందం కలిగించింది. అవును మరి. ఏ ఒక్కరూ మరొకరిలా రాయరు, రాయలేరు. రాస్తే రాణించదు కూడాను. పట్టుచీరె కట్టి గిల్టు నగలు పెట్టుకున్నట్టు ఎబ్బెట్టుగానూ, హాస్యాస్పదంగానూ ఉంటుంది.

అయితే ఈ "ఎవరిలా రాయడం?" అన్న ప్రశ్న ఎందుకు వచ్చింది అన్న ప్రశ్నకి ధర్మసూక్ష్మం వివరిస్తాను.

మిమ్మల్ని అడిగినతరవాత నామాట కూడా చెప్పాలి కదా. బహుశా 14, 15 ఏళ్ళప్పుడనుకుంటా రావిశాస్త్రిగారి కథలు చదివేను. అప్పుడే రావిశాస్త్రిగారిలా రాయగలగితే బాగుండునని అనిపించింది. ఇప్పటికీ అనిపిస్తుంది. అంటే ఎత్తిపోతలు కాదు, "దస్తూరీమాత్రమే స్వహస్తం"గా (ఆరుద్రగారివాక్యం) మామిడిచెట్టుని వేపచెట్టుగానూ, ముత్యాలమ్మని చెత్యాలమ్మగానూ మార్చి రాయడం కూడా కాదు నేను చెప్తున్నది.

నాకు రావిశాస్త్రిగారిలా రాయాలనుంది అంటే నాకు ఆయన రాసిన కథ చదువుతున్నప్పుడు కలిగిన స్పందనమాట అన్నమాట. ఒకొక పదం, వాక్యం నామనసులో సూటిగా నాటి శాశ్వతంగా నిలిచిపోయేయి. సందేశం కంటే కూడా పదసౌలభ్యం నన్ను ఎక్కువగా ఆకట్టుకుంటుంది. అంచేత రావిశాస్త్రిగారిలా,

మధురాంతకం రాజారాంగారిలా రాయాలనుంది అంటే వారికథలు చదువుతున్నప్పుడు మనలో ఎలాటి స్పందన కలిగిందో అలాటి స్పందన కలిగించగల కథలు రాయాలని ఉంటుంది అని. ముఖ్యంగా రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు అల్పాక్షరాలతో అనల్పార్థాలు ధ్వనింపచేయడంలో అద్వితీయులు. "పువ్వులు" కథలో "ఈ తుపాకీ పేలదు", "పాపి" కథలో "మరి ఆడి పాపాలన్నీ ఏటయిపోయినట్టు" లాటి వాక్యాలు అక్షరలక్షలు చేస్తాయి. నిజానికి క్లిష్టమైన సంస్కృతభూయిష్టమైన సమాసాలు వాడకుండానే అంతటి శక్తిమంతమైన వాక్యాలు రాయగలగడం ఆయన ఎక్కడ నేర్చేరో అనిపిస్తుంది నాకు.

అంచేత నాకు "ఫలానావారిలా రాయలనుంది" అంటే అది వారిరచనలకి అది నివాళి. "పక్కింటి బామ్మగారిలా గారెలొండు" అంటే ఆవిడలా గుండు కొట్టించుకుని, సైను పంచె ముసుగేసుకుని అని కానట్టే.

ప్రతి ఒక్కరూ, ఎవరికి వారు తమలాగే రాస్తారు. వారి అనుభవాలు, పెంపకం, చుట్టూ ఉన్న సమాజం, ఓనమాలనాటినుండి చదువు పూర్తయేవరకూ దారిపొడుగునా కలిసిన స్నేహితులూ, ఇంకా జాలమిత్రులూ – ఇంతమంది ప్రభావం ఉంటుంది ప్రతి ఒక్కరి ఆలోచనాధర్మంలోనూ. వాటన్నిటిమీదా ఆధారపడి తయారయిన పదకోశం వారికి ప్రత్యేకంగా ఉంటుంది. వారు చదివిన పుస్తకాలూ, అనుదినమూ వింటున్న మాటలూ, వాక్యనిర్మాణం కూడి ఆ రచయిత రచనకి పునాది అవుతుంది. అదే చిత్తశుద్ధితో రాసిన రచన అవుతుంది.

నాప్రశ్నకి సమాధానాలు రాసిన లక్ష్మీదేవి, స్ఫురిత మైలవరపు, ఇస్మయిల్ సుహేల్ పెనుకొండ, జోగారావు వెంకట సంభార, జ్యోతి వలబోజు, మహేశ్వరి అందే, వెంకట్ టేకుమళ్ళ, విజయ కర్రా, శ్రీనివాస్ మేరు సూరిసెట్టి, లలిత గూడ, సుభద్ర శీలా. మీరు మీ అబిప్రాయాలు రాసినందుకు ఇవే నా కృతజ్ఞతలు.

(మే 8, 2015)

27. అర్థాంతరీకరణము

భాషాంతరీకరణము అనగా ఒక భాషలో వాక్యాలు మరొక భాషలోకి మార్చడం. అర్థాంతరన్యాసములో ఒక విషయానికి మరొక విషయాన్ని అదే భాషలో జత చేయుట.
ఇటీవల కొంతకాలంగా అంతర్జాలంలో కథలూ, కబుర్లూ చూస్తుంటే ఒకభాషలో ఒకమాటకి వేరొక భాషలో వేరొక అర్థం ఇచ్చుట ఇనుమిక్కిలిగా కనిపిస్తోంది. నేను కొంచెం చదువుకున్నదానినే అయినా ప్రస్తుతం నాకు తెలుగూ ఇంగ్లీషూ కూడా రాదేమో అన్నంత గందరగోళం అయిపోతోంది. ఆ పైన తెలుగులిపిలో రాసిన ఇంగ్లీషయితే ఇహ చెప్పక్కర్లేదు నా అవస్థ. అంచేత ఈ అర్థాంతరీరణము వివరించ పూనుకున్నాను, నాలాటివారు మరి కొంతమంది ఉండకపోతారా అన్న ధీమాతో.
అతి సూటిగా నున్నది మరియు నాకు తప్ప అందరికీ తెలిసినదీ, అత్యంతము ప్రచారములో ఉన్నదీ హేండిచ్చుట. హేండిచ్చేరు అంటే సహాయపూర్వకంగా చెయ్యి అందించేడు అనే అనుకున్నాను చాలాకాలం. గత ఏడాది దాని నిజఅర్థం తెలుసుకుని ధన్యత చెందేను. ప్రస్తుతం -
మాయింటికి అరమైలు దూరంలో ఒక దేశీదుకాణం ఉంది. అక్కడ మన పప్పులు, కారాలూ, నామమాత్రంగా నేరికాయ, కాకరకాయలూ ఉన్నాయి. ఆహ్, నడిచివెళ్ళి తెచ్చుకునేదూరంలో మన కిరాణాకొట్టు అనుకుని మురిసిపోయేను.
నెలరోజులక్రితం యాజమాన్యం చేతులు మారింది. కొత్త కొట్టువాడు – కొత్త కొట్టు కాదు, కొట్టు యజమాని - నన్ను చూడగానే, పరమానందపడిపోయి, పొంగిపోతున్న ఉత్సాహంతో ఆహ్వానించి, ఇదేమిటి, అదేమిటి అని నన్ను అడగడం మొదలు పెట్టేడు! కంగారు పడకండి. దేశీజనాలకి ఇది సర్వసాధారణం. ఇలాటి సన్నివేశాలు నాకు

చాలానే తగిలేయి. ఏళ్లతరబడి ఈ దేశంలో ఉన్న దేశీ వ్యాపారస్థులు కూడా భాషా, ఊసులదగ్గరికి వచ్చేసరికి నిన్నో మొన్నో దిగినట్టు కనిపిస్తారు. అంచేత అతనికి ఇంగ్లీషు పదం తెలీదు కాబోలు అనుకుని అదేమిటో చెప్పేను. మూడోపదం దగ్గరికి వచ్చేసరికి నాకు తెలివొచ్చింది. ఆ ప్రశ్నలన్నీ ఆ సామగ్రి అంతా నాకు అంటగట్టడానికే అని తెలుసుకున్నదానిసై, "నాకు నీసామగ్రి అక్కర్లేదు" అని చేతిలో ఉన్న సంచులు అక్కడే పారేసి వెనక్కి తిరిగేను. "లేదు, లేదు, తీసుకో" అంటూ వెనక్కి తగ్గేడు. వారంరోజులతరవాత మళ్ళీ వెళ్ళేను. ఈసారి అతను నావెంట బడలేదు కానీ, ఎంత అయిందో చెప్పమంటే, "నాలుగు డాలర్లియ్యి" అన్నాడు.

"అలా కాదు, తూకం వేసి చెప్పు," అన్నాను.

అన్నిటికీ లెక్కలు గట్టి, "4.85" అన్నాడు. రవంత విచారం కూడా వెలిబుచ్చేడు నేను మొదట చెప్పినధర అంగీకరించినందుకు. నేను మాటాడకుండా, ఐదు డాలర్ల నోటిచ్చేను.

"అయితే నువ్వు ఒంటరిగా ఉంటున్నావా?"

ఈ ప్రశ్న కూడా నేను ఇదివరలో విన్నదే. మామూలుగా కొంచెమే కొంటున్నాననీ, చాలా కాలంగా కనిపించలేదనీ ... ఏదో అంటారు. నాకు ఎక్కువ ఖర్చు కాదు, నేనొక్కదాన్నే కదా ఎంత తింటాను ఇలా జవాబులు చెప్పుకొస్తాను. కానీ పైప్రశ్నవరకూ ఎవరూ రాలేదు. "సొంతవిషయాలు అడక్కు," అని అతనికో ఓ చిన్నపాఠం చెప్పేను కొన్నసామాను సంచీలో పెట్టుకుంటూ. ని బయట పడ్డాను.

"అది కాదు. నేను దగ్గర్లో ఇల్లు అద్దెకి తీసుకుందాం అనుకుంటున్నాను. చిన్న వాటా కాదు, ఇల్లే. షేర్ చెయ్యడానికి," అన్నాడు.

నేను తలడ్డంగా విసురుగా ఊపి బయట పడ్డాను. గుమ్మందగ్గర అక్కడే పని చేసే మరొకడు కనిపిస్తే, "అతనికి మాటాడ్డం రాదు," అని చెప్పి ఇంటికొచ్చేసేను. నాకు చిరాగ్గా ఉన్నా, ఈ దుకాణాల్లో దేశీజనాలు ఇంగ్లీషు మాటాడినప్పుడు అలాగే ఉంటుందని కూడా నాకు తెలుసు. సున్నితంగా మాటాడ్డానికి భాష బాగా తెలిసుండాలి.

నిజానికి ఇదే మనదేశంలో అయితే, నేను కోపగించుకుంటే, "పోనిద్దూ పాపం, వాడికి మాటతీరు తెలీదు," అనేస్తారు సద్దుబాటుతనం సూచిస్తూ. నేనూ అలాగే అనుకుని ఊరుకున్నాను.

ఆ తరవాత అమ్మదినంనాడు మాఅమ్మాయి వచ్చి, "ఎక్కడికెళ్దాం?" అంటే "నీయిష్టం" అన్నాను. ఏదో హోటలుకి వెళ్ళి, లంచి తిన్నతరవాత, "కూరలూ అవీ ఏమైనా కావాలంటే చెప్పు, వెళ్దాం," అంది.

"సరే పద."

మరొ దేశవాళీ దుకాణానికి వెళ్ళేం. ధారిలో చెప్పేను, "నాకు ఇంటిదగ్గర దుకాణం సౌకర్యంగానే ఉంది. కానీ ఆ షాపు యజమానిపద్ధతి నచ్చలేదు," అని.

"వ్హాట్," అంది మాఅమ్మాయి. "నేనిప్పుడు వెంటనే ఆ షాపుకి వెళ్ళాలి. వాడితో మాటాడాలి," అని కూడా అంది.

మామూలుగా మాటాడని మా అల్లుడు, "that is weird." అన్నాడు. ఆ తరవాత మూడు క్షణాల్లోనూ మూడు సార్లు అదే వాక్యం ఉచ్చరించేడు - దట్, ఈజ్, వియర్డ్ – ఒకొక పదానికి ఒకొకసారి స్వరం మారుస్తూ.

"నేనక్కడికి వెళ్ళాలి," అంది మా అమ్మాయి మరోసారి ముక్తాయింపుగా.

అదుగో అప్పుడే, నాకు రావిశాస్త్రిగారి జరీఅంచు తెల్లచీరె కథా, ఆకథలో వామనరావు గుర్తుకొచ్చేరు. అంతవరకూ నావయసూ, మొహంలో ముడతలూ చూసి ఎవరు గానీ నాతో సరసాలాడగలరని నాకు తోచలేదు. అలాటి ఆలోచన షాపువాడికి వచ్చిందో లేదో కానీ అమ్మాయికీ అల్లుడుగారికీ విశేషార్థంగా ధ్వనించింది!

మాఅమ్మాయికి నాక్షేమంగురించిన అపేక్ష ఉన్నందుకు నేను పొంగిపోయేను ఆంతర్యంలోనే. అప్పుడే మరో ఉదంతం గుర్తుకొచ్చింది.

సుమారు 20 ఏళ్ళక్రితం –

ఓ చిన్న కాలేజీలో ఓ ప్రొఫెసరుకి సహాయకారిగా పని చేస్తున్నాను. ఒకసారి, ఆయన ఆఫీసులో లేని సమయంలో ఒక స్టూడెంటుబాబు వచ్చి, ఏదో అడిగేడు. నేను తగు

సమాధానం ఇచ్చేను. ఇచ్చేననే అనుకున్నాను. కానీ అతడికి కోపం వచ్చింది. "నేను తలుచుకుంటే ఏం చేస్తానో నీకు తెలీదు," అన్నాడు.

నేను సీదాగా తలూపి సరే అనిపించేట్టు.

ఇక్కడ నాగురించి మరోమాట చెప్పాలి. ఎవరైనా నన్ను ఏదైనా అంటే, నేను ఠపీమని మాటకి మాట సమాధానం ఇచ్చేసి క్షణాలమీద అప్పు తీర్చేసుకోలేను. ఆమాట నాతలకెక్కేసరికి కొంత సమయం పడుతుంది. దీన్ని కూడా అర్థాంతరీకరణం చెయ్యొచ్చు. 1. మందబుద్ధి. 2. నిదానస్తురాలు. ఆలోచించి గాని జవాబు చెప్పదు.

ఇంతకీ అసలు విషయం –

మా ప్రొఫెసరుకు చెప్తే, ఆయన, "నేను అతనికోసం చూస్తున్నానని చెప్పు."

మా అమ్మాయికి చెప్తే, అమ్మాయి, "నేను నల్లపటకా (black belt) అని చెప్పు."

నేను నవ్వేను, "సరే, ఓ బోర్డు తయారు చేయిస్తాను – నాబాసు ఆరున్నర అడుగులు. మాపిల్ల నల్ల పటకా. నాజోలికి రాకండి – అని" అన్నాను.

పై రెండు వాక్యాలకీ విశేషార్థం – సున్నంలోకి ఎముకలు లేకుండా చితుకకొట్టబడుదువు అనే.

ఇంకా వెనక్కి వెళ్తే, 50 ఏళ్ళక్రితం –

అప్పుడే కొత్తగా ఉద్యోగంలో చేరేను. ఖర్మవశాత్తు ఒకవిధంగా నాశక్తికి మించిన అధికారం చేతిలోకి వచ్చింది. సరిగా జ్ఞాపకం లేదు కానీ పాతికమంది వరకూ ఉన్నారు నాఅదుపాజ్ఞలలో పని చేయవలసినవారు.

ఒక గుమాస్తా ఏదో జబ్బుతో తో ఆస్పత్రిలో పడ్డాడు. వారం రోజులుపోయేక ప్రమాదస్థితి అని విన్నాను. మర్నాడు మరొక గుమాస్తా వచ్చి, అతను మరణించేడని చెప్పేడు. ఆనవాయితీ ప్రకారం నేను శలవు ప్రకటించేను. అదీ సందర్భం. వారంరోజులతరవాత అతను (చనిపోయేడని నేను అనుకున్నవాడు) ఆఫీసుకి వచ్చేడు. నేను శలవు ప్రకటించినందుకు కోపగించుకున్నాడు. న్యాయమే. నేను శక్తివంచన లేకుండా క్షమాపణలు వేడుకున్నాను. అంతటితో అతను ఊరుకుంటే కథే లేదు.

ఆ సాయంత్రం మాయింటికి వచ్చేడు. మళ్ళీ అదేమాట చెప్పేడు.మరొకరిమాట వినడం నాతప్పే అని మళ్ళీ గట్టిగా ఒప్పుకున్నాను. అయినా అతను శాంతించలేదు. ఆఖరికి, "నాసంగతి మీకు తెలీదు," అన్నాడు. అదన్న మాట అర్థాంతరీకరణమునకు అర్హమయిన వాక్యం.

పైన చెప్పేను నేను మాటకి మాట వెంటనే జవాబు చెప్పలేనని. కానీ ఆ క్షణంలో మాత్రం వాగ్దేవి నన్ను కటాక్షించిందో, లేక గ్రహాలన్నీ తమ తమ స్థానాల్లో ఉన్నాయో కానీ నాకు జవాబు తోచింది.

"ఆమాత్రం గుండెబలం లేకుండానే ఇంతదూరం ఈ ఉద్యోగానికి వచ్చేనా?" అన్నాను. అతను మొహం ముడుచుకుని వెళ్ళిపోయేడు.

మాఅమ్మ పక్కగదిలో ఉంది. నాలుగు రోజులు నాదగ్గర ఉండడానికి వచ్చింది. నామాటలు విందో లేదో వింటే ఏమనుకుందో నాకు తెలీదు. అప్పట్లో. ఆ తరవాత ఆఫీసులో కూడా మరే ప్రమాదాలు జరగలేదు. ఇద్దరం మామూలుగా మాపనులు నిర్వర్తించుకుంటూ పోయేం.

కొంతకాలం అయేక, శలవులకి నేను విశాఖపట్నం వెళ్ళేను. నేను పక్కగదిలో ఉన్నాను. మాఅమ్మ నడవలో ఎవరితోనో మాటాడుతోంది. పై వృత్తాంతం, "నేను దాన్ని గురించి భయపడక్ఖర్లేదు. బాగా చెప్పింది వాడికి," అంది.

అప్పుడు తెలిసింది నాకు నేను గొప్పజవాబు చెప్పేనని.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే – భాష ఎవరబ్బ సొమ్మూ కాదు. అందరూ వాడుకోవచ్చు. వారు వాడుకునేవిధమూ ఎదటివారికి అర్థమయేవిధమూ ఒకటే కావడం సాధారణంగా జరగదు.

ఇందలి నీతి - ఈసారి ఎవరైనా మీదగ్గర "ఆడవారిమాటలకు అర్థాలే వేరులే" అని పాడితే, "ఆ మనిషికోసం నేను చూస్తున్నాను" అని చెప్పండి. అన్నట్టు మా అమ్మాయి black belt కూడాను నిజంగానే!

(మే 13, 2015)

28. కథకుడు కథలో ఒక పాత్ర!

ఇది యమర్జెంటుగా రాయాలనిపించిన కారణం చెప్తాను – మామూలుగా బ్లాగులో ఎక్కువ భాగం తమ జీవితాల్లో సన్నివేశాలూ, విహారయాత్రలూ, హాస్యాలూ కొండొకచో మనస్తాపాలూ లేదా మనస్పర్థలూ రాసుకుంటారు. నేను కూడా అలాటివి రాసిన సందర్భాలున్నాయి. మళ్ళీ చెప్తున్నా - అవి హాస్యానికి మాత్రమే కానీ నా సొంతబాధలు చెప్పుకోడానికి కాదు. నాకు వేరే జీవితం ఉంది. అది నాబ్లాగులో కనిపించేది కాదు. పాఠకులలో సగానికి సగం నాబ్లాగుకి సాహిత్యస్థాయి ఉన్నట్టు గుర్తించేరు. స్పందనలలో కూడా ఆ కోణం కనిపిస్తుంది. మీరు కాదంటే నాకేమీ అభ్యంతరం లేదు.
ఇంతకీ యమర్జెన్సీగురించి కదూ మొదలు పెట్టేను. అక్కడికే వస్తున్నా. నాల్రోజులక్రితం నా లేఖాసంపదలో కనుగొన్న "ఉత్తరాలలో సంగతులు చదువుతుంటే నాకు కలిగిన ఆలోచనలతో కథలు రాయాలని" అనిపించింది. ఆ విషయం ప్రత్యేకించి ఒక ఉత్తరం కూడా రాసేను మీకు. ఉత్తరం చూడనివారి సౌకర్యార్థం తొలి పోస్టులోనే "కథలు" అని కూడా విశదం చేసేను.
అడుగులోనే హంసపాదు అని మొదటి టపాతోనే వచ్చింది కలకలం. "మరో రెండేళ్ళుంటానేమో" అనడం "నా మానసికారోగ్యం"గురించిన ఆందోళనకి తావిచ్చినట్టుంది. "అయ్యయ్యో, జీవితం ఆనందమయం కదా, అలా ఎందుకంటున్నారు" అని ఒక పాఠకుడు ప్రశ్నించేరు. ఆ తరవాత "జీవితం బహు సుందరం" అనో అలాటిదే మరో గీతమో కలిగిన మరో వ్యాసం పంపేరు. అప్పుడే నాకు గాభరా పుట్టింది. ఇంకా నయం. మాఊళ్ళోనే ఉంటే ఆయన 911 వారిని పిలిచేసేవారేమో అని కూడా అనిపించింది. మరి రానున్న కాలంలో నేను ఓ ముష్టివాడిగురించి రాస్తే, ముష్టెత్తుతున్నాననీ, కుష్టురోగిని గురించి రాస్తే కుష్టురోగంతో కుళ్ళిపోతున్నాననీ

అనుకోగల ప్రమాదం కూడా ఉంది కదా. నాశీ తుపాకీమీద కథ రాస్తే, "ఇంట్లో తుపాకీలెందుకు పెట్టుకున్నారండీ" అంటూ ఆయనని ఎవరేనా అడిగేరా? రేపు ఫోన్ చేసి కనుక్కోవాలి.

అదన్నమాట ఈ పోస్టు రాయవలసిన అవుసరం. నేనిక్కడ మరీ మరీ నొక్కి వక్కాణించడానికి ప్రయత్నిస్తున్నది కథ రాసినవాడు కథ చెప్పేవాడు ఒకరు కారు. ఇది స్పష్టం చేయడానికే ఈ నోది. "మేమంతా క్షేమం" శీర్షికతో నేను రాస్తున్న పోస్టులు నా ఆత్మకథ అని భ్రమ పడి, సైకో థెరపీ సెషను పెడితే నాకు ఇబ్బందిగా ఉంటుంది. రానున్న పోస్టులలో ఇలాటివి అనేకం రావచ్చు. గత 70 ఏళ్లలో (బాలాప్రాయం 8 తీసేస్తే), నేను తెలుసుకున్న, చూసిన అనేక విషయాలు పరామర్శించడం కనక మరణంవార్తలు పునశ్చరణ కావచ్చు. నాకు ఏ ఆలోచనలు వస్తాయో, వాటిని కథలో ఎలా ఇరికిస్తానో అన్నది ఇప్పుడప్పుడే చెప్పలేను కానీ నేను రాసిన ప్రతి వాక్యం నాజీవితానికి ఆపాదించి ఆందోళన ప్రకటించకండి. అలాటి అవుసరం నారాతలమూలంగా రాదని ఇదే - వ్రాతమూలకంగా హామీ ఇస్తున్నాను.

నా అభిప్రాయం చెప్పేను. నాకు మీ అభిప్రాయాలు కూడా తెలుసుకోవాలని ఉంది.

నా ప్రశ్న -

రచయిత పేరూ, కథకుడు పేరూ అని ఎంతమంది అనుకుంటున్నారు? కథలోని ప్రతి అంశం రచయితజీవితంనుండి మాత్రమే వస్తుందని ఎంతమంది అనుకుంటున్నారు?

000

(మే 30, 2015)

28. పిన్నలు "నేనెందుకు రాస్తున్నానంటే ..."

నేనెందుకు రాస్తున్నాను అన్న విషయంలో పేరు గన్న రచయితలు చాలామంది తమ అనుభవాలు వివరించారు.

నిన్నా ఇవాళా కొత్తగా రాస్తున్నవారు చెప్పిన కారణాలు ఆనందదాయకం.

నోటితో చెప్తే కొత్త సమస్యలు వస్తాయేమోనని

రాయడానికి రచయితే కానక్ఖర్లేదనుకుని

రాయాలనిపించి

రచయిత కావాలని

అనిపించుకోవాలని

నాకోసం

మరిచిపోపడానికి

రాయడం ఇష్టం కనక

పిల్లలకోసం, తెలుగుభాషకోసం

ముఖపుస్తకంలోనూ బ్లాగులోనూ ఏదో ఒకటి గిలకాలని

ఏం రాస్తే ఎవరు ఎలా స్పందిస్తారో తెలుసుకోడానికి

అంటున్నారు.

ఇంకా

మనసులో మాట మరొకరితో పంచుకోడానికి

గుర్తు పెట్టుకోడానికి

సమస్యలకి సమాధానాలు వెతుక్కోడానికి

వెనక తోబుట్టువులతో, వేడుక చెలులతో చెప్పుకునేవి ఇప్పుడు కాయితంమీద,

జాలంలో.

రాయలేక ఆగిపోయినవారు ఎందుకు రాయలేకపోతున్నారో చూసుకోడానికి రాయవచ్చు.

కాయితంమీద పెట్టలేనివారు మనసులో చూసుకోవచ్చు.

ఈనాడు రచయితకి నిర్వచనం ఇది.

మీకు నామాట నమ్మకం లేకపోతే కొన్ని పత్రికలలో రచయితలకి సంపాదకులు ఇచ్చే సూచనలు చూడండి. మీరు కూడా రచయితలే అని ఒక వాక్యం ఉంటుంది.

000

(జులై 11, 2015)

29. నా సంగీతసేవ

"హా, సాహిత్యం అయింది ఇంక సంగీతమ్మీద పడ్డావా," అని మీరనుకుంటే క్షమించవలెను. ఈ మధ్య సాహిత్యపరంగా రాయగలిగిందేమీ లేదని తెలిసేక, సంగీతంమీద పడ్డాను. కేవలం నాకు ఊసు పోక. కొన్నాళ్ళు యూట్యూబులో సంగీతం వినగ వినగ ఉండబట్టలేక ముఖపుస్తకంలో ఇది వినండి ఇది వినండి అంటూ ప్రచారం చేస్తుంటే, అది విని ఆనందించినవారు కనిపించేరు. ఆ మీదట "మేమంతా క్షేమం" ధారావాహికకి కొనసాగింపుగా నాకీ సంగీతం యావ చిన్నప్పుడు ఎలా ఉండేదో చెప్పాలనిపించింది. సూక్ష్మంగా ఈ టపాకి పరిచయంవాక్యం.
నా సంగీతసేవ కూడా మీ అందరిలాగే రేడియో, సినిమాసంగీతంతోనే మొదలయింది. సూక్ష్మంగా నాకు సంగీతం వినడం ఇష్టం. నేను సంగీతం నేర్చుకోడం మాఅమ్మకి ఇష్టం. అంచేత ఆవిడ ప్రయత్నలోపమేమీ లేకుండా, నాకూ, మాఅక్కయ్యకీ కూడా నానావిధాలా సంగీతం నేర్పించడానికి ప్రయత్నించింది. ఆరోజుల్లో పెళ్ళిసంగీతం అనబడే గాత్రంతోనే మొదలుపెట్టేను. మీలో కొందరికైనా తెలిసే ఉండాలి రేడియోలో సంగీతప్పాఠాలు. ఓరోజు అది వింటూ నేను పాడబోతే, ఇల్లు తుడుస్తున్న అప్పమ్మ ఝడుసుకుని ఓలమ్మో అంటూ చీపురు వదిలేసింది. మాఅమ్మ అది చూసే కాబోలు నన్ను వయొలినుకీ ఆ తరవాత వీణకీ మార్చింది. అలా ఒకటి తరవాత ఒకటి ఆరేసి నెలలచొప్పున కుస్తీ పట్టి నావల్ల కాదులే అని తప్పుకున్నాను. మాఅక్కయ్య మాత్రం పట్టుదలగా సాగించి, వీణ ఓ మోస్తరుగా "బాగానే" వాయించేస్థాయి చేరుకుంది. పాపం, మాసంగీత మేష్టరు ఎంతో మృదువుగా "నీకు స్వరజ్ఞానం ఉందమ్మా. సాధన చేస్తే బాగా వస్తుంది," అని చెప్పడానికి సర్వవిధాల నన్ను నమ్మించడానికి ప్రయత్నించేరు కానీ నాకు ఆ బుద్ధి, ఆ మంచి బుద్ది, లోపించినందున నా

సంగీతప్పాఠాలు అనతికాలంలోనే ఆగిపోయేయి. కాకపోతే ఆ సంగీతప్పాఠాలమూలంగా జంటస్వరాలూ, వర్ణాలూ, తాళం, శృతిలాటి నాలుగు మాటలు పట్టుబడ్డాయి. పొరబడకండి, మాటలు మాత్రమే నాకు తెలిసింది. అది అట్లుండగా

నేను నాచదువు అయిందనిపించుకుని విజయనగరం మహరాజావారి మహిళా కళాశాలలో లైబ్రేరియనుగా కుదురుకున్నాను. విజీనారం మాఊరు కానందున ఆ కళాశాల ప్రభువులు ఏర్పరిచిన గుఱ్ఱాలశాలలో మకాం పెట్టేను. లేదులెండి అప్పుడక్కడ గుఱ్ఱాలూ లేవు. వెనకటి మహారాజుగారూ లేరు. రాజుగారి భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కళాశాలగా మార్చేశారు. ఇంతకీ గుఱ్ఱాలశాలని వాసయోగ్యం చేసి, నాలాటి పొరుగూళ్లనుండి వచ్చిన పంతులమ్మలకి నివాసం కల్పించేరు.

ఆ వసతిగృహంలోనే విజయవాడనుండి వచ్చిన నిర్మల అను పేరుగల హిస్టరీ లెక్చరరుతో నాకు స్నేహం అయింది. ఆవిడకి సంగీతం వచ్చు. అంచేత కచేరీలకి వెళ్తూ, నన్ను కూడా ఈడ్చుకెళ్లేది. "నన్ను శృతి పెట్టె అయినా వాయించనివ్వవు, (తను సాధన చేస్తున్నప్పుడు), నేను రాను" అని కొంచెం పేచీ పెట్టి, కొంచెంసేపు మురిపించి బతిమాలించుకుని వెళ్ళేదాన్ని. (జనాంతికం – ఈ నువ్వు ప్రయోగంమీద మరో టపా రాయాలనుకుంటా!)

ఒకసారి "ద్వారం వెంకటస్వామినాయుడుగారి కచేరీ, పద," అన్నప్పుడు కూడా నేను కొంచెం నస పెట్టేను కానీ వెళ్ళేను. నాకు ఇప్పటికీ ప్రత్యేకంగా జ్ఞాపకం ఉండిపోయిన కచేరి అది.

"ఆయన పెద్దవారయిపోయేరు. మళ్ళీ ఎప్పుడో ... పద, పద," అని నిర్మల పట్టు పట్టి, తీసుకెళ్ళింది నన్ను. ఈ విషయంలో నేను నిర్మలకి ఋణపడి ఉన్నాను. నాయుడుగారు చేసిన ఆఖరికచేరి అదే. మహా వాయులీన విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడుగారు నవంబరు 1964లో పరమపదానికి తరలిపోయేరు.

ఇక మూడోదశ నేను తిరపతిలోనూ అనంతపురంలోనూ ఉద్యోగాలు వెలగబెట్టినప్పుడు. అదేమిటో! వెనక్కి తిరిగి చూసుకుంటే నేను వెళ్ళిన ప్రతిచోటా మిత్రరూపంలో నన్ను సంగీతంవేపు లాగేవాళ్ళు ఒకరో ఇద్దరూ తటస్థపడుతూనే వచ్చేరు. ప్రధానంగా చెప్పుకోవలసింది తిరుపతిలో సుప్రసిద్ధులయిన మహా విద్వాంసుల కచేరీలు ఉచితంగా సకల జనులకు అందించడం. అప్పటికే మద్రాసులోనూ హైదరాబాదులోనూ టికెట్టుకి యాభయ్యో వందో ఖర్చు పెట్టవలసివచ్చేది అని గుర్తు (ఈమాట ఒక కథలో రాసేను కనక). తిరపతిలో ప్రభావతీ, అనంతపురంలో మీరాబాయి నాసంగీతాభిరుచిని ఎగసన తోస్తూ వచ్చేరు. తిరపతిలో ఉండగానే, నా సంగీత అజ్ఞానాన్ని స్పష్టం చేస్తూ రాసిన కథ "రససిద్ధి" మీకు గుర్తుండే ఉంటుంది. వెనకటి టపాల్లో వివరించినట్టు అది నావిపరీత హాస్యానికి చిహ్నమే కానీ నాకు సంగీతం అంటేనూ, సంగీత విద్వాంసులంటేనూ చులకన భావం లేదు. ఒకరకంగా నామీద నాకే కలిగిన చిరాకు కావచ్చు.

ఇంతకీ మళ్లీ మంచి సంగీతంమీదికి నాదృష్టి మళ్ళించింది 80వ దశకంలో అమెరికాలో కంప్యూటర్ సైన్స్ చదువుకోడానికి వచ్చిన కామేశం అని ఒక అబ్బాయి. బహుశా పాతికేళ్ళలోపే అనుకుంటాను. మరో తెలుగువారింట విందువేళ కలిసేం. నాకు సంగీతం అంటే సరదా అని అతనికి ఎలా తెలిసిందో కానీ మొత్తంమీద మాకు స్నేహం కుదిరింది. అప్పుడప్పుడు మాఇంటికొచ్చేవాడు తనదగ్గరున్న టేపులతో. ఒకొకప్పుడు టేపు పెట్టేసి తన్మయుడై పాడుతూ ఉంటే నేను చూసి ఆనందిస్తుండేదాన్ని. మాకు 3 గంటలదూరంలో ఉన్న షికాగోలో వసంతకుమారివంటి విద్వాంసులు కచేరీలు చేసినప్పుడు ఇద్దరం వెళ్ళేవాళ్ళం. నేనే సారథిని!

"మాయింట్లో గోడలు కూడా పాడతాయండి," అన్నాడు తనకి సంగీతంమీద అభిరుచి ఎలా కలిగిందో చెప్పడానికి. నలుగురు అక్కలుట, అందరూ సంగీతం నేర్చేరుట. కర్ణాటక సంగీతానికీ ఉత్తరాది సంగీతానికీ మధ్య గల వ్యత్యాసంగురించి మాటాడుతూ తనకి, "కర్ణాటక సంగీతం ఎక్కువ అర్థం అవుతుందనీ, ఉత్తరాది సంగీతం ఎక్కువ ఇష్టం," అనీ అన్నాడు.

చెప్పేను కదా ఇది 80వ దశకంలో. చెప్తే మీరు నమ్మకపోవచ్చు కానీ ఆ వాక్యం నాకు ఇంతకాలం అయినతరవాత ఇప్పుడు అర్థమయింది! ఇది ముగిసేవేళకి మీకే తెలుస్తుందిలెండి.

సాధారణంగా మనసు బాగులేనప్పుడు సంగీతం వింటాం అంటారు కొందరు, ఉపశమనంగా ఉంటుందని. నేను మాత్రం మనసు బాగుంటేనే మంచి సంగీతం వినగలగడం. కామేశం చదువు ముగించుకుని ఉద్యోగానికి న్యూ జెర్సీకి వెళ్ళిపోయేక నేను సంగీతం వినడం తగ్గిపోయింది. మధ్యలో సుధ అని మరో స్నేహితురాలు ఇండియా వెళ్ళినప్పుడల్లా టేపులు కొనుక్కొచ్చి నాకు ఇవ్వడంతో కొంత కాలక్షేపం అయింది. ఆవిడకి పాడడం రాదు కానీ నేర్చుకోవాలన్న తపన ఉండేది. అంచేత ఆ టేపులు విని సాహిత్యం రాసే పని నాకు ఒప్పగించింది. ఆ రాయసపని మూలంగా కొంతకాలం సంగీతాభిరుచి నిలిచింది. (చెప్పేను కదా నేను ఉద్యోగం చేసేరోజుల్లో కూడా నాస్నేహితులందరి దృష్టిలో పనీ పాటూ లేని మనిషినే!). అది బహుశా ఓ పదేళ్ళు సాగిందేమో. 90వ దశకం వచ్చేసరికి నాకు సంగీతాభిమానం మంగళం పాడేసుకుంది. అప్పటివరకూ పోగేసుకున్న టేపులు ఉంచలేకా పారేయలేకా సతమతమవుతూ మరో పదేళ్ళు గడిపేను. మొత్తమ్మీద ఆఖరికి సంగీతం అంటే వీరికి ఇష్టమయి ఉండనోపు అని ఇద్దరు ముగ్గురిని ఎంచుకుని, నాదగ్గర మంచి టేపులున్నాయనీ, కావలిస్తే పంపగలననీ ప్రకటించేను. అప్పుడయితే పంపమన్నారు కానీ ఇప్పుడు వారిని గురించి మరికొంత తెలిసినతరవాత నా అమాయకత్వం అర్థమయింది. వాళ్లకి ఈ టేపులు అవసరం లేదు. వారిదగ్గర చాలా చాలా మంచి సీడీలూ, లైవు కచేరీలూ ఇంకా ఏవో చాలానే ఉన్నాయి. ఇహ నాదగ్గరున్న మిగతా టేపులగురించి మాటాడను.

ఈ తికమకలో పడి కొట్టుకుంటుండగా, ముఖపుస్తకప్రపంచం ప్రవేశించేను, రెండేళ్లయిందనుకుంటాను. అక్కడ కొందరు మంచి మంచి పాటలుగురించి నాలుగుమాటలు చెప్పడం, లింకులివ్వడంతో మళ్ళీ నాకు సంగీతం వినాలన్న ఉత్సాహం పుట్టుకొచ్చింది. (పైన ఉటంకించిన సిద్ధాంతంప్రకారం మనస్తిమితం

అన్నమాట). అక్కడ్నించి యూట్యూబుమీద దాడి ప్రకటించేను. నాకే ఆశ్చర్యం. ఇదివరకూ, రాగం, తానం, తిల్లానావంటివి విని ఆనందించే జ్ఞానం లేదు. ఇప్పుడు అవి వింటుంటే అబ్బ, ఎంత బాగుంది అనిపిస్తోంది. ఇవ్విధమున నాసంగీతాభిలాష ఒక మెట్టు పైకి చేరినట్టు అనిపించింది.

ఆ ఉత్సాహం పట్టలేక, ఫేస్బుక్కులో లింకులిస్తే, రసజ్ఞులు ఆనందించడమే కాక, ఆ కీర్తనలగురించి, గాయకులగురించి అనేక వివరాలు ఇస్తున్నారు. తద్వారా నాఉత్సాహం మరింత పుంజుకుంది.

అంచేత వచ్చే జన్మలో నేను గాయకురాలిగా పుడతాననుకుంటున్నాను. చిత్రగుప్తుడో, బ్రహ్మదేవుడో "నువ్వెవరివిగా పుట్టాలనుకుంటున్నావు?" అని నన్నడిగితే, ఆ పరిస్థితి వస్తే, "నన్ను కనీసం ఓ మోస్తరు స్థాయి గాయనిని లేదా గాయకుడిని చేయుము మహాప్రభో," అని చెప్పేస్తాను నిస్సందేహంగా.

ఇంత దూరం వచ్చేక, మరి మీకు నన్ను ఇంతగా ఆకర్షించిన ఆ గాయకులెవరో తెలుసుకోవాలనుందా? కావాలంటే నేను ఏ గాయకులసంగీతం విని ఆనందించేనో, ఎవ్విధమున ఆనందించేనో, లేదా అవి వింటున్నప్పుడు నాకేమనిపించిందో చెప్తాను మీరు కావాలంటే.

అన్నట్టు చెప్పడం మరిచేను వీరిలో కొందరు మరీ చిన్నపిల్లలు. 10-18 ఏళ్ళమధ్య వాళ్ళు. వయసుమాట వదిలేయండి. బొమ్మ చూడకుండా, వారి సంగీతం వింటే ఆరితేరిన విద్వాంసుల స్థాయిలో పాడుతున్నారని మీకే తెలుస్తుంది. "వృద్ధిలోకి వస్తున్న గాయకులు" అనలేం, వృద్ధిలోకి వచ్చేసినవిద్వాంసులే అనిపించే స్థాయిలో పాడుతున్నారు.

000

(ఆగస్ట్ 3, 2015)

30. నా ఇష్ట గాయనీగాయకులు

వెనక చెప్పేను కదా నా గానవినోదం రేడియోలో నిలయవిద్వాంసులతో మొదలయిందని. ఆరోజుల్లో వారిని "నిలవ"విద్వాంసులని హాస్యమాడినా, ఈనాటికీ గుర్తున్న పేర్లు **వింజమూరి లక్ష్మి, శ్రీరంగం గోపాలరత్నం, వేదవతి.** నిలయవిద్వాంసులు కాదు గానీ తరుచూ **టంగుటూరి సూర్యకుమారి, పి. లీల, రావు బాలసరస్వతి, సీత అనుసూయ వంటివారు అందంచిన** లలిత సంగీతం మనోరంజకంగా ఉండేది.
అట్టే సంగీతజ్ఞానం లేనివారికి సాహిత్యం తోడ్పాటు ఉంటుంది. "సాగరరాజా చిన్నదోయీ నాపడవ, తెరచాపా చుక్కానీ నావి కావు కానీ" "అమరావతీపట్టణమున బౌద్ధులు స్తూపములు స్థాపించునాడు"వంటి సాహిత్యం నాకు ఇప్పటికీ మనసులో మెదుల్తూనే ఉంటుంది ఉండీ ఉడిగీ.
ఆతరవాత తిరపతిలో ఉన్నప్పుడే మొట్టమొదటిసారిగా **యం.యస్. సుబ్బలక్ష్మిగారి** గానం విని పరవశించి అహో శాస్త్రీయసంగీతం అంటే ఇలా ఉంటుందన్నమాట అని అనుకున్నది. మళ్ళీ అమెరికా వచ్చేక, ముందు చెప్పినట్టు కామేశం కర్నాటక సంగీతంతో నాకు మంచి పరిచయమే ప్రసాదించేడు. చెప్పేను కదా ఉత్తరాది సంగీతం తనకి నచ్చుతుందన్నాడని. అప్పట్లో అతను నాకిచ్చిన **కిషోరీ అమోంకర్ టేపు ఒకటి** ఇప్పటికీ ఉంది నాదగ్గర. ఈనాటికి అది విని ఆనందించగల స్తోమత వచ్చింది, సుమారుగా. :).
ఆరోజుల్లోనే అంటే 80వ దశకంలో **ప్రియ సిస్టర్స్, హైదరాబాద్ బ్రదర్స్, బాలమురళీకృష్ణ, వసంతకుమారి, బాల మురళీకృష్ణ** షికాగో వచ్చినప్పుడు వారి ప్రత్యక్ష కచేరీలు విన్నాను. ఆ తరవాత చాలాకాలం అదేపనిగా **ప్రియ సిస్టర్స్, సుధా రఘునాథస్‌తోపాటు మహరాజపురం సంతానం, నూకల చిన సత్యనారాయణ, బాలమురళీకృష్ణ, జేసుదాస్, యం.యస్. సుబ్బలక్ష్మి, యం.యల్ వసంతకుమారి,**

రాధ జయలక్ష్మి సంగీతం వింటూ వచ్చేను. ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి రెండున్నాయి – **డి.కె. పట్టమ్మాళ్** శ్యామలాదండకం, **బొంబే సిస్టర్స్ సౌందర్యలహరి. ఈ** రెండూ టేపు అరిగిపోయేవరకూ విన్నాను.

ఇలా రాస్తుంటే నాకు మరో పిట్ట కథ గుర్తొస్తోంది. మా అమ్మాయి పుట్టినప్పుడు నాకు జోలపాటలేమీ రావు కనక **సుబ్బలక్ష్మిగారి జో అచ్యుతానంద టేపు పెట్టేసేదాన్ని**. వింటూ బాగానే నిద్రపోయేది. ఆ తరవాత దానికి తొమ్మిదేళ్ళప్పుడు ఇండియా వెళ్ళేం. ముత్యాలముగ్గు సినిమా చూసేం. ఆదిలోనే హంసపాదు. ఆ సినిమా ప్రారంభిస్తూనే రావు గోపాలరావు భయంకరంగా తెరమీద కనిపించేసరికి మాఅమ్మాయి ఝుడుసుకుంది. కానీ ఆ సినిమాలో పాట మాత్రం "ముత్యమంత ముగ్గు" పాడుతుండేది. ఆ తరవాత రామచంద్రాయ రాజజామనోహరాయ కూడా నేర్చేసుకుంది బాలమురళీకృష్ణ టేపు విని. దానిపాట విన్నవాళ్ళు మంచి స్వరజ్ఞానం ఉందని మెచ్చుకున్నారు కూడాను. ఇప్పటికీ రామచంద్రాయ అని మొదలు పెడుతుంది. మిగతా అంతా మరిచిపోయింది. అది వేరే సంగతి.

సరే మళ్ళీ అసలు విషయానికొస్తాను. 15-20 ఏళ్ళు అయిపోయేక ఇప్పుడు మళ్ళీ హఠాత్తుగా నాకు సౌందర్యలహరి వినాలన్న కోరిక పుట్టింది. హడావుడిగా ఆ గానంకోసం యూట్యూబు వెతుకుతూ తదితర విద్వాంసులని కనిపెట్టేసేను.

ఇందాకా చెప్పినట్టు, నేను సాహిత్యంమీద ప్రత్యేకంగా దృష్టి పెట్టి వినడంతో నాకు ఒక సుళువు తెలిసింది. టేపులు లేనప్పుడు కూడా ఏ వీధుల్లోనో తిరుగుతున్నప్పుడు ఈ సాహిత్యం మనసులో మెదుల్తూ సంగీతం వింటున్న అనుభూతి కలుగుతుంది! అంటే అది రక్తంలో ఇంకిపోయింది. సంగీతవిద్వాంసులు నా బ్రెయిను వాష్ చేసేసేరు అనుకోండి! **నూకల చినసత్యనారాయణ**గారి క్షీరసాగరశయనా, **మహారాజపురం సంతానంగారి రామా నిన్నె నమ్మినవారము ఎంతగా నామనసులో ముద్ర** పడిపోయేయో మాటల్లో చెప్పడం కష్టం. ఇందులో నష్టం ఏమిటంటే ఆ తరవాత వేరే ఎవరు ఆ కీర్తనలు పాడినా అంత బాగున్నట్టు అనిపించదు.

గత రెండు నెలల్లో ఆ సిద్ధాంతానికి గంటు పడింది ఒక చిన్న గాయని మూలంగా. చిన్న అంటే వయసులోనే కానీ వైదుష్యంలో కాదు. సుబ్బలక్ష్మిగారి మునిమనుమరాలు, **రాధ విశ్వనాథన్ గారి మనుమరాలు అయిన యస్. ఐశ్వర్య పాడుతుంటే,** సుబ్బలక్ష్మిగారు మనసులోకి వచ్చేసేరు. ముఖ్యంగా ఈ అమ్మాయి చంద్రశేఖరగురుం అన్న శ్లోకంతో మొదలు పెట్టినప్పుడు, మనవ్యాలకించరాదా, సీతమ్మ మాయమ్మ, అపరాధముల మన్నించి లాటి కీర్తనలు పాడుతున్నప్పుడు మనసుని సూటిగా తాకుతుంది ఆ ఆదిమ మధురస్వరం. చిన్న హెచ్చరిక – యూట్యూబులో **యస్. ఐశ్వర్య అనే చూడాలి. కేవలం "ఐశ్వర్య"** అని టైపు చేస్తే సినీతార దర్శనమిస్తుంది. అసలు నేను యూట్యూబులో సంగీతం వినడం మొదలు పెట్టేక, మొదట నాకు చెప్పలేనంత గొప్పగా అనిపించింది **శ్రీరంజని సంతానగోపాలన్, నేవేలి ఆర్. సంతానగోపాలన్‌గారి కుమార్తె గానం. ఆయన మహా విద్వాంసులని నేను ఇప్పుడే** కనుగొనడం (ఆమాత్రం తెలియదా అని మళ్ళీ నామీద కళ్ళురమకండి మరి.). ఈ అమ్మాయి కంఠస్వరం మధురం. వైదుష్యం అసాధారణం.
మిగతావారిలో నన్ను బలంగా ఆకట్టుకున్నది **మాస్టర్ అనంతరామన్. 12 వయసులో** ఇతడు చేసిన కచేరి ప్రథమశ్రేణి గాయకులస్థాయిలో ఉంది. ఇది నామాట కాదు. యూట్యూబులో ఆ కచేరీదగ్గర వ్యాఖ్యలు చూడండి. ఇతను కొంచెం పెద్దవాడయేక అంటే 15, 16 ఏళ్ళు వచ్చేక, **ఈరోడ్ అనంతరామన్‌గా, విద్వాన్ అనంతరామన్‌గా** ప్రసిద్ధుడయేడు. సుమారుగా ఇప్పుడు అతని వయసు అదే అనుకుంటాను. **అశ్వత్ నారాయణన్** గానం కూడా మనోజ్ఞంగా ఉంది. ఇతను కూడా 17, 18 ఏళ్ళకే విద్వాన్ అనిపించుకున్నాడు.
కొంతకాలంగా కచేరీలు చేస్తూన్న ప్రముఖగాయకులలో నేను కొత్తగా మొదటిసారి వింటూనే చకితురాలినయింది **మండా సుధారాణి గానం. ఆమె కంఠస్వరం** కంచుకంఠమే. ఖంగున మోగినట్టనిపిస్తుంది ఆలాపన ఎత్తుకోగానే. ఆవిడ స్వతస్సిద్ధమైన బాణీలో వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. ఆమె ప్రయోగం మీరు

వినదలుచుకుంటే, యూట్యూబులో "రాజరాజరాజితే" (అసలు పాఠం రాజరాజారాధితే అనిట. కానీ యూట్యూబులో ...రాజితే అని ఉంది.) చూడండి. ఇది చాలా వేగంగా పాడతారు. నిరోష్ఠ కృతి అంటే ప, మ స్వరాలు లేకుండా అనిట. ఇదంతా ఇప్పుడు నేను కొత్తగా నేర్చుకున్నది. ముఖ్యంగా పల్లవి గానవిశేషంలో అనేక ప్రయోగాలు ప్రవేశపెట్టేరుట. అన్నట్టు పల్లవి అంటే నేను కీర్తనలో ఒక పాదమనే అనుకున్నాను కానీ ప – పదం, ల – లయ, వి – విన్యాసం అనిట. ప్రముఖ వైయొలిన్ విద్వాంసులు **ఇవటూరి వెంకటేశ్వరరావుగారి శిష్యురాలు ఈమె. సుధారాణిగారి కుమార్తె మండా శృతి** రవళి. ఈ అమ్మాయికి తల్లికంఠస్వరం రాలేదేమో అని నాకు. అది నేను అర్థం చేసుకోలేకపోవడం కావచ్చు. (తా.క. ఈ అభిప్రాయం దరిమిలా మారిపోయింది. ఇప్పుడు శృతిరవళి కూడా నా అభిమానగాయకురాలే.

కొంచెం విచిత్రంగా అనిపించిన చిన్నకథ - **శృతి రవళి** వారి సద్గురు సత్యనారాయణమూర్తి గారి సమక్షంలో కచేరీ చేసింది. ఆ సమయంలో విడియో కెమెరా రెండు మూడు సార్లు ఆ స్వామి పాదసంవాహన దృశ్యం చూపడం జరిగింది. కనీసం అంతసేపు కెమెరా వారిమీద నిలపడం నాకు వింతగానే తోచింది.

మరొక గాయకునివిషయంలో కొన్ని విషయాలు ప్రస్తావించాలి. ఒక విదేశీ - మలేషియన్ చైనీస్ **చంగ్ చ్యూ సెన్** (Chong Chiu Sen) కర్ణాటకసంగీతంలో నిష్ణాతుడు. ఆయన **డి.కె. పట్టమ్మాళ్ తో ప్రారంభించి, ఆ తరవాత వరసగా పట్టమ్మాళ్** కుమారుడు **డి.కె. జయరామన్, మనుమరాలు గాయత్రి సుందరరామన్ శిష్యరికంలో** సంగీతం అభ్యసించేడుట. అతను చేసిన కచేరీలో తెలుగు, తమిళం, సంస్కృతకృతులు ఉన్నాయి. ఇతని ఉచ్చారణ నన్ను అవాక్ చేసింది.

ఉచ్చారణ విషయం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. నేను అమెరికనులకి 15 ఏళ్ళకి పైనే తెలుగు నేర్పేను, లేదా నేర్పడానికి ప్రయత్నించేను. వాళ్ళలో ఎవరూ ఈ స్థాయి ఉచ్చారణకి చేరలేదు. ఒత్తులూ ద్విత్వాలూ లేని నా పేరే సరిగ్గా పలకలేని వాళ్లే ఎక్కువ నేను చూసిన అమెరికనులలో. ఆ దృష్టితో చూస్తే ఈవిద్వాంసుడికి నమస్కరించక

తప్పదు. ఇతని ఉచ్చారణలో యాస ఉందని ఒకరిద్దరు అన్నారు. ఆ విషయం నేను ఆలోచించేను కొంచెంసేపు. నాకు తోచింది ఏమిటంటే శాస్త్రీయసంగీతంలో ఉచ్చారణలో కొంత సాంకర్యం మనకి కొత్త కాదని. తమిళులు తెలుగు కృతులు పాడినప్పుడు ఉచ్చారణ ఎల్లవేళలా పక్కాగా ఉందని చెప్పలేం. **వసంతకుమారి పవమాన "సుతడు"** బట్టు ... అని పాడేరు. అంతే కాదు తమిళగురువులదగ్గర నేర్చుకున్న తెలుగువారు కూడా ఆ తమిళ ఉచ్చారణతోనే పాడడం కూడా విన్నాను.

ఏమైనా చంగ్ చూ సెన్ విద్వత్ మాత్రం నాకు ఘనంగానే అనిపించింది.

చివరిమాటగా రాగం, తానం, తిల్లానగురించి కూడా ఒక మాట చెప్పాలి. నాకు సాహిత్యంమీద యావ ఎక్కువ అని చేప్పేను కదా. రాగం, తానం, తిల్లానా - వీటిలో అంతా సంగీతమే కదా అమూర్త కళలాగ. ఆ కారణంగా ఈ ప్రక్రియలు నన్ను ఆకర్షించలేదు. మరి నేను సంగీతం వినడం మానేసిన 15 ఏళ్ళలో ఏం జరిగిందో నాకు తెలీదు కానీ రెండు నెలలక్రితం తొలిసారి శ్రీరంజని సంతానగోపాలన్ కచేరీ వింటున్నప్పుడు అనిపించింది ఆలోపన మనోహరంగా ఉంటుందని. దానిమీదే మనసుంచి వింటే గాయని తనతోపాటు మనని కూడా దిగంతాలలోకి తీసుకుపోగలదని. క్రమంగా తద్వారా భాష కూడా. తెలుగు కృతలయితేనే వింటానన్న నియమం కూడా తొలగిపోయింది.

వెనకటి టపాలో చెప్పడం మరిచిన మాట - ద్వారం వెంకటస్వామినాయుడిగారి కుమార్తె ద్వారం మంగతాయారు కూడా పేరు గన్న వయొలిన్ విద్వాంసురాలే. అప్పట్లో రేడియోలో ఆమె కచేరీలు వచ్చేవి. అప్పట్లో విన్నా అట్టే ఆసక్తితో మాత్రం కాదు. నిన్న ఒక కచేరీ వింటుంటే బాగుందనే ఇంకా ఇంకా వినాలనే అనిపించింది.

ఈ గానాలు వింటూ మరొక సంగతి గమనించేను. గాయని లేదా గాయకుడు, పక్కవాద్యగాళ్ళు - వీరిమధ్య సమన్వయం. ఒక మంచి సంగతి, ఒక గమకం, స్వరప్రస్తారంలో ఒక విశేషం – వినిపించినప్పుడు చిరునవ్వులతో ఒకరినొకరు సంప్రదించుకుంటూ అమందానందం అనుభవించడం చూస్తే సభికులను, శ్రోతలను

అలరించడమే కాదు తాము కూడా అంత అలౌకికమైన అనుభూతి పొందుతున్నారని తెలుస్తుంది. ఆక్షణంలో మనకి కూడా అంతటి ఆహ్లాదమూ కలుగుతుంది. అప్రయత్నంగానే మనపెదవులమీద చిరునవ్వు మొలకలెత్తుతుంది.

నేను అమెరికా వచ్చేక అందరూ బోలెడు మెచ్చుకుంటున్నారు ఏమిటో చూదాం అని మైకల్ జాక్సన్, ఎల్విస్ ప్రెస్లీ వంటి వారి గానం వినడానికి ప్రయత్నించేను కానీ నాతరం కాలేదు. స్టేజంతా కదం తొక్కుతూ భయంకరంగా యుద్ధం చేస్తున్నట్టు కనిపించే వారి గానం గాయాలు చేస్తున్నట్టు కనిపించింది. మన గాయకులేమో స్టేజిమీద మఠం వేసుకు కూర్చుని, ప్రశాంతంగా చేతులూపుతూ పాడుతుంటే, ఈ సంగీతం ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. చేతులకదిలకతో శబ్దాలు చిత్రిస్తున్నట్టు అనిపిస్తుంది నాకైతే.

ప్రతి నియమానికీ ఒకటో రెండో మినహాయింపులు ఉన్నట్టే, ఈ యూట్యూబు సంగీతంలో చిరాకు కలిగించేవి ప్రకటనలు. అయితే ఆధునిక యుగంలో ఉచిత లంచి అన్నది లేదని నాకు కూడా తెలుసు. అంచేత భరించకతప్పదు. కొన్ని పాట అయినతరవాత అయితే, కొన్ని పాటమధ్యలోనే పాట ఆపేసి తమ కచేరీ పెట్టేస్తాయి ఈ ప్రకటనలు. దానిమీద ఎవరో వ్యాఖ్యానించడం, కార్యకర్తలు ఆ ప్రకటనలు తమచేతిలో లేవనీ, వీలయితే ఆ పద్ధతి మార్చడానికి ప్రయత్నిస్తామనీ జవాబిచ్చేరు.

ఇదీ నా సంగీతాభిమాన కథ.

000

(ఆగస్ట్ 5, 2015)

31. నా ఇష్ట గాయనీగాయకులు 2

వెనకటి టపాలో నాకు నచ్చిన గాయనీగాయకులగురించి ప్రస్తావించేను కదా. ఫేస్బుక్కులో మిత్రుల ప్రోత్సాహంతో నా ఉత్సాహం రెట్టింపయింది. నాకు అదో పెద్ద వ్యాపకం అయిపోయింది. రోజూ కనీసం 3, 4 గంటలు యూట్యూబులో గడిపి నాకు నచ్చిన విద్వాంసులని కనిపెడుతున్నాను. అందులో ఏదో ఒక ప్రత్యేకత గల, కనీసం నాకు అలా అనిపించిన గానం అయితే ఫేస్బుక్కులో పెట్టడం, అక్కడ అనేకమంది శ్రోతలు తమ ఆనందం వెలిబుచ్చడం నాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది.
ఆ టపాలో చెప్పిన మరో విషయం సాహిత్యం తెలిస్తేనే సంగీతం ఆస్వాదించగలనని. దానికి ఇప్పుడొక మినహాయింపు నందినీ రావు గజర్ పాడుతున్న పురందరదాసు కృతులు. అసలు ఆ అమ్మాయి పాడిన పాటల్లో నన్ను అమితంగా ఆకర్షించింది స్వాగతం కృష్ణా. లింకు https://www.youtube.com/watch?v=RBrBtdAGiNM. ఇది ఊత్తుక్కాడు వెంకట సుబ్బయ్యర్ రచన. ఇది నేను ఫేస్బుక్కులో పెడితే 60కి పైగా లైకులు, 19 వ్యాఖ్యలు వచ్చేయి. మరో 19 మంది షేర్ చేసేరంటే ఆలోచించండి ఆ గానమాధుర్యం ప్రతిభ. ఆ స్పందన చూసి నేను ఉబ్బి తబ్బిబ్బయిపోయేను. అందుకే ఇక్కడ కూడా మీతో పంచుకుందాం అని ఈ టపా రాస్తున్నాను.
ఈ టపాకోసం తరిచి తరిచి ఆలోచిస్తుంటే, నందిని రావు నన్ను అంత ఆకట్టుకోడానికి కారణం - మొట్టమొదట చెప్పుకోవలసింది ఆ కంఠమాధుర్యమే, ఆ పైన ఎత్తుగడ. ఏదో ఆలోచిస్తూ విడియో తెరిస్తే, ఎంత చెలువగె అంటూ పైస్థాయిలోఆ అమ్మాయి పాట అందుకునేసరికి మెదడులో అంతవరకూ ఉన్న ఆలోచనలన్నీ మూకఉమ్మడిగా చెల్లా చెదరయిపోయి, మనసు ఆ గానంమీదకి మళ్ళి అక్కడే నిలిచిపోతుంది. బహుశా ఇది లలిత శాస్త్రీయ సంగీతం స్థాయి అనుకోవచ్చు. తెలుగు సినిమాల్లో మల్లాది

రామకృష్ణశాస్త్రిగారివంటి కవులూ, బానుమతివంటి గాయకులూ ప్రవేశపెట్టిన శాస్త్రీయసంగీతంలాగానే.

వెనకటి టపాలో నేను మనసు బాగులేనప్పుడు మంచి సంగీతం ఆస్వాదించలేనని రాసేను. గతవారం నాకు చిరాగ్గా ఉన్నప్పుడు నందిని రావు పాడిన స్వాగతం కృష్ణా వింటే నామనసు స్థిమితపడి ఉల్లాసం పుంజుకుంది. ఇది చాలనుకుంటాను ఈఅమ్మాయి గానసామర్థ్యం తెలియజెప్పడానికి.

నందిని రావు ఆలాపన, స్వరప్రస్తారం వంటి ప్రక్రియలతో కచేరీ చేసేరో లేదో నాకు తెలీదు కానీ యూట్యూబులో మాత్రం లేవు. ఆమె సంగీతవైదుష్యాన్ని విమర్శించడానికి కావలసి సంగీత పరిజ్ఞానం నాకు లేదు.

పురందరదాసు కృతులు యం.యస్. సుబ్బలక్ష్మి, యం.యల్. వసంతకుమారి, రాధ జయలక్ష్మి వంటి ప్రసిద్ధగాయనీమణులు పాడినప్పుడు విన్నాను. చాలా బాగున్నాయని కూడా అనుకున్నాను. ఇప్పుడు మళ్ళీ నందిని రావు పాడిన రెండు పాటలు నన్ను చెప్పలేనంతగా ఆకర్షించేయి. అవి – రామమంత్రవ జపిసో, ఎంత చెలువగె. ఈసారి నాకు సాహిత్యం తెలుసుకునే అవకాశం కూడా లభించింది.

కన్నడ భాషా పరిజ్ఞానం చక్కగా గలిగిన జెజ్జాల కృష్ణ మోహన రావు గారు, లక్ష్మీ దేవి గారు ఈ రెండు కృతులకు అనువాదాలు చేసి ఇచ్చేరు. వారి సౌజన్యంతో ఆ అనువాదాలు, నందిని రావు గానానికి లింకులు ఇక్కడ మీకు అందిస్తున్నాను.

1. రామమంత్రవ జపిసో

లింకు - https://www.youtube.com/watch?v=_IKyd7P_ZA0

లక్ష్మీ దేవిగారి అనువాదం.

కాచే దైవం నీవే, కొలువ దైవం నీవే
కైవల్యఫలదాత కేశవుడు నీవే.
ఇంకే దైవంలోనూ ఈ వైభవం చూడలేదు

రావణాంతక స్వామి శ్రీ పురందరవిఠల!!

రామమంత్రము జపించరా, ఓ మనుజా! రామమంత్రము జపించరా!

ఆ మంత్రమీమంత్రము మెచ్చీవు (మెచ్చి+ఈవు) చెడబోకు

సోమశేఖరుడు తన భామకు చెప్పిన

రామమంత్రము జపించరా!

కులహీనుడైననూ ఎలుగెత్తి పలికే మంత్రం

అల వీధినైనా ఉచ్చరించు మంత్రం

పలు పాపముల అంతమొందించే మంత్రం

సులభముగ మోక్షము దోచేమంత్రము

జ్ఞాననిధి మన దాసులవారి

సానురాగపు నిత్య సేవామంత్రం

భానుకులాంబుధి సోము దలచు మన

దీనరక్షక పురందర విఠలుని మంత్రం.

(వేర్వేరు రూపాలు దొరుకుతున్నాయి ఈ పాటకు)

----

2. జెజ్జాల కృష్ణ మోహన రావు గారి అనువాదం ఎంత చలువెగె మగళను కొట్టను పాటకి

నందిని రావు గానానికి లింకు -

https://www.youtube.com/watch?v=EEAkDazrGRY

ప. ఎంథా చలువెగె మగళను కొట్టను

గిరిరాజను నోడమ్మమ్మా

అను. కంతుహర శివ చెలువనెన్నుత

మెచ్చిదను నోడమ్మమ్మా

ప. ఎంతటి చెలువుని కొసగెను పుత్రిని

గిరిరాయడు చూడమ్మమ్మా

అను. కంతుహరు డతి చెలువుడు శివుడని

మెచ్చెనుగ చూడమ్మమ్మా

చ-1. మోరె ఐదు మూరు కణ్ణు

విపరీతవ నోడమ్మమ్మా

కొరళొళు రుండ మాలె ధరిసిద

ఉరగభూషణన నోడమ్మమ్మా

ముఖము లైదు మూడు కనులు

విపరీతము చూడమ్మమ్మా

గళమున పుఱ్ఱె మాల దాల్చెను

ఉరగభూషణుని జూడమ్మమ్మా

చ-2. తలెయొందు నోడిదరె

జడె హోళెయుతిదె నోడమ్మమ్మా
హలవు కాలది తపిసి రుద్రన
మై బూదియ నోడమ్మమ్మా

శిరము సెదుట జూడగను
జడ కనబడెను జూడమ్మమ్మా
చాల కాలపు తపసి రుద్రుని
మెయి బూడిద చూడమ్మమ్మా

చ-3. భూతప్రేత పిశాచిగళెల్ల
పరిహారవు నోడమ్మమ్మా
ఈతన నామవ ఒందే మంగళ
ముప్పు హరన నోడమ్మమ్మా

భూతప్రేత పిశాచములెల్ల
పరిహారము చూడమ్మమ్మా
ఈతని నామ మొక్కటే మంగళ
మిచ్చు హరుని చూడమ్మా

చ-4. మనెయెంబుద స్మశానవు నోడె
గజచర్మాంబరవమ్మ
హణవొందాదరు కైయొళగిల్ల
కప్పరవను నోడమ్మమ్మా

గృహ మన్నది స్మశానమె చూడు
గజచర్మాంబరు డమ్మమ్మా
ధన మేదేనియు జేతుల లేదు
బిచ్చగాడె చూడమ్మమ్మా

చ-5. నందివాహన నీలకంఠన
నిర్గుణవ నోడమ్మమ్మా
ఇందిరె రమణం శ్రీ పురందర విఠలన
పొందిదవన నోడమ్మమ్మా

నందివాహను నీలకంఠుని
నిర్గుణము చూడమ్మమ్మా
ఇందిర రమణు శ్రీపురందర విఠలుని
పొందుకానిని జూడమ్మమ్మా

(విధేయుడు - జెజ్జాల కృష్ణ మోహన రావు)

గానం, గాయని, సాహిత్యం మీముందుంది. ఇంక నేను చెప్పడానికేముంది? మిగతా గాయకులలో నేను ప్రత్యేకంగా చెప్పుకునేది యస్. ఐశ్వర్య గానం. ముందు చెప్పేను కదా ఈ అమ్మాయి అమరగాయని షి యం.యస్. సుబ్బలక్ష్మిగారి మునిమనుమరాలు. నేను పని గట్టుకుని కొన్ని కీర్తనలు – మనవ్యాలకించరాదటే, సీతమ్మ మాయమ్మ - వరసగా ఒకటి తరవాత ఒకటి ఇద్దరి గానం విన్నాను వ్యత్యాసాలేమిటో గమనించడానికి. ఐశ్వర్యగానం వింటుంటే సుబ్బలక్ష్మిగారు చిన్నతనంలో ఇలాగే పాడేవారేమో అనిపించింది. సుబ్బలక్ష్మిగారి కంఠస్వరంలో

పరిణతి, ఐశ్వర్య గళంలో యౌవనధృతి. దేనికదే గొప్ప సౌందర్యం. ఐశ్వర్య కూడా ముత్తమ్మమ్మవలె అత్యంత భక్తితో పాడడం గమనించేను.

చిన్న విషయమే అయినా చెప్పాలనిపిస్తోంది. సాధారణంగా శాస్త్రీయసంగీతం గానం చేసే విద్వాంసులు అందరూ కూడా పాడుతున్నప్పుడు మధ్య మధ్యలో చేతులు జోడించి తమ వినయాన్ని ప్రకటించుకుంటారు. కొందరు పాట అయినతరవాత సభాసదులకు నమస్కారం చేస్తారు. అందుకు రవంత భిన్నంగా ఈ ఇద్దరు గాయనీమణులూ కూడా పాట మధ్యలో భగవంతుని పేరు వచ్చినప్పుడో, కృతికర్తపేరు వచ్చినప్పుడో (ఉదా. త్యాగరాజు, పురందరదాసు) వచ్చినప్పుడో చేతులు జోడించడం చేస్తే నామనసు ఆర్ద్రతతో చలించిపోయింది. ఆ క్షణంలో కేవలం కచేరీ చేసే విద్వాంసులే కాక భక్తిభావంతో సంగీతజలధిలో పరవశించి తలమునకలైపోయిన గానకళాస్వరూపాలే అనిపిస్తుంది.

ooo

(సెప్టెంబరు 13, 2015)

32. ఎందుకు మళ్లీ "ఎందుకు పారేస్తాను నాన్నా?"

ఈ కథమీద చర్చలతో తలవాచిపోతోందని నేనే సణుక్కున్నతరవాత మళ్ళీ నేనే ఎందుకు రాస్తున్నానంటే, ఈ నిరవధిక చర్చల, వ్యాసాల ధారవల్ల నాలాటి అర్భకులకు జరిగే అన్యాయం మనవి చేసుకోడానికి!

చానో గొప్ప కథకుడు అని సాహిత్యవేత్తలూ, సాహిత్యసారథులూ, ఇంకా అనేకరకాల ప్రముఖులూ ఏకగ్రీవంగా నొక్కి వక్కాణించడం జరిగింది, జరుగుతోంది, భవిష్యత్తులో కూడా ఇదే సాగుతూ పోడానికి ఈనాటి సా.వే.లూ, సా.సా.లూ తదితరులూ రంగం తయారు చేసి పెడుతున్నారు నిర్విరామంగా.

మరి నాబాధేమిటి అంటే ఒక కథనో ఒక రచయితనో ఒక కవినో సర్వకాల సర్వావస్థలయందూ పొగడుతూనో తెగడుతూనో అదే పనిగా ఊదర పెట్టేస్తే నావంటి సాధారణ పాఠకులకి ఉన్న కాస్త ఉత్సాహం కూడా ఉడిగిపోయి మాట తోచకుండా పోతుంది అని. ఆమీదట ఒక రకమైన వైముఖ్యం మనసులోనో తలలోనో చోటు చేసుకుని, మ్, ఏముందీకథలో అనిపించేలా చేస్తుంది. పునః పునః పీకి పాకాన పెట్టుటచేత ఆ పాకం నా బుర్రకెక్కకుండా పోతుంది.

కందిరీగలరొద మధ్య బుర్ర పని చేయనట్టే పైకథ తీసి చదవబోతే నాకు దిక్కు తోచలేదు. ఈ విషయమే అతి సర్వత్ర వర్జయేత్ అన్న శీర్షికతో ఫేస్బుక్ లో పెట్టేక కొందరు మిత్రులు సరళభాషలో నాకు అర్థమయేలా వివరించేరు. ఇది నాందీ ప్రస్తావన.

ఈ కథ నాకు తొలిసారిగా పరిచయం చేసినవారు శారద (ఆస్ట్రేలియా). 2007లో శారద ఈ కథని ఆంగ్లంలోకి అనువదించి తూలిక.నెట్ లో ప్రచురణకి పంపినప్పుడు తెలిసింది. (అనువాదం లింకు ఇక్కడ). నాకు బాగా జ్ఞాపకం లేదు కానీ ఆరోజుల్లో శారద నాకు ఈకథగురించి కొంచెం వివరించేరనుకుంటాను.

నిన్న మళ్ళీ ఈ కథ చదివేను. మంచి కథ. మంచికథ చదివేను అన్న అనుభూతి కలిగించిన కథ. కథలో పాత్రలు, సంభాషణలు చాలా కాలం గుర్తు పెట్టుకుంటాను. ఫేస్బుక్కులో నాటపాకింద ఎ.వి. రమణమూర్తిగారు ఈకథమీద వచ్చిన కొన్ని విశ్లేషణలు, చిన్న వ్యాఖ్యలతో నాకు అందించేరు. ఆ లింకులన్నీ ఈవ్యాసం చివర మీకు అందిస్తున్నాను రమణమూర్తిగారి సౌజన్యంతో.

ఆ వ్యాసాలు, వాటికింద వ్యాఖ్యలలో కూడా షరా మామూలే అన్నట్టు వైవిధ్యం ఉంది. అందులో ఆశ్చర్యం లేదు. పాఠకులస్పందన సాధారణంగా వారిమనస్తత్వం, పరిస్థితులు, అనుభవాలమీద ఆధారపడి ఉంటుంది కనక. కొందరికి కన్నీరు పిలిచిన పలుకు తల్లి. నెత్తిమీద నీళ్ళకుండ ఎల్లవేళలా సిద్ధమై ఉంటుంది. నాకు మాఅమ్మ పోయినప్పుడే ఏడుపు రాలేదు. ఏ కథ గానీ చదివేక ఏవిధమైన మనోవికారాలమాట అసలే లేదు. మంచి కథ అయితే మళ్ళీ మళ్ళీ తలుచుకుంటాను. వాటిలో కొన్ని వాక్యాలు కూడా గుర్తుండిపోతాయి. బహుశా వినేవాళ్ళుంటే చదవమని చెప్తానేమో కూడా. అంతే.

సోమయాజులుగారి కథలో పిల్లవాడికి చదువుకోవాలన్న కోరిక చిత్రణ, స్కూలు ఆవరణలో పిల్లల సంభాషణలు చాలా వాస్తవికంగా ఉన్నాయి. తల్లిదండ్రులు చదువుగురించి చర్చించుకుంటున్నప్పుడు ఆమాటలు వింటున్నవాడి మనస్తత్వం కూడా నైపుణ్యంతో ఆవిష్కరించేరు. పాఠకలోకాన్ని ఆకట్టుకున్న విషయాలివి. ఏ కథలోనైనా పిల్లలపాత్రలు ఆకర్షణీయమే. మధ్యతరగతి, దిగువతరగతి కుటుంబాల్లో పిల్లల చదువులగురించిన ఆందోళనలు సర్వసాధారణం. కథ చదువుతున్నంతసేపూ పాత్రలు కళ్ళకి కట్టినట్టు కనిపిస్తాయి. ఇవి చా.సో. నిస్సందేహంగా విమర్శకులనీ, పాఠకులనీ కూడా ఆకట్టుకున్న అంశాలు.

శాఖాచంక్రమణమే అయినా మరోవిషయం కూడా ప్రస్తావించాలి ఇక్కడ. ఈకథకి రాంబాబు ఆర్లె గారు గీసిన చిత్రం ఎంతో సహజంగా ఉంది. రాంబాబుగారు తూలిక.నెట్ లో ఈకథ అనువాదంకోసం ప్రత్యేకంగా గీసి చిత్రం ఇది. అరిపిరాల సత్యప్రసాద్ గారి

విశ్లేషణకి సారంగ.నెట్ లో వాడుకున్నారు. నాకు చెప్పకపోయినా, కనీసం చిత్రకారుడు ఆర్లె రాంబాబు గారికి క్రెడిట్ ఇవ్వలేదు. ఈసంగతి ఆవ్యాసందగ్గర నేను వ్యాఖ్యానించేను కూడా.

ముగింపు వాక్యం కథకి శీర్షిక అయిన ప్రశ్న "ఎందుకు పారేస్తాను నాన్నా?" మీద కూడా కొంత చర్చ జరిగింది. నిజానికి నాక్కూడా చాలా కాలం అర్థం కానిది ఆ శీర్షికమూలానే. ఇప్పుడు మళ్ళీ ఆ కథ చదివిన తరవాత నాకు తోచిన జవాబు – అది కేవలం మన కుటుంబాల్లో నిత్యం జరిగే చిన్న సంభాషణ అని. సాధారణంగా ఇద్దరు సంభాషించుకుంటున్నప్పుడు, ఒకరికి ఇబ్బంది అయిన మాట వస్తే వారు మాట తప్పిస్తారు. ఆ ఇద్దరిలో ఒకరు పెద్దవారు, రెండోవారు చిన్నవారు అయితే, పెద్దవారికి ఇది మరింత సౌకర్యం. పిల్లవాడికి స్కూల్ ఫీజు కట్టాలి. అది ఆయనబాధ్యత. వాడిభవిష్యత్తు దానిమీద ఆధారపడి ఉంది. ఆయనకేమో చుట్ట లేకపోతే పొద్దు గడవదు. చుట్ట తనకి ఉపశమనం కలిగిస్తుంది. తన ఉపశమనం ముఖ్యమా, పిల్లవాడిభవిష్యత్తు ముఖ్యమా, చుట్టా? చదువా? అని ప్రశ్నిస్తే పిల్లవాడి భవిష్యత్తే అంటారు ఎవరైనా. కానీ నిజజీవితంలో గబుక్కున ఆ ఆలోచన తోచదు. ఈ సంగతి ఆయన భార్యకిచ్చిన జవాబుల్లో కూడా కనిపిస్తుంది. స్కూలు ఆవరణలో పిల్లవాడు ఎదురు జవాబు చెప్పినప్పుడు ఆయనకి చూచాయగా అర్థమయింది ఆ సంగతి. అర్థమయినతరవాత వాడిని ఎలా సమాధానపరచాలో తోచలేదు. అంచేత చర్చని తనమీదనుండి పిల్లవాడిమీదకీ, వాడికిచ్చిన డబ్బుమీదకీ మరల్చే చిన్న కిటుకు ఆ ప్రశ్న. కొంతవరకూ కుత్సితం అని కూడా అనొచ్చు. ఈ కిటుకులూ, కుతంత్రాలూ ఆ వయసు పిల్లల అవగాహనలో ఉండవు. అంచేత ఆ పిల్లవాడు అమాయకంగా "ఎందుకు పారేస్తానూ?" అని తిరిగి ప్రశ్నించేడు. "అదేం ప్రశ్న? నేను పారేస్తానని ఎందుకనుకున్నావూ?" అన్న ధ్వని ఉంది ఆ ప్రశ్నలో.

ఈ కథలో సోమయాజులుగారు గొప్ప ఆర్థికసూత్రాన్ని ఆవిష్కరించేరా అంటే నాకు తెలీదు. నామటుకు నాకు ఏ సూత్రాలూ వల్లించుకోకపోయినా ఇది మంచి కథే.

రచయితే చెప్పేరు పాఠకులు రెండు వర్గాలనీ, ఆ రెండు వర్గాలూ ఆదరిస్తేనే అది మంచి కథ అనీ. ఇందులో సోమయాజులుగారు చెప్పిన మొదటి వర్గంలో ఉన్నాను నేను. పోతే సూత్రాలపరంగా ఈకథ ఈనాటి సమాజానికి వర్తించదు. ఈ కథాకాలంనాటికి చిన్నక్లాసులకి కూడా జీతం కట్టవలసి వచ్చేది. ఇప్పుడు అది లేదు. సిద్ధాంతాలు మాటాడాలంటే, ఈనాటి సమాజంలో పిల్లలచదువులకి ఆర్థికపరిస్థితులు ఆటంకం అయినసందర్భంలో కూడా దానికి కారణం స్కూలు ఫీజు కాదు. వారికి సమస్య కాలం. ఏ పూటకా పూట కూటికోసం పిల్లలని కూలిపనిలో పెట్టవలసివస్తోంది కనక స్కూలికి పంపరు. అంతే కాదు, స్కూలికి వెళ్ళిన పిల్లలకి ఎలాటి ఉద్యోగాలు దొరుకుతున్నాయి? తన్మూలంగా వారిళ్ళల్లో కొత్తగా వస్తున్న సమస్యలేమిటి? ఈనాటి సమాజానికి వర్తించే ప్రశ్నలు ఇవీ. నాదృష్టిలో చా.సో. రాసిన గొప్ప ఆర్థికసూత్రం వివరించే కథ అన్నది విశ్వవిద్యాలయాలలో యం.ఫిల్లులకీ డాక్టరేటులకీ పనికొస్తుంది కానీ ఈతరం యువతీయువకులకి కాదు. మరో రెండు తరాలు పోతే, చాసో, కొకు తప్ప మనకి వేరే రచయితలు లేరేమో అనుకునే ప్రమాదం కూడా ఉంది ఈ పునరుద్ఘాటన వ్యాసాలద్వారా.

కాగా ఇలా కొట్టినపిండే కొట్టుకుంటూ పోవడంవల్ల మనసాహిత్యచరిత్రకి కొత్తగా ఒరిగేదేమీ లేదు. భావితరాలకి సమగ్రమైన తెలుగు కథాసాహిత్య చరిత్ర తెలియజెప్పాలంటే మిగతా రచయితలనుగురించి, మిగతా కోణాలు కూడా ప్రస్తావించాలి.

ఉదాహరణకి పన్యాల రంగనాథరావు అంటే కొందరికి ఆయన తొలికప్పు కాఫీతో అందించే వార్తలు గుర్తు రావొచ్చు. ఆయన మంచి కథలు రాసేరని ఎంతమందికి తెలుసు? మీరు ఆర్థికసమస్యలు చర్చించదలుచుకుంటే "దరిద్రం" అని ఒక కథ రాసేరు రంగనాథరావుగారు. కథలో పిల్లలు లేరు కానీ దరిద్రం ఉంది. ఆర్థికంగా చితికిపోయిన భర్త మానసికక్షోభ అది. ఆయనే రాసిన మరో కథ "అంతస్తులు". చక్కని మనోవిశ్లేషణ కనిపిస్తుంది అందులో. ఇద్దరు మిత్రులగురించి రాసిన ఈ కథలో దుర్మార్గులు లేరు. ఆర్థికపరిస్థితులమూలంగా ఒకొకరిలో ఎలాటి ఆలోచనలు

ఆవిర్భవిస్తాయో ఎంతో ప్రతిభావంతంగా చిత్రించినకథ ఇది. జి.వి. కృష్ణరావుగారి "కీలుబొమ్మలు" నవలలో మానసికవిశ్లేషణ – ఒక వ్యక్తి అబద్ధం ఆడినతరవాత అదే నిజమని తనని తనే ఎలా నమ్మించుకుంటాడో - కృష్ణరావుగారు అద్భుతంగా చిత్రించేరు. ఈనవల "చివరిమిగిలేది" నవలకి తీసిపోదు శిల్పం దృష్ట్యా. ఎటొచ్చీ కృష్ణరావుగారి నవల కాంతాసమ్మితం కాదు. ఉద్వేగ్నత కలిగించే సన్నివేశాలు లేవు. ఆయనకి భజనసంఘాలు లేకపోవడం కూడా కారణం కావచ్చు ఆ నవలని గురించి మన పండితులు మాటాడకపోవడానికి. లత "గాలిపడగలూ నీటి బుడగలూ" మొత్తం సాహిత్యచరిత్రలోనే తొలిసారిగా వేశ్యలు అనుభవించే అమానుషహింసలు చిత్రించిన కథ. మాలతీ చందూర్ కథలన్నీ నాకు నచ్చవు కానీ ఆవిడ రాసిన "డాబా ఇల్లు" ఋణభ్రమణాలమీద బలమైన వ్యాఖ్యానం. అప్పు అప్పే. ఆ అప్పుకు నియమాలున్నాయి. సమయానికి తీర్చకపోతే ఋణదాత చట్టబద్ధంగానే ఇల్లు హక్కుభుక్తం చేసుకోవచ్చు. ఇది ఈనాటికీ వర్తించే నిత్యసత్యం. అలాగే పి. శ్రీదేవిగారి "వాళ్ళు పాడిన భూపాలరాగం" coming of age కథ. పి. సరళాదేవిగారి "ఎదురు చూసిన ముహూర్తం" స్త్రీ అస్తిత్వాన్ని ప్రశ్నించిన కథ. మునిపల్లె రాజుగారి "బోధివృక్ష ఛాయలో" మనిషికి ప్రకృతితో గల అనుబంధాన్ని చిత్రించిన కథ. "నిశ్శబ్దం" మనసంస్కృతిలో మౌనానికి గల ప్రముఖపాత్రని ప్రయోగాత్మకంగా ఆవిష్కరించిన కథ. చూడాలే కానీ వందలకొద్దీ కనిపిస్తాయి మనం సగర్వంగా చెప్పుకోదగ్గ కథలు తెలుగు సాహిత్యచరిత్రలో. ప్రధానంగా నేను చెప్పదలుచుకున్నది వెనకటి రచనలు మాటాడదలుచుకుంటే వస్తువైవిధ్యం కూడా గమనంలోకి తీసుకోవాలి. లేకపోతే చరిత్ర సమగ్రం కాదు.

కొసమెరుపుగా నేను ఈ సుప్రసిద్ధులయిన, ప్రజ్ఞావంతులయిన విమర్శకులనందరినీ అడుగుతున్న ప్రశ్న – 40వ దశకంలో కనుపర్తి వరలక్ష్మమ్మగారు "కథ ఎట్లా ఉండాలె?" అని ఒక కథ రాసేరు. అందులో ఆమె ఆనాటి విమర్శకులమీద ఘాటైన

విమర్శలే విసిరేరు. మీరు ఆ కథ చదివేరా? 40వ దశకంలో ఆమె లేవదీసిన ప్రశ్న 70 ఏళ్ళతరవాత ఈనాటికీ సత్యదూరం కాదని గమనించేరా?

000

(ఆగస్ట్ 17, 2015)

33. ఎదుగుట ఆగిపోయిందేమో అనిపించే క్షణాలు!

కొంతకాలం క్రితం నలుగురిమధ్య కూచుని మాటాడుతుండగా ఈ ఎదగడం మాట వచ్చింది. "కొందర్ని చూస్తే వాళ్ళు ఏ పదిహేనో ఏటో ఎదగడం మానేసేరేమో అనిపిస్తుంది," అన్నాను. ఎవరిగురించి మాటాడుకుంటున్నామా? ఇంకెవరు? మగాళ్ళమాటే. అప్పుడలా అన్నాను కానీ ఈమధ్య నాగురించే నాకు అనుమానం వస్తోంది. కొన్ని విషయాలు నాబుర్రకెక్కవు. కొన్ని ఎక్కించుకునే ఉద్దేశం నాకే లేదు. ఏతా వాతా నేను ఏ తొమ్మిదో ఏటో ఎదగడం మానేసేనేమో అనిపిస్తోంది.
నిన్న ఒక చిన్న అద్భుతం జరిగింది. అంటే నాప్రాణానికి అది అద్భుతమే. ఎందుకంటే అది జరిగేక నేను ఇంటికొచ్చేవరకూ దారిపొడుగునా నవ్వుకుంటూనే ఉన్నాను. ఇంకా చిన్నినవ్వు మిగిలే ఉంది ఇప్పటికీ.
చాలా చిన్నవిషయం చాలు నాకు పరమానందం కలిగించడానికి. నానిత్యసంచారంలో ఏ మొక్కదగ్గరో మోడుదగ్గరో నిలబడిపోయి నవ్వుకోగలను నేను. ఆ సమయంలో నన్ను చూసినవాళ్ళు నేను వాళ్ళని చూసే నవ్వుతున్నాననుకుని, ఆగి పలకరించి, నేను ఎందుకు నవ్వుతున్నానో అర్థం కాక, నాకు మతి స్థిమితం లేదేమో అనుకుని కాస్త దూరం జరిగి గబగబా వెళ్ళిపోయేవాళ్ళు కూడా ఉన్నారు. అప్పుడు జాలి పడుట అను "ఫీలింగు మ్యుచువలు" కూడా కావచ్చు. మరి ఆ ఊరికి ఈ ఊరు ఎంత దూరమో ఆ ఊరికి ఈ ఊరూ అంతే దూరం కదా! అసలామాటకొస్తే మీరు కూడా ఇలాటి సందర్భంలో అలాగే ప్రవర్తించవచ్చు. ఎవరైనా అనుకోవచ్చు పాపం ఈ మనిషికి మతి లేదు అని.
నిన్న మధ్యాన్నం ఏం జరిగిందంటే, నానిత్యసంచారంలో పైన చెప్పినట్టు ఓ ఇంటిదగ్గర ఆగి వారి కంచెమీదకి పాకిన ఓ లతనీ, ఆ లతనంటిపెట్టుకుని ఉన్న ఓ తీగెమీద

వరసగా దీపతోరణంలా వేలాడుతూ పచ్చ పచ్చగా మెరిసి పడి పోతున్న కాయలనీ చూస్తున్నాను.



.

అవి నాకు చూడ్డానికి అందంగా కనిపించేయి. బొమ్మ తీసుకోడానికి ఏ కోణం బాగుంటుందా అని కళ్ళు చికిలించి చూస్తున్నాను.
ఇంతలో హలో వినిపించి, ఉలికిపడి చుట్టూ చూసేను.
మూడో హలోకి తెలిసింది ఆ సుస్వరం ఎక్కడినించి వస్తోంది. కంచెకి అటువేపు ఆఇంటి మరియు పెరటి యజమాని. ఆయన అలా ప్రత్యక్షమవగానే నాకు కలిగిన మొదటి స్పందన – నేనేదో వారి కాయలు దొంగిలించేస్తున్నాను అనుకుంటున్నాడు కాబోలు అని. ఎవరిఆస్తి వారు వెయ్యికళ్ళతో కాపాడుకోడం ఈనాటి ధర్మమూ, నీతీ కూడా కదా. ఎప్పుడు కానీ తగువు కనుచూపుమేరలో కనిపిస్తే, దాన్ని ఛిద్రం చేయడానికి ఉత్తమపద్ధతి అమాయకంగా మొహం పెట్టేసి, ఇదేమిటి అని అడగడమే అని చాలాకాలం క్రితమే కనిపెట్టేసేను. నిజం చెప్పాలంటే పిల్లలందరికీ ఇది పుట్టుకతో వచ్చిన విద్య. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతకంటె ముందు ఇదే నేర్పేడు. మూతినిండా వెన్న పులుముకుని, నాకేం తెలీదు అన్నరోజునే ఈ ఆది పాఠం పుట్టింది. ఇలా ఆలోచిస్తుంటే నేను కూడా ఏ తొమ్మిదీ పదో వచ్చేసరికి ఎదగడం మానేసేననే అనిపిస్తోంది. అందుకే ఇప్పటికీ మీరెవరైనా ఏదైనా అడిగితే నాకు మొదట కొంటె సమాధానాలు వచ్చి, తరవాతే నిజసమాధానాలు వస్తాయి.
సరే, మళ్ళీ మొదటిపేజీకి వస్తాను.
నిన్న మధ్యాన్నం నా సంచారసమయంలో – ఆ హలోవక్త ఉన్న స్థలం నేను గుర్తించేక, అది వారిఇల్లు అని విదితమయినతరవాత, నేను చేయగలగింది ఒకటే. అమాయకంగా

మొహం పెట్టేసి, "ఇవేమిటి?" అని ఆయన్ని మరోవిషయం మాటాడనీయకుండా చేయడం.
అదే చేసేను ఆ లతవేపు చూస్తూ.
అవి passion fruit అని చెప్పి "కోసుకో కావలిసినన్ని" అన్నాడు.
నేను ఆశ్చర్యపోయేను. "చెట్టుమీద చెయ్యేస్తే పళ్లు రాల్తాయి" అనే తప్ప "తీసుకో, తీసుకో" అనడం విని కొన్ని దశాబ్దాలు అయింది.
"చూడ్డానికి బాగున్నాయి క్రిస్మస్ దీపాల్లా. తింటారా?" అన్నాను.
"తినొచ్చు. గింజలుంటాయి. తీసుకో," అన్నాడు మళ్ళీ.
నేను ఒక కాయ తీసుకుని చూస్తానని చెప్పి, బొమ్మ కూడా తీసుకుని నవ్వుకుంటూ వస్తున్నాను. నవ్వెందుకా? నాకు తెలీదు. అలాటి సందర్భాల్లో నా మొహమ్మీద నవ్వు ఒక అసంకల్ప ప్రతీకారచర్య.
నేను అవ్విధమున ఒక చేతిలో కెమెరాతోనూ, రెండో చేతిలో ఒక passion పండుతోనూ నవ్వుకుంటూ నడుస్తుండగా నాకు ఎదురుగా మరొకావిడ వస్తూ కనిపించింది. మీకు తెలుసు కదా అమెరికాలో వీధుల్లో నడిచేవారు చాలా చాలా తక్కువ. నడిచేవాళ్ళని చూసి మెచ్చుకునేవాళ్ళు ఎక్కువ. నడవడం అపురూపం కనక, అలా నడిచేవారు ఒకరికొకరు హలోలు చెప్పుకుంటూ పోతారు. ఒకొకప్పుడు నామొహం చూసి నమస్తే కూడా చెప్తారు.
అలా నాకు ఎదురైన ఒక జవరాలు హలో అంది దూరం నించే. నేను నావంతు హలో చెప్పేను. ఆవిడ ఇంకొంచెం దగ్గరకొచ్చేక మళ్ళీ "అంత పెద్ద నవ్వు ..." అంది చేతులు గాలిలోకి విసిరి ఎంత పెద్ద నవ్వో అభినయం చేస్తూ.
"నేనెందుకు నవ్వుతున్నానంటే అక్కడ ఓ పెద్దమనిషి .." అంటూ చెప్పబోయేను చేతిలో పండు చూపుతూ.
నా నోట్లో మాట నోట్లో ఉండగానే, "తీసుకో నీకు కావలిసినన్ని. అది మాయిల్లే." అంది.

నాకు ఇంకా నవ్వొచ్చింది. ఓయ్ బాబోయ్ అనుకుంటున్నా. "తీసుకో. గులాబీలు కూడా ఉన్నాయి. కావలిసినన్ని కోసుకో," అంది మళ్ళీ.

మీలో ఎంతమందికి తెలుసో నాకు తెలీదు కానీ అమెరికాలో గులాబీలు చాలా చాలా ఖరీదు. ఎవరైనా ఎవరికైనా నాలుగు గులాబీలు ఇచ్చేరంటే ఇచ్చివారికి ఇవ్వబడినవారంటే ఇబ్బడి ముబ్బడి ప్రేమ ఉన్నట్టు లెఖ్ఖ (భర్త భార్యకి డజను "రోజులు" తెచ్చేడంటే అంతకుముందు ఏదో క్షమించరాని నేరం చేసి ఉండొచ్చు).

మరి గులాబీలు ఉచితంగా కోసేసుకో అంటే ఆశ్చర్యం కాదూ?

అలా నాకు ఇల్లూ పెరడు లేకపోయినా, పెరట్లో పళ్ళూ, పువ్వులూ లేకపోయినా, అక్షరాలా కొమ్మనుండి తాజా తాజాగా కోసుకోగల అవకాశం వచ్చేసింది. ఇది చాలదూ గుండెలనిండా నవ్వు నింపేసుకు పొంగిపోడానికి?

అవున్నాకు తెల్సు. చాలామంది పెద్దవాళ్ళకి నవ్వు రాకపోవచ్చు. అలా నవ్వడం సిల్లీగా కూడా ఉండొచ్చు :(

ఇప్పుడు మీకు నాప్రశ్న ఒక్కటే – మీరెప్పుడు ఎదగడం మానేసేరో మీకు తెలుసా?

000

(సెప్టెంబరు 28, 2015)

33. నిరవధిక చిరునవ్వు కష్టతరము!

"నిరవధిక చిరునవ్వు కష్టతరము!"

ఇది నా ప్రవచనం కాదు. 1953లో రెండవ ఎలిజబెత్ పట్టాభిషేకం సందర్భంలో అన్నారని విన్నాను. అది నాకు ఇప్పటికీ గుర్తుంది. ఎందుకు కష్టమో కూడా ఆవిడే చెప్పేరు. పట్టాభిషేకం మహోత్సవం అంటే రోజంతా కొన్ని లక్షల ప్రజలు ఆవిడని చుట్టముట్టేసి ఉంటారు. అంటే అన్నిజతల కళ్లు, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, ఆ ప్రజావాహిని సంఖ్యకి రెట్టింపు సంఖ్యలో కళ్ళు ఆవిడమీద కేంద్రీకృతమయి ఉంటాయి. అంతసేపూ ఆవిడ మొహంమీద నవ్వు చెక్కు చెదరరాదు. ఆ మందహాసం ఏమాత్రం చెదిరినా, వెంటనే పక్కనున్నవారు కళవళి పడిపోతారు. "ఏమైందేమైందేమైంది? రాణీగారికి ఎందుకు కోపం వచ్చింది? అంటూ తొక్కిసలాడుతూ ఆమెమోమున మళ్ళీ ఆ మందహాసం పునఃప్రతిష్ఠ చేయడానికి ఆరాటపడిపోతారు.

దూరంగా ఉన్నవారికి ఆ "నవ్వు వెలిసిన మొహము" కనిపించకపోవచ్చు, కానీ దగ్గర ఉన్నవారు ఆ "నవ్వు లేని మోము" చూసి కంగారు పడినందున మిగతా జనసందోహం ఆ దగ్గరున్నవారి కంగారు చూసి, ఏం జరిగిందో తెలీక మరింత కంగారు పడతారు. అలా కంగారుమీద కంగారు పడుతూ పడుతూ లేస్తూండడంచేత మొత్తం ప్రదర్శనంతా కంగాళీ అయిపోతుంది. అదన్నమాట మహా రాణీగారి బాధ!

ఆ క్షణంలో, "ఏమీ లేదూ, అలా ఆపకుండా నవ్వు నిలబెట్టి ఉంచుటచేత చెంపలు పీకుతున్నాయి" అని చెప్పడం ఆవిడకి సాధ్యం కాదనే అనుకుంటున్నాను.

మీలో ఎంతమందికి తెలుసోనాకు తెలీదు కానీ నిజానికి అది – అంటే అలా "నెమ్మోమున ఎడ తెగని చిరుహాసము నిలుపుట" చాలా కష్టం. అది నెత్తిమీద నీళ్ళకుండ నిలపడం కంటె ఎక్కువ కష్టం. పల్లెపడుచులు నీళ్ళకుండలో కూరల తట్టలో

నెత్తిన పెట్టుకుని విలాసంగా చేతులూపుకుంటూ చులాగ్గా మైళ్ళకి మైళ్ళు నడిచి పోవడం చూసేను కానీ రోజంతా చిరునవ్వు మొహాన అమ్మవారి ఆలయంలో నిశ్చలదివ్వెవలె వెలయించి నిలబెట్టినవారిని చూడలేదు. కారణాలు అడగండి, చెప్తాను. సుమారుగా నాకు తెలిసినవి ఇవి -

1. చెంపలు పీకుతాయని ముందే చెప్పుకున్నాం కదా.

2. ఏదో కనిపించి మరేదో ఆలోచన వచ్చి నవ్వడం మరిచిపోతాం.

3. ఎవరైనా తమ కష్టాలు వెళ్ళబోసుకుంటుంటే వారికి ఓదార్పుగా నవ్వు మాని విచారమో జాలో చూపవలసిన అగత్యం ఏర్పడుతుంది.

4. ఇవేవీ కాని, నేను ఊహించలేని మరేదో జరుగుతుంది.

ఇహ ప్రస్తుతానికి వస్తే, నామటుకు నాకు, నేను మహారాజ్ఞిని కాకపోయినా, నాకు ఏ పట్టాభిషేకమూ జరక్కపోయినా, "సదానంద మొహం" కుదరదు.

ఇక్కడ మీకు మరో రహస్యం చెప్పాలి. నేనున్న వాటాలో అద్దాలు కొంచెం ఎక్కువే. ఒక గోడంతా నిలువుటద్దమే! అది నేను కోరీ వేడీ పెట్టించుకున్నది కాదు. అది ఇల్లు కట్టించినవారి మేధోవిలాసం. ఆధునికయుగంలో "కనిపించడానికి" ఉన్న విలువ ఇంతా అంతా కాదని చెప్పడానికి ఇంత కన్న ఋజువు అక్కర్లేదు నన్నడిగితే. ఎటు తిరిగినా ఎలా ఉన్నావో చూసుకోమంటూ ఈ దిక్కు మాలిన అద్దాలు. అద్దం అంటే ఆదర్శం అని అర్థం ఉంది కానీ నాకు అలాటి తలపు కలిగే సమయం కాదిది.

ఇంతకీ జరుగుతున్నదేమిటంటే ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు నాకు నేను కనిపిస్తుంటాను. ఈ కొంపలో చేరిన కొత్తలో అయితే గదిలో మరో మనిషి ఉందనుకుని ఉలికిపడుతూ వచ్చేను కూడా. దరిమిలా అది నేనే అని అర్థం చేసుకున్న తరవాత, ఎలా "కనిపిస్తున్నాను" అని చూసుకున్నాను. ఆశ్చర్యం! నేను నిన్నా మొన్నా తీసుకున్న బొమ్మల్లోలా లేను. చిరునవ్వులు, దరహాసాలు లేవు. చుట్టపక్కల ఎవరూ లేనప్పుడు, ఏదో ఆలోచనల్లో పడిపోయినప్పుడు, లేదా ఋర్ర

పూర్తిగా ఖాళీ అయిపోయినప్పుడు ఇలా ఉండుదును అని జ్ఞానోదయమయింది అప్పుడే!

ఇది మీరు కూడా చేయొచ్చు. మీ ముఖాన్ని మీరు పరీక్షకి పెట్టి చూసుకోండి. ఇంటినిండా అద్దాలు ఉండక్కర్లేదు. ఈరోజుల్లో ఏ బజారుకెళ్ళినా అద్దాలగోడలు, అద్దాల బీరువాలు ... ఎక్కడ చూసినా అద్దాలే అద్దాలు – "ఎక్కడ చూసినా నువ్వే" కథలోలాగ. అంచేత ఎటు తిరిగినా మీ వదనం మీకు దర్శనమవుతుంది. అప్పుడు మీ మోము ఎలా ఉంది? లాటరీలో లక్ష గెల్చుకున్నట్టు అమందానందంతో వెలిగిపోతోందా? దారి తప్పిన పిల్లాడిమొహంలాగానో, లక్ష రూపాయిలా లాటరీలో వచ్చిన టికెట్టు మీది కాదని తెలిసిన క్షణంలోలాగానో కనిపిస్తోందా? ఇంతెందుకు గానీ , ఒక్క మాటలో ముఖ పరీక్షకి తిరుగు లేని ఆదర్శం ఇది.

నలుగురిమధ్య ఉన్నప్పుడు నవ్వుతూ తుళ్ళుతూ కనిపించడం సాధారణమే. కొందరయితే తమ కళ్ళల్లో నవ్వులు వెలిగించి మనల్ని అలరిస్తారు. వారిని "పుట్టు నవ్వుల"వారు అనొచ్చు. కొందరికి పళ్ళు రవంత ఎత్తయి, చిరునవ్వులు చిందిస్తున్న భ్రమ కలిగిస్తాయి ఆ మొహం తాలూకు మెదడు ప్రత్యేకించి చేసిన ఏర్పాటేమీ లేకపోయినా. దానికి ప్రతి అంటే ప్రత్యామ్నాయంగా పళ్ళు కనిపించకుండా పెదిమలు బిగిస్తే, మూతి ముడుచుకున్నట్టు కనిపించి "వీరికి కోపం సర్వసాధారణం కానోపు" అనిపించొచ్చు. కొందరు మాత్రం, మొహమంతా నవ్వు చేసుకుని, "పుట్టు స్మితులు" (స్మితము స్వతస్సిద్ధంగా పుట్టుకతోనే గలవారు) అయినట్టు కనిపిస్తుంటారు సదా. అలాటి అదృష్టవంతులు అరుదు.

నాతరంవరకూ ఈ ఫొటోల మేళా లేదు. ఊరికో ఫొటోగ్రాఫరుంటే గొప్ప. ఏదో ప్రత్యేకమైన సందర్భంలో ఆ "బొమ్మ పెట్టి" నిపుణుడిని పిలిపించి కుటుంబం హోల్మొత్తం ఏ పదేళ్ళకో ఓ మారు ఫొటో దిగేవారు. అప్పట్లో "సే ఛీజు"లు లేవు సరి కదా ఎవరైనా నవ్వు ప్రదర్శిస్తే, పళ్ళు కనిపిస్తే, "టూత్ పేస్ట్ ప్రకటన" అని వెక్కిరించేవాళ్ళు మిగతావాళ్ళు.

నామాట నమ్మకపోతే, మీ పెద్దల పాతకాలపు ఫొటోలు తీసి చూడండి. అసలు అప్పట్లో బొమ్మ తీస్తే చిక్కిపోతారన్న భయం కూడా ఉండేది. అప్పుడు చేతి సెల్లులన్నమాటే లేదు సరి కదా ఈ పాయింటెన్షూటు పెట్టె కూడా అపురూపమే. తీసిన లేదా తీయబడిన ఏ బొమ్మ చూసినా "గంభీరంగారావు" లై కనిపిస్తుండేవారు ఆరోజుల్లో!

ఇంతకీ ఇదంతా ఎందుకు మొదలు పెట్టేనంటే కిందటివారం అందరూ సెల్ఫీలు తీసుకుంటున్న నేపథ్యంలో నాక్కూడా ఓ సెల్ఫీ తీసుకుందాం అని సరదా పుట్టింది. నాకు ఐఫోనూ లేదు, ఐపాడూ లేదు. అసలు ఏ పాడూ లేదు. నాకున్న పాతకాలపు పాయింటెన్షూటు కెమెరాతోనే తీసుకోవాలి. ఎలా తీసుకోవాలా అని ఆలోచిస్తూ ఓ నొక్కు నొక్కేను. ఆ తరవాత మరో నొక్కు, మళ్ళీ మరోటీ ... బేటరీ ఆరిపోయేవరకూ చేసేను. తీరా చూస్తే చాలా బొమ్మల్లో కింద గచ్చూ, మీద చూరూ, ఆ పక్క కుర్చీ, ఈ పక్క టీవీ ... ఇలా చాలా బొమ్మలే వచ్చేయి. అవన్నీ నా మొహాలు కావని తెలియడానికి అట్టే కాలం పట్టలేదు. మళ్ళీ బేటరీకి బలము కూర్చి, రెండో వరస తీసేను.

ఆ గందరగోళం మధ్య వచ్చిన ఒక బొమ్మ రోజు మా అద్దాలవాటాలో కనిపించే మొహంలా ఉంది. నిజానికి ఇదే రోజులో ఎక్కువసేపు నాకు కనిపించే మొహం కనక ఇదే "నిజ నేను" అని తెలుసుకొనిన దాననై, నా నిజాయితీని నిరూపించుకోడానికి ఫేస్బుక్కులో పెట్టేను.

అక్కడ అందరూ నా ప్రాణమిత్రులు కనక, వారికి నా నిజస్వరూపం తెలియజేయడం నా విధ్యుక్తధర్మం అని పెట్టేను.

అదే ఊపులోనే సరయుకి కూడా పంపేను "సెల్ఫీ తీసుకున్నానోచ్" అని సగర్వంగా. నేను కూడా ఆధునికయుగం చేరుకున్నాను అని ఆ పిల్లకి తెలియజేయడం కూడా నా విధ్యక్తధర్మమే అనిపించినందున. ఆ పిల్ల మాత్రం అలా అనుకోలేదు. "బొమ్మ బాగుంది. కానీ ఎందుకంత కోపంగా ఉన్నావు?" అని తిరుగుటపాలో ప్రశ్న పంపింది.

"అది కోపమోము కాదు, నా ఆలోచనామోము," అని తిరుగుతిరుగు మెయిలిచ్చేను.

హాహాహహాహ అని మళ్ళీ మెయిలు. ఆ అధ్యాయం అలా ముగిసింది. మొత్తమ్మీద నాకు అర్థమయిందేమిటంటే మారోజుల్లో మొహంలో ఏ భావమూ కనిపించకపోతే, "ఏమిటాలోచిస్తున్నావు?" అనేవాళ్లం. ఇప్పుడు, "ఎందుకంత కోపం?" అంటున్నారు. "ముఖము చదువుట"లో మనం సాధించిన ప్రగతి అనుకుంటానిది.

ఇక్కడే మరో పిట్టకథ కూడా చెప్పాలనిపిస్తోంది. కింద ఇచ్చిన బొమ్మల్లో మొదటి బొమ్మ చూడండి. అది నవ్వుమొహం కదా. అది కూడా నా డొక్కుకెమెరాతో తీసుకున్నదే. అది చూసి సరయు చాలా ఆనందించేసి, తన స్నేహితులతో పంచుకుంది. నాకథకి సంబంధించింతవరకూ ఆ పంచుకోలుకి పెట్టిన వాక్కులే గమనార్హం. మేకప్పు లేదంది. అదేం వింత కాదు కానీ తరవాతి మాట చూసి ఉలిక్కిపడ్డాను. "no Botox"! ... నాకు బొటాక్స్ అంటే ఏమిటో తెలీదనీ కాదు, నేనెప్పుడూ వినలేదనీ కాదు నేను ఉలిక్కి పడడం. తెల్లారి లేస్తే టీవీనిండా అవే కదా ప్రకటనలు. నాకు ఆశ్చర్యం కలిగించింది నావిషయంలో మనవాళ్ళవిషయంలో ఇలాటి తలుపు ఎవరికొస్తుందని. మళ్లీ నాకు నేనే జవాబిచ్చుకున్నాను - ఆపిల్ల ఉన్న రంగం అలాటిది కనక అని. పుట్టు అందానికున్న విలువ పెట్టు అందానికి లేదు అనేది మాఅమ్మ. నేను ఆ వాతావరణంలో పెరిగేను మరి.

ఇప్పుడు మీకు నేనొక సలహా ఇస్తాను. ఇది ఉచితం. మీరేం చెయ్యాలంటే, ఒకమారు అద్దంముందు నిలబడి మీకు ఎన్ని మొహాలున్నాయో చూసుకోండి. ఇలా అప్పుడప్పుడు చేస్తూ ఉండడం ఆరోగ్యానికి మంచిది.

000

(అక్టోబరు 12, 2015)

34. మహావీరచక్ర అనుభవం మళ్ళీ

పాతికేళ్ళకిందట రక్షకభటుడొకడు నాకారు వెంట బడ్డాడని ఏడేళ్ళకిందట రాసేను, మీలో కొందరికైనా జ్ఞాపకం ఉండే ఉండాలి. మళ్లీ ఆ అదృష్టం నిన్న కలిగింది.

అసలు నేను ఇక్కడికొచ్చేక కారు చోదకక్రియ మానీసేను. కారణాలు రెండో మూడో ఉన్నాయి కానీ ప్రధానకారణం మాఅమ్మాయిని ఉపయోగించుకోడమే. నేను మాయింటి చుట్టుపట్ల 6మైళ్ళ పరిధిలో కూరా కాయా పాలూ గట్రా తెచ్చుకోడానికి మాత్రమే కారు తీస్తాను.

నిన్న అలాగే బయల్దేరేను. పంచాంగం చూసుకోలేదు నేను బయల్దేరినవేళ వర్జ్యం అదీ ఏమైనా ఉందేమో అని. వీధి మలుపు తిరిగేనో లేదో పొలోమంటు ఎరుపూ నీలం రంగుల దీపాలు ఝళిపిస్తూ కాపు కారు నావెంట బడింది. మొదట నాకోసమే వేంచేస్తున్నారు రాజభటులు అని నేను గ్రహించలేదు. అలాటి కార్లకి మనం తప్పుకోవాలి అన్న నిబంధననుసరించి పక్కకి తప్పుకున్నాను. ఆ రక్షకభటుడు నాకోసమే ఆ దీపతోరణాలు అని తెలియజేస్తూ నావెనకే తనకారు ఆపేడు.

నాకు కాళ్లలో రక్తం గుండెలకీ, గుండెలనుండీ తలకీ ఎగసి తన్నింది. ఇదేం ఖర్మరా, నేను స్పీడు లిమిటు దాటలేదు, ఎడమవైపుకి తిరుగుతున్నాన్ని సౌంజ్ఞ చేసి, వెళ్ళు అని పచ్చబాణం అనుమతిచ్చిన తరవాతే తిరిగేను కదా అని చూస్తున్నాను.

ఆ శిక్షకభటుడు తీరిగ్గా మూడు నిముషాలతరవాత వచ్చి, తన పేరు చెప్పుకుని, "నిన్నెందుకు ఆపేనో తెలుసా?" అన్నాడు.

తెలీదన్నాను.

"నీకారు వెనక ఎడమవైపు దీపం ఆరిపోయింది, తెలుసా?"

"తెలీదు."

"సరే. నీ డ్రైవింగ్ లైసెన్సు చూపించు."

తీసి ఇచ్చేను.

ఇన్సూరెన్సు ఉందా?

ఉంది. తీసిచ్చేను.

"ఇక్కడే ఉండు," అని ఆ రెండు కార్డులు తీసుకుని వెళ్ళిపోయేడు. కొన్ని యుగాలయేక, మరో అమ్మాయి వచ్చి, నాకార్డులు నాకిచ్చి, "నిన్నెందుకు ఆపేమో తెలుసా?"

రెడ్లొచ్చే మొదలాడు. అదయేక, "ఇదుగో. ఇది వార్నింగు. నువ్వు కోర్టుకెళ్ళక్కర్లేదు. తప్పు ఇచ్చుకోనక్కర్లేదు," అంది ఆవిడ రాసిన టికెట్టు నాకు ప్రేమగా అందిస్తూ.

"అది నా రికార్డెక్కుతుందా?" అనడిగేను. నాకు ఇలాటివి అట్టే అలవాటు లేవు మరి. పైగా నిన్ననే నా ఇంసూరెన్సు కంపెనీ నా ఉత్తమ కారుచోదక రికార్డుని అభినందిస్తూ ప్రీమియము తగ్గిస్తున్నట్టు తెలియజేసింది.

"లేదు. నీ రికార్డులోకి ఎక్కదు. ఊరికే వార్నింగు ఇచ్చేం అంతే. ఆ దీపం మరామత్తు చేయించు," అని నాకు ధైర్యం చెప్పి వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయి అందించిన కాయితం చూసేను. దానిమీద పెద్దక్షరాలతో Traffic Violation Notification అని ఉంది. ఆ మూడు ముక్కల్లో మధ్య ముక్క నాకు ముల్లులా గుచ్చుకుంది.

నా తప్పు లేకపోతే, నారికార్డులోకి ఎక్కకపోతే ఆ కాయితమ్ముక్క మాత్రం ఎందుకూ? ఎందుకంటే వాళ్ళ రికార్డులో రాసుకోడానికి. వాళ్ళు ఎన్ని తాంబూలాలిస్తే అంత ఘనంగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నట్టుట.

మీకు గుర్తు లేకపోతే నా పూర్వానుభవం, మహా వీర చక్ర ఇక్కడ చూడండి.

ooo

(నవంబరు 8, 2015)

35. అరటి చెట్టు

కిందటివారం చైనా ప్రభుత్వం "ఒక్క బిడ్డని మాత్రమే కనాలి చట్టం" సడలించి, "ఇవాళ్టినించీ మీరు ఇద్దరు బిడ్డలని కనుక్కోండి," అంటూ సవరణ ప్రకటించేరన్న వార్త విన్నతరవాత నాకు ఆలోచనలు అనేకం కలిగేయి. అవేమిటో చెప్తాను.

ఆ ఒక్క బిడ్డ మాత్రమే మాత్రమే కనుక్కోండి అన్నరోజుల్లో మరి కవలలు పుడితే ఒక బిడ్డని మాత్రమే బతికి బట్ట కట్టడానికి అనుమతించేరా? అయే ఉంటుంది. ఏ బిడ్డ బతకొచ్చో ఎలా నిర్ణయించేరు? ఏమో మరి! ఆ ప్రభువులకే తెలియాలి.

బిడ్డలు భగవత్ప్రసాదం అనుకునేరోజులు పోయేయి. చైనాలో ప్రభువులదయ. భారతదేశంలో దంపతులే (ఒకొకప్పుడు భర్త మాత్రమే) కర్తా, కర్మా కూడా కావచ్చు. మనదేశంలోనూ గవుర్నమెంటోరు ఏవో త్రికోణపాటలు పాడేరు కానీ అవి చట్టబద్ధం కాలేదనుకుంటాను. కేవలం అదొక ఉచిత సలహా మాత్రమే.

ప్రస్తుతానికి మనం ఎన్నుకున్న నాయకులు మనకి గరపే బుద్ధులమాట అలా ఉంచి, పెరట్లో పెరిగే పచ్చని అరటిమొక్కగురించి మాటాడుకుందాం. నామటుకు నాకు అరటి మొక్క చాలా అందంగా కనిపిస్తుంది. అరటి చెట్టు, మిగతా చెట్లలా కరుగ్గానూ మట్టిరంగులోనూ ఉండదు. బోదె అంతా లేతఆకుపచ్చరంగు నారే అయినా దిట్టంగానే ఉండే నార. ఆకులు పెడదకనులలా విచ్చుకుని విలాసంగా గాలిలో ఊయ్యాలలూగుతూ దరి చేరినవారికి వింజామరలు వీస్తుంటాయి. ఆకులమధ్యలోంచి కరవాలంలాగ పొడుచుకొచ్చి సుతారంగా ఒంగిన గెలా, దాని కొనల ఊదారంగు పువ్వుతో నిండుగా హుందాగా ముచ్చటగా పండు ముత్తైదువలా కనిపిస్తుంది.



అరటి చెట్టుకి అట్టే సేవలు అక్కర్లేదు. మాయింట్లో స్నానాలగది గోడనానుకుని ఉండేవి రెండు చెట్లు. మా స్నానాలతో వాటికి నీళ్ళు పెట్టడం అయిపోయేది. అప్పాయమ్మ గిన్నెలు కడగడం కూడా అక్కడే.



అరటిమొక్క కనీసం ఒకటైనా ఇంట్లో ఉండాలంటూ మాతాతగారు చెప్పిన కారణం మాఅమ్మ మాటల్లో, "ఇల్లు అన్న తరవాత పూజకోసం పువ్వులుండాలి. అభ్యాగతులు (పిలుపులూ, రావచ్చా అంటూ అనుమతి కోరడాలూ లేకుండా అకస్మాత్తుగా వాకిట్లో ప్రత్యక్షమయే చుట్టాలు, స్నేహితులు) వచ్చినప్పుడు కూరకి తడుముకోకుండా, చెట్టు కాయొహటి కోసి కూరొండి పెట్టడానికి అరటి మొక్క ఉండాలి. విస్తరాకుకి తడుముకోకుండా అరటి ఆకు ఉంటుంది," అనిట. మీకు తెలుసా అరటిపండుని రంభాఫలం అంటారు. అరటిచెట్టుని రంభావృక్షము అంటారు.

నాకు అట్టే నచ్చని జనవాక్యం ఒకటి కూడా ఆ రోజుల్లోనే విన్నాను. అరటిచెట్టుని ఒంటి గొడ్రాలు అంటారు. ఒంటి గొడ్రాలు అన్న సుజనవాక్కుకి కారణం అరటిచెట్టు ఒక్క గెల మాత్రమే వేయడం. దీనికి అనుబంధమేమో అనిపించే మరో జనవాక్యం " ఒక్క కన్ను కన్నూ కాదు, ఒక్క కొడుకు కొడుకూ కాడు" అని. కొడుకులు వంశోద్ధారకులు కనక, ఆ ఉన్న ఒక్క కొడుకుకూ ఏమైనా అయితే, ఏమైనా ఏమిటిలెండి చస్తే అని, వంశోద్ధారణ జరిగే అవకాశాలు మన్ను కొట్టుకుపోతాయని వారి బాధ. మరి ఆ పుట్టిన ఒక్క బిడ్డా ఆడపిల్ల అయితే, ఇహ చెప్పక్కర్లేదు కాబోలు. ఇంతకీ ఈ నానుడులు కారణంగానే ఉదయం లేస్తూనే అరటి చెట్టు చూడకూడదని, గుమ్మాలకి ఎదురుగా

అరటిమొక్కలు నాటరు అని కూడా మాఅమ్మదగ్గరే విన్నాను. అలా అంటారు కానీ పెళ్ళిళ్ళలోనూ, ఇతర శుభకార్యాల్లోనూ అరటిచెట్టు మొత్తం సహా తెచ్చిపందిళ్లలో స్తంభాలకి జత చేస్తారు.

మరి నాకు నచ్చిన మరో ఉపమానం చెప్పకుండా ఈ పేరా ముగించలేను. ఇది సామెత అవునో, దీవెన అవునో నాకు తెలీదు కానీ "అరటిపిలకల్లా ఇంటినిండా కలకల్లాడుతూ పిల్లలు" అన్న వాక్యం విన్నాను. ఈ చెట్టుకి అంటు కట్టడం, విత్తులు నాటడంవంటి సేవలేమీ అవసరం లేదు. అరటిమొదలు పిలకలేసి దానికదే పెంచేసుకుంటుంది సంతానం. అందువల్లనే వచ్చిఉండొచ్చు పై మాట.

అసలు అరటి మొక్కలో దాదాపు అన్ని భాగాలూ పనికొచ్చేవే. కాయ, పువ్వు, ఆకులు, దొప్పలు అన్నీ ఏదో విధంగా వాడుకునేవే. అరటి బోదె ఉల్లిపాయలా పొరలు పొరలుగా – అంత సుకుమారం కాదులెండి – ఒలిచి, మూరెడు ముక్కలుగా తరిగి, ఆ దొప్పల్లో సంపెంగపూలు పొట్లాలు కట్టి అమ్ముతారు. ఆ దొప్పలో తేమమూలాన పువ్వులు చాలాసేపు వాడకుండా తాజా తాజాగా కళకళల్లాడుతూనూ ఘుమఘుమలాడుతూనూ ఉంటాయి. అసలు ఆంధ్రభారతిలో పొట్లము అంటే అర్థం ఏం ఇచ్చేరో చూడండి - పువ్వులు మొదలుగువానిని ఆకులు లోనగువానియందుంచి మడిచిన మడుపు అని. ఆ పొట్లాలు చల్లగా చూడ్డానికి ఎంత ముచ్చటగా ఉంటాయో తెలుసుకోడానికేనా మీరు విసాపట్నంవో సింవాచెలంవో ఓమారైనా వెళ్ళితీరాలని నా తీర్మానం.

ఇంత చెప్పేక అరటిపువ్వు కూర చేయు విధానము చెప్పకపోతే నాకు మాట దక్కదు కదా. అసలు అరటిపువ్వు వొలిచి కూరకి సిద్ధం చేయడమే ఒక గొప్ప కళ. ముందు ఊదారంగు దొప్పలు ఒకొకటే ఒలుస్తాం. పైన చెప్పిన బోదె దొప్పలమాట కాదు నేను చెప్పేది. ఈ దొప్పలు వేరు. వీటితో కూడా ఏదో చేస్తారు కానీ ఏం చేస్తారో నాకు జ్ఞాపకం లేదు. నేతిలో తడిపిన వత్తులేసి, కార్తీక దీపాలు పెట్టుకోవచ్చునేమో!

సరే, అరటిపువ్వు – ఊదా రంగు దొప్ప ఒకొకటే ఊడదీసి, రేసులు (తెల్లనివి) ఏరి ఓ పళ్లెంలో పెట్టుకోండి. ఈ రేసులే దరిమిలా కాలగతిలో – అదే మనం కోసుకు తినేయకపోతే - కాయలయేది. అలా ఒకొక దొప్పా, తీసేస్తూ, రేసులు తీసుకుని దాచుకుంటూ పోతే, ఆఖరికి, ఆ పువ్వు కోలగా చిన్న శంఖం రూపంలో మొగ్గ మిగులుతుంది. ఒలవడానికి రేసులుంటాయి కానీ చాలా సున్నితంగా ఉండి ముట్టుకుంటే కందిపోతాయేమో అన్నట్టుంటాయి. తలవేపు నలిపితే దొంగలు దొరకవు. (దొంగలంటే ఏమిటో తరవాతి పేరాలో వివరించేను). అలా మిగిలిన మొగ్గని అలా ఉన్నదున్నట్టు కొరుక్కు తినేయడమే! చెప్పలేదనకండి. చిన్న కస తగుల్తుంది నాలుకకి. నాకు ఆ కస ఇష్టమే మరి. అలా పసిమొగ్గ తినేసిన తరవాత - ఇప్పుడు వేరే పెట్టుకున్న రేసులు ఒకొకటే తలవేపు చిదిపితే, లోపలి కాండం తల గట్టిగా తగులుతుంది. ఆ తల పుచ్చుకు ఆ కాండం పీకేయండి. వాటిని దొంగలు అంటారు. ఈ దొంగల్ని కూడా ఏం చెయ్యలేం. పారేయడమే.

రేసుల్ని కొత్తిమీర తరిగినట్టు సన్నగా తరిగి, ఆవాలు, మినప్పప్పు, ఎండు మిరపకాయలూ పోపేసి అందులో పడేసి, ఉప్పేసి కొంచెంసేపు మూత పెట్టండి. అవి ఉడికేక, ఆవ పెట్టి (ఓ పచ్చిమిరపకాయ, ఆవాలు, చిటికెడు ఉప్పు, చిటికెడు బియ్యప్పిండి మెత్తగా నూరి) కూరలో కలిపి, రెండు నిముషాలతరవాత, పొయ్యిమీంచి తీసి పక్కన పెట్టేయండి. ఆ కూర రుచి చూడడానికి మీరు ఏ విసాపట్నంవాసుల్నో స్నేయితం చేసుకోవాల్సిందే.

అలాగే అరటిదవ్వ కూర. ముందు చెప్పినట్టు అరటిబోదె కూడా అలా ఒలుచుకుంటూ పోతే, కొంతసేపయేక, మరి దొప్పలు రావు. మధ్యలో కాండం – దీన్నే దవ్వ, దూట అంటారు – తెల్లగా ముల్లంగిలా ఉంటుంది. ఇది కూడా ఆవ పెట్టి ముల్లంగిలాగే కూర చేసుకోవచ్చు.

చివరి మాటగా – అరటికాయ, అరటాకుల్లో భోజనం కూడా చాలా చాలా ఆరోగ్యంట. తేలిగ్గా అంతర్జాలంలో వివరాలన్నీ మళ్ళీ ఇక్కడెందుకని ఇవ్వడం లేదు. మీకు సరదా ఉంటే తెవికీవంటి వనరులు చూడొచ్చు. బోలెడు సమాచారం దొరుకుతుంది.

ooo

Banana flower courtesy of wikimedia.org

https://commons.wikimedia.org/wiki/File:Banana_flower_edit2.jpg

(నవంబరు 15, 2015)

36. శుభాకాంక్షలు కార్డు కథలు

పండుగ బహుమతులతరవాత శుభాకాంక్షల దినాలగురించి కూడా చెప్పుకకోపోతే ఎలా మరి! వీధి చివరనుండి పొంచి చూస్తూ వస్తున్నా వస్తున్నా అంటూ ఊరిస్తోంది కొత్తసంవత్సరం తొలి దినం. వెనక కొంత రాసేసేమో గానీ ఇప్పుడు ఇంకొంచెం ఏడ్చేయాలనిపించింది (add చేయు = జత చేయు).

చెప్పేను కదా బహుమతుల వ్యవహారం - నవంబరు ముగిసీ ముగియకముందే మొదలు పెట్టేస్తారు ఎవరికి ఏం ఇవ్వాలి? ఎవరు మనకి ఏమి ఇచ్చే అవకాశాలు ఉన్నాయి? ఎక్కడ ఏ వస్తువు ఎప్పుడు తగ్గింపుధరలో ఉండగలదు లాటి ప్రశ్నలతో ప్రజలు గిలగిల్లాడిపోతూంటారు. ఫోను తీస్తే అవే కబుర్లు, అదుగో అక్కడ ప్రత్యేక ధరలు, ఇదుగో ఇక్కడ దివాలా (closeout sales) అమ్మకాలు అంటూ ఒకరికొకరు ఆచూకీలు ఇచ్చేసుకుంటూంటారు. దాన్నిగురించి రాయడం అయిపోయింది కనక శుభాకాంక్షలగురించి చెప్పుకుందాం.



శుభాకాంక్షల చరిత్ర ఎట్టిదనిన పూర్వకాలమందు అంటే నా చిన్నతనంలో ఉత్తరాలు రాసుకునేవాళ్ళం అని చెప్పేను కదా. అంటే కలమో పెన్సిలో పిడికిట పుచ్చుకుని కాయితంమీద కుటుంబంమొత్తం పేరు పేరునా, ఇంకా ఇరుగూ పొరుగూ, దూరపుచుట్టాలు అందరి సంగతులు వరసగా రాసేసి, ఆ రెండు కాయితాలూ కవరులో కుక్కి, దానిమీద చిరునామా రాసి, స్టాంపు అతికించి వీదిచివరనున్న తపాల్ డబ్బాలో పడేసి, జవాబుకోసం నెలో రెణ్ణెల్లో ఎదురు చూసేవి. ఇంత వివరంగా ఎందుకు

చెప్తున్నానంటే మీలో కొందరికైనా ఇది కనివిని ఎరగని సంగతి అయి ఉండొచ్చు అనుకుని.

క్రమంగా ఉద్యోగాలూ, సంసారాలతో ఎవరికి వారు చాలా బిజీ (ఉక్కిరిబిక్కిరయిపోతున్నారు అనొచ్చు కానీ మీ "బిజీ"కి సరిపోదు లేదా అర్థం కాదు అనుకుని ఇలా రాసేను) అయిపోడంతో ఉత్తరాలు కేవలం అవసరార్థం, అంటే ఏదో ఒక ముఖ్యవిషయం తెలియజేయడానికి మాత్రమే అయింది. అపుడయినా ఓ కార్డుముక్క రాసి పడేయడంగా కొన్నాళ్లు సాగింది. మా పెద్దన్నయ్య వాటిని vital statistics అనేవాడు. అంటే బాలసారె, అపరకర్మలు, వివాహమహోత్సవాలు, కదాచితుగా కొత్త ఉద్యోగాలూ (చిరునామా ఇవ్వడానికి) వంటి వార్తలు అందించడానికి ఆ కార్డుముక్కలు రాసుకోడం ఆనవాయితీ అయిందని.

ఆ వెనకే బాపూబొమ్మలతో రంగు హంగులతో కార్డులు అనబడు శుభాకాంక్షల అట్టముక్కలొచ్చేయి. అవి అట్టేకాలం నిలిచినట్టు లేదు. అనతికాలంలోనే అవి ఎన్ని రూపాంతరాలు చెందేయో నాకంటే మీకే ఎక్కువ తెలుసు.

ఈకార్డు కథ ముగించేముందు, బహుమతులకీ కార్డుకథకీ ముడిపెట్టే మరో కోణంగురించి చెప్పాలి. అది gift card. ఎవరికి ఏ బహుమతి అన్నవిషయంలో రాగల కష్టాలగురించి వెనక "అభిమానాలకి కొలమానాలు అన్న టపాలో చెప్పేను. ఇప్పుడు చెప్పేదేమిటంటే ఆ కష్టాలమూలంగా బహుమతికార్డులు వచ్చేయి. సూక్ష్మంగా ఏదో దుకాణంలో ఓ సొమ్ముకార్డు కొని అదిచ్చేసి "నీక్కావలసింది అక్కణ్ణించి తెచ్చుకో" అని ఆదేశించడం అన్నమాట. వీటిలో కూడా లుకలుకలున్నాయని రాధి రాధిక చెప్పేకే తెలిసింది నాకు.

మనం "సుళువులకాలం"లో ఉన్నాం కదా. ఏది ఎక్కువ సుళువు అన్నది వెతుక్కుంటూ రోజులకి రోజులు గడిపేస్తాం. నేను కనిపెట్టిన సుళువు ఓ చెక్కు

రాసిచ్చేయడం. దానివల్ల దుకాణాలవెంట తిరగడం కూడా తప్పుతుంది. అప్పుడు ఆ సమయం కూడా కలిసొచ్చినట్టే కదా. చెక్కులు అందరికీ రాసివ్వలేం లెండి. అవును దానిక్కూడా కార్డులున్నాయి ఇదుగో నీ బహుమతి అంటూ.

ఇంతకీ శుభాకాంక్షలమాట - మొదటి దశలో కవరులో పెట్టి తపాలా డబ్బాలో పడేసేవారనుకున్నాం కదా. తరవాత ఫోనులో చెప్పుకోడాలు వచ్చేయి. ఇప్పుడు పూర్తిగా లాప్టాపూ, టాబ్లెట్, మొబైలు మెసెంజరులోంచి చెప్పేస్తే సరిపోతోంది.

చాలాకాలం క్రితం ఎవరో పెళ్ళి శుభలేఖ ఇలా కంప్యూటరులో పంపితే అది సీరియస్ ఆహ్వానం కాదనుకుని నేను జవాబు ఇవ్వలేదు. ఎందుకంటే పూర్వం ఇంటికొచ్చి బొట్టు పెట్టి పిలిస్తేనే మర్యాద. దారిన పోతూ "ఇదుగో మాయింట్లో పెళ్ళి పైవారం. రా," అంటే అది పిలుపు కాదు. మాటవరసకి విషయం తెలియజేస్తున్నట్టు లెక్క. గుంటూరు దగ్గర ఏదో పల్లెలో ఫలానా ఇంట్లో పెళ్ళి భోజనానికి రండహో అని దండోరా వేసేవారుట. ఆ పల్లెలో వారికి అంత చనువు ఉండి ఉండాలి మరి.

మరో మాట. పోస్టుడబ్బాలో పడేసే కార్డు ముక్కలకి మితి ఉండేది. ఖర్చు కావచ్చు, కాలప్రమాణం కావచ్చు, ఆత్మీయత ఎంతలో ఉంది అన్నదాన్నిబట్టి కావచ్చు. ఏ నలుగురికో, మహా అయితే పదిమందికి మాత్రం పంపేవారు. ఇప్పుడలా కాదు. తెలిసినవాళ్ళకీ తెలీనివాళ్ళకీ, "ఈవిడ లేక ఈయన మనకి తెలిసి ఉంటుందిలే లేక ఉంటాడులే" అనుకుంటూనూ, ఇంకా మరొకరి మందమెయిల్లోంచి కొట్టేసిన ఐడీలకీ కుప్పలుతిప్పలుగా వచ్చేస్తున్నాయి విద్యుత్ వార్తావాహికలో.

"వీళ్ళెవరు? వీళ్ళు నాకు ఏ వంక చుట్టాలు? అమ్మవంకా బాబువంకా? లేక ఏ బజారులోనో పెళ్ళిలోనో కలిసామా? ఎక్కడ ఎప్పుడు కలిసేం? నేను వాళ్ళకి ఎలా తెలుసు? వీరు నిజంగా నా శుభం కాంక్షిస్తున్నారా?" లాటి ప్రశ్నలు వేసుకోడం వృథా ప్రయాస. నామటుకు నేను ఓపినంతసేపు "మీక్కూడా" అంటూ జవాబులిస్తాను. ఆ

తరవాత ఓహో వీరు నా శుభము కాంక్షిస్తున్నారు అనుకుని సంతసించి ఊరుకుంటాను.

పైగా ఈ తెరాకాంక్ష(తెరమీద ఆకాంక్ష)ల విషయంలో మరో కిటుకు. ఫోనుకంటె ఇందులో సమయం ఆదా ఎక్కువ అని కూడా. ఈ సమయపొదుపు విషయంలో మరో గోల మాటలూ వాక్యాలూ అంట కత్తెరేయడం.

అంటే ఏమిటా? చెప్తాను వినండి. ముందు వీరెందుకిలా చేస్తున్నారో చెప్పుకోవాలి. కొందరికి తెలుగు రాదు. అదేలెండి, కంప్యూటరుమీద తెలుగు రాయడం రాదు. కనీసం అది వారి సాకు. నిజానికి తగిన software వాడితే, తెంగ్లిషులో టైపు చేసినట్టే అక్కడాను. అలా నేను పదే పదే మొత్తుకుంటున్నాను కానీ పట్టించుకున్నవారిని వేళ్ళమీద - సుమారుగా రెండు చేతులూ మరియు ఒక కాలు - లెక్క పెట్టొచ్చు. రెండోది కాలం ఆతృత. ఏమాట గానీ తెరమీద కనిపించీ కనిపించగానే జవాబు కొట్టేయాలి. అంచేత చేతిలో ఉన్న మొబైలులో ఠపీఠపీమని రెండు మూడు అక్షరాలు కొట్టేసి, హమ్మయ్య ఒక పని అయిపోయిందనుకుని సుఖపడి పోతారు.

అంటకత్తిరేసిన పదాలు ఇలా ఉంటున్నాయి. tq, tnks, y, u. వీటన్నిటిలో worst నాదృష్టిలో RIP. మాట వచ్చింది కనక చెప్పేస్తున్నాను. నాసమయం వచ్చినప్పుడు నాకు మాత్రం రిప్పని పెట్టకండి. తలచినంతమాత్రనే నన్నూ నాఆత్మనీ రిప్పేసినట్టనిపిస్తోంది ఇప్పుడే :).

ఇంతకీ ఇలా కత్తెరేసిన పదాలు ఇప్పటికే అందరికీ, కనీసం నూటికి 99మందికి, అలవాటయిపోయేయి. అంచేత అవి వారికి ఎబ్బెట్టుగా తోచవు సరి కదా, అందులో తప్పేమిటి అని నన్ను నమిలేయగలరు.

దురదృష్టవశాత్తు నేను ఆ మిగతా ఒక వంతులోని మనిషిని. నాకు ఆ పదాల్లో జీవం కనిపించదు. మొక్కుబడిలా అనిపిస్తుంది. నేనిలా అన్నందుకు ఎవరైనా నొచ్చుకుంటే, ఇదుగో ఇప్పుడే క్షమాపణలు కోరుకునేస్తున్నాను.

ప్రస్తుతానికి వద్దాం. ఇంకా Happy New Year, Merry Christmasకి ఈ తిరుక్షవరం జరిగినట్టు లేదు. కానీ 2016 కొత్త సంవత్సరం శుభసందర్భంలో అవి మొదలవవు అని హామీ ఏమీ లేదు కదా. ఏ ఒకరికి తోచినా చాలు. క్షణాల్లో మొత్తం అంతర్జాలం కార్చిచ్చులా కమ్ముకునేస్తుంది. మళ్ళీ టైపు చేయడం ఎందుకని అదే పంచేసుకుంటూ పోవచ్చు మిగతా మిత్రవర్గం సమస్తం.

మరో సంగతి కూడా చెప్పుకుంటాను. ఇది కేవలం నా ఆత్మఘోష. ఇప్పటికే లైకులతోనూ స్మైలులతోనూ వేళ్ళు వాచిపోయేయి.



ఇవన్నీ ఆలోచించేక నాకు ఒక ఉపాయం తోచింది. నేను ముందు ఒక టపా పెడతాను, సూక్ష్మంగా "శుభాకాంక్షలు" అని. మీరు లైకు కొడితే చాలు. మీకు నేనూ, మీరు నాకూ ఈ శుభాకాంక్షలు ఇచ్చిపుచ్చుకోడం అయిపోయినట్టే లెఖ్ఖ. మళ్ళీ tqs, y2 లాటివి మాత్రం పెట్టకండి మరి.

ooo

(డిసెంబరు 6, 2015)

37. కాపీ ఒక సాహిత్య ప్రక్రియ!

కాపీ చేయుట చాలాకాలము క్రితము కనిపెట్టబడినది. మొదట అతి సాధారణమైనదీ అనాదిగా అభ్యాసములో నున్నదీ చెప్పుకుందాం. అక్షరాభ్యాసం చేసి పిల్లలకి ఓ పలకా బలపం ఇచ్చి అక్షరాలు దిద్దించడంతో ఇది ప్రారంభం. ఆ తరవాత చూచి వ్రాత రెండోపాదం. మూడోపాదంలో నీతి వాక్యాలు – అబద్ధమాడరాదు, ఒరులసొమ్ము తస్కరించరాదు –వంటివి కాపీ పుస్తకంలో చూచి రాయడం వచ్చింది. నా చిన్నతనంలో కాపీ చేయుట అంటే అంతే.

ఆ తరవాత పుస్తకాలు వచ్చేయి. చేతివ్రాత రూపంలో కాపీ చేయడం జరిగేది. అవి అపురూపం అనేక కారణాలవల్ల. అది శ్రమతో కూడిన పని అని మనకి బాగానే తెలుసు కదా. రెండోది వ్రాయసకారుల పొరపాట్లవల్ల పాఠ్యం. అర్థాలు మారిపోయే ప్రమాదం ఉండేది. అచ్చుయంత్రాలొచ్చేక కాపీ రాయడం అయితే తప్పింది కానీ అచ్చుకోసం galleyలో అక్షరాలు పేర్చేవారివల్ల కూడా పొరపాట్లు జరిగే అవకాశం కొనసాగుతూనే ఉండేది. ఇది కాపీ కథలో పూర్వార్థం.

20వ శతాబ్దం నాలుగోపాదంలో మొదలయి. 21వ శతాబ్దంలో కాపీ చేయుట అంటే విశేషమైన అర్థంలో ప్రచారంలోకి వచ్చింది. ఒక కథకి అనేక కాపీలుండవచ్చు. అంటే నేను ఒక కథ రాసి, ఆ తరవాత మనసు మార్చుకునో, తప్పులు దిద్దుకునే ప్రయత్నంలోనో మరొక కాపీ తయారు చేస్తాను. క్రమంగా ఇదో పత్రికకీ అదో పత్రికకీ పంపడం కూడా జరిగింది. అయితే ఈ రూపాలన్నీ రచయిత స్వయంకృతం.

ప్రింటు పత్రికలని వెనక్కి పెట్టేసి, బ్లాగులూ, జాలపత్రికలూ, ముఖపత్రాలూ మహోద్భృతంగా విజృంభించేసి, నియమాలను ఏట్చుకోలేనంతగా మార్చేసేయి. వీటిల్లో కూడా తొలిపాదంలో ఎవరో ఒకరు ఆధిపత్యం వహించి తమ దృక్పథాలకి అనుగుణంగా రచయితలచేత మార్పులు చేయించి వివిధ కాపీలు తయారు చేయించి వారిపేరుమీదే ప్రచురించడం జరిగింది.

గత ముప్పై ఏళ్ళలో రాసేవారు ఎక్కువయిపోయేరు. రాయాలన్న తపన పెచ్చు పెరిగిపోయింది. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ రాయాలన్న, రాసి తీరాలన్న, రాయకపోతే పేరు పడిపోతుందన్న అద్భుతమైన ఆలోచన మొత్తం సాహిత్యక్షేత్రాన్ని సంపూర్ణంగా మార్చేసింది. దాంతో మొదలయింది ఇక్కడివక్కడా అక్కడివిక్కడా పెట్టడం. కొందరు తమపే పెట్టుకుంటే మరి కొందరు పేరేవారివి పెట్టడం కూడా మొదలు పెట్టేరు. చెప్పి కొందరు, చెప్పకుండా కొందరు కూడా పునశ్చరణ పెంచుకుంటూ వచ్చేరు.

ప్రస్తుతం మనం ఈ దశలో ఉన్నాం. విశాల హృదయం లేని కొందరు ఈ ప్రక్రియని గ్రంథచౌర్యం అంటున్నారు కానీ అది సబబు కాదనే నేననుకుంటున్నాను. ఇది చివరివరకూ చదివిన తరవాత, మీరు కూడా అంగీకరిస్తారు ఇది ఒక ప్రత్యేక ప్రక్రియ అని. ఇప్పుడు ఈ దశ రూపురేఖలేమిటో వివరంగా తెలుసుకుందాం. శాస్త్రప్రకారం – అదేలెండి నూతనంగా వ్రాయబడిన శాస్త్రప్రకారం - అచ్చులో వచ్చిన కథ జాలంలో, జాలంలో కత అచ్చు పత్రికలో మళ్ళీ ప్రత్యక్షమవుతున్నాయి. కాపీరైటు నియమాలకి ఇది విరుద్ధం కాదు. కానీ పేరేవారివి కూడా ఈ shell gameలోలాగ చేయడం మాత్రం కాపీరైటు నియమాల్లో లేదు.

ఇటీవల ఇది ఎక్కువయిపోయింది. జాలంలోనే ఒకరిపేజీలో కనిపించింది మరొకరు వారిపేజీలోనో మరో సమూహపేజీలోనో పెట్టేయడం మొదలయింది. మూలరచయిత పేరు నూటికి 90వంతులు కనిపించదు. పదుగురాడుమాట పాటియై చెల్లు అంటారు

కనక పదేమిటి ముప్ఫైమంది అలా చెప్పకుండా ప్రచురిస్తున్నట్టు కనిపిస్తోంది కనక అదే నిజమైన నియమం. "అయితే చెప్పఖ్ఖర్లేదంటారా?" అని మళ్లీ నన్ను అడక్కండి. అలా అడగడం చాదస్తం. ఇది ఎవరూ చెప్పని, చెప్పకూడని రూలు అని మీకు మీరు రహస్యంగా రాసుకోండి.

మూలరచయిత పేరు చెప్పకుండా వేరేవారి రచనలు పూర్తిగానో సగంసగమో తమవిగా ప్రచురించుకోడం అంచెలంచెలుగా పట్టపట్ట పగ్గాల్లేకుండా అభివృద్ధిగా చెందేసింది. నా వ్యాసాలు, కథలు కూడా ఈ అసాధారణగౌరవానికి నోచుకున్నాయి. మూలరచయితలు అమాయకులైతే, "అయ్యో. అది నారాత. నాఖర్మ," అని నొచ్చుకుని ఊరుకుంటారని ఆ కాపీరచయితలు - నేను కాపికేయులు అంటాను ప్రస్తుతానికి - ఆశిస్తారు. కానీ రచయితలు ముఖ్యంగా నాలాటి రచయితలయితే ఊరుకోరు. అట్టే రచ్చ చెయ్యకపోవచ్చు. చాలా మర్యాదగా కాపికేయులకి చెప్పడానికి ప్రయత్నిస్తారు. ఆ ఉత్తరం సుమారుగా ఇలా ఉంటుంది, "మీరు ప్రచురించిన కథ/కవిత/వ్యాసం నేను రాసేను. ... పత్రికలో ... తేదీన ప్రచురించడం జరిగింది. మీరు చూసుకోక పొరపాటున మీదనుకుని ప్రచురించినట్టున్నారు (హాహా. చూడకపోతే కాపీ చేయడం జరగదు అని చాదస్తంగా అడక్కండి). మీరు పెద్దవారు. మిమ్మల్ని తప్పు పట్టుట నా అభిమతం కాదు. మీరు మూలరచయితగా నాపేరు కూడా చెప్తే బాగుండేది కదా. లేదా మీరు మీ పేజీలోనుండి తొలగించినను నేను అపార్థం చేసుకోను."

దానికి సమాధానం, "మీరు రాసినట్టు నాకు తెలీదు. నేను అసలు ఆ పత్రిక చూడలేదు. చూడను. కానీ మీరు నిజంగా చాలా బాగా రాసేరు. నాకు చాలా నచ్చింది. అందుచేత నాస్నేహితులు కూడా చూసి ఆనందిస్తారని నాపేజీలో ప్రచురించేను. ఆ క్రెడిటంతా మీకే."

"క్షమించండి. నేను సరిగా చెప్పలేదులా ఉంది. మీరు నాపేరు చెప్పలేదు కనక నాకు మీపేజీలో క్రెడిటు రాదండి."

"ఇప్పుడు చెప్తున్నాను కదా. అయినా మీరు ఇలా సతాయించడం బాగా లేదు. మంచి సాహిత్యం వీలయినంత ఎక్కువగా ప్రచారం పొందడమే న్యాయమని నా దృఢవిశ్వాసము."

దాంతో మూలరచయిత బాధ మూల పడిపోతుంది. అలాటి కాపికేయులు చెప్పే ఇతర కారణాలు -

కారణం 2. "అమ్మా లేదా అయ్యా, మీరు అది రాసేరని నాకు తెలీదు. అసలు నేను మీపేరే వినలేదు. ఓహో, మీరు కూడా రచయితేనన్నమాట. చాలా సంతోషం. తప్పకుండా రాస్తూ ఉండండి."

కారణం 3. "అమ్మా లేక అయ్యా, నాది పొరపాటే. మీరు నొచ్చుకోగలరని నేననుకోలేదు. నాకు కంప్యూటరుమీద తెలుగు టైపు చేయడం రాదు. నా మిత్రులనడిగితే, వారు తీసి ఇచ్చేరు. నేను చేసింది కేవలం కాపీ చేసి పేస్ట్ చెయ్యడం మాత్రమే."

నాలుగోది కారణం కాదు, సాకు లేక నెపం అనాలి. "నేను డబ్బు చేసుకోలేదు ఆ ప్రచురణతో. ఇంకా చెప్పాలంటే నేను మీకు నిస్వార్థంగా ప్రచారం తెచ్చేను. మీరు సంతోషిస్తారనుకున్నాను."

"నాపేరు చెప్పకపోతే నాపేరు ప్రచారానికి తావేదీ?" అని అడగరాదు.

ఇక్కడ మరోమాట చెప్పుకోవాలి. ఈ కాపీ విశేషాన్ని నేను సాహిత్య ప్రక్రియ అనడానికి కారణం ఇప్పుడు కొన్ని పత్రికలు కూడా బ్లాగుల్లోంచి తీసుకుని (తస్కరించి అనడం

మర్యాద కాదుట) ఇలాగే చేస్తున్నారని వార్త. బహుశా రచయిత పేరు కూడా అక్కడ పెడుతున్నారో లేదో నాకు తెలీదు.

ఈ విషయాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించినతరవాత నాకు అర్థమయిన పరమసత్యము - కాపీ చేయుట కలియుగం నాల్గవపాదంలో అఖండద్వీపం అంటే యావత్ ప్రపంచంలోనూ అనధికారంగా ఆచరణలో పెట్టబడిన నీతి. అందుకే నామాట విని, "కాపీలనాపరాదు. కాపీ చేయలేనివాడు చిల్లుకానీకి కొరగాడు," అని ఓ కాయితంమీద రాసి, లేదా ఇదే ఫొటో తీసుకుని మీ ఫ్రిజిమీద పెట్టుకోండి. వంటింటిలోకి రాని మగవారు మీఇంట్లో ఉంటే, ఆ కాయితం తలవాకిలికి అంటించండి. రోజు లేస్తూనే తొలికప్పు కాపీతోపాటు కాపీ కాపీ అంటూ మూడుసార్లు మననం చేసుకోండి.

కాపీ చేయు విద్య - సూక్ష్మంగా కా.వి. అందాం - సాహిత్య ప్రక్రియ స్థాయి తెచ్చుకునేసిందని నా నిశ్చితాభిప్రాయం.మనం. అచిరకాలంలోనే ఈ విద్యకి జ్ఞానపీఠ్ పురస్కారం, నోబెల్ బహుమానం వంటివి కూడా ప్రతిష్ఠించవచ్చు ఏ అమీరికా రెడ్డిగారో రాజుగారో నాయుడుగారో.

ఇది సాహిత్య ప్రక్రియ అని తేలిపోయింది కనక కొత్తగా ఈ ప్రక్రియ చేపట్టదలుచుకున్నవారికి కొన్ని కిటుకులు బోధించడం కూడా నాధర్మం. ప్రత్యేకించి ఇటీవల కాపి చేసినవారు పట్టుబడిపోవడం కూడా జరుగుతోంది కనక. ఇప్పుడు కొత్త కాపికేశ్వరులకి ఇస్తాను.

1. వీలయినంతవరకూ మధ్యస్థమైన ప్రాచుర్యం పొందిన రచయితని ఎంచుకోండి.

2. కథాంశం ఎంత సంప్రదాయ విరుద్ధమైతే అంత మంచిది. నాకూ అలాటి ఆలోచన రాకూడదేముంది అని దబాయించడానికి వీలు.

3. ఆ రచయిత ఏ పత్రికలు, ఫేస్బుక్ పేజీలు చూస్తారో తెలుసుకుంటే మంచిది. వాటికి కొంచె దూరంగా మరోచోట ప్రచురించుకోడం ఉత్తమ పద్ధతి.

4. కొంత వాక్చాతుర్యం కూడా అవుసరం. కాలికేస్తే మెడకీ, మెడకేస్తే కాలికీ తికతికగా జవాబులివ్వడం నేర్చుకుని సిద్ధంగా ఉండాలి.

కాపీలలో కూడా భిన్న పద్ధతులున్నాయి.

1. ఒక వాక్యం ఉన్నదున్నట్టు కాపీ చెయ్యడం. ఇది చాలా తేలిక. ఎందుకంటే మీరూ ఆ రచయితా కూడా నిఘంటువులో ఉన్నపదాలే కదా వాడేది. ఇద్దరు అవే పదాలు ఎంచుకోకూడదని ఎక్కడా లేదు.

2. ఒక పేరా అయితే ఒత్తులూ, గుణింతాలు మార్చడం ఉత్తమం. మరో ప్రాంతీయభాషలోకి మారిస్తే భేషుగ్గా ఉంటుంది.

3. మొత్తం పాఠం అంతా ఉన్నదున్నట్టు పెట్టేసుకున్నప్పుడు, రచయిత పేరు కూడా ఏదో మూల ఇరికించడమే క్షేమమే అని నా తలపు.

4. రచయిత పేరు చెప్పకుండా ఎక్కడోక్కడ ప్రచురించేసి, ఏమీ తెలియనట్టు ఊరుకోడం కూడా సాధ్యమే.

ఇంక అసలు విషయానికి వస్తాను. నేను ఈ విషయం ఎంతో ఆలోచించి, శల్యపరీక్ష చేసి, ఒక ఆలోచన చేసేను. ఇదుగో నేను కనిపెట్టిన ధర్మసూక్ష్మం ఇక్కడ ఇస్తున్నాను. తెలుగు దినపత్రికలలోనూ వారపత్రికలలోనూ, నాముఖపత్రంలోనూ ప్రకటన ఇస్తున్నాను కూడా.

"కాపీరచయితలకు అభ్యర్థన. దయ చేసి, ఈ కిందివాక్యం కాపీ చేసి మీ కాపీరచనకి జత చేయగోరుచున్నాను. మీకు కాపీ చేయడం వచ్చు కనక ఇది తేలిక పద్ధతి.

"ఇది స్వీయరచన కాదు. కాపీ చేయడంవరకే నా బాధ్యత. ఇట్లు, (మీ దివ్య నామధేయం)."

(ఇక్కడ తాజాకలం. కథలు, వ్యాసాలే కాదు బొమ్మలు తస్కరించడం కూడా నేరమే. అరిపిరాల విశ్వప్రసాద్ ఎందుకు పారేస్తాను నాన్నా కథమీద రాసినవ్యాసానికి అనుబంధంగా ప్రచురించిన చిత్రం ఆర్లె రాంబాబు గారు తూలిక.నెట్ సైటుకోసం ప్రత్యేకంగా చిత్రించినది. మూల చిత్రకారుడికి క్రెడిట్ ఇవ్వకపోవడం కూడా ఇలాటి చౌర్యంకిందకే వస్తుంది.)

ఇంకా ఆలోచిస్తుంటే, ఈ అంశంమీద ఓ శతకం రాయొచ్చు అని కూడా అనిపించింది. నా ముఖపత్ర మిత్రులనడిగితే, వారు రాసి ఇచ్చిన కొన్ని పద్యాలకి లింకు ఇక్కడ

000

(జనవరి 5, 2016)

38. పుచ్చుకున్ననాటి ముచ్చట!

ప్రతి సూత్రానికి మినహాయింపులుంటాయి. వీటినే మన పూర్వులు ఆపద్ధర్మం అన్నారు. ధర్మవ్యాధుడు మాంసం అమ్ముకున్నా ధర్మరాజు అశ్వత్థామ హతః అన్నా ఫరవాలేదన్నదందుకే. అంతే కాదు శబరి ఎంగిలి పళ్ళు రామునికిచ్చింది. వేటగాడు శివునిమొహంమ్మీద కాలు మోపేడు. ఇవన్నీ ఫరవాలేదని ఎందుకన్నారంటే ఆ విదంగానైనా మతి సన్మార్గంవేపు మళ్ళవచ్చునని. పగనైన వగనైన ప్రాణభీతినైన నన్ను తలుచుకుంటే చాలన్నాడు కదా శ్రీహరి.

ఇంతకీ ఈ సదసద్వివేచనలోకి నేను ఎందుకు దిగేనంటే పండుగలపేర అనవసర ఇచ్చిపుచ్చుకోడాలకి వ్యతిరేకిని అని చెప్పేను కదా. కానీ పుచ్చుకోడం జరిగితే దానికి కనీసం సమాధానం ఇచ్చుకోవాలి. చేసిన పాపం చెప్తే పోతుందంటారు అన్నారు కనక. అసలు ఆ పుచ్చుకోడం కూడా నేనేదో బాధ పడిపోతూ చెయ్యలేదు. కొంచెం సంతోషం కూడా కలిగిందని కూడా ఒప్పుకోవాలి.

ఇప్పుడు అసలు కథ. దాదాపు నెల రోజులయిందనుకుంటాను నా కెమెరా తిరగబడి బొమ్మలు తీయను కాక తీయనని మొండికేసి. ఇక్కడే మరోమాట చెప్పుకోవాలి. మామూలుగా ఎంత చిన్న వస్తువు కొన్నా దానిని సదా ఉపయోగకరంగా ఉంచడానికి అంటే maintenance అనబడు కార్యక్రమానికి మరో నాలుగు వస్తువులు కొనవలసివస్తుంది. ఎంత చిన్న వస్తువయినా సరే దాన్ని నీటుగానూ, భద్రంగానూ ఉంచడానికి ఏ నోమో వ్రతమో చేసినప్పుడు ఉన్నంత తతంగం ఉంటుంది. ఉదాహరణకి కెమెరామాటే తీసుకోండి. దానికి అమర్చిన రెండున్నర అంగుళాల తెర తుడవాలంటే కేవలం అది తుడవడానికి మాత్రమే సృష్టింపబడిన గుడ్డముక్క కావాలి.

అది ఏదో ఒక్క దుకాణంలో మాత్రమే దొరుకుతుంది. ఆరో పదో డాలర్లు పెట్టి కొనాలి. దానితోపాటు చిన్న కుంచె, చిటికెడు పొడి, ఇంకా ఏవేవో కూడా వస్తాయి. ఏది ఏ చేత్తో ఎన్ని వేళ్ళతో ఎలా పట్టుకోవాలో బొమ్మలతో సహా పద్ధతి వివరించబడి ఉంటుంది. అచ్చంగా ఇలాగే కాకపోవచ్చు కానీ సుమారుగా ఇలాగే ఉంటాయి ఇక్కడి వ్యవహారాలన్నీ. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ పాత పీలిక తీసుకు తుడుస్తూ ఉండండి అప్పుడప్పుడు అని ఒక్కమాటలో చెప్పడం మాత్రం జరగదు.

ఇంతకీ నా పూర్వ కెమెరా సంగతి. పైన వివరించిన శుభ్రపరుచు విధానం ఉంది కానీ అంతర్జాలంలో చూస్తే ఓ చుక్క నీళ్ళతో తుడిస్తే చాలు అని తెలిసింది. ఆ విషయం కనిపెట్టేసిన ఆనందంతో పొంగిపోతూ వంటింట్లో కొళాయిదగ్గర ఆ కాస్త చదరపుముక్క శుభ్రపరిచి గిరుక్కున వెనుతిరిగేను. నా ఉత్సాహంపాలు శృతి మించినట్టుంది నేను వెనుదిరగడంలో. ఆ విసురుకి కెమెరా చేతిలోంచి జారి ఠప్పున లినోలియం నేలమీద పడి మట్టి కరిచింది. ఏమైందో అనుకుంటూ ఆన్ చేసి రెండు మూడు బొమ్మలు తీసేను. బాగానే వచ్చేయి. సరే, ఇంకా దానికాలం చెల్లలేదు అనుకుని సంతోషించేను. మరోవారం రోజులు పోయేక వీధిలోకి వెళ్తే చెట్లు కొట్టేస్తూ కనిపించేరు సిటీవారు. ఇక్కడ శిశిరం ప్రవేశిస్తుండగానే ఎంత పెద్ద చెట్టయినా సరే నిచ్చెనలేసుకుని మరీ కొమ్మలు నరికేస్తారు. ఈ కొండమంగలి క్షవరానికి tree maintainance service అని పేరు. పాతిక అడుగులు ఎదిగిన చెట్టు. పది పదిహేను బారలు సాగిన కొమ్మలను హృదయవిదారకంగా నరికేసే ఆ క్రియావిశేషాన్ని maintainance అనడం నాకయితే హాస్యాస్పదంగానే ఉంది.

అలా నవ్వుకుంటూ నేను ఆరోజు వెనక్కెళ్ళి నా కెమెరా తీసుకు మళ్ళీ అక్కడికి చేరుకున్నాను ఆ తంతు పెట్టెలో పట్టడానికి. రెండు బొమ్మలు తీసినట్టే కనిపించింది. మరో నాలుగడుగులేసి, మరో బొమ్మ తియ్యబోతే పొరబాటొచ్చింది. "ఆఫ్ చేసి మళ్ళీ ఆన్ చెయ్యమం"టూ ఆదేశం కనిపించింది. మరి ఆ పెట్టె చిన్నదే అయినా ఎలా చెప్తే అలా చెయ్యాలి. నేను చేస్తాను. చేసేను కూడా బుద్ధిగా కానీ మళ్ళీ అదే సందేశం.

రెండోమారు, మూడోమారు, నాలుగూ, ఐదూ ... అలా ఆ చిన్నపెట్టెతో గంటసేపు ముచ్చట్లాడి, ఇహ ఇది పనికిరాదని అర్థం చేసుకున్నాను.

ఆ రోజుల్లోనే సరయు వస్తే, నాకు జరిగిన అన్యాయం వివరించి, కొంచెం విచారంగా మొహం పెట్టి, నేను ఇదివరకు తీసిన బొమ్మలు చూపించేను, "ఎంత బాగున్నాయో చూసేవా?" అంటూ. ఆ తరవాత ఒకొక బొమ్మనీ ఎంతమంది మెచ్చుకున్నారో లెక్కలు చూపించేను. ఒకొకబొమ్మమీద ఎన్ని వ్యాఖ్యలు వచ్చేయో చెప్పి, వాటికి అనువాదాలు కూడా ఇచ్చేను. కొన్నిటిమీద వచ్చిన కవితలు కూడా వివరించేను.

ఆ తరవాత "నాలుగు రోజుల కిందటనుకుంటాను నిండు పున్నమి చంద్రుడు మబ్బులు మధ్య అచ్చు మబ్బులమధ్య చంద్రుడిలా ఎంత అందంగా ఉన్నాడో తెలుసా, చూడ్డానికి రెండు కళ్ళు చాలవు," అన్నాను.

"మరి బొమ్మ తీసేవా?"

"కెమెరా లేదు కదా," అన్నాను. అలా చెప్పుకోడంలో నాకు విషాదం ధ్వనించలేదు. లేని వస్తువులమీద కోరిక పెంచుకోకూడదు.

"పండుగ అమ్మకాలు కదా. ఎమెజాన్ లో మంచివి ఉంటాయి,"

"మ్. చూస్తున్నాను. కెమెరా లేకుండా ఎంతకాలం ఉండగలనా అని."

ఆ తరవాత మరేవో కబుర్లలో పడిపోయేం.

ఆ తరవాత నాకు హఠాత్తుగా ఏది శాశ్వతం అన్న నిస్పృహ కూడా వచ్చేసింది. దీర్ఘంగా ఆలోచించడం మొదలు పెట్టేను. ఎందుకింత తాపత్రయం.

పదిరోజులనాడు పిలిచింది సరయు, "మేం మాలుకెళ్తున్నాం. వస్తావా?"

సరేనన్నాను. చెప్పేను కదా నాబజారుపనులు రెండు విధాలుగా జరుగుతాయని. నాకు పనున్నప్పుడు పిలుస్తాను. లేదా వాళ్ళిద్దరూ వెళ్తున్నప్పుడు వస్తావా అని అడుగుతారు. నాకేమీ అవసరాలు లేవు కానీ కాలక్షేపం కదా అని సరేనన్నాను. అలా ముగ్గురం బజారులో తేలేం.

మీరు సూక్ష్మగ్రాహులు ఆతరవాతేమయిందో కనక గ్రహించేసి ఉంటారు ఈసరికి.

"ఎలాగా వచ్చేం కదా కెమెరా చూడు."

అసలు మాఅమ్మాయి ఆ మాట అనక్ఖర్లేదు. నాకాళ్ళు ఇనపముక్కని అయస్కాంతం ఆకర్షించినట్టు అటువేపు లాగబడతాయి నాకు ఏమీ అక్ఖర్లేని రోజుల్లో కూడా. మామూలుగా చీరెలూ నగలవేపు ఆడవాళ్లూ, చొక్కాలూ టైలవేపూ మొగవాళ్ళూ పొద్దు తిరుగుడుపువ్వుల్లా తిరుగుతారు అని ప్రతీతి. నేను ఎలక్ట్రానిక్స్ ఉన్నచోటికి వాలుగాలిలో తెప్పలా తేలిపోతాను. ఎలెక్ట్రానిక్స్ అరలు కనిపించడం చర్య. నేనక్కడ తేలడం అసంకల్ప ప్రతీకారచర్య.

అక్కడ నాకళ్ళు ఠక్కున ఓ కెమెరామీద పడ్డాయి. అది ఎంతో ముద్దుగా అచ్చు నా పాత కెమెరాలాగే ఉంది . నాకెమెరా నాచేతిలోనే ధ్వంసమయి నాచేతే దాచివేయబడింది అని నాకు తెలీకపోతే, అది నా కెమెరాయే అనుకునేదాన్నన్నమాట. అంత పోలికలున్నాయి దానికి. "అరె, సరిగ్గా ఇలాటిదే నాది," అన్నాను హాచ్చెర్యపడిపోతూ.

"తీసుకో."

వెంటనే నాకు తెలివొచ్చింది. కెమెరా లేకుండా ఎంతకాలం గడపగలనో చూదాం అనుకున్నాను కదా.


"ఇప్పుడొద్దు. తరవాత చూస్తాను."

పిల్లలదగ్గర తల్లులమాటలు చెల్లవు. నామాట చెల్లలేదు. ఆఖరికి మరో చుట్టు "నేనే కొనుక్కుంటాన"నని నేనూ, "కాదు, మేం కొంటాం" అని వాళ్లూ కొంచెంసేపు వాదులాడుకున్నాం. అక్షరాలా అది ఆటలాగే అనిపించింది. అంచేత ఆడుకున్నాం అనే చెప్పాలి.

ప్చ్ ఏం చెయ్యనూ కోరి ఇస్తానంటున్న కూతురూ, మేమిద్దరం ఇవ్వాలనుకున్నాం అంటున్న కొత్తల్లుడూ ... వాళ్ళసరదా చూసి ముచ్చట పడిపోతూ వెనక్కి తగ్గిపోయాను :p

అదండీ నా బహుమతి పుచ్చుకోలు మరియు కెమెరా కథ.

ఇదుగో ఆ కొత్త బహుమతితో తీసిన తొలి బొమ్మ. పరికించి చూడండి. కెమెరాని ఆప్యాయంగా పొదివి పట్టుకు ఛాయామాత్రంగా కనిపిస్తున్న రెండుచేతులూ నావే!



000

(డిసెంబరు 19, 2015)

ఉపసంహారం

ఊసుపోక శీర్షికతో తెలుగు తూలికలో ధారావాహికంగా ప్రచురించిన కతల సంకలనాలు ఈ సంకలనంతో సమాప్తం. ఇవి విడివిడిగా సమయాన్నిబట్టీ సందర్భాన్ని బట్టీ రాసినా ఈ విధంగా సంకలించడంలో కొన్ని కొత్త విషయాలు తెలిశాయి. ప్రధానంగా నా భావజాలం ఏ విధంగా రూపు దిద్దుకుంది, ఏమైనా మారిందా లేదా అన్నవి స్పష్టమయాయి ఇలా ఒకచోట పెట్టి చదువుతుంటే. మీకు అలా అనిపించిందో లేదో మీరే చెప్పాలి.

నాకు అర్థమైన ఇతర అంశాలు - కొన్ని విషయాలు మళ్ళీ మళ్ళీ ప్రస్తావించడం జరిగింది. తద్వారా నా ప్రపంచం ఎంత చిన్నదో తెలిసింది. రెండోది, ఆ విషయాలు నన్ను అంతగా మథనపెడుతున్నాయని కూడా అనుకోవచ్చు. ఏమైనా ముందు ముందు జాగ్రత్తగా ఉండాలి.

ఈ ధారావాహిక అనేక అంశాలమీద నేను వ్యాఖ్యానించడానికి వేదిక అయింది. అనేక అంశాలమీద పాఠకులు తమ అమూల్యమైన అభిప్రాయాలు వెలిబుచ్చేరు. నిజానికి ఆ వ్యాఖ్యలు ఇక్కడ చేర్చగలిగితే బాగుండునేమో కానీ సందర్భాలు అర్థం కాక అయోమయం కలిగించవచ్చని చేర్చలేదు. అనుమతివిషయంలో కూడా సంశయమే కదా. ఆసక్తి గల పాఠకులు నాబ్లాగులో ఆ యా టపాలదగ్గర చూడవచ్చు.

ఊసుపోక ధారావాహికను ప్రోత్సహించిన పాఠకలోకానికి కృతజ్ఞతలతో శలవు.

- నిడదవోలు మాలతి

తెలుగు తూలిక

కాలిఫోర్నియా, ఉత్తర అమెరికా. జూన్ 26, 2016.